ఎఎంఆర్ అపార్డ్
AMR-APARD

# స్థానిక పాలన

గ్రామీణ వికాస మాసపత్రిక

సంపుటి: 5 సంచిక: 6

జూలై, 2013

ఎడిటర్
**శశిభూషణ్ కుమార్** ఐ.ఏ.ఎస్.
కమీషనర్, అపార్డ్

ఎడిటోరియల్ బోర్డు
**డా॥ సి. నాగరాజు**
**హెచ్. కూర్మారావు**
**ఎ. సుభాష్‌చంద్ర గౌడ్**
**డా॥ కె. ఆసయ్య**
**శ్రీమతి ఆర్. శివపార్వతి**
**ఎ. నాగేశ్వరరావు**

కాన్సెప్ట్, ప్లానింగ్,
ఎడిటింగ్, డిజైనింగ్
**సెంటర్ ఫర్ మీడియా & పబ్లికేషన్స్, అపార్డ్**
**& కాక్స్‌టన్ ఆఫ్‌సెట్ ప్రైవేట్ లిమిటెడ్**
హైదరాబాద్

ప్రచురణ

ఎ.ఎం.ఆర్. - అపార్డ్
రాజేంద్రనగర్
హైదరాబాద్-500 030
ఆంధ్రప్రదేశ్, ఇండియా
ఫోన్ : 040-24018656
ఫ్యాక్స్ : 040-24017005

E-mail : editorsthanikapalana@gmail.com
Website: www.apard.gov.in

ఈ సంచికలో రచయితలు వెలిబుచ్చిన అభిప్రాయాలు తప్పనిసరిగా ప్రభుత్వానికి గాని అపార్డ్‌కి గాని చెందినవిగా భావించనక్కరలేదు.

# విషయ సూచిక

సంపాదకీయం ........ 2
'బంగారు తల్లి'కి చట్టబద్ధత ........ 3
ఉపాధిహామీ పథకం అమలు ముందంజలో రాష్ట్రం ........ 4
ఉపాధి హామీ పథకం అమలుపై కాగ్ ప్రశంసలు ........ 5
సాంఘిక సంక్షేమ హాస్టళ్ళు ఎస్.సి.ల సాధికారికతకు కృషి చేయాలి ........ 6
నగదు బదిలీ చెల్లింపులతో లబ్ధిదారులకు చేయూత ........ 7
జాతీయాభివృద్ధికి కీలకమైన పిల్లల మనుగడ, ఎదుగుదల ........ 9
ఎయిడ్స్ వ్యాధి - నైతిక విలువలు - నీతి, సన్మార్గం ........ 13
ఆంధ్రప్రదేశ్‌లో సంక్షేమ హాస్టళ్ల స్థాపనకు కృషి చేసిన పి.ఎస్. కృష్ణన్. ఐఏఎస్ (రిటైర్డ్) ........ 14
రాష్ట్ర యువతకు ఆశాకిరణాలు 'రాజీవ్ యువ కిరణాలు' ........ 15
రాష్ట్రంలో మైనారిటీల విద్యా సదుపాయాల కల్పన, స్థితిగతులు ........ 16
పథకానికి పది ప్రశ్నలు - జాతీయ వ్యవసాయ బీమా పథకం ........ 17
వర్షాకాలంలో వచ్చే వ్యాధులు తీసుకోవలసిన జాగ్రత్తలు ........ 18
నైతిక విలువల అవలంబనే మనకు ఆలంబన ........ 21
పిల్లల మనుగడ, ఎదుగుదల పెంపొందాలంటే బి.ఎన్.వి.లు ముఖ్య భూమిక పోషించాలి ........ 25
ప్రజా సేవకు పేదరికం అడ్డుకాదు ........ 26
మన గ్రామ అభివృద్ధి మన చేతుల్లోనే... మారుద్దామా మన గ్రామాన్ని ఇలా! ........ 27
స్థానికపాలనే సుపరిపాలన ........ 28
గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల్లో బిఎన్‌విల పాత్ర ........ 30
భారత్ నిర్మాణ్ వాలంటీర్ల అపూర్వ విజయాలు ........ 32
ఉపాధి హామీతో ఎదిగే క్రమంలో భార్యాభర్తలు ........ 34
జీవ నియంత్రణ ప్రక్రియలో పంటలలో బూజు తెగుళ్ళ నివారణ ........ 35
రాష్ట్రంలో 'ఇందిరమ్మ పచ్చతోరణం' అమలు ........ 37
ఆధునిక సాంకేతికతతో "ఆన్‌లైన్" పద్ధతి ద్వారా సంక్షేమ హాస్టళ్ళ నియంత్రణ ........ 40
బిఎన్‌విలతో పిల్లల మనుగడ, ఎదుగుదల ........ 41
భూమి పట్టా పొందటం ఎలా? ........ 43
పంటల సాగులో ఉత్తమ యాజమాన్య పద్ధతులు ........ 49
దుఃఖదాయినిగా ఉన్న గోదావరిని ప్రాణహితగా మార్చిన సర్ అర్థర్ కాటన్ ........ 52
పశువుల్లో మేలు జాతి - ఒంగోలు జాతి ........ 54
'రేబిస్' నుండి రక్షణ పొందటం సులువే! ........ 57
అంధత్వ నిర్మూలనకు సేవలు ........ 59
పల్లె ప్రజల ప్రగతి బాట ........ 61

# జనాభా అదుపు... వనరుల పొదుపు

ప్రస్తుతం మన దేశ జనాభా 124 కోట్లకు పైగా ఉంది. 2011లో జనాభా లెక్కల సమయంలో 121 కోట్లుగా ఉన్న జనాభా ఈ రెండేళ్లలో 3 కోట్లకు పైగా పెరిగింది. 2001 జనాభా లెక్కలతో పోలిస్తే, 2011 నాటికి దేశ జనాభా 17.7 శాతం, అంటే 18.19 కోట్ల మేరకు పెరిగింది. బీహార్‌లో జనాభా పెరుగుదల 25.4 శాతం ఉండగా, కొన్ని రాష్ట్రాల్లో 20 శాతం పైగా పెరిగింది. దేశం మొత్తం మీద చూస్తే సగటు జనసాంద్రత కూడా పెరిగింది. 2001లో చదరపు కిలోమీటరు విస్తీర్ణంలో 325 మంది నివశిస్తుండగా, 2011 నాటికి జనసాంద్రత రేటు 382కి పెరిగింది. 1996లో ఇది 287 మందిగా ఉండేది.

భారత్ వంటి అత్యధిక జనాభా కలిగిన దేశాలకు జనాభా పెరుగుదల అనేది ఎప్పుడూ ప్రతికూలాంశమే. జనాభా సంఖ్య వేగంగా తగ్గిపోతున్న స్పెయిన్, ఇటలీ వంటి దేశాలకు జనాభా పెరుగుదల వరం కావచ్చు కానీ, మనదేశానికి అదొక శాపమే.

వనరులనేవి ఏ దేశానికైనా పరిమితంగానే ఉంటాయి. జనాభా పెరుగుదల అధికంగా ఉంటే, ప్రతి మనిషికి అందుబాటులో ఉండే వనరులు తగ్గిపోయి, పలు సమస్యలు ఎదుర్కొవాల్సి ఉంటుంది.

ఇప్పటి పెరుగుదల రేటు ప్రకారం చూస్తే, మన దేశంలో ప్రతి నిముషానికి 29 మంది పుడుతున్నారు. గంటకి 1,768 మంది, రోజుకి 42,434 మంది పుడుతున్నారు. ఈ లెక్కన ప్రతి నెల 12,73,033 మంది మన దేశంలో పుడుతున్నారు. ఏడాది గడిచే సరికి ఒక కోటీ 55లక్షల 31వేల మంది మన జనాభా పెరుగుతున్నారు. అయితే, వనరులు మాత్రం ఈ విధంగా పెరగటం లేదు. దాంతో, మనుషుల కనీస అవసరాలైన కూడు, గుడ్డ, నీడ వంటి వాటికి కూడా మన ప్రజలు అర్రులు చాచవలసి వస్తున్నది. మాటలో చెప్పాలంటే, మన దేశం ఇప్పుడు 'జనాభా పెరుగుదల-పేదరికం- జనాభా పెరుగుదల - పేదరికం జనాభా పెరుగుదల' అనే విష వలయంలో చిక్కుకొని విళవిళలాడుతున్నది. జనాభా పెరుగుదలకు పేదరికం కూడా ఒక కారణం. అదే విధంగా జనాభా పెరుగుదల పేదరికానికి కారణమవుతోంది.

మన జనాభాలో 30 కోట్ల మంది రోజుకి సంపాదించే ఆదాయం 50 రూపాయల లోపే. చాలీచాలని సంపాదనతో నెట్టుకొచ్చే పేదలు మరింత మంది పిల్లలను కంటున్నారు ఎందుకంటే - వారు కూడా పనిచేసి కొంత డబ్బు తెస్తారనే ఆశతో. ఈ నిరుపేదల కుటుంబాల్లో శిశు మరణాల రేటూ ఎక్కువే. పుట్టిన పిల్లల్లో ఎంతమంది బతుకుతారో భరోసా లేకపోవటం వల్ల జనాభా పెరుగుదల రేటు నిరుపేదల కుటుంబాల్లో అధికంగానే ఉంటున్నది. మగ పిల్లలు కావాలనుకునే మూర్ఖపు ధోరణితో పిల్లలను కంటూ ఉండటం వల్ల కూడా జనాభా పెరుగుతోంది. మన దేశంలో బాల్య వివాహాల బెడద ఇప్పటికీ ఎక్కువగానే ఉంది. చిన్న వయస్సులో తల్లులయ్యే బాలికలు ఎక్కువ మంది పిల్లలను కనే అవకాశం ఉంటుంది. చిన్న వయస్సులోనే తల్లులవటం వల్ల వీరు విద్యావంతులయ్యే అవకాశం లేదు. దాంతో, వీరి పిల్లలు కూడా ఇదే వెనకబాటు పద్ధతిలో నడిచే ప్రమాదం ఉంది. ఇదొక విషవలయం. ఈ కారణాలన్నిటి వల్ల మన దేశ జనాభా ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోతోంది. 2025 నాటికే మనం జనాభాలో చైనాను అధిగమిస్తామనే అంచనాలు ప్రణాళికా వేత్తలను భయపెడుతున్నాయి.

జనాభా పెరుగుదల వల్ల వాహనాలు పెరగటం, అడవులు, చెట్లు మరింతగా నరకివేతకు గురికావటం, వస్తువులను ఉత్పత్తి చేసే పరిశ్రమలు పెరగటం, తత్కారణంగా కాలుష్యం పెరగటం, కాలుష్యం వల్ల ప్రజలకు పలు ప్రాణాంతక వ్యాధులు రావటం, మరింతగా మందులు అవసరం కావటం, మందుల పరిశ్రమల వల్ల మరింత భూమి, వాయు, నీటి కాలుష్యం పెరగటం... ఇలా ఓ పెద్ద విషవలయంలో చిక్కుకున్నాం. అందువల్లనే, ఎన్ని పథకాలు అమలు చేసినా మన దేశం పేదరికం నుంచి ప్రజలను బయట పడవేయలేకపోతోంది.

ఈ సారి ప్రపంచ జనాభా దినం సందర్భంగా ఐక్యరాజ్య సమితి 'అందరికీ అందుబాటులో పునరుత్పత్తి సంబంధిత ఆరోగ్యం' అనే అంశాన్ని థీమ్‌గా ఎంపిక చేసింది. కుటుంబ నియంత్రణ, మాతా, శిశు మరణాలు, పునరుత్పత్తి సంబంధిత ఆరోగ్య సమస్యలు మొదలైనవి దీని కిందకు వస్తాయి.

ఈ రంగంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే కార్యక్రమాలే కాకుండా, స్థానిక సంస్థలు కూడా చొరవ తీసుకుని పని చేయాల్సి ఉంది. ఎందుకంటే, జనాభా పెరుగుదల ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల్లోనే సమస్యగా ఉంది. బాల్య వివాహాలు నిరోధించటం, కుటుంబ నియంత్రణ పాటించేలా చూడటం, మగ పిల్లల కోసం ఎదురు చూస్తూ పిల్లలను కంటూ ఉండటం, మాతాశిశు మరణాలు మొదలైన విషయాల్లో స్థానిక సంస్థలు ప్రజల్లో అవగాహన కల్గించడానికి ప్రయత్నించాలి. తద్వారా జనాభా పెరుగుదలకు కొంత వరకు అడ్డుకట్ట వేయగలం.

( శశి భూషణ్ కుమార్ )

# 'బంగారు తల్లి' కి చట్టబద్ధత

## మే 1 గీటురాయిగా అమలు... ప్రతి నెల 15 లోగా సొమ్ము





**రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన 'బంగారు తల్లి' పథకానికి చట్టబద్ధత లభించింది. జూన్ 19న ఈ బిల్లుకు శాసనసభ ఆమోదం తెలిపింది. ఐదేళ్లలో ఇలాంటి చరిత్రాత్మక బిల్లు రావడం ఇది రెండోసారని సీఎం చెప్పారు. సబ్‌ప్లాన్ నిధులకు చట్టబద్ధత కల్పించే సందర్భం కూడా చరిత్రాత్మకమైనదని, అన్నారు.**

'బంగారు తల్లి' పథకాన్ని ఓట్ల కోసమో, రాజకీయాల కోసమో కాకుండా ప్రజా ప్రయోజనార్థం ప్రవేశపెట్టామని చెప్పారు. మహిళలకు మేలు చేయాలన్న సదుద్దేశంతో పథకాన్ని తీసుకువచ్చామన్నారు. ఈ పథకం రావడంతో ఆడపిల్లగా పుట్టాలని, అదీ ఆంధ్రప్రదేశ్‌లోనే పుట్టాలని కోరుకుంటున్నామని చమత్కరించారు.

ఈ పథకానికి ప్రణాళిక సంఘం కూడా కితాబిచ్చిందని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇది వరకే ప్రవేశ పెట్టిన 'లక్షాధికారి (లక్‌పతి)' పథకాన్ని కూడా కొనసాగిస్తామని సిఎం చెప్పారు. ఈ ఏడాది మే 1 నుంచి పథకం అమలులోకి వచ్చిందని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సునీతా లక్ష్మారెడ్డి చెప్పారు. ఈ పథకానికి ప్రత్యేకంగా బడ్జెట్‌ను కేటాయించి అమలు చేస్తామన్నారు. ప్రతి నెల 15వ తేదీలోగా ఈ పథకం లబ్ధిదారుల ఖాతాలో సొమ్ము జమ చేస్తామని తెలిపారు. ఆర్థిక మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ ఈ పథకం ప్రజా ప్రయోజనాల కోసం తీసుకువచ్చిన పథకమని ఓట్ల దృష్టితో తెచ్చినది కాదని చెప్పారు.

### ఇదీ 'బంగారు తల్లి'

ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదివే ప్రతి ఆడపిల్లా బంగారు తల్లేనని మంత్రి సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. పథకంలోని ప్రధానాంశాలను ఆమె వివరించారు.

- ఆడపిల్ల పుట్టినట్లు నమోదవగానే రూ. 2500; వెయ్యి రూపాయల చొప్పున తొలి, రెండో పుట్టినరోజులకు మూడు నుంచి రూ. 1500 చొప్పున ఐదో పుట్టిన రోజులకు ప్రభుత్వం అందిస్తుంది.
- ఆరు నుంచి పదేళ్ళ మధ్యలో, అంటే ఒకటి నుంచి ఐదో తరగతి నడుమ ఏటా రూ. 2 వేల చొప్పున, ఆరు నుంచి ఎనిమిదో తరగతి చదువుతున్నప్పుడు ఏటా రూ. 2,500 చొప్పున 9,10 తరగతుల్లో ఏటా రూ. 3 వేల చొప్పున అందుతాయి.
- ఇంటర్మీడియట్‌లో ఏటా రూ. 3,500 గ్రాడ్యుయేషన్‌లో (18-21 ఏళ్ళు) రూ. 4 వేల చొప్పున నాలుగేళ్లపాటు అందుతుంది. 21 ఏళ్లలోపు ఇంటర్ పాసైతే రూ. 50 వేలు లేదా గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకుంటే ప్రభుత్వం లక్ష రూపాయలిస్తుంది.
- జననీ, సురక్ష యోజన, సుఖీభవ, ప్రి-మెట్రిక్ స్కాలర్‌షిప్, రాజీవ్ విద్యా దీవెన, పోస్ట్ మెట్రిక్ స్కాలర్ షిప్‌వంటి పథకాలతో దీనికి సంబంధం లేదు.
- మొత్తం 22 ఏళ్ల పాటు (2013-35) ఈ పథకానికయ్యే అంచనా బడ్జెట్‌ను కూడా మంత్రి వెల్లడించారు. దీని ప్రకారం... 2013-14లో రూ. 530 కోట్లు అవసరం కాగా, 2034-35 నాటికి రూ. 3,922.13 కోట్ల వంతున నిధులు కేటాయించాలి.



# ఉపాధి హామీ పథకం అమలు ముందంజలో రాష్ట్రం

## గ్రామీణాభివృద్ధి, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణాభివృద్ధి ఉపాధి శాఖామాత్యులు శ్రీ డి. మాణిక్య వరప్రసాదరావు గారితో ముఖాముఖి

**ప్రశ్న** : గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయడంలో ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉందని కేంద్రం తన నివేదికలో పేర్కొంది. ఏ ఏ కార్యక్రమాలను మీరు అమలు చేస్తున్నారు!

**మంత్రి** : ముఖ్యంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం.

**ప్రశ్న** : ఈ ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి.ఎస్. అమలు చేయుటంలో ఆంధ్రప్రదేశ్ ముందుండటానికి కారణాలు ?

**మంత్రి** : 1. ఈ కార్యక్రమం అమలుకై నిజాయితీ మరియు నియమనిబద్ధతగల ఉద్యోగ సిబ్బందిని చేర్చుకుని, వారికి కీలకమైన బాధ్యతలను అప్పగించడం జరిగింది.

2. కొన్ని కీలకమైన ప్రతిపాదనలను కూడా అమల్లో మొదలు పెట్టడమైనది. అవి :
   - శ్రమశక్తి సంఘాల ఏర్పాటు
   - పని కొరకు దరఖాస్తు
3. ఐ.టి. వినియోగం ద్వారా పథకంలో పారదర్శకత నిమిత్తం కొన్ని అంశాలను వినియోగించడమైనది. అవి:
   - రాగాస్ సాఫ్ట్‌వేర్
   - ఇ.ఎఫ్.ఎం.ఎస్.
   - ఇ.ఎమ్.ఎమ్.ఎస్.
   - స్మార్ట్ కార్డ్ ద్వారా వేతన చెల్లింపులు
4. జవాబుదారీ నిమిత్తం సామాజిక తనిఖీ విభాగాన్ని, మొబైల్ కోర్టును ఏర్పాటు చేయటం జరిగింది.
5. క్షేత్ర స్థాయి సిబ్బందికి టార్గెట్స్‌ను నిర్దేశించడం.
6. షెల్ఫ్‌లో పనులు చేర్చడానికి ప్రాజెక్ట్ మోడ్ పనులు ప్రారంభించటం.
7. చేయగలిగిన పనులను జిల్లాలవారీగా / ప్రాంతాల వారీగా గుర్తించటం.
8. క్వాలిటీ కంట్రోల్, విజిలెన్స్ విభాగాలను నెలకొల్పటం
9. స్వచ్ఛంద సంస్థలతో అప్నా ఎన్.జి.ఒ. అలెయన్స్ ఏర్పాటు చేయటం

**ప్రశ్న** : ఏ జిల్లాలో ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి.ఎస్. ఎక్కువ ఫలితాలను సాధించింది ?

**మంత్రి** : ఆంధ్రప్రదేశ్‌లోని జిల్లాలలో పథకం మంచి ఫలితాలను ఇచ్చింది. 2012-13 లో ప్రత్యేకించి శ్రీకాకుళం, విజయనగరం, అనంతపురం, చిత్తూరు మొదలైన జిల్లాలు అత్యుత్తమ ఫలితాలను సాధించాయి.

**ప్రశ్న** : ఉపాధి హామీ పథకం అమలు చేయటంలో భారత నిర్మాణ్ వాలంటీర్లను గూర్చి చెబుతారా ?

**మంత్రి** : ఉపాధి హామి పథకంపై ప్రజలలో అవగాహన పెంపొందించడంలో భారత్ నిర్మాణ్ వాలంటీర్లు ప్రధాన పాత్ర పోషిస్తున్నది. అంతేకాక, పథకం సక్రమ అమలుకై కూడా ఈ వ్యవస్థ పాటుపడుతుంది.

**ప్రశ్న** : దేశంలోనే పేద జిల్లా అయిన మహబూబ్ నగర్ జిల్లాలో ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి.ఎస్. గురించి చెబుతారా ?

**మంత్రి** : గత ఆర్థిక సంవత్సరం (2012-13)లో 1.97 కోట్ల పనిదినాలను కల్పించడం జరిగింది. 3.3 లక్షల కుటుంబాలకు, అంటే 6.37 లక్షల కూలీలకు పని కల్పించటం జరిగింది. కుటుంబానికి సగటున 59.05 పని దినాలు కల్పించటం జరిగింది.

- 57,347 కుటుంబాలు 10 రోజుల పనిని పూర్తి చేసాయి.
- జిల్లాలోని గట్టు మండలం వెనుకబడినదిగా గుర్తించి అదనపు సిబ్బందితో ప్రత్యేకమైన శ్రద్ధను చూపడం జరిగింది. దీనివల్ల అక్కడి ప్రజలకు పథకంపై సమగ్ర అవగాహన కల్పించడం జరిగింది.
- పైన పేర్కొన్న అదనపు చర్యల వల్ల మహబూబ్‌నగర్ జిల్లాలోని వలసలు గణనీయంగా తగ్గిపోయాయి.

**- ఎం. మాణిక్యరావు,**
**డి.ఎం.టి.ఐ**

# ఉపాధి హామీ పథకం అమలుపై కాగ్ ప్రశంసలు

## పొరుగు రాష్ట్రాలు పాటించాలని సూచన శ్రమశక్తి సంఘాల పనితీరు భేష్

**మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తున్న నిర్మాణాత్మక విధానాలు సామర్థ్యాన్ని పెంపొందించే చర్యలు చాలా వరకూ తగిన విధంగా ఉన్నాయని భారత కంప్ట్రోలర్ &ఆడిట్ జనరల్ నివేదికలో పేర్కొన్నారు. ఆరుజిల్లాల్లో 18 మండలాలను, 180 గ్రామాలను, 1800 పనులను కాగ్ స్వయంగా పరిశీలించి 1789 లబ్దిదార్లతో సర్వేలు నిర్వహించింది. ఎంపిక చేసిన జిల్లాల్లో ఐ.ఎం.ఎస్. నుంచి ఎలక్ట్రానిక్ డేటాను విశ్లేషించింది.**

వేతనార్థులకు ఉపాధి కల్పన పనుల జాబితా చాలుబడి పెద్ద అడ్డంకి కాబోదని పేర్కొంది. ఖర్చుకాని నిధుల పోగవడం, అడ్వాన్సులు సర్దుబాటు కాకపోవడం వంటి ఆర్థిక నిర్వహణకు సంబంధించిన లోటుపాట్లు ఈ పరిశీలనలో వెల్లడయ్యాయి. ఇతరశాఖలు కొన్ని చట్టానికి విరుద్ధంగా భారీ స్థాయిలో సామాగ్రి అవసరమున్న పనులకు కూడా అమలు చేస్తున్నాయి.

చిరకాలంగా మనగలిగే ఆస్తుల కల్పన మీద దృష్టి సారించకపోవడం, పలు పనులు పూర్తి కాకుండా ఉన్నాయని కాగ్ గమనించింది. ఒక గ్రామంలో భారీ సంఖ్యలో నూరుశాతం మేరకు పనులు జరుగుతున్నాయి. మౌలిక సదుపాయల దృష్ట్యా వీటిని నిర్వహించడం, ప్రభావంతంగా పర్యవేక్షించడం అంత సులువుకాదని పేర్కొంది. గ్రామీణ మహిళా సాధికారత, సామాజిక సమానత్వం విషయానికి సంబంధించి ఈ పనుల్లో మహిళలు ఎస్సీ, ఎస్టీ, ఇతర వెనుకబడిన తరగతుల లబ్దిదార్ల తమ ప్రాతినిధ్యం సక్రమంగానే ఉందని కాగ్ నివేదిక పేర్కొంది.

పర్యావరణానికి సంబంధించిన పనులకు మంచి గుర్తింపు ఇచ్చారని, నీటి నిర్వహణ, చెట్ల పెంపకం, నీటిపొదుపు, పనీకరణ, వర్షభావ పరిస్థితుల నిర్వహణ వంటి చర్యలు బాగా చేపట్టారని పేర్కొంది. గ్రామ స్థాయిలో రికార్డులు లేవని, మండల స్థాయిలో ఉన్నా తగినంతగా లేదని సూచించింది. ఇక్కట్ల పరిష్కారానికి విధానాలు సరిచేస్తూ ఉన్నా పరిష్కారంలో జాప్యాలు ఉన్నాయని, వీటిని వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయడంలేదని కాగ్ పేర్కొంది.

ఈ పథకం అమలు చాలా సక్రమంగా ఉన్నందున పట్టణాలకు వలసలు తగ్గాయని, పనివారి జీతంలో మెరుగుదల కనపడినట్లు ప్రశంశించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉపాధి హామీ అమలు చేస్తున్న విధానాలను ఇతర రాష్ట్రాలు కూడా పాటించదగినవిగా కాగ్ అభిప్రాయం వ్యక్తం చేసింది. ఎపి ఉపాధి హామీ సాఫ్ట్‌వేరును ఉపయోగించి వివరణాత్మక ఇన్‌పుట్‌ల తయారీ కోసం సాంకేతిక ఇన్‌పుట్‌లను సేకరించే విధంగా తగినంతగా ఉన్నదని, దీన్ని ఇతర రాష్ట్రాలు ఉపయోగించి అనుసరించాలని కాగ్ సూచించింది.

వినియోగంకాని నిధులు జిల్లా లేదా అంతకన్నా కింది స్థాయిలో స్థంబించిపోయే అవకాశాలు తొలగించే విధంగా రికార్డుల నిర్వహణ ఉన్నట్లు పేర్కొంది. పని జాప్యానికి, రికార్డుల జాప్యానికి బాధ్యులైన అధికారులకు విధించాల్సిన పరిహారాన్ని లెక్కకట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఒక సర్క్యులర్ జారీ చేసింది.

ఇలాంటివి ఇతర రాష్ట్రాలు పాటించాలని కాగ్ అభిప్రాయం వ్యక్తం చేసింది. శ్రమశక్తి సంఘాల పేరిట పని వారిలో పాక్షిక శాశ్వత బృందాల ఏర్పాటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశ పెట్టింది. ఈ బృందాలను పనివారే ఏర్పాటు చేసుకుంటారు.

ఇలాంటి బృందాల ద్వారానే పనులు జరుగుతున్నాయని ప్రశంశించింది. 2009 మే నెలలో సొసైటీ ఫర్ సోషల్ ఆడిట్ ఫర్ అకౌంటబిలిటీ అండ్ ట్రాన్స్‌పరెన్సీ అనే స్వతంత్ర స్వయం పాలక సంస్థను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసి దానిని సామాజిక ఆడిట్‌కు బాధ్యులుగా చేసింది.

2007 సెప్టెంబరులో సామాజిక ఆడిట్ నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయి మార్గదర్శక సూత్రాలను జారీ చేసింది. వీటి స్థానంలో 2008 ఆగస్టులో ఆంధ్రప్రదేశ్ సోషల్ ఆడిట్ నియమావళి వచ్చింది ఇవన్నీ ఇతర రాష్ట్రాలు అమలు చేస్తే పథకం ఆయా రాష్ట్రాలలో కూడా సమర్థవంతంగా అమలు చేయవచ్చని కాగ్ అభిప్రాయం వ్యక్తం చేసింది.

**సి.ఎం.పి.**



# సాంఘిక సంక్షేమ హాస్టళ్ళు ఎస్.సి. ల సాధికారికతకు కృషి చేయాలి

**నేటి సాంఘిక సంక్షేమ వసతి గృహాలు విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చి దిద్దేందుకు, ఎస్.సి. లను స్వయం సహాయక సాధికారికతను సాధించిన పూర్ణమైన వ్యక్తులుగా తీర్చి దిద్దేందుకు కృషి చేయాలని కేంద్ర సాంఘిక సంక్షేమ శాఖ మాజి కార్యదర్శి శ్రీ పి.ఎస్. కృష్ణన్ ఐ.ఎ.ఎస్ (రిటైర్డ్) పిలుపునిచ్చారు. ఆయన జూన్ 19 న హైదరాబాద్‌లోని 'అపార్డ్' లో సామాజిక న్యాయ స్వచ్ఛంద సేవా కేంద్రము వారు ఏర్పాటు చేసిన హాస్టల్ సంక్షేమ అధికారుల శిక్షణా కార్యక్రమానికి ముఖ్య అధితిగా విచ్చేసి ప్రసంగించారు.**

ఈ సందర్భంగా 1980లో ఎస్.సి. ఎస్.టి. లకు ప్రత్యేక ప్రణాళికను శ్రీమతి ఇందిరాగాంధీ ఒక లక్ష్యంతో ప్రారంభించారని. అందుకు తగిన విధంగా ఎస్.సి./ఎస్.టి. లను అభివృద్ధి పరచవలసిన ఆవశ్యకత ఉందని శ్రీ కృష్ణన్ అన్నారు.

అదేవిధంగా 1859 నుండి ఏ విధంగా బలహీన వర్గాల అభివృద్ధికి చర్యలు తీసుకున్నారనే అంశాలను ఆయన వివరించారు. షెడ్యూల్డు కులాలు, జాతులు మహిళల సాధికారికతకు 1859లోనే కృషి జరిగిందని, వారి జీవితాల మెరుగుదలకు సాంఘిక సంక్షేమ శాఖ కృషి సల్పిందని కృష్ణన్ వివరించారు.

ఈ కార్యక్రమంలో అపార్డులోని సెంటర్ పర్ డెవలప్‌మెంట్ స్టడీస్ డైరెక్టర్ జనరల్ శ్రీ కె. చంద్రమౌళి ఐఎఎస్ (రిటైర్డ్) మాట్లాడుతూ, హాస్టలు సంక్షేమ అధికారుల ప్రధానమైన పాత్ర ఉపాధ్యాయులుగా, భోజన వసతి కల్పించే వ్యక్తులుగా వ్యవహరించటమని, విద్యార్థులను భావిపౌరులుగా తీర్చిదిద్ద వలసిన బాధ్యత వారిపై ఉందని ఉద్బోధించారు.


ఈ వ్యవస్థలో సంక్షేమ హాస్టలు అంటే ఉన్న దురభిప్రాయాలను తొలగించేందుకు సంక్షేమ అధికారులు నైతిక తతో సామాజిక పురోభివృద్ధికి ముఖ్యంగా బడుగు వర్గం పిల్లల ఉన్నతికి కృషి చేయవలసిన ఆవశ్యకత ఉందని శ్రీ చంద్రమౌళి వివరించారు. అపార్డు నిర్మించిన 'దాతృత్వం' అనే దృశ్య చిత్రం ద్వారా అధికారులకు స్ఫూర్తిని అందించటమే కాక, కొన్ని ఉదాహరణాలను కూడా ఆయన వివరించారు.

ఈ కార్యక్రమానికి రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మాజీ ప్రిన్సిపల్ కార్యదర్శి శ్రీ కె. గోపాల రావు ఐ.ఎ.ఎస్ (రిటైర్డు) అధ్యక్షత వహించారు. రాష్ట్రం లో సంక్షేమ హాస్టళ్ల వ్యవస్థను తగురీతిలో నడిపించి, ఎస్.సి. విద్యార్థుల ఉన్నతికి కృషి చేయాలని సూచించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో 9 జిల్లాల హాస్టల్ సంక్షేమ అధికారులు 40 మంది ఈ నాలుగు రోజుల శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నా రు. ఈ శిక్షణా కార్యక్రమాన్ని సామాజిక న్యాయకేంద్ర హెడ్ ఎం. మదన్ మోహన్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించారు.



**సి.ఎం.పి.**

# నగదు బదిలీ చెల్లింపులతో లబ్ధిదారులకు చేయూత




**దేశంలో పేదరికాన్ని రూపుమాపే క్రమంలో పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తుంది ప్రభుత్వం. వీటిలో ముఖ్యంగా, పేదలకు చౌకగా ఆహార ఉత్పత్తులు అందించేందుకు 1957 నుండి ప్రజా పంపిణీ వ్యవస్థను అమలు చేస్తోంది. దాంతో పాటు అనేక సంక్షేమ పథకాలు కూడా అమలు చేస్తోంది. అయితే ప్రభుత్వం అమలు చేసే ప్రతి పథకం ప్రయోజనం పూర్తిగా లబ్దిదారులకు చేరడం లేదని, ఎక్కువ భాగం అవినీతి పరుల పాలవుతోందనే విమర్శ ఎన్నాళ్లుగానో ఉంది. వాటి అమల్లో లోపాలు, నిర్వహణ వైఫల్యాలు మొదలైన కారణాలు ఏమైనా ఉండవచ్చు. వీటి వల్ల అవినీతి పెరిగిపోయి నానాటికీ ప్రజలు పేదరికం నుండి బయటపడలేక పోతున్నారు.**

పేదరికం కుడి ఎడమలుగా సాగుతున్న వర్ధమాన భారతదేశంలో ఈ రెండింటినీ లక్ష్యంగా చేసుకుని కేంద్ర ప్రభుత్వం "నగదు బదిలీ" పథకానికి శ్రీకారం చుట్టింది. సంక్షేమ పథకాలకు చెందిన సబ్సిడీని నగదు రూపంలో నేరుగా లబ్దిదారుల ఖాతాల్లోకి జమ చేయడమే నగదు బదిలీ పథకం యొక్క ప్రధాన ఉద్దేశ్యం. విశిష్ట గుర్తింపు సంఖ్య"ఆధార్" ఆధారంగా దేశ వ్యాప్తంగా ప్రస్తుతం కొన్ని ఎంపిక చేసిన జిల్లాల్లో ఈ పథకం ప్రారంభమైంది.

### నగదు బదిలీ పథకం ప్రయోజనాలు

గత కొంత కాలంగా కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సంస్కరణలను పకడ్బందీగా అమలు చేయడానికి సిద్ధ పడుతున్నట్లు ఎఫ్.డి.ఐ. ల విషయాన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు. ఇదే పరంపరలో కేంద్రం రాష్ట్ర స్థాయిల్లో అమలవుతున్న 35 పథకాలను నగదు బదిలీ పథకం క్రిందకు తీసుకువచ్చి ఆయా పథకాలకు సంబంధించిన లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల ద్వారా సబ్సిడీ బియ్యం, కిరోసిన్, గ్యాస్ వంటి నిత్యావసర వస్తువులతో పాటు ఎరువులు, విత్తనాల రాయితీకి సంబంధించిన సబ్సిడీని మొత్తం ఆధార్ సంఖ్య ఆధారంగా లబ్దిదారుల ఖాతాల్లోకి నేరుగా నగదు రూపంలో బదిలీ చేయడం జరుగుతుంది. ఈ మొత్తానికి కొంత మొత్తాన్ని కలుపుకుని బహిరంగ మార్కెట్‌లో నిత్యావసర

వస్తువులు కొనుక్కోవచ్చు. ఈ నగదు బదిలీ వల్ల బోగస్ కార్డులు, రేషన్ డీలర్ల అక్రమాలు, అవినీతి తగ్గుతుంది. అదే విధంగా రేషన్ వస్తువుల నిల్వ, రవాణా ఖర్చులు కూడా తగ్గి, ప్రజాధనం ఆదా అవుతుందని ప్రభుత్వం భావిస్తున్నది.

### బదిలీ ఇలా

నగదు బదిలీ పథకాన్ని తొలుత మానవ వనరుల అభివృద్ధి, మహిళా శిశు సంక్షేమం, ఆరోగ్య, కుటుంబ సంక్షేమం, విద్యార్థులకు ఉద్దేశించిన ఉపకార వేతనాలు, వృద్ధాప్య పింఛనులు, వికలాంగ పింఛనులు, వితంతు పింఛనులు మొదలైన వాటికి వర్తించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. ఈ నగదు బదిలీ కోసం ప్రభుత్వం ప్రభుత్వ రంగ బ్యాంకుల సహకారంతో దేశ వ్యాప్తంగా ఇరవై క్లస్టర్లను ఏర్పాటు చేసి, బిజినెస్ కరస్పాండెంట్ అనే వ్యవస్థ ద్వారా నేరుగా నగదు అందజేయడం జరుగుతుంది.

బ్యాంకులు లేని మారుమూల పల్లెల్లో వీటి ఉపయోగం ఎక్కువగా ఉంటుంది. బ్యాంకింగ్ రంగం అభివృద్ధి అయిన గ్రామాల్లో నేరుగా లబ్ధిదారుని బ్యాంకు ఖాతాల్లోకి ఈ నగదు బదిలీ జరుగుతుంది. సబ్సిడీలకు బదులుగా ఈ నగదు చెల్లింపులు జరుగుతాయి. ఉదాహరణకు వంట గ్యాస్‌కు నగదు బదిలీ వినియోగదారుడు తొలి సిలిండర్ బుక్ చేసుకున్న వెంటనే సిలిండర్ అందక ముందే, వినియోగదారుడి ఆధార్ సంఖ్యతో అనుసంధానమైన బ్యాంకు ఖాతాల్లో రాయితీ మొత్తం రూ॥ 435 జమ అవుతుంది. ఆధార్ వివరాలను గ్యాస్ డీలర్ వద్ద, బ్యాంకులో సమర్పించిన వినియోగదారుడు ఇక నుంచి సబ్సిడీ లేని గ్యాస్ సిలిండర్‌నే తీసుకోవలసి ఉంటుంది. అందుకు గాను అప్పటికే బ్యాంకు ఖాతాల్లో జమ అయిన నగదును, ఇప్పటి దాకా చెల్లిస్తూ వచ్చిన నగదును కలిపి సరఫరాదారునికి చెల్లించ వలసి ఉంటుంది.

తొలి సిలిండర్ అందించిన వెంటనే మరోసారి రాయితీ మొత్తం పడుతుంది. ఇలా రెండవ సారి పడిన మొత్తంలో తదుపరి సిలిండర్‌ను మార్కెట్ ధరకు కొనుక్కోవడానికి వీలవుతుంది. గరిష్టంగా ఏడాదిలో తొమ్మిది సిలిండర్లకు ఈ సౌకర్యం ఉంటుంది. 'ఆధార్' వివరాలను సమర్పించని వినియోగదారులకు రాయితీ సిలిండర్లను వచ్చే 3 నెలల





వరకూ సరఫరా చేస్తారు. ఆ తర్వాత నిలిపి వేయడం జరుగుతుంది. జూన్1, 2013 న మన రాష్ట్రంలో హైదరాబాద్, రంగారెడ్డి, తూర్పు గోదావరి, అనంతపురం, చిత్తూరు, 5 జిల్లాలోని గ్యాస్ వినియోగదారులకు నగదు బదిలీ కార్యక్రమం మొదలైంది.

కిరోసిన్‌కు నగదు బదిలీ పరిశీలిస్తే, రేషన్‌కార్డు ప్రస్తుతం పట్టణాలలోని పేదలకు నెలకు నాలుగు (4) లీటర్లు, ఇతర ప్రాంతాలవారికి రెండు (2) లీటర్లు, దీపం పథకం క్రింద సిలిండర్ పొందిన వారికి ఒక లీటరు (1)చొప్పున రేషన్ దుకాణాల ద్వారా ప్రభుత్వం అందజేస్తుంది. అయితే ఒక లీటరు కిరోసిన్‌ను ప్రభుత్వం 48 రూపాయలకు కొనుగోలు చేసి, లబ్ధిదారునికి కేవలం 15 రూపాయలకు అందజేస్తుంది. అంటే ప్రతి లీటరుకు ప్రభుత్వం 33 రూపాయల సబ్సిడీ భరిస్తోంది.

ఈ నగదు బదిలీ అమల్లో ఉన్నచోట ఎన్ని లీటర్లకు లబ్ధిదారులు అర్హులైతే అన్ని లీటర్లకు 33 రూపాయలు చొప్పున వారి బ్యాంకు ఖాతాలోకి నగదు బదిలీ చేయబడుతుంది. అయితే లబ్ధిదారుడు ఇప్పటి వరకు చెల్లిస్తున్న 15 రూపాయలు కలుపుకుని మార్కెట్ ధరకు కిరోసిన్‌ను కొనుగోలు చేసుకోవల్సి వుంటుంది. అయితే ఒక నెలలో వారు కొనుగోలు చేయకపోతే ఆ మొత్తం తిరిగి ప్రభుత్వానికి చేరుతుంది. కిరోసిన్‌కు నగదు బదిలీ ఇంకా ప్రారంభం కావల్సి ఉంది.

ఇదే విధంగా ఉపకారవేతనాలు, వృద్ధాప్య పింఛనులు, వికలాంగ పింఛనులు, వితంతు పింఛనులు, మహిళా శిశు సంక్షేమ పథకాలకు సంబంధించిన నగదును లబ్దిదారులకు వారి వారి అకౌంట్లలోకి ప్రభుత్వం నేరుగా బదిలీ చేస్తుంది.

ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు, ఇతర పథకాల ద్వారా రైతులకు, విద్యార్థులకు, బలహీన వర్గాలకు ఇచ్చే సబ్సిడీ పథకాలకు సంబంధించి లబ్దదారుల ఎంపిక మొదలు పంపిణీ వరకూ చోటు చేసుకుంటున్న అక్రమాలు, అవినీతి, ప్రజాధనం దుర్వినియోగాన్ని నివారించేందుకుగాను ఈ నగదు బదిలీ పథకం ఎంతగానో ఉపయోగపడుతుంది.

**ఎం. ప్రదీప్‌కుమార్,** రీసెర్చ్ అసోసియేట్, అపార్డ్

# జాతీయాభివృద్ధికి కీలకమైన పిల్లల మనుగడ, ఎదుగుదల

"దేశమంటే మట్టికాదోయ్ దేశమంటే మనుషులోయ్
ఈసురోమని మనుషులుంటే దేశమేగతి బాగు పడునోయ్"
*- గురజాడ అప్పారావు (1862-1915)*

"మన గ్రామాలను పట్టి పీడించే త్రిముఖ జాడ్యము పారిశుధ్య వ్యవస్థలేమి, పోషకాహార లోపం, అలసత్వములే"
*- మహాత్మాగాంధీ (7.5.1936)*

"ఊయలను ఊపే చేతులే ప్రపంచాన్ని శాసించే చేతులు"
*- బ్రిటిష్ సామెత*

**ఏ దేశపు ఆర్థిక వికాసమైనా, పునర్నిర్మాణమైనా ఆధారపడే కీలకాంశాలలో ఆ దేశపు మానవ వనరుల శక్తి సామర్థ్యాలు ముఖ్యమైనవి. వివిధ దేశాలకు సంబంధించిన పరిశీలనలో ఈ విషయం నిరూపించబడింది. దీన్ని బట్టి గ్రహించవలసినదేమిటంటే ఎప్పటికప్పుడు ప్రభుత్వాలు, ప్రభుత్వ సంస్థలు, సమాజాలు తదుపరి తరాల గురించి ఆలోచిస్తూ వారి శ్రేయస్సుకు బాటలు వేసే కార్యక్రమాలు చేపట్టాల్సి ఉంటుంది. ఈ "శ్రేయస్సు" అనే అంశానికి చాలా విస్తృతమైన పరిధి ఉన్నా కూడా అందులో అతి ముఖ్యమైన భాగం శారీరక, మానసిక ఆరోగ్యమే. రేపటి తరాల శారీరక, మానసిక పటుత్వాల ప్రమాణాలకు తొలి బీజాలు నేటి తల్లుల గర్భావస్థలోనే పడతాయని ప్రపంచవ్యాప్తంగా శాస్త్రీయ అధ్యయనాల్లో తేలింది. ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రీయ పత్రిక లాన్‌సెట్** (The Lancet) **2008లో ప్రారంభించి ఇటీవలే ముగించిన "మాతాశిశుపోషణ" పై నాలుగు భాగాల వ్యాససరళిలో ఈ విషయాన్ని నొక్కి వక్కాణించింది.**

ఈ నివేదిక మాటల్లో చెప్పాలంటే ''తమ ప్రజలు తగినంతగా పోషితులు కాకుండా దేశాలు దారిద్ర్యాన్ని అధిగమించలేవు. సాధించే ఆర్థిక ప్రగతిని నిలబెట్టుకోలేవు. పోషకాహారలోపం పర్యవసానంగా సంభవించే ఉత్పాదకతా లోపాలు, జ్ఞాన సంబంధశక్తి లోపాలు, బడి మానివేయటం వల్ల వచ్చే నష్టాలు ఒక దేశపు ఆర్థిక ప్రగతిని కనీసం 8% మేరకు తగ్గిస్తాయి. మాతృపోషణ కేవలం తల్లి మనుగడ కోసమే కాదు - పుట్టబోయే బిడ్డ మనుగడకు, ఎదుగుదలకు కూడా కీలకం''

ఐసిడిఎస్, ఎన్ఆర్‌హెచ్ఎం, జేఎస్‌వై, ఆర్ఎంఎన్‌సిహెచ్, ఇతర పథకాల ద్వారా భారతదేశం మాతాశిశు సంరక్షణ లో గణనీయమైన మెరుగుదలను సాధించింది. మాతాశిశు మరణాల రేట్లు బాగా తగ్గు ముఖం పట్టాయి.

మాతృ మరణాల విషయానికి వస్తే 1990లో లక్షకు 600 మంది చనిపోతే, 2010లో లక్షకు 200 మంది చనిపోయారు (ఆంధ్రప్రదేశ్ 134). 1990లో లక్ష కాన్పులకు 115 శిశువులు చనిపోతే 2010లో ఆ సంఖ్య 59కి తగ్గింది. (ఆంధ్రప్రదేశ్ 49). అలాగే 1990లో 1000 మంది 5 సంవత్సరాలలోపు పిల్లలతో 114 మంది చనిపోతే ఆ సంఖ్య 2010 నాటికి 61 కు తగ్గింది (ఆంధ్రప్రదేశ్ 52) కాని అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే ఇది చాలదు. పైగా దేశంలో మాతాశిశు మరణాల రేట్లు తగ్గు ముఖం పట్టినప్పటికీ, ఈ మరణాల సంఖ్య ఇంకా చాలా ఎక్కువగా ఉండి (సంవత్సరానికి దాదాపు 17 లక్షలు) ప్రత్యక్షంగా సంబంధిత కుటుంబాలపైన, పరోక్షంగా దేశాభివృద్ధిపైన చూపిస్తోన్న ప్రభావాన్ని గమనిస్తే ఇంకా చేయవలసినది చాలా ఉందని, అది సాధ్యమైనంత త్వరితగతిన చేయాలని మనకర్థమవుతుంది. ఈ క్రింద కనపరచిన తులనాత్మక గణాంకాలు / అంశాలు దీన్ని విశదీకరిస్తాయి.



| సూచిక | ప్రపంచము | భారత్ | ఇతర గమనార్హమైన అంశాలు. |
|---|---|---|---|
| మొదటి రోజే సంభవించే శిశుమరణాల రేటు (వేయి జననాలకు) | 8 | 11 | అభివృద్ధి చెందిన దేశాలలో ఇది 4 లోపే ఉంది. శ్రీలంక, వియత్నామ్, ఇండోనేషియా, నేపాల్, బంగ్లాదేశ్‌లలో భారత్ కంటే తక్కువగా ఉంది. |
| మొదటినెలలో సంభవించే శిశు మరణాల రేటు (వేయి జననాలకు) | 22 | 32 | అభివృద్ధి చెందిన దేశాలలో ఇది 4లోపే శిశు మరణాల ఉంది. శ్రీలంక, వియత్నామ్, ఇండోనేషియా నేపాల్, బంగ్లాదేశ్‌లలో భారత్ కంటే తక్కువగా ఉంది. |
| 5 సంవత్సరాలలోపు సంభవించే పిల్లల మరణాల రేటు (వేయి జననాలకు) | 51 | 61 | అభివృద్ధి చెందిన దేశాలలో ఇది 8 లోపే ఉంది. శ్రీలంక వియత్నామ్ ఇండోనీషియా, నేపాల్, బంగ్లాదేశాలలో భారత్ కంటే తక్కువగా ఉంది. ఆంధ్రప్రదేశ్ 48 లోఉంది. కేరళ (12) తమిళనాడు (28), కర్నాటక (41), మహారాష్ట్ర (31). ఇంకాతక్కువ. |
| మాతృమరణాల నిష్పత్తి (లక్ష జననాలకు) | 210 | 200 | అభివృద్ధి చెందిన దేశాలలో ఇది 16 లోపే ఉంది. ఆంధ్రప్రదేశ్ 134కు తగ్గించింది. కేరళ, తమిళనాడు, మహారాష్ట్రలలో ఆంధ్రప్రదేశ్ కంటే తక్కువ ఉంది. |



**మాతృ సంక్షేమ సూచిక (2013)**

'సేవ్ ది ఛిల్డ్రన్'' అనే ప్రఖ్యాత అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థ 176 దేశాలకు సంబంధించిన ఈ క్రింది 5 అంశాల స్థితిగతులను పరిగణనలోకి తీసికొని మాతృ సంక్షేమ సూచికలను (Mother's index) నిర్ధారించి ఇటీవలే ప్రకటించింది.

1. తల్లుల ఆరోగ్యం (మాతృమరణాలు)
2. పిల్లల ఆరోగ్యం (5 సంవత్సరాల లోపు పిల్లల మరణాలు)
3. విద్య (పిల్లలు సగటున విద్యాలయాల్లో చదివే సంవత్సరాల సంఖ్య)
4. ఆర్థిక స్థితి (తలసరి ఆదాయం)
5. మహిళల రాజకీయ భాగస్వామ్యం (పార్లమెంటులో సీట్ల శాతం)

ఈ ప్రకటన ప్రకారం భారత్ ఈ సమ్మిళిత మాతృసూచికలో 142 వ స్థానంపొందింది. కొన్ని ఇతర దేశాల స్థానాలు ఇలా ఉన్నాయి.

| | | |
|---|---|---|
| 1. ఫిన్‌లాండ్ | 86. వియత్నాం | 173. మాలి |
| 2. స్వీడెన్ | 89. శ్రీలంక | 174. సియెరాలెవన్ |
| 3. నార్వే | 106. ఇండోనేషియా | 175. సోమాలియా |
| 4. ఐస్ లాండ్ | 121. నేపాల్ | 176. కాంగో |
| | 136. బంగ్లాదేశ్ | |

ఈ పూర్వరంగాన్ని దృష్టిలో ఉంచుకొని భారత్ ఇదివరకటి కంటే ఇంకా వేగంగా మాతా శిశుసంరక్షణ, పిల్లల ఎదుగుదలలో మెరుగైన ఫలితాలను అందుకోవాల్సిన అవసరముంది. దీనికి సంబంధిత ప్రభుత్వ శాఖలు,సమాజాలు, కుటుంబాలు నడుముబిగించాలి. WHO, UNICEF, The Lancet, John Hopkins Medical School, PHFI ఇత్యాది ప్రఖ్యాత సంస్థల ఆధ్వర్యంలో ప్రపంచవ్యాప్తంగా జరిగిన పరిశోధనలు, పరిశీలనలతో తేలిన ఫలితాల ఆధారంగా పిల్లల మనుగడ, ఎదుగుదలకు త్రిముఖ వ్యూహం రూపొందింది. ఈ వ్యూహంలోని మూడు పార్శ్వాలు ఇవి.

1. మాతాశిశువులకు శాస్త్రీయ పద్ధతిలో నిర్దేశిత/అవసరమైన ఆరోగ్య సేవలు అందుబాటులోకి రావటం (HEALTH)
2. మాతాశిశువులకు సరైన పోషకాహారం చేరటం (NUTRITION)
3. పారిశుద్ధ్యం, శుభ్రతా అలవాట్లు (WASH).

ఈ వ్యూహంలోని ముఖ్యమైన అంశాలు పిల్లలు ఎదుగుదలలో దశలవారీగా ఇలా ఉన్నాయి.

| సంఖ్య | దశ | అవసరమైన జాగ్రత్తలు | దీని అవసరాన్ని బలపరచే ఆధారం |
|---|---|---|---|
| 1. | గర్భధారణకు పూర్వం | 1. కనీస గర్భధారణ వయస్సు<br>2. గర్భాల మధ్య విడత<br>3. గర్భస్రావ జాగ్రత్తలు | 20 సంవత్సరాల కంటే తక్కువ వయసులో గర్భదారణ, ప్రసవాలమధ్య తగినంత వ్యవధి లేకపోవడం వల్ల బిడ్డ తక్కువ బరువుతో పుట్టే అవకాశాలు ప్రసవంలో సమస్యలు వచ్చే అవకాశాలు ఎక్కువని తేలింది. మాతృమరణాల నిష్పత్తి కూడా అటువంటి స్త్రీలలో రెండు రెట్లు అధికంగా ఉందని తేలింది. |
| 2 | గర్భిణీ దశ | ఐరన్, ఫోలిక్ఆసిడ్, కాల్షియం, అయోడిన్ సూక్ష్మ పోషకాలు ప్రొటీన్ల వినియోగం మలేరియా నిరోధక చర్యలు నులిపురుగుల తొలగింపు, స్థూలకాయ నిరోధం, గర్భిణీ దశలో కనీసం 4 సార్లు వైద్యులచే ఆరోగ్య పరీక్షలు, వైద్య సలహా ప్రకారం టిటి ఇంజెక్షన్లు తీసికోవటం. | ఐరన్ కాల్షియమ్‌ల లోపాలు మాతృ మరణాలలో ప్రముఖపాత్ర వహిస్తాయని తేలింది. తల్లిలో ఐరన్ లోపానికి బిడ్డ తక్కువ బరువుతో పుట్టడానికి సంబంధముందని తేలింది. మాతృస్థూల కాయానికి మాతృమరణానికి ముందస్తు ప్రసవానికి, మరణానికి సంబంధముందని తేలింది. గర్భస్థదశలో తల్లి పోషకాహార లోపం బిడ్డ ఎదుగుదల లోపానికి బిడ్డ వ్యాధుల బారిన పడటానికి హెచ్చైన అవకాశాలకు దారితీస్తుందని కూడా తేలింది. |
| 3. | ప్రసవసమయం | ఆస్పత్రి/ఆరోగ్య కేంద్రంలో ప్రసవం | భారత దేశంలో మాతృ మరణాలకు ముఖ్యకారణాలు రక్తపుపోటు సమస్యలు, రక్తస్రావం, సెప్సిస్, గర్భస్రావ-సమస్యలు, గర్భస్థదశలో ఆరోగ్య జాగ్రత్తలతో పాటు ప్రసవాలు ఆరోగ్య కేంద్రాలలో జరిగితే ఈ మరణాలు చాలా వరకు నివారించవచ్చు. |
| 4. | క్రొత్త శిశువు | • మొదటి గంటసేపు తల్లి శరీరంతో సన్నిహిత స్పర్శ<br>• సాధ్యమైనంత త్వరగా చను బాలు ప్రారంభించటం. (ముర్రుపాలుతో సహా)<br>• బిడ్డకు విటమిన్-కె అందజేత<br>• అవసరాన్ని బట్టి తక్కువ బరువున్న శిశువులకు విటమిన్-ఎ అందివ్వటం,<br>• 'కంగారూ తల్లి' ఆదరణ.<br>• అవసరాన్ని బట్టి అంటువ్యాధి నిరోధక మందులు (Antibiotics) బిడ్డకు తల్లికి అందివ్వటం.<br>• బిడ్డను వెచ్చగా ఉంచే ఏర్పాట్లు<br>• బొడ్డుకోయడానికి సక్రమమైన క్రిమిరహిత పద్ధతి పాటించడం.<br>• అవసరాన్ని బట్టి శిశువు సక్రమంగా ఊపిరి తీసికునేందుకు సాయపడటం. | క్రొత్త శిశువు విషయంలో ఈ జాగ్రత్తలు పాటించకపోవడమే మొత్తం శిశు మరణాలలో సగానికి పైగా ఈ దశలో జరుగుతాయని తేలింది.<br>ఈ మరణాలకు కారణాలు<br>25% - అంటువ్యాధి<br>23% - ఊపిరాడక పోవటం<br>35% - ముందస్తు ప్రవాహాల్లో<br>17% - ఇతర కారణాలు<br>• భారత దేశంలో 1 సంవత్సరానికి 3 లక్షల శిశువులు మొదటి రోజునే మరణిస్తున్నారు. |
| 5. | బిడ్డకు 5 సం॥ వయస్సు పూర్తయేంత వరకు | • సంవత్సరం లోపున వ్యాధి నిరోధక టీకాలు కార్యక్రమాన్ని పూర్తిగా పాటించడం (బిసిజి, డిపిటి, ఓపివి, తట్టు)<br>• మొదటి 6 నెలలు బిడ్డకు కేవలం చనుబాలే ఇవ్వటం.<br><br>• 6 నెలలు దాటాక చనుబాలతోపాటు అనుబంధ పోషకాహారం కూడా ఇవ్వాలి. చనుబాలివ్వటం కనీసం 2 సంవత్సరాలు వయస్సు వచ్చే వరకు ఇవ్వాలి. | ఈ టీకాలు కార్యక్రమం వ్యాధుల నుండి (క్షయ, పోలియో, ధనుర్వాతం, కంఠసర్పి, కోరింతదగ్గు, తట్టు, హెపటైటిస్ బి) రక్షణనిస్తుంది.<br>• మొదటి 6 నెలలు చనుబాలతో పెరిగిన బిడ్డల విషయంలో శారీరక, మానసిక ఎదుగుదల బాగా ఉంటుందని శాస్త్రీయ పరిశీలనలలో తేలింది, పైగా ఇతర బిడ్డలతో పోలిస్తే వ్యాధులు వచ్చే అవకాశం 6రెట్లు తక్కువగా ఉంటుందని నిరూపితమయింది.<br>6 నెలల తరువాత కేవలం చనుబాలు చాలదు కాబట్టి, అనుబంధకాహారం అవసరం. |

| | | | |
|---|---|---|---|
| | | • సూక్ష్మపోషకాలను (ముఖ్యంగా విటమిన్ ఏ, ఐరన్, జింక్) ఆహారం ద్వారా కాని ఇతరత్రాకాని తప్పకుండా అందివ్వాలి. | ఈ దశలో జింక్ ఎదుగుదలకు తోడ్పడుతుందని, న్యుమోనియా విరేచనాల అవకాశాన్ని తగ్గిస్తుందని తేలింది.<br>విటమిన్-ఏ వ్యాధినిరోధక శక్తి పెంచుతుందని ఐరన్ కూడా ఎదుగుదలకు తోడ్పడుతుందని తేలింది. |
| | | • బిడ్డలు అనారోగ్యంతో బాధ పడుతున్నపుడు పోషకాహారం మానకూడదు. (ద్రవాహారం రూపంలో) చను బాలివ్వటం ఆపకూడదు. | ఇది ముఖ్యంగా విరేచనాలతో బాధ పడుతున్న పిల్లలశక్తి పెంచుతుందని, విరేచనాలను పెంచదని తేలింది. |
| | | • మలేరియా విస్తతంగా ఉన్న ప్రాంతాలలో క్రిమి సంహార మందుతో ఉన్న దోమ తెరల వాడకం | |
| | | • సమస్యాత్మకం కాని చిన్నజబ్బులకు సరైన చికిత్సను ఇంట్లోనే ఇవ్వటం (ముఖ్యంగా విరేచనాలకు ఓఆర్‌టి ఇవ్వటం) | ఓఆర్‌టి విరేచన సంబంధిత పిల్లల మరణాలను 41% మేరకు తగ్గించినట్లు తేలింది. |
| | | • అవసరమొచ్చినపుడు తాత్సారం చేయకుండా పిల్లలకు వైద్యసహాయం అందచేయటం. | |
| | | • పిల్లలకు ఉత్తేజకరమైన వాతావరణాన్ని అందించి వారి అవసరాలకు స్పందించడం ద్వారా వారి సాంఘిక ఎదుగుదలను పెంచాలి. | ఈ రకంగా పెరిగిన పిల్లలలో విద్యా విషయక విజయాలే కాకుండ సరైన సాంఘిక దృక్పథం కూడా ఉంటుందని తేలింది. |
| 6. | అన్నిదశలు | సరైన పారిశుద్ధ్యం, వ్యక్తిగత శుభ్రతా అలవాట్లు ముఖ్యంగా<br>• వ్యక్తిగత మరుగుదొడ్లనిర్మాణం, వాడకం.<br>• సురక్షిత మలనిర్వహణా విధానాలు<br>• పిల్లల మలాన్ని కూడా సురక్షితంగా విసర్జించటం.<br>• ఆహారాన్ని తయారుచేసి పిల్లలకిచ్చే ముందు, మల విసర్జన తరువాత సబ్బుతో సక్రమంగా చేతులు కడుక్కోవడం<br>• త్రాగునీటి శుభ్రత విషయంలో తగు జాగ్రత్తలు.<br>• ప్రసవ సమయంలో పరిశుభ్రత క్రిమిరహిత వాతావరణం. | బహిరంగ మలవిసర్జన, వ్యక్తిగత పరిశుభ్రతా అలవాట్ల లేమి డయేరియా, శ్వాస కోశ వ్యాధులు ఇత్యాదులకు దారి తీస్తుందని నిరూపితమయింది. డయేరియా మరణాల్లో 88% పారిశుద్ధ్య లేమి వల్లేనని తేలింది. |

### మొదటి 2 సంవత్సరాలు

ఒక వ్యక్తి ఎత్తు, శారీరక, మానసిక సామర్థ్యం, జ్ఞాన సంబంధ శక్తి, తనకు పుట్టబోయే పిల్లల స్థితిపై ఆ వ్యక్తి తన జీవితంలోని మొదటి 2 సంవత్సరాలలో అందుకొన్న పోషణ ప్రభావం ఉంటుందని ప్రపంచ వ్యాప్తంగా నిపుణులు ఏకాభిప్రాయంతో ఉన్నారు. మొదటి 2 సంవత్సరాల పోషకాహార లోపం ప్రభావం తిరగదోడలేనిదని వారి అభిప్రాయం. అందుకే గర్భధారణ సమయం నంచి 1000 రోజులను అతికీలకంగా పరిగణించి దానికి '1000 day window' గా పేరు పెట్టారు.


భారత ప్రభుత్వం ఈ విషయానికి అధిక ప్రాధాన్యత నిస్తోంది. సంబంధిత పథకాలను సమీక్షించి ఇంకా పటిష్టపరచే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇంతటి జాతీయ ప్రాముఖ్యత కలిగిన పథకాలతో సంబంధమున్న వారందరు సామాజిక స్పృహతో పిల్లల మనుగడ, ఎదుగుదల కార్యక్రమాలను ఒక జాతీయ బాధ్యతగా గుర్తించి మరింత మెరుగైన ఫలితాలను త్వరితగతిన సాధిస్తారని ఆశిద్దాం.

**- ఏ. నాగేశ్వర రావు,**
**సెంటర్ హెడ్, నీరు పారిశుద్ధ్య కేంద్రం, అపార్డ్**

# ఎయిడ్స్ వ్యాధి -నైతికవిలువలు-నీతి, సన్మార్గం

**'ఎయిడ్స్' అనేది ప్రపంచపు దృష్టిలో నివారణ లేని ఒక భయంకరమైన వ్యాధి. అయితే నిజానికి ఇది వ్యాధి కాదు. మనిషి తన శరీరం నందలి రోగనిరోధక శక్తిని కోల్పోవడం, తద్వారా అనేక వ్యాధులు శరీరాన్ని చుట్టుముట్టి మనిషి మరణానికి దారి తీసే వ్యాధినే ఎయిడ్స్ (Acquired Immune Deficiency Syndrome) అంటాం. దీనిని గూర్చి ఇంకాస్త వివరాలలోకి వెళితే.....**

ప్రతి మనిషికి కూడా తన తాహతు మేరకు తన పిత్రార్జితమైన, స్వార్జితం ద్వారా ఒనకూడిన ఆస్తిపాస్తులు వుండటం సహజం. వీటినే మనం సంపాదించుకున్న ఆస్తిపాస్తులు అనవచ్చు (Acquired Properties). అలాగే ప్రతి మనిషి శరీరంలో కూడా సొంతంగా సంపాదించుకున్న రోగనిరోధక శక్తి అనే పదార్థం ఉంటుంది. దీనినే మనం 'Acquired Immune' అని అంటాం. ఇది మనిషిని బట్టి కొంత ఎక్కువ, తక్కువ వుండవచ్చు. అయితే ప్రతి మనిషిలోను అంతో, ఇంతో ఈ శక్తి దాగి వుంటుంది. ఇటువంటి శక్తి ఎక్కువ వున్న వారు చాలావరకు రోగాల బారిన పడకుండా వుంటారు. అదే తక్కువ శక్తివున్న వారు తరచుగా జబ్బుల బారినపడుతూ వుంటారు. మరి అటువంటి శక్తి పూర్తిగా క్షీణిస్తే పలురకాల రోగాలు ఆ మనిషి శరీరాన్ని చుట్టు ముట్టి, ఆ వ్యక్తి మరణానికి దారి తీస్తాయి. దీనినే ఎయిడ్స్ ద్వారా మరణం అంటాం.



ఈ ఎయిడ్స్ వ్యాధి సోకడానికి మూల కారణం చెడు అలవాట్లు. ముఖ్యంగా ప్రకృతి విరుద్ధమైన లైంగిక, ఆహారపు అలవాట్లు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు కొంతకాలానికైనా మరణించక తప్పదు. మరి ఇటువంటి మరణం ఆ వ్యక్తికి లేదా అతని కుటుంబానికి నష్టం కలిగించ వచ్చు.

*ఇవుడు నైతిక నియమాలను గూర్చి తెలుసుకుందాం.*

నైతికత అంటే నీతి, నియమం, సన్మార్గం, నిబద్ధత అనవచ్చు. ప్రతి మనిషిలో కూడా తన శరీరంలో వున్న రోగనిరోధక శక్తి మోతాదు మాదిరిగానే నైతికత, నీతి నిజాయితీలు దాగి వుంటాయి.

ఉదా: ఒక దొంగ ఒక కలవారి ఇంట్లో దొంగతనానికి వచ్చి డబ్బు, నగలు దొంగిలించడమే కాక, ఇంటి ఇల్లాలి ఒంటిపై గల నగలన్నీ దోచుకుని ఇల్లాలు ప్రాధేయ పడితే మెడలోని తాళి వదిలివేయడం. ఇది ఆ దొంగకున్న కనీస నైతికత. ఇలా ప్రతి వ్యక్తిలోను కొద్దో, గొప్పో నైతికత దాగి వుంటుంది. నైతికత మోతాదు ఎక్కువ వున్నవారు తమ అవసరాలు కూడా పట్టించుకోకుండా ఇతరులకు సహాయపడతారు. ఒక మోస్తరుగా వున్న వారు తమ అవసరాలు తీరిన తరువాత ఇతరులను ఆదుకుంటారు. నైతికత తక్కువగా వున్న వారు ఇటువంటి విషయాలు ఆలోచించరు. నైతిక విలువలు పూర్తిగా లోపిస్తే, వారు చేసే అకృత్యాలకు, దుర్మార్గాలకు, అవినీతి, అసాంఘిక కార్యక్రమాలకు అంతే వుండదు. ఇలా మనిషి, మనిషికి తేడా వుంటుంది. నైతిక విలువల స్థాయిని బట్టి ఆ మనిషి ప్రవర్తన వుంటుంది.

*ఎయిడ్స్ వ్యాధికి, నైతిక విలువలు లోపించడానికి సంబంధం ఏమిటి?*

గతంలో వివరించినట్లుగా సంపాదించుకున్న రోగనిరోధక శక్తి (Acquired Immune) లోపిస్తే, మనిషిపై అనేక జబ్బులు దాడి చేసి ఎయిడ్స్ వ్యాధికి దారితీయడం, ఫలితంగా ఆ వ్యక్తి చనిపోవడం, తద్వారా ఆ వ్యక్తికి వ్యక్తిగతంగాను, లేదా కుటుంబానికి గాని నష్టం కలుగుతుంది.

అదే మనిషిలోని నైతికత (Morality) పూర్తిగా లోపిస్తే, అటువంటి మనిషి ఎయిడ్స్ రోగిలా మరణించడు. అయితే అతని దుర్మార్గపు, అసాంఘిక మరియు అవినీతి కార్యక్రమాల ద్వారా తన చుట్టూ వున్న మనుషులను, సమాజాన్ని చంపే ప్రయత్నం చేస్తాడు. మరి ఇటువంటి పరిస్థితులలో రోగనిరోధక శక్తి (Acquired Immune) కోల్పోవడం వలన సంక్రమించే ఎయిడ్స్ వ్యాధి ప్రమాదకరమా? లేక నైతిక విలువలు (Moralities) పతనం కావడం వలన సంభవించే దుర్మార్గాలు ప్రమాదకరమా? ఒక్కసారి ఆలోచిద్దాం.

సమాజంలో రోజురోజుకు పెరిగి పోతున్న దుశ్చర్యలకు, దుర్మార్గాలకు మూల కారణం మనిషిలో నైతిక విలువలు లోపించడంకాదా? మరి ఇటువంటి నైతిక విలువలు పెంపొందించే కార్యక్రమాలను ఇటు ప్రభుత్వాలు కాని, ప్రజా సంఘాలు కాని, అధికార యంత్రాంగం కాని చేపడుతున్నారా?

ప్రజల జీవన ప్రమాణాలు పెంచే దిశలో వందల కొద్దీ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు, పథకాలు ప్రవేశపెట్టి కోట్లాది రూపాయలు ఖర్చు చేసే ప్రభుత్వాలు, ఎయిడ్స్ లాంటి వ్యాధుల నివారణపై ప్రత్యేక శ్రద్ధ వహించే అధికార యంత్రాంగం అంతకంటే భయంకరమైన 'నైతిక విలువల పతనం' పై శ్రద్ధ వహించక పోవటం శోచనీయం.

ప్రస్తుత తరుణంలో సమాజంలో నైతిక విలువలు పెంపొందించే దిశలో చర్యలు చేపట్టక పోతే ప్రభుత్వాలు ఎన్ని సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినా, ఎన్ని కోట్ల రూపాయలు ఖర్చు చేసినా ఆశించిన అభివృద్ధి జరిగే అవకాశం ఎంత మాత్రం లేకపోగా, అవి ప్రక్క దారి పట్టి, అవినీతిపరులకు వరంగా మారే ప్రమాదం వుంది.

*- జి. జయపాల్ రెడ్డి, కన్సల్టెంట్, ఎమ్ఆర్, అపార్డ్*

# ఆంధ్రప్రదేశ్‌లో సంక్షేమ హాస్టళ్ల స్థాపనకు కృషి చేసిన
# పి.ఎస్ కృష్ణన్, ఐఏఎస్ (రిటైర్డ్)

**భారతదేశం పలు అభివృద్ధి పథకాలకు నాంది పలికింది. అందులో సాంఘిక సంక్షేమం ఒకటి. రాష్ట్రంలో ఉన్న బడుగు, బలహీన, వర్గాలను ఉద్ధరించాలనే ఆలోచన చేసిన వారు మాజీ ఐఏఎస్ అధికారి పి.ఎస్. కృష్ణన్ గారు. ఆయన ప్రకాశం జిల్లా సబ్ కలెక్టరుగా పని చేస్తున్న కాలంలో బడుగు వర్గాలు, ముఖ్యంగా షెడ్యూల్డు కులాల, జాతుల వారిని ప్రతి సంవత్సరం జరిగే 'జమా బందీ' కార్యక్రమంలో సమావేశ పరిచి విధాన నిర్ణయాలు చేసేవారు. అందులో భాగంగా వచ్చిన ఆలోచనే ప్రభుత్వం సంక్షేమ హాస్టళ్లు నిర్వహించాలని. దానితో అయన ఒక పథకం తయారుచేసి ప్రభుత్వానికి సమర్పించగా, దానిని అప్పటి ప్రభుత్వం అంగీకరించింది.**

దానితో 1964-71 ప్రాంతంలో షెడ్యూల్డు కులాలు, జాతులు, వెనుకబడిన తరగతులు (బి.సిలు) కోసం విశ్వవిద్యాలయ హాస్టళ్ళు, కాలేజీ హాస్టళ్ళు, స్వయంగా ప్రభుత్వమే నిర్వహించే హాస్టళ్ళు వచ్చాయి. అప్పటి వరకు ఉన్న చీకటి గదుల, ప్రైవేటు హాస్టళ్ళను స్వాధీనం చేసుకుని, మెరుగు పరచి ప్రభుత్వం నడపటం ప్రారంభించింది.



దానితో, పాఠశాలలు, కళాశాలలలో చదివే విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంక్షేమహాస్టళ్ళను నిర్వహించడం ప్రారంభించింది. 1975లో అత్యవసర స్థితి కాలంలో ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలు అమల్లో పెట్టింది. అందుకు ఆ నాటి గవర్నరు సలహాదారుగా నున్న శ్రీ శరీన్, ఐ.ఏ.ఎస్. వాటికి స్థిరీకరణరూపం కల్పించి, దేశంలో సంక్షేమ పథకాల అమలులో ముందుంచారు.

దానితో అత్యవసనర స్థితి ముగిసిన అనంతరం జరిగిన ఎన్నికలలో దేశం మొత్తం మీద కాంగ్రెస్ పార్టీ ఓడిపోగా, ఆంధ్రప్రదేశ్‌లోనే 41 లోక్ సభ సీట్లను గెల్చుకోవడం విశేషం. ఆ కృషికి తోడ్పడిన వారిలో పి.ఎస్. కృష్ణన్ వాటికి, రూపం కల్పిస్తే, శ్రీ శంకరన్ ఐ.ఏ.ఎస్., వాటిని స్థిరీకరించి, అభివృద్ధి పథంలో నడిపారు. సంక్షేమ హాస్టళ్లకు బడ్జెట్ కేటాయించి పాలనలో భాగం చేసిన ఘనత వీరిద్దరికే దక్కుతుంది.

అదేరీతిలో గిరిజనుల సంక్షేమానికి కూడా పాటు పడిన వారు బి.డి. శర్మ, ఐ.ఏ.ఎస్. ఆయన గిరిజనులను చేరదీసి విద్యా, సంస్కృతీకరణకు తోడ్పడ్డారు. గిరిజనుల సంస్కృతికి తూట్లు పొడవకుండా వారిని నేటి నాగరికతకు చేర్చడం లక్ష్యంగా, సమగ్ర గిరిజన అభివృద్ధి పథకాలను రచించారు. అదే రీతిలో పి.వి. నరసింహారావు ప్రధానిగా ఉన్నకాలంలో ఆయన ఒడిస్సాలో గంజాం జిల్లా పేద ప్రాంతమైన గిరిజనులకు ప్రాతినిథ్యం వహించిన సమయంలో గిరిజనాభివృద్ధి అంటే వారి అసలు జీవితాన్ని, సంస్కృతి, వేషం, బాషలను మార్చడం కాదని, వాటిని సంరక్షిస్తూ వారిని వెలుగులోకి తేవడమని అన్నారు.

కాని, నేటి పరిస్థితుల్లో వారి సంస్కృతి, ఆచార వ్యవహారాలను ధ్వంసం చేసి, ఆధునిక జీవన విధానాన్ని రుద్దడంకాదని గుర్తించి గిరిజనుల ఉన్నతి కొరకు పనిచేయాల్సి ఉంది.

ఆంధ్రప్రదేశ్‌లో సమగ్ర గిరిజనాభివృద్ధి పథకాలను అమలు చేయటంలో గిరిజన శాఖలో కమీషనర్‌గా, కార్యదర్శిగా, ప్రిన్సిపల్ కార్యదర్శిగా పనిచేస్తున్న ఐ.ఏ.ఎస్. అధికారి ఎ. విద్యాసాగర్‌ను ప్రముఖంగా చెప్పుకొనవచ్చు. ఆయన నాయకత్వంలో గిరిజనులు ప్రాథమిక, మాధ్యమిక, కళాశాల, విశ్వవిద్యాలయ స్థాయిల్లో షెడ్యూల్డు కులాల కంటే ముందున్నారని ఆంధ్రప్రదేశ్ గణాంక వివరాలు చెబుతున్నాయి. గిరిజనుల సమగ్రాభివృద్ధిలో విద్యాసాగర్ కృషి చాలా ఉందని చెప్పవచ్చు.

నేటి షెడ్యూల్డు కులాల అభివృద్ధికి ఎన్నోవిధాలుగా ప్రణాళికా బద్దమైన కృషిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చేయడం గర్వించదగిన విషయం. షెడ్యూల్డు కులాలు, జాతుల ఉపప్రణాళికలకు 1984లో రూపం కల్పించిన వారు ఆనాటి సాంఘిక సంక్షేమ కార్యదర్శిగా పి.ఎస్. కృష్ణన్ గారే. ఆనాటి ప్రధాని ఇందిరాగాంధీ ఆదేశాల మేరకు ఎస్‌సి, ఎస్‌టిలకు ఉపప్రణాళికలను ఆయన 1984లోనే తయారు చేసి, అమలుకు రాష్ట్రాలకు పంపితే ఇంతవరకు ఏ రాష్ట్రం ఈ ఉపప్రణాళికలు అమలు చేయడానికి ముందుకురాలేదు.

కాని మన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి చొరవ తీసుకొని దేశంలోనే మొట్టమొదటి సారిగా ఎస్.సి., ఎస్‌టి ఉప ప్రణాళికలకు చట్టబద్ధతను కల్పించారు. ఇది 2013, ఏప్రిల్‌లో జరిగింది. అంటే, సాంఘిక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడంలో ఆంధ్రప్రదేశ్ ముందుండటానికి కూడా కారణం ఆనాడు శ్రద్ధతో, లక్ష్యాలను నిర్దేశించి అమలుకు కృషి చేసిన పి.ఎస్. కృష్ణన్ గారే.

ఇందుకు ఆయన ఎంతగానో అభినందనీయులు. ఈ పథకాలు దళితుల బ్రతుకుల్లో వెలుగు నింపడానికి కృషి చేసిన వ్యక్తి పి.ఎస్. కృష్ణన్. ఆంధ్రప్రదేశ్ అకాడమీ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్‌లో నిర్వహించిన సంక్షేమ ఆఫీసర్ల (వార్డెన్స్) శిక్షణా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి, ఆనాడు బడుగు వర్గాల ఉన్నతికి నడుం బిగించి, వారిని పేదరికం, అవిద్యల నుండి బయటపడేలా చేసిన కృషిని వివరించారు. 1950-60 - 1965-1975 కాలంలో సంక్షేమ కార్యక్రమాలను పలువురు ఎంతగా వ్యతిరేకించినా అమలు చేయటానికి నిర్ణయించడం గొప్ప విషయం.

పి.ఎస్. కృష్ణన్, శంకరన్ గార్లు దళితుల అభివృద్ధికి చేసిన కృషి మరవలేనిది. ఈ ఎస్‌సి, ఎస్‌టి రిజర్వేషన్లు కేవలం రాజకీయాల్లోనే కాక, అన్నింటిలో అమలు చేస్తున్నారు. ఎస్‌సి, ఎస్‌టి ప్రజలు నేడు ఉచితంగా అనేక సౌకర్యాలు పొందడం ఆ మహానుభావుల కృషి అని చెప్పక తప్పదు. కనుక వారు చూపిన మార్గంలో నడుస్తూ కొందరు అధికారులు నిస్వార్థంగా పనిచేయటం వలన షెడ్యూల్డు కులాలు, జాతుల ఉన్నతి సాధ్యమౌతూంది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా ఈ పథకాలను శ్రద్ధతో అమలు చేసి, మరి కొన్ని రాష్ట్రాలకు మార్గదర్శకంగా ఉంది. ఆంధ్రప్రదేశ్ తన స్థానాన్ని కాపాడుకుంటూ ముందుకు నడుస్తుందని ఆశిద్దాం.

*- సి.ఎం.పి.*




**ఆం**ధ్రప్రదేశ్ ప్రభుత్వం నిరుద్యోగ యువతీ యువకుల జీవితంలో వెలుగును నింపడానికి చేపట్టిన కార్యక్రమమే 'రాజీవ్ యువకిరణాలు'.

రాజీవ్ ఎడ్యుకేషన్ ఎంప్లాయ్‌మెంట్ కౌన్సిల్ (REE CAP) ఛైర్మన్‌గా ముఖ్యమంత్రి వ్యవహరిస్తారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ పుట్టిన రోజు ఆగస్టు 20 న పోర్ట్ స్టేడియం, విశాఖ పట్టణంలో 'రాజీవ్ యువకిరణాలు' పథకాన్ని ముఖ్యమంత్రి శ్రీ ఎన్. కిరణ్ కుమార్‌రెడ్డి ప్రారంభించారు.

**2. మెప్మా**: నగర, పట్టణ, మున్సిపల్ ప్రాంతాలలో పేద నిరుద్యోగులను గుర్తించి, శిక్షణ ఇచ్చి వారికి ప్రైవేట్ ఉద్యోగ అవకాశాలను కల్పిచడానికి మెప్మా (Mission of Elimination of poverty in Municipal Areas) ను ప్రారంభించడం జరిగింది. డైరక్టర్, మెప్మా ద్వారా ఈ కార్యక్రమం అమలవుతోంది.

**3. ఉపాధి- శిక్షణా శాఖ**: కమిషనర్, ఎంప్లాయ్‌మెంట్ & ట్రెనింగ్ ద్వారా కూడా వివిధ రంగాలలో నిరుద్యోగ యువతను గుర్తించి వారి అభిరుచిని అనుసరించి శిక్షణ ఇచ్చి ప్రైవేట్ ఉద్యోగ అవకాశాలను కల్పించడం జరుగుతుంది.

# రాష్ట్ర యువతకు ఆశాకిరణాలు 'రాజీవ్ యువ కిరణాలు'

### లక్ష్యం

ఆంధ్రప్రదేశ్‌లో ప్రైవేట్, పబ్లిక్ రంగాలలో యువతకు శిక్షణతో కూడిన నూతన ఉద్యోగ అవకాశాలను కల్పించడం. ఒక లక్ష ప్రభుత్వ ఉద్యోగావకాశాలను, ప్రైవేట్ రంగంలో నూతనంగా 15 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలను కల్పించడం రాజీవ్ యువకిరణాల లక్ష్యం.

**2011-15 వరకు లక్ష్యాలు**

| | | |
|---|---|---|
| 2011-12 | - | 2,46,600 |
| 2012-13 | - | 4,99,382 |
| 2013-14 | - | 6,14,240 |
| 2014-15 | - | 1,75,368 |
| | | **15,36,600** |

'రాజీవ్ యువకిరణాల'లో విభిన్న రంగాలలో నిరుద్యోగ యువతకు ఉద్యోగాలను కల్పించటం జరుగుతుంది. ఈ పథకంలో భాగస్వామ్య శాఖ వివరాలు.

1. ఇజిఎంఎం 2. మెప్మా 3. ఉపాధి, శిక్షణా శాఖ
4. సాంకేతిక విద్యా శాఖ 5. వికలాంగుల సంక్షేమ శాఖ

**1. ఇ.జి.ఎం.ఓ.ఎం :** ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్, మార్కెటింగ్ మిషన్ గ్రామాలలో పేద నిరుద్యోగ యువతను గుర్తించి శిక్షణ ఇచ్చి ప్రైవేట్ రంగాలలో, ఉద్యోగ అవకాశాలను కల్పించడం జరుగుతుంది. 2007 నుంచి 10 లక్షల మంది గ్రామీణ యువతీ యువకులకు వృత్తి నైపుణ్యం, వివిధ రంగాలలో శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలను కల్పించిన EGMM ద్వారా రాజీవ్ యువకిరణాలలో గ్రామీణ పేద యువతకు శిక్షణ ఇచ్చి ప్రైవేటు ఉద్యోగాలను కల్పించడం జరుగుతుంది.

**4. సాంకేతిక విద్యాశాఖ**: కమీషనర్, టెక్నికల్ ఎడ్యుకేషన్ శాఖ ద్వారా నాన్ టెక్నికల్, నైపుణ్యం లేని పేద నిరుద్యోగ యువతీ యువకులకు సాంకేతిక పరిజ్ఞానం కల్పించి, చిన్న, పెద్ద తరహా సాంకేతిక సంస్థలకు సేవలను అందించేందుకు శిక్షణలను ఇచ్చి ఉద్యోగ అవకాశాలను కల్పిస్తుంది.

**5. వికలాంగుల సంక్షేమం:** డైరక్టర్, వికలాంగుల సంక్షేమం శాఖ ద్వారా పేద నిరుద్యోగ వికలాంగ యువతీ యువకులకు విభిన్న రకాల శిక్షణలను ఇచ్చి వారికి ఉద్యోగ అవకాశాలను కల్పిస్తుంది.

రాజీవ్ యువకిరణాలతో పై అన్ని తరహా శిక్షణా సంస్థలను సమీకృతం చేసి, విద్యార్హతలు గల 18 నుంచి 35 సంవత్సరాల యువతీ యువకులకు శిక్షణతో కూడిన ప్రైవేట్ ఉద్యోగ అవకాశాల ను కల్పించే లక్ష్యాలను నిర్ధేశించుకొని యువతకు సరైన ఉపాధి కల్పన మార్గాన్ని కల్పించడమే ధ్యేయంగా నడుస్తున్నది 'రాజీవ్ యువ కిరణాలు' కార్యక్రమం.

### రాజీవ్ యువకిరణాలు - శిక్షణ ఇచ్చే రంగాలు

భవన నిర్మాణం, టెక్స్‌టైల్స్, ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ, హెల్త్‌కేర్, టూరిజం, ఫార్మాస్యూటికల్, బయోటెక్, ఫైనాన్షియల్ సర్వీసెస్, పారా మిలటరీ, సెక్యూరిటీ, ఇంజనీరింగ్, రిటైల్ మేనేజ్‌మెంట్, జెమ్స్, జ్యూయలరి మొదలైన రంగాలలో స్థానిక ఐటిఐలు, పాలిటెక్నికల్, EGMM సంస్థలలో శిక్షణలు ఇప్పించి వారికి చిన్న తరహా సంస్థలలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుంది రాజీవ్ యువకిరణాలు.

*- కె. కోటేశ్వరరావు*

# రాష్ట్రంలో మైనారిటీల విద్యా సదుపాయాల కల్పన, స్థితిగతులు





**భారతదేశంలో ముస్లింలలో విద్యా శాతం తక్కువగానే ఉంది. వీరి జనాభా 1947లో చూస్తే, కేవలం 3.5 కోట్లు కాగా, నేడు వీరి జనాభా 12 కోట్లు దాటి పోయింది. అంటే, 60 ఏళ్లలో నాలుగు రెట్లు పెరిగారని చెప్పవచ్చు. మైనారిటీల అభివృద్ధికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పలువిధాల కార్యక్రమాలు చేపడుతున్నాయి. అదే విధంగా కేంద్రం దేశంలో కొన్ని మదరసాలను - ప్రాధమిక పాఠశాలలుగా గుర్తించడం జరిగింది.**

ఇందుకు కేంద్ర ప్రభుత్వ మానవాభివృద్ధి శాఖ విద్యా సంబంధిత పథకాలను అమలు చేస్తోంది. మహిళా విద్యను పెంచేందుకు బాలికా సంరక్షణ, తదితర పథకాలను అమలు చేస్తున్నారు. అదే విధంగా ముస్లిం మహిళలలో అక్షరాస్యతను పెంచేందుకు, పాఠశాలలో నుండి బాలికలు తమ చదువును మధ్యలో మానివేయకుండా అనేక చర్యలు తీసుకొంటున్నారు.

మైనారిటీల విద్యా విషయాలను చూస్తే స్టాండింగ్ కమిటీ రిపోర్టును మే 13, 2013 నాడు మానవ వనరుల మంత్రి సమీక్షించారు. ఆ స్టాండింగ్ కమిటీ నివేదికననుసరించి చూస్తే, ముస్లిం విద్యార్థులలో చదువు మానేవారు ఎక్కువ మంది ఉన్నారు. వారు చదువు మానేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించింది. అందులో ఉర్దూ మీడియం స్కూళ్ళ సంఖ్యను పెంచాలని సూచించింది.

స్కాలర్‌షిప్‌లు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని కూడా సూచించింది. స్త్రీలు ఎక్కువగా విద్యలో పాల్గొనేందుకు చర్యలతో పాటు, మదరసాలను పాఠశాలలుగా మార్చేందుకు 25 స్కూళ్ళను మంజూరు చేసినట్లు, వీటిలో పిపిపి స్కూళ్ళ (పబ్లిక్ పార్ట్‌నర్‌షిప్‌తో పని చేసే వాటి) సంఖ్య పెంచాలని కోరింది. నవోదయ విద్యాలయాల తరహాలో స్కూళ్ళను స్థాపించేందుకు చర్యలు తీసుకోవాలని కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించింది.

ఆంధ్రప్రదేశ్‌లో మైనారిటీల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పలు చర్యలు చేపట్టింది. మైనారిటీ కమీషన్ అందుకు కావలసిన చర్యలు చేపడుతోంది. 2001 జనాభా లెక్కల ప్రకారం, రాష్ట్రంలో ముస్లింల జనాభా 69,86,856, అంటే 9.17 శాతం మంది ఉన్నారు. క్రైస్తవులు మొత్తం 11, 81, 917, అంటే 1.55%, సిక్కులు 30,998 అంటే 0.04%, బౌద్ధులు 32,037, అంటే 0.04%, మొత్తం మైనారిటీలు 82,31,808 అంటే 10.80% ఉన్నారు.

రాష్ట్ర బడ్జెట్‌లో మైనారిటీలకు 1,027 కోట్ల రూపాయలు కేటాయించగా, 2013 -14కు గాను 488 కోట్ల రూపాయలు విడుదల చేసినట్లు ఆర్థిక శాఖా మంత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ముస్లిం మైనారిటీల సంఖ్య 11 జిల్లాల్లో ఎక్కువగా ఉంది. వీరి అభివృద్ధికి పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నా, వీరిలో విద్యా శాతం పెరగడం లేదు. బడికెళ్ళే పిల్లలు మధ్యలోనే మానివేయడం జరుగుతుంది. అందుకుగాను ఉర్దూ మీడియం స్కూళ్ళకు స్థాపించడం, ఖాళీగా ఉన్న ఉర్దూ టీచర్ల పోస్టులను భర్తీ చేయడం జరిగింది. మదరసాలను పాఠశాలలుగా గుర్తించి ఆర్థిక సహాయాన్నందించడం, టీచర్ పోస్టులను మంజూరు చేయడం జరిగింది.

కేంద్ర ప్రభుత్వం మైనారిటీలకు 4% రిజర్వేషన్లు ప్రకటించింది. కాని దానిని కోర్టు కొట్టివేసింది. మైనారిటీలకు రిజర్వేషన్లను కల్పించేందుకు ప్రభుత్వం జస్టిస్ సచార్ కమిటీని ఏర్పాటు చేసింది. ముస్లింలు విద్యలో వెనుకబడి ఉన్నారు కనుక రిజర్వేషన్‌ను అనుమతించాలని ఆ కమిటీ సూచిందింది.

దేశవ్యాప్తంగా మైనారిటీ ముస్లింలకు 4% రిజర్వేషన్ ప్రకటించడాన్ని చాలామంది వ్యతిరేకించి, సుప్రీం కోర్టుకు కూడా వెళ్ళారు. సుప్రీం కోర్టు పార్లమెంటు ఆమోదం లేకుండ 4% రిజర్వేషన్లు అమలు చేయటాన్ని నిలిపి వేసింది. దానితో ముస్లింలకు ఇచ్చే రిజర్వేషన్లు అలా నిలిచి పోయాయి. తిరిగి ఏ నిర్ణయం తీసుకోవాలన్నా, పార్లమెంటు చట్టం చేయాల్సిందే. మైనారిటీ ముస్లింలలో విద్యాభివృద్ధికి ఎన్నో చర్యలు తీసుకొన్నప్పటికీ, అవి అమలు చేయటంలో రాష్ట్రాలు సరిగా శ్రద్ధ చూపకపోవడం వల్ల అక్షరాస్యత పెరగడం లేదని విమర్శలున్నాయి.

కాని మన రాష్ట్ర ప్రభుత్వం మాత్రం పలు విద్యా సంస్థలలో చదువుకొంటున్న ముస్లింలకు, ఇతర మైనారిటీ వర్గాలకు ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నది. 4% రిజర్వేషన్లు అమలు చేస్తోంది. మైనారిటీలకు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయటంలో మన రాష్ట్రం ముందంజలో ఉంది. **- సి.ఎం.పి.**

# జాతీయ వ్యవసాయ బీమా పథకం

**1. జాతీయ వ్యవసాయ బీమా పథకం ఎప్పుడు ప్రారంభమైంది ?**

*జ.* జాతీయ వ్యవసాయ బీమా పథకం 2007 సంవత్సరం మే 29వ తేదీన కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. రాష్ట్రాలలో ఈ పథకాన్ని రాష్ట్రీయ కృషి వికాస్ యోజన (ఆర్.కె.వి.వై.) అని పిలుస్తారు.

**2. ఈ పథకం యొక్క ఉద్దేశ్యాలు ఏమిటి ?**

*జ.* వ్యవసాయం మరియు దాని అనుబంధ రంగాలలో పెట్టుబడులు పెంచే రాష్ట్రాలకు ప్రోత్సహకాలను ఇవ్వడం, వ్యవసాయ రంగంపై ప్రణాళికలు చేయడం, కార్యక్రమాలను అమలు చేయడంలో రాష్ట్రాలకు స్వయం ప్రతిపత్తి మరియు మార్పులు చేర్పులు చేసుకునే అవకాశం కల్పించడం: రాష్ట్రాలకు, జిల్లాలకు వ్యవసాయ ప్రణాళికలు ఖచ్చితంగా చేసుకునే విధంగా చూడడం, ప్రధాన పంటలలో దిగుబడి అంతరాలను తగ్గించడం ద్వారా లక్ష్యాన్ని సాధించడం, రైతులు ఎక్కువ ఆదాయం, ఫలితాలు వచ్చేటట్లు చేయడం, సమీకృత తరహాలో వ్యవసాయం మరియు దాని అనుబంధరంగాలను అమలు చేయడం.

**3. జాతీయ వ్యవసాయ బీమా పథకం యొక్క లక్ష్యాలు ఏమిటి ?**

*జ.* ప్రకృతి వైపరీత్యాల వల్ల మరియు చీడ రోగాల వల్ల పంటల వైఫల్యాన్ని చవి చూసినప్పుడు రైతులకు వారి నష్టాన్ని భర్తీ చేసేలాగ ఆర్థిక సాయాన్ని బీమ సౌకర్యాన్ని ఏర్పాటు చేయడం.

- రైతులకు అభివృద్ధిదాయకమైన వ్యవసాయం వాడటానికి ప్రోత్సహించడం నాణ్యతగల ముడి సరుకులు పరిజ్ఞాలు వాడేలా చేయడం.
- రైతులకు వారి పొలాల నుండి వచ్చే ఆదాయం ముఖ్యంగా వైపరీత్యాలు సంభవించిన కాలంలో స్థిరంగా ఉండేలా చూడటం.

**4. ఈ పథకం ఏ ఏ పంటలకు వర్తిస్తుంది ?**

*జ.* ఈ పథకం ద్వారా ఆహారపు పంటలు (తృణ, పప్పు, ధాన్యాలు, జొన్న) నూనె విత్తనాలు, చెరుకు, పత్తి, ఆలుగడ్డ (సాలుసరి వ్యాపార, ఉద్యాన పంటలు) ఇతర సాలుసరి వ్యాపార ఉద్యాన పంటలకు వర్తిస్తుంది.

**5. ఏ విధమైన ప్రమాదాలు జరిగితే ఈ పథకం వర్తిస్తుంది ?**

*జ.* ఈ పథకం క్రింద సమగ్రబీమాని క్రింద వారింపలేని ప్రమాదాల నుంచి రక్షణగా ఇవ్వడం జరుగుతుంది

- సహజమైన నిప్పు పిడుగు
- గాలివాన, వడగళ్ళు వాన, తుఫాను
- వరదలు, ముంపు, కొండ చరియలు విరిగి పడటం
- కరువు కాటకాలు, చీడ / వ్యాధులు మొదలైనవి సంభవించినప్పుడు బీమా సౌకర్యం వర్తిస్తుంది.

**6. ఈ పథకం క్రింద వృద్ధి చేయబోతున్న ఇతర వ్యవసాయ అనుబంధ రంగాలు ఏమిటి ?**

*జ.* పంటగణాభివృద్ధి (ఉద్యానవన తోటలు కలుపుకుని)

- పశుగణాభివృద్ధి.
- వ్యవసాయ పరిశోధన మరియు విద్య
- వ్యవసాయ మార్కెటింగు
- ఆహార ఉత్పత్తుల గిడ్డంగి
- భూమి మరియు నీటి సంరక్షణ
- వ్యవసాయ ఆర్థిక సంస్థలు

**7. ఈ పథకం ద్వారా వచ్చే ప్రీమియం సబ్సిడీ వివరాలు ఏమి ?**

*జ.* చిన్న సన్నకారు రైతులకు ప్రీమియంలో 50% సబ్సిడీని అనుమతిస్తారు. ఆ సబ్సిడీని కేంద్రం, రాష్ట్రం సమానంగా భరిస్తాయి. ప్రీమియం సబ్సిడీని 3-5 సంవత్సారాలలో ఆర్థిక ఫలితాలను బట్టి పథకం అమలైన తొలి సంవత్సరం చివరన రైతులు స్పందన బట్టి తొలగిస్తారు.

**8. బీమా మొత్తం / పరిమితి వివరాలు ఏమి ?**

*జ.* బీమా మొత్తాన్ని బీమా చేసిన పంట రాబడికి సమానంగా ఉండేలా రైతులు చూసుకోవాలి. సగటు రాబడికి 15% దాకా వాణిజ్య రేట్ల ప్రకారం బీమా చేసుకోవచ్చు అప్పు తీసుకున్న రైతులు బీమా మొత్తం అప్పటికే తీసుకున్న పంట ఋణానికి సమానంగా ఉండేలా చూసుకోవాలి.

**9. జాతీయ వ్యవసాయ బీమాయోజన పథకం పరిధిలోకి పట్టు, సంబంధిత పంటలు వర్తిస్తాయి ?**

*జ.* పట్టు సాగుకు సంబంధించి పట్టు గూళ్ళు ఉత్పత్తి విస్తరణ దశ వరకు వ్యవసాయక పారిశ్రామిక రంగానికి సంబంధించి పట్టుదారం తయారీ నుంచి మార్కెటింగ్ దశ వరకూ ఈ పథకం వర్తిస్తుంది. పట్టు పురుగులు పెంపకం విస్తరణ విధానానికీ వర్షాధారపు పట్టు పురుగుల పెంపకానికి ఎలాంటి చీడ పురుగులక ు తావు లేకుండా భూసారాన్ని పరిరక్షించాడానికి ఉపయోగపడుతుంది.

**10. ఈ పథకం క్రింద వృద్ధి చేయబోతున్న వివిధ వ్యవసాయ పనులు ఏమిటి ?**

*జ.* • ఆహార పంటలు, ఆహార ధాన్యాలు, చిరు ధాన్యాలు మరియు పప్పు ధాన్యాలను సమీకృత అభివృద్ధి చేయడం.

- వ్యవసాయ రంగంలో యాంత్రీకరణను ప్రోత్సహించడం
- భూసారం పెంపొందించడం మరియు దిగుబడి పెంచడం
- వర్షధార వ్యవసాయ సాగు పద్ధతులను అభివృద్ధి చేయడం
- సమీకృత చీడ పురుగులు, కీటకాలు నిర్మూలన నిర్వహణ - సస్య రక్షణ
- మార్కెట్‌కు అవసరమైన మౌళిక సదుపాయలు
- ఉద్యాన వన తోటలు
- పశు సంపద డెయిరీ మరియు మత్య పరిశ్రమ వృద్ధి చేయడం
- సేంధ్రీయ మరియు బయో ఎరువులను ప్రోత్సహించడం

**- సి.ఎం.పి.**

వర్షానికి ప్రతి ఒక్కరి మనసు పులకరిస్తుంది. చిటపట చినుకులతో వాన నీళ్ళు వయ్యారంగా వంకలు తిరిగి పారుతుంటే చూడడానికి అందంగా అనిపిస్తుంది. పిల్లలు కాగితపు పడవల నడకలను చూసి మురిసిపోగా, రైతన్నలు తెలియని ఉత్సాహంతో పొలాల్లో విత్తడాలు, కలుపులు, సాగుమడులతో క్షణం తీరిక లేకుండా బిజీగా ఉంటారు. ఇంటి ఇల్లాదులు పొలం పనులలో నిమగ్నమై పోషణ విషయంలో సరియైన జాగ్రత్త తీసుకోరు. అదే పరిసరాల విషయానికి వస్తే మురికి కాలువలు



# వర్షాకాలంలో వచ్చే వ్యాధులు తీసుకోవలసిన జాగ్రత్తలు

**పొంగి పారడం, పశువుల కొట్టాలు శుభ్ర పరచకపోవడం, బహిరంగ మల విసర్జన వలన ఊరు కంపుకొట్టడం ఇంటి చుట్టూ బురద, పగలు ఈగలు, సాయంత్రాలు దోమల దాడులు గమనిస్తాం. అదే వానాకాలంలో సంతోషాలతో పాటు కొన్ని ఇబ్బందులు కూడా ఉంటాయి.**

పరిసరాలను పరిశుభ్రముగా ఉంచకపోతే అనేక రకాలైన క్రిములు, దోమలు వ్యాప్తి చెందుతాయి. వానాకాలం అంటేనే రోగాల కాలం అని నానుడి ఉంది. కలుషిత ఆహారం, కలుషిత నీళ్ళు, వ్యక్తిగత శుభ్రత లోపం, పరిసరాల అశుభ్రత అతిసార వ్యాధి, మలేరియా, చికెన్ గున్యా, డెంగ్యూ, టైఫాయిడ్, కామెర్లు, వాతావరణ మార్పుతో వీచే చల్లటి గాలుల వల్ల ఆస్తమా, జలుబు, దగ్గు, జ్వరం వంటి రోగాలు సంక్రమిస్తాయి. గ్రామాలలో గిరిజన ప్రాంతాలలో బహిరంగ మల విసర్జన ఈ వ్యాధులు ప్రభలడానికి ముఖ్య కారణం అని తెలిసింది.

### కలుషిత ఆహారం, అపరిశుభ్రత వల్ల సంక్రమించే వ్యాధులు

***అతిసార వ్యాధి:*** అతిసార వ్యాధి ఎక్కువగా కలుషిత ఆహారం, నీరు తీసుకోవడం మూలంగా వస్తుంది. ఈ వ్యాధి సోకిన వారికి నీళ్ళ విరేచనాలు, వాంతులతో పాటు తీవ్రమైన చలి జ్వరం, కడుపునొప్పి, తలనొప్పితో బాధపడుతుంటారు. తగిన సమయంలో చికిత్స జరగకపోతే శరీరంలో ఉన్న నీరంతా పోయి చివరకు ప్రాణాపాయం కూడా కలుగవచ్చు. అతిసార వ్యాధి సంభవించినప్పుడు ఓరల్ రీ హైడ్రేషన్ సాల్ట్ (ఓ.ఆర్.యస్) ని వాడాలి. ఓ.ఆర్.ఎస్. ప్యాకెట్లు అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో అందుబాటులో ఉంటాయి. ఓ.ఆర్.యస్. వాడడానికి సులువుగా ఉంటుంది. ఓ.ఆర్.యస్ వాడేటప్పుడు ముందుగా చేతులను శుభ్రంగా సబ్బుతో కడుక్కొని శుభ్రమైన పాత్రలో ఒక లీటరు నీటిని తీసుకుని, ఆ నీటిలో ఒ.ఆర్.ఎస్ ప్యాకెట్‌లోని పొడిని కలపాలి. ఇలా తయారు చేసిన ద్రావణాన్ని 24 గంటల వరకు చిన్న గ్లాసు మోతాదులలో తరచుగా వ్యాధిగ్రస్తునికి పట్టించాలి. ఈ లోగా వాంతులు, విరేచనాలు ఇంకా తగ్గకపోతే కొత్తగా మరో ప్యాకెట్ ద్రావణాన్ని కలుపుకోవాలి. ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్ అందుబాటులో లేని పక్షంలో ఇంట్లో సొంతంగా తయారుచేసుకోవచ్చు. ఒక లీటరు శుభ్రమైన నీటిలో 8 స్పూన్ల పంచదార, 1 స్పూను ఉప్పును కరిగిస్తే చాలు. ఓ.ఆర్.యస్. నియమంగా తీసుకుంటే గ్లూకోస్ (సెలైన్) ఎక్కించుకోనవసరం రాదు. దానిమ్మ, జామూన్, సగ్గుబియ్యం, గంజి, వంటి ఆహార పదార్థాలు విరేచనాలను అరికడతాయి. మసాలాలు, కారం లేకుండా పలుచటి మజ్జిగ అన్నం తినాలి.

అతిసార వ్యాధి బారిన పడకుండా ఉండడానికి పరిశుభ్రమైన కాచి, చల్లార్చిన నీటినే తాగాలి, చేతులను సబ్బుతో కడుక్కోవాలి. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి. అవసరమైతే వెంటనే వైద్యుని సంప్రదించాలి.

***టైఫాయిడ్:*** టైఫాయిడ్ ఒక అంటువ్యాధి. ఈ వ్యాధి కూడా కలుషితమైన ఆహారం వల్ల వస్తుంది. రోడ్డు పక్కల అమ్మబడే తినుబండారాలు ముఖ్యంగా పానీపూరి, జ్యూస్‌లు వంటివి సేవించడం, ఈగలు, బొద్దింకలు వాలిన ఆహారం, ముందురోజు వండిన అన్నం తినడం వల్ల, ఎంగిలి గ్లాసులలో నీళ్ళు తాగడం వల్ల ఈ వ్యాధి సోకుతుంది. చాలా కాలంగా తీవ్రమైన జ్వరం, కడుపులో నొప్పి, తలనొప్పి ఈ వ్యాధి లక్షణాలు. ఈ వ్యాధి ఒకరి నుంచి ఇంకొకరికి సోకే ప్రమాదం ఉంది. కనుక వ్యాధి గ్రస్తులను కుటుంబ సభ్యులతో ముఖ్యంగా పిల్లలతో కలువనియ్యకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. ఈ వ్యాధి మందులతో నయం అయినట్టే అనిపించినా వ్యాధికి సంభవించిన సూక్ష్మజీవులు గాల్ బ్లాడర్‌లో స్థావరం ఏర్పాటు చేసుకుంటాయి కనుక, వ్యాధి తగ్గిన 2 వారాలలో మళ్ళీ ప్రబలే అవకాశం ఉంది. కావున వ్యాధిగ్రస్తులు వ్యాధి తగ్గిన తరువాత కూడా తగు శ్రద్ధ తీసుకోవాలి. టైఫాయిడ్‌కి సంబంధించి ముందస్తుగా టీకాలు కూడా తీసుకోవచ్చును.

వ్యాధి సోకినప్పుడు శుద్ధమైన మంచినీరు త్రాగాలి. వీలైనంత వరకు తాజాగా వండిన పలచటి ఆహారం తీసుకోవాలి. ఆకుకూరలు, కూరగాయలు శుభ్రం చేసి, కడిగిన తరువాత వండాలి. అన్నం తినేముందు, తరువాత పిల్లల చేతులు కడిగించాలి. వండిన పాత్రలను శుభ్రమైన ప్రదేశాలలో పెట్టి వాటిమీద ఎటువంటి ఈగలు వాలకుండా చూడాలి. చంటి పిల్లల మూతులపై, ముఖాలపై ఈగలు, సన్న దోమలు వాలకుండా శుభ్రంగా ఉంచాలి. మల విసర్జన తరువాత సబ్బుతో చేతులు కడగాలి. బహిరంగ మల విసర్జన కాక మరుగుదొడ్లను ఉపయోగిస్తూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి.

***కామెర్లు:*** కలుషిత ఆహారం తీసుకోవడం వల్ల వచ్చే మరొక ప్రాణాంతకమైన వ్యాధి కామెర్లు. కామెర్లు రెండు రకాలు పచ్చ కామెర్లు, తెల్ల కామెర్లు. ఈ వ్యాధి ఈగల వల్ల కలుషితమైన ఆహారం తీసుకోవడం వల్ల వ్యాధిగ్రస్తుల నుండి ఇంకొకరికి సోకే ప్రమాదం ఉంది. సహజంగా రోగం ముదిరే వరకు వ్యాధి లక్షణాలు బయట పడవు. తీవ్రమైన జ్వరం, వాంతులు, తినాలనిపించక పోవడం, తలనొప్పి, ఒళ్ళునొప్పులు ఈ వ్యాధి లక్షణాలు. వ్యాధిగ్రస్తులు సాత్వికమైన నూనెలేని పిండి పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. మసాలాలతో, నెయ్యితో, డాల్డాలతో చేసిన పదార్థాలు తీసుకోకూడదు. కామెర్లు అంటువ్యాధి కనుక కామెర్లతో బాధపడుతున్న వ్యక్తుల నుండి పిల్లలను దూరంగా ఉంచాలి. వ్యాధిని పసిగట్టిన వెంటనే మందులు తీసుకోవాలి. ఆలస్యం చేస్తే ప్రాణానికే ముప్పు. పిల్లల్లో ఈ వ్యాధిని నివారించడానికి ముందస్తుగా టీకాలు వేయించాలి. అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో వేయబడుతుంది.



***మలేరియా:*** దోమలు పగలు కనబడవు కాని రాత్రులు దాడి చేస్తాయి. గణాంకాల ప్రకారం మన దేశంలో దోమకాటు వ్యాధుల బారిన పడేవారి సంఖ్య కొన్ని కోట్లకు పైమాటే. దోమల వలన ప్రమాదకరమైన మలేరియా, ఫీలేరియా (బోదకాలు) చికెన్‌గున్యా, డెంగ్యూ రోగాలు వస్తాయి. అపరిశుభ్ర పరిసరాలు ముఖ్యంగా మురికి నీరు నిల్వ వుండే చోట దోమలు ఉత్పత్తి చెందుతాయి. ఎందుకంటే దోమలు నీటిపైనే గుడ్లు పెడతాయి. దోమకాటు ద్వారా ఒకరి నుండి ఇంకొకరికి వ్యాధులు వ్యాపిస్తాయి. మలేరియా సోకిన రోగి రోజు రోజుకు జ్వరం తీవ్రత ఎక్కువై కృశించి పోతారు. తీవ్ర తలనొప్పి, ఒళ్ళు నొప్పులు, ఎముకల నొప్పులతో పాటు విపరీతమైన చలి జ్వరం వస్తుంది. డెంగ్యూ వ్యాధిగ్రస్తులకు వాంతులు కూడా అవుతాయి. ఇటువంటి లక్షణాలు వున్నప్పుడు వైద్యుడిని సంప్రదించి తగు మందులు తీసుకోవాలి. మందులతో పాటు తేలికపాటి ఆహారం తీసుకొని వ్యాధి త్వరగా నయం అయ్యేటట్టు చూసుకోవాలి.

మలేరియా, చికెన్‌గున్యా, డెంగ్యూ వంటి వ్యాధులకు మందులు ఉన్నప్పటికీ రోగాల బారిన పడకుండా కాపాడుకోవడం శ్రేయస్కరం. వ్యాధి సోకకుండా ముందు జాగ్రత్త చర్యలలో పరిసరాల పరిశుభ్రత అంటే ఇంటి చుట్టుపక్కల చెత్త లేకుండా ఊడ్చుకోవడం, కలుపు మొక్కలు, గుబురుగా పెరిగిన మొక్కలను తొలగించడం, చిన్నచిన్న నీటి గుంతలలో నీరు నిల్వకుండా పూడ్చివేయడం, ఇంటి ముందు పారే మురికి కాలువలలోను పూడికలను తీసేసి నీరు సరళంగా పారేటట్లు చూడడం. పూడిక తీసిన మన్నును గ్రామానికి దూరంగా తరలించడం, ఉపయోగించని నీటితొట్టెలు, కుండలు, టైర్లు, పూలకుండీలు, త్రాగి పడవేసిన కొబ్బరి కాయలు, కొబ్బరి చిప్పలు మరేవైనా నీరు నిల్వ ఉండే అవకాశం ఉన్న వాటినన్నింటిని తొలగించాలి లేదా బోర్లించాలి. ఇంట్లో నుండి వచ్చే వృధా నీటిని డ్రైనేజీకి మళ్ళించడం లేదా ఇంకుడుగుంత ఏర్పాటు చేసుకొని సమర్థవంతంగా నిర్వహించాలి. బహిరంగ మల విసర్జన చేయకూడదు. పిల్లలతో సహా అందరూ మరుగుదొడ్డిని ఉపయోగించాలి.

పశువుల పేడ, చెత్తను ఇంటి పరిసరాలలో తొలగించి దూరంగా తరలించడం లేదా ఎరువు గుంతను ఏర్పాటు చేసుకొని ప్లాస్టిక్ కవర్‌తో కప్పి వేయాలి. నిల్వ ఉన్న నీటి కుంటలలో దోమలు ఉత్పత్తి చెందకుండా కిరోసిన్ ఆయిల్ లేదా ఏదైనా ఆయిల్ చల్లడం వంటివి చేయాలి. కిటికీలకు, తలుపులకు దోమతెరలు ఏర్పాటు చేసుకోవాలి. పగలు చిన్న పిల్లలు పడుకున్నప్పుడు కూడ దోమతెర వాడాలి. బజారులలో చౌకధరకు లభించే దోమతెరల గురించి తెలుసుకోవాలి. చీకటి పడుతున్న సమయంలో సాయంత్రం 5.30 నుండి 7.30 సమయంలో దోమలు ఎక్కువగా ఆక్రమిస్తాయి కనుక ఈ సమయంలో ఇంటిలోకి దోమలు చొరబడకుండా తలుపులు, కిటికీలు మూసి ఉంచడం మంచిది.

## చల్ల గాలితో వచ్చే వ్యాధులు

***జలుబు, దగ్గు:*** వర్షంతో పాటు వీచే చల్లటి గాలుల వల్ల పిల్లల నుండి వృద్ధుల వరకు సాధారణంగా నుస్తీ చేస్తుంది. రోగులతో ఆసుపత్రులు కిటకిటలాడతాయి. వర్షంలో తడిసినప్పుడు లేదా నీళ్ళలో పనులు చేసినప్పుడు జలుబు, దగ్గు, జ్వరం వస్తుంది. మందులు వేసుకుంటే 7 రోజులలో తగ్గుతుంది. లేకపోతే వారం రోజులలో తగ్గుతుందిలే అని గ్రామాలలో పెద్దలు ఎగతాళిగా చెప్పుతారు. నిజానికి మన శరీరంలోకి ఏ క్రిములు చేరినా శరీరంలో ఉన్న శక్తి ఆ క్రిములపై దాడి చేసి శరీరాన్ని మళ్లి స్వస్థత చేకూరుస్తుంది. అంటే చిన్న చిన్న రోగాలను తట్టుకునే శక్తి మన శరీరానికి ఉంది అని అర్థం. కాని జ్వరాలని నిర్లక్ష్యం చేయవద్దు.

సాధారణ జలుబు ఉన్నప్పుడు, ముక్కు కారడం, దగ్గు, శ్వాస తీసుకోవడానికి కష్టం కావడంతో పాటు ఉండాల్సిన దానికన్న ఎక్కువ శారీరక ఉష్ణోగ్రత ఉండడం లాంటి లక్షణాలు కనిపిస్తాయి. తగు సమయంలో వైద్యం చేయించుకుంటే శరీరం నీరసపడిపోకుండా ఉంటుంది. ఇతరతర వ్యాధుల నుండి కాపాడుకోగలుగుతాము. జలుబు, దగ్గు అంటువ్యాధి కాబట్టి వీటితో బాధపడుతున్న వారు మాట్లాడేటప్పుడు, తుమ్ముతున్నప్పుడు ఇతరుల నుండి దూరంగా వెళ్ళాలి. మూతిని ముక్కును బట్టతో కవర్ చేసుకోవాలి. రద్దీగా ఉన్న ప్రదేశాల నుండి దూరంగా ఉండాలి. తరచుగా చేతులను సబ్బుతో కడుక్కొని శుభ్రంగా ఉంచుకోవాలి. గొంతులో గరగర తగ్గడానికి గోరువెచ్చని ఉప్పు నీటితో గార్‌గల్ చేయడం వల్ల చాలా ఉపసమనం కలుగుతుంది. వేడివేడిగా అల్లంతో చేసిన కాషాయం కాని, కాఫీ, టీలు ఉపశమనం కలిగిస్తాయి. ఎక్కువ కారంగా ఉన్న వస్తువులు తీసుకోకూడదు.

ఇంటిలో నిమ్ము చేరకుండా పొడిగా ఉంచుకోవాలి. పిల్లల పట్ల ఒకింత ఎక్కువ శ్రద్ధ చూపాలి. వారికి వెచ్చని దుస్తులు వేయాలి. చెవులకు టోపి లేదా స్కార్ఫ్‌ని కట్టాలి పడుకునేటప్పుడు ఫ్యాన్ స్పీడుని తగ్గించాలి. అలాగే మహిళలు కూడా పొలాలకి వెళ్ళేటప్పుడు, నీళ్ళలో పని చేసేటప్పుడు సరియైన చెప్పులు ధరించాలి. చెవులకు, ముక్కుకు కప్పుతూ గుడ్డను (స్కార్ఫ్)ని కట్టుకోవాలి. వృద్ధుల ను కూడా ఒక కంట కనిపెట్టాలి. సాధారణంగా వాళ్ళు తడిసిన బట్టలు అవే ఆరతాయనుకొని నిర్లక్ష్యంగా ఉంటారు. కాని వాళ్ళని పొడిబట్టలు వేసుకునేటట్టు ప్రోత్సహించాలి, పడుకునేటప్పుడు నిండుగ దుప్పట్లు కప్పుకునేలా చూడాలి.



*జ్వరం:* జ్వరం అంటే శరీరం అనారోగ్యంగా ఉందని చూపుతూ ముందస్తు సూచన. జ్వరం వచ్చినప్పుడు శరీర ఉష్ణోగ్రత పెరిగి వేడిగా ఉంటుంది. పని వత్తిడి వల్ల వచ్చే సాధారణ జ్వరం అయితే 4 రోజులు మందులు వాడడం వల్ల తగ్గుతుంది. అదే జ్వరం ఇన్ఫెక్షన్ వల్లో, మలేరియా వల్లో లేక ఇతర దీర్ఘకాలిక రోగాలు క్షయ, హెచ్.ఐ.వి. ఇన్ఫెక్షన్ వల్లా అని కేవలం భౌతిక పరీక్ష వల్ల తెలుసుకోవడం కష్టం. అటువంటి రోగ నిర్ధారణకు వైద్య పరీక్షలు చేయించుకొని జ్వరం కారణాన్ని బట్టి తగు చికిత్స తప్పక చేయించుకోవాలి.

జ్వరం తీవ్రతను బట్టి మందులు, జాగ్రత్తలు తీసుకోవలెను. వైద్యులు అందుబాటులో లేనప్పుడు జ్వరం తగ్గటానికి పారాసిటమాల్, ఐబ్రూఫెన్ లాంటి మందులు తీసుకోవాలి. పారాసిటమాల్ నొప్పి లేకుండా చెయ్యటానికి, జ్వరం తగ్గించటానికి ఉపయోగపడుతుంది. జీర్ణాశయంలో చికాకు కలిగించదు. కాబట్టి జీర్ణాశయంలో పుండ్లు ఉన్నవారు, గర్భవతులు కూడా పారాసిటమాల్ ఉపయోగించవచ్చు. కాని గర్భవతులు ఐబ్రూఫెన్ వాడకూడదు. జ్వరానికి గల కారణాన్ని తెలుసుకుని దానిని నయం చేసుకోవడం ముఖ్యం. జ్వరం లేక నొప్పి 3 రోజుల కంటే ఎక్కువ కాలం ఉంటే వైద్యుని సలహా పాటించాలి.

జ్వరం ఉన్నప్పుడు అదనంగా ఉన్న దుస్తుల్ని తీసేసి, పలచటి, సౌకర్యంగా ఉన్న దుస్తుల్ని వేసుకోవాలి. చీకటి గదిలో కాక, గాలి వెలుతురు వచ్చే చోట ఉండాలి. శరీరంలో తీవ్రమైన వేడి ఉన్నప్పుడు చర్మంమీద నీళ్ళు పోసుకోవడం కాని తడి గుడ్డతో చర్మాన్ని తుడవడం లేక ఛాతీమీద, నుదుటి మీదా తడి గుడ్డలు వేసి విసరటం ద్వారా చర్మాన్ని చల్లబరచాలి. చర్మాని శుభ్రంగా పొడిగా ఉంచుకోవాలి.

***ఆస్తమా:*** ఆస్తమా ఉన్నవాళ్ళు వర్షాకాలంలో బహు జాగ్రత్తగా ఉండాలి. అస్తమా ఊపిరితిత్తుల వ్యాధి. వ్యక్తిగతంగా ఉన్న అలర్జీల వల్ల అస్తమా తీవ్రత పెరుగుతుంది. శ్వాస తీసేటప్పుడు గుర్రు గుర్రు శబ్దం రావడం, శ్వాస తీయడంలో కష్టం కావడం, ఏకధాటిగ తుమ్ములు, దగ్గు కలిగి ఉండటం ఆస్తమా లక్షణాలు. అస్తమా ఉన్న వాళ్ళు వర్షంలో తడవరాదు. బయట వీచే తేమగాలికి దూరంగా ఉండాలి. ముక్కు, చెవులు కప్పుకొని ఉండాలి. అవసరమైన మందులు ఎల్లప్పుడు దగ్గర పెట్టుకోవాలి.

*చర్మ వ్యాధులు:* వర్షాకాలంలో కాళ్ళు పగలడం, కాళ్ళు వేళ్ళ మధ్యలో చీలడం కూడ గమనిస్తుంటాము. తడవడం వల్ల లేదా తడిసిన తరువాత పొడిగా తుడుచుకోకపోవడం శుభ్రంగా కాళ్ళు కడగక పోవడం వల్ల వైరల్ ఇన్ఫెక్షన్స్ సోకి చెడడం జరుగుతుంది. పిల్లలలో గజ్జి, తామర వంటి చర్మ వ్యాధులు ఈ కాలంలో గమనిస్తాం. కాబట్టి పిల్లలకు రోజూ స్నానం చేయించడం, శుభ్రమైన దుస్తులు వేయడం, గోళ్ళు పెరగకుండా గోళ్ళను ఎప్పటికప్పుడు కత్తిరించడం వంటి శ్రద్ధ తీసుకోవాలి.

మందులతో, శుభ్రతతో పాటు కొన్ని ఆహార నియమాలు పాటిస్తే రోగాలు త్వరగా నయం అవుతాయి. జ్వరం వచ్చినప్పుడు సులభంగా డీహైడ్రేట్ (అధికంగా నీటిని కోల్పోవడం) జరుగుతుంది. కాబట్టి దాహం లేనప్పటికీ ఎక్కువగా నీటిని త్రాగాలి. (6 నెలల లోపు చంటిపిల్లలకు జ్వరం వచ్చినప్పుడు తల్లిపాలే శ్రేష్ఠం. నీళ్ళు తాగించనవసరం లేదు). రోగులు త్వరగా జీర్ణమయ్యే మెత్తటి సాత్వికమైన ఆహారాన్ని తీసుకోవాలి. ఇడ్లీ, బ్రెడ్, పాలు, మొత్తటి రొట్టెలు, మజ్జిగ అన్నం, సూప్, రసం అన్నం, జావ, అంబలి వంటివి. కారపు లేక మసాలా పదార్థాలు వద్దు. చల్లటి పదార్థాలు, పానియాలు, ఐస్‌క్రీమ్, Baked foods, మాంసాహార పదార్థాలు వానాకాలంలో తీసుకోకూడదు. కాలానుగుణంగా దొరికే పళ్ళు తీసుకుంటే మంచిది.

వానాకాలంలో కలుషిత ఆహారం, నీటి వలన వచ్చే రోగాలను నివారించడానికి కాచి చల్లార్చిన నీటిని తాగాలి. తాజాగా వండిన ఆహారాన్నే తినాలి. వండిన ఆహార పదార్థాలపై ఈగలు, దోమలు వాలకుండా కప్పి ఉంచాలి. వాడిన పాత్రలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి.ప్రతిరోజు ఇంటిని వంటిని నీట్‌గా ఉంచుకోవాలి.అందరూ మరుగుదొడ్లనే వాడాలి. పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు ఇప్పించాలి. జ్వరం వచ్చినప్పుడు ఇన్ఫెక్షన్ ఉంటే ముదరకముందే వైద్యుని సలహా తీసుకోవాలి.మందులు కొనేటప్పుడు వాటి కాల పరిమితి (expiry date) తప్పక చూడాలి. అలాగే బిల్లుని కూడా తీసుకోవాలి. వైద్యుని దగ్గరకు వెళ్ళినప్పుడు ముందు తీసుకున్న మందుల గురించి తప్పక చెప్పాలి. సొంతవైద్యం, చిట్కా మందులు, మంత్రాలు, తావిజులతో ప్రయోజనం ఉండదు. పరిశుభ్రమైన పౌష్టిక ఆహారం మరికొంచెం అవగాహన ఉంటే రోగాల బారిన పడకుండా కాపాడుకోవచ్చు.

***- డా॥ ఆర్. అరుణ్‌జ్యోతి***

*గృహవిజ్ఞాన శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్ర మామ్‌నూర్*

# నైతిక విలువల అవలంబనే మనకు ఆలంబన

**నైతిక విలువలు అని చెబితే మనలో చాలా మంది నవ్వనివారు వుండరేమో. ఇందుకు కారణాలు అనేకం.**

**అయితే విధి నిర్వహణలో నైతిక విలువలు పాటించవలసిన అవసరం ఏమిటి? మనకు ఒకరు నైతిక విలువలు నేర్పడం ఏమిటి? మనకు నైతిక విలువలు తెలియవా? లేవా? అనే సందేహాలు మనలో చాలా మంది మదిలో తలెత్తుతుంటాయని ఊహించగలం!**

మనలో చాలామంది ఒక వ్యవస్థను అనుసరించే సమయంలో, అసలు వ్యవస్థ నియమాలను కాకుండా, ప్రస్తుతం వ్యవస్థలో ఏమి జరుగుతుందో అదే వ్యవస్థ అని అపోహపడుతుంటారు. అంటే, ప్రస్తుత వ్యవస్థలోని అవినీతి, బంధుప్రీతి, అలసత్వం, రాజకీయ ప్రేరణలు, అధికార దర్పం మొదలైన అవలక్షణాలు సహజమైనవనీ, వాటినే కొనసాగించాలనే ఉద్దేశ్యంలో ఉంటారు. ఐతే ఇదే సమయంలో మనలో మరికొన్ని ఆలోచనలు కూడా వస్తుంటాయి.

అవి.. ఈ వ్యవస్థకు అనుగుణంగా వ్యవహరించక పోతే మనం మనుగడ సాగించలేమని కొందరు పెద్దల బెదిరింపులు ఒకవైపున, మరో పార్శ్వంలో మనం మంచి అధికారం, ఆదాయంగల ఉద్యోగంలో ఉన్నాం. ఈ అధికారం, ఆదాయంతో మనం, మన కుటుంబం నిశ్చింతగా బ్రతకగలం, కనుక, వ్యవస్థలోని దుర్లక్షణాలను వ్యతిరేకించకుండా సర్దుకుపోవడం, పూర్తిగా రాజీపడడం ద్వారా అంతా సజావుగా సాగి పోతుంది'' అని భావిస్తాం.

కానీ ఈ రోజున మనం చూసి కూడా పెరికి వేయని ఒక పార్థీనియం మొక్క అతి తక్కువ కాలంలోనే పెరిగి పెద్దదై, తనలాంటి అనేక పార్థీనియం మొక్కలను విస్తరింప చేస్తుంది. అంటే ప్రాథమికస్థాయిలో నిర్మూలించకపోతే, దుర్లక్షణ భరితమైన వ్యవస్థలో ఆ లక్షణాలు పెరిగి, రకరకాల రూపాలలో అన్ని రంగాలకు, అందరు వ్యక్తులకు చేటు చేయవచ్చు.

'ఐతే.. నాకేంటి? నేను నా పిల్లలకు తరగని ఆస్తిపాస్తులను వారసత్వంగా ఇస్తున్నాను. కనుక వారికి భవిష్యత్‌లో ఏ బాదరబందీ ఉండదు కదా!' అని అనుకుంటూ ఉంటే.. అది అమాయకత్వమే!




మన ప్రక్క ఇంట్లో ఆకలికి అలమటిస్తున్న వ్యక్తి ఉంటే ఇది మనకు ప్రమాదం! ఏ విధంగా అంటే, ఆకలికి తట్టుకోలేని వ్యక్తి మన ఇంటి పైకే దోపిడికి పాల్పడవచ్చు. మన ఊరిలోని కలరాను మనం నిర్మూలించడానికి ప్రయత్నించక పోతే ఇది మన ఇంటికి కూడా వ్యాపించవచ్చు.

ఈ రోజున భారత వాణిజ్య రాజధాని అయిన ముంబాయిలో పెచ్చు పెరిగిన మాఫియా సంస్కృతికి అవసరమైన రిక్రూట్‌మెంట్ అక్కడి మురికివాడల నుండి జరుగుతుందనేది ఎవరూ కాదనలేని వాస్తవం. దీనికి కారణం తీవ్రమైన ఆర్థిక సమానతలు, నిర్దేశిత ప్రభుత్వ నిధులు, పథకాలు అర్హులైన లక్షిత వర్గాలకు చేరకపోవడమే. కాని దీని వలన పెరిగిన నేర సంస్కృతిలో భాగంగా జరుగుతున్న అపహరణలు, బెదిరింపులు, భూకబ్జాలు, హత్యలు మొదలైన నేరాలు ఎక్కువగా సంపన్న, మధ్యతరగతి వారిపైనే జరుగుతున్నాయి. దీనిని బట్టి ఒక ప్రాంత వ్యవస్థలోని దుర్లక్షణాలను ప్రాథమిక స్థాయిలో అదుపు చేయకపోవడం లేక పూర్తిస్థాయిలో అరికట్టలేకపోవటం వలన, ఆ ప్రాంతం అభివృద్ధి నేర సంస్కృతిలో చీకటి కోణంగా పెరుగుతుందని గుర్తించవచ్చు. సదరు ఆర్థికాభివృద్ధి లోపభూయిష్టమై, దీని ద్వారా లబ్ధిపొందిన వారు కూడా దుష్పరిణామాల బారిన పడతారని గ్రహించవచ్చు. దీనికి సంబంధించి ఒక వాస్తవ గాథను తెలుసుకుందాం.

''చాలా సంవత్సరాల క్రిందట మనదేశంలోని ఒక ప్రాంతంలో తలెత్తిన కరువుకాటకాల వలన ఒక ఊరిలోని యువకులు, పని చేయగలవారు వలసపోయారు. ఆ ఊరిలోని అతికొద్దిమందితో పాటు ఒక వృద్ధ జంట మాత్రం అక్కడే ఉండిపోయారు. ఐతే వారు బ్రతుకు తెరువు కోసం ఆ గ్రామంలోని మరికొందరు చేసినట్లే, ఆ ఊరి మీదుగా పోయే బాటసారులపై దాడిచేసి, దోచుకోవడం వృత్తిగా చేసుకున్నారు.

6, 7 సంవత్సరాల తర్వాత ఒక రోజున ఆ గ్రామం మీదుగా వెళుతున్న ఒక యువకుడిని చూసిన ఆ దంపతులు దాడిచేసి, దోచుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో ఆ దంపతులలోని భార్య ఒక దుడ్డుకర్రతో వెనకగా వెళ్ళి ఆ ప్రయాణికుడి తలపై బలంగా కొట్టింది. ఆ దెబ్బకు గాయపడిన ప్రయాణికుడి నుండి విలువైన వస్తువులు, డబ్బుని వెదకడంలో నిమగ్నమైన ఆ దంపతులకు, చావు బ్రతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న ఆ ప్రయాణీకుడి పలవరింతలు వినిపించాయి.

''నా పేరు రాధాశ్యామ్! మా తల్లిదండ్రుల పేర్లు భారతీబాయి, రాజేందర్. మాది ఈ ఊరే. బ్రతుకుతెరువు కోసం వలసపోయి చాలా కాలం తర్వాత మా అమ్మనాన్నల కోసం వచ్చా.... నన్నెవరో కొట్టారు.. నేను చచ్చిపోతున్నాను.. మా అమ్మనాన్నలకు చెప్పండి..'' అనే పలవరింతలు విన్న ఆ దంపతులు నిశ్చేష్టులై నిలిచిపోయారు. కారణం ఆ అమ్మనాన్నలు వేరెవరో కాదు!... ఆ దంపతులే!!... ఆ ప్రయాణికుడు అక్షరాలా వీరి రక్తం పంచుకుని పుట్టిన వీరి కొడుకే!.. 6, 7 సంవత్సరాల క్రితం పనికోసం దూరంగా ఉన్న పట్నానికి వలసపోయి తన తల్లిదండ్రుల ను సుఖపెట్టడానికి ధనాన్ని సంపాదించి తెచ్చిన ఆ కొడుకు అతని తల్లితండ్రుల చేతిలోనే మరణించాడు.

పై వాస్తవ గాథ నుండి మనం గ్రహించాల్సినదేమిటి?.... మనం ఒక చెడ్డ వ్యవస్థని లేదా వ్యవస్థలోని దుర్లక్షణాలను కొనసాగించడం, పాటించడం వలన కలిగే దుష్పరిణాల బారిన మనమే పడే ప్రమాదం ఉందని!... కనుక తాత్కాలిక ప్రయోజనాలను ఆశించి చెడుని సమర్ధించడం లేదా ఉపేక్షించడం వలన వ్యవస్థలోని చెడు సంప్రదాయాలను కొనసాగించడం వలన మనకు, మన పిల్లలకు, మన భవిష్యత్ తరాల వారికి ఒక కలుషితమైన, ప్రమాదభరితమైన వ్యవస్థను మాత్రమే అందించగలము!!.. ఇదేనా మనం మన పిల్లలకు ఇచ్చే/ఇవ్వబోయే ఆస్తి?!.. అలాంటి ప్రమాదభరితమైన వ్యవస్థలో మన ప్రియమైన పిల్లలు ఎలా స్వేచ్ఛగా, సంతోషంగా, సౌభాగ్యంతో జీవించగలరో??.. ఆలోచించండి!...

ఐతే మనలో చాలామంది వ్యవస్థలోని దుర్లక్షణాలను గుర్తించినా, వాటి వలన భవిష్యత్‌లో తలెత్తే దుష్పరిణామాలను గుర్తించడం, ఊహించడం లేదు. మరికొంతమంది వ్యవస్థలో చాలాకాలం నుండి నెల కొని ఉన్న సాంప్రదాయక దుర్లక్షణాలను.... అసలు దుర్లక్షణాలుగానే గుర్తించలేని స్థితిలో ఉన్నారు. అంటే చాలాకాలం నుండి ఒక డిపార్ట్‌మెంట్ వ్యవస్థలో ఆచరించబడుతున్న చెడు పద్ధతులు, లంచాలు, అధికార దురహంకార వైఖరులు ఆ డిపార్ట్‌మెంట్/వ్యవస్థ 'సహజ లక్షణాలు' గా పొరపాటు పడటం జరుగుతుంది.

ఉదాహరణకు పోలీసులు థర్డ్ డిగ్రీని యధేచ్ఛగా ప్రయోగించడం, ట్రెజరీలలో బిల్ విలువలో నిర్ధిష్ట 'పర్సంటేజ్'లను ఆశించడం, ఆస్తుల రిజిస్ట్రేషన్ సమయంలో నకలు పత్రాల కొరకు అదనంగా కొంత మొత్తాలను చెల్లించడం, వర్క్ బిల్లులలో వివిధ స్థాయిలలో నిర్ధిష్ట పర్సంటేజ్‌లు చెల్లించడం, రాజకీయ సిఫార్సుల ఆధారంగా సాంఘిక సంక్షేమ పెన్షన్‌లు, సబ్సిడీలు, ఉద్యోగుల ట్రాన్స్‌ఫర్‌లు మొదలైన పనులను చేయడం మనలో చాలామంది అవి చెడు సంప్రదాయాలని గుర్తించలేని స్థాయిలో మన వ్యవస్థలోని వివిధ శాఖలలో చెలామణి కావడం మనం గమనించవచ్చు.

ఐతే.... దీనికి పరిష్కారం ఏమిటి?.... ఊరు మొత్తం శుభ్రంగా ఉండాలంటే, ముందు వ్యక్తిస్థాయి నుండే ఆ ప్రయత్నం మొదలు కావాలి! వ్యక్తి స్థాయి నుండి కుటుంబ స్థాయికి, కుటుంబస్థాయి నుండి గ్రామస్థాయికి ఈ ప్రయత్నం తాలూకు సత్ఫలితాలు విస్తరించి, మనం ఆశించిన గ్రామం ఆవిష్కరించబడుతుంది.

ఇదే విధంగా వ్యవస్థలో నెలకొని ఉన్న చెడులను నిర్మూలించడం మన వృత్తి, ఉద్యోగ నిర్వహణలో భాగంగానే ప్రారంభించాలి. మన విధి నిర్వహణలో భాగంగా మన పరిధిలో జరిగే అనేక ప్రజాసంక్షేమ, పాలనా కార్యక్రమాలలో నైతిక విలువలను పాటించడం ద్వారా, మనం మన పిల్లలకు అందించాలనుకుంటున్న మంచి వ్యవస్థను రూపొందించవచ్చు. ఐతే వ్యవస్థను మార్చడం లేదా మంచిగా తీర్చిదిద్దడం నా ఒక్కడి వల్లే ఎలా సాధ్యం అవుతుంది?!.. అనేది మనలోని చాలా మందికి వచ్చే సత్వర సందేహం!!.

దీనికి ఒకటే సమాధానం... ప్రతి సుదీర్ఘ ప్రయాణం ఒక అడుగుతోనే మొదలవుతుంది. ప్రతి పెద్ద నిర్మాణం ఒక ఇటుకతోనే ప్రారంభిస్తాం. ఓ కవి చెప్పినట్లు "ఎవరో ఒకరు, ఎపుడో అపుడు, నడవరా ముందుకు" అన్నట్లుగా మొదటి అడుగు ఎప్పుడూ ఒంటరే మరి!. వెనుక వచ్చు వారికీ బాట అయినదీ!!.. అనే వాస్తవాన్ని గుర్తించి, ప్రతి ఒక్కరూ తమ విధి నిర్వహణలో నైతిక విలువలను పాటించి, భవిష్యత్ భారతాన్ని నిర్మించుదాం!!!

## ప్రభుత్వ ఉద్యోగులు-నైతిక విలువలు

ప్రజల నమ్మకానికి పునాది ప్రజాసేవే! ప్రభుత్వోద్యోగులు ప్రభుత్వానికి, ప్రజలకు అనుసంధాన కర్తలుగా ఉంటూ, ప్రభుత్వ చట్టాలకు బద్ధులై, స్వంత లాభాన్ని ఆశించక జాతీయ లక్ష్యాల సాధనకై కృషి చేయాలి. ప్రభుత్వం నుండి ప్రజలు ఆశించే నిజాయితీ, నిష్పాక్షికత మరియు నిబద్ధతలు ప్రభుత్వ ప్రతినిధులైన ప్రభుత్వ ఉద్యోగులలో ప్రతిఫలించాలి. ఉద్యోగులు తమ నైపుణ్యాలను, జ్ఞానాన్ని, అనుభవాన్ని మెరుగుపరచుకుంటూ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చ వలసి ఉంటుంది. ఈ క్రమంలో ప్రజల నమ్మకాన్ని పొందడానికి, జాతీయ సమైక్యత, సమగ్రతలను కాపాడేందుకు మరియు దేశ సమగ్రాభివృద్ధిని సాధించేందుకు. ప్రభుత్వోద్యోగులు కొన్ని వ్యక్తిగత నియమాలను, వ్యవహారశైలిని పాటించాలి.

### నైతిక నియమావళి- కొన్ని కీలక అంశాలు

1. వ్యక్తిగత జవాబుదారీతనం

- విధి నిర్వహణలో నిజాయితీ, ఆసక్తి, సావధానత, నిపుణత, నిష్పాక్షికత, సమైక్యత భావనలను కలిగి ఉండాలి.
- కేవలం చట్టపరమైన లేక విధానపరమైన ఆవశ్యకతలను సంతృప్తి పరచడం కాక ప్రజావిశ్వాసాన్ని, నమ్మకాన్ని పొందే విధంగా సేవ చేయాలి.
- విధి నిర్వహణకు భంగం కలిగించే ద్రవ్యపరమైన వ్యవహారాల ను నిర్వహించరాదు.
- చట్టవ్యతిరేకంగా వివాహ, వివాహేతర సంబంధాలను సాగించరాదు.
- ప్రభుత్వ లేక ప్రభుత్వేతర సంస్థల సమాచారంతో స్వంత ప్రయోజనాలను ఆశించి, ఏ విధమైన ఆర్థిక కార్యకలాపాలలో పాల్గొనరాదు.
- ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఏ విధమైన బహుమతుల నుగాని, ఆర్థిక లేదా ఆర్థికేతర ప్రయోజనాలను స్వీకరించరాదు.
- విధి నిర్వహణకు సంబంధించిన అన్ని రకాల చట్టాలు, విధి విధానాలపై అవగాహనను నిరంతరం పెంచుకుంటూ విజయవంతమైన ఉద్యోగ జీవితాన్ని నిర్మించుకోవాలి.
- ప్రజలతో సహోద్యోగులతో సగౌరవంగా వ్యవహరించాలి.
- ప్రభుత్వేతర సంస్థ పట్ల కానీ, వ్యక్తి పట్ల కానీ పక్షపాత వైఖరితో వ్యవహరించరాదు.
- ప్రజల వనరులను వృధా చేయటం లేదా దుర్వినియోగపరచటం చేయరాదు.
- తెలిసి, తెలిసీ చట్టవిరుద్ధమైన హామీలను, నిర్ణయాలను చేయరాదు.
- ప్రభుత్వ లేదా ప్రజా ఆస్తులను స్వార్ధ ప్రయోజనాల కోసం వాడరాదు.
- ప్రభుత్వ ఆస్తులను అనుమతిలేని కార్యకలాపాలకు వినియోగించకుండా సంరక్షించాలి.
- మీ పరిసరాలలో జరుగుతున్న మోసం, అవినీతి, వృధా, అసభ్యతల గురించి సంబంధిత అధికారులకు తెలియ పరచాలి/ఫిర్యాదు చేయాలి.
- విధి నిర్వహణలో భాగంగా చట్టాలనే కాక ప్రజా సంక్షేమాన్ని కూడా దృష్టిలో ఉంచుకొని నిర్ణయాలు తీసుకోవాలి.
- ఆశావాద దృక్పథంతో వ్యవహరిస్తూ ప్రజలతో, సాటి ఉద్యోగులలో ధైర్యాన్ని నింపాలి.

- ❀ పరిమితికి మించి చేసే వ్యక్తిగత కొనుగోళ్ల వివరాలను ప్రభుత్వానికి తెలియపరుస్తూ, తగిన అనుమతులను పొందాలి.

**2. చట్టం పట్ల విధేయత**

- ❀ సివిల్, క్రిమినల్ చట్టాలను గౌరవిస్తూ విధులను నిర్వహించాలి.
- ❀ ఉద్యోగులపై, డిపార్ట్‌మెంట్‌పై వచ్చే ఫిర్యాదులపై సకాలంలో, నిష్పక్షపాత వైఖరితో విచారణ జరిగేలా సహకరించాలి. తద్వారా ప్రజలలో విశ్వాసాన్ని నెలకొల్పాలి.

**3. ప్రజా సంబంధాల నిర్వహణ**

- ❀ సివిల్, స్థానిక ప్రజల అనుభవాల నుండి వచ్చే సూచనలు, సలహాలు, పరిష్కారాలను స్వీకరించడం ద్వారా మరింత మెరుగైన నిర్ణయాలను చేయగలం.
- ❀ సివిల్, ప్రభుత్వం పట్ల, చట్టం పట్ల ప్రజలలో గౌరవాన్ని పెంచేలా, సమైక్యతను కాపాడేలా ప్రజలలోని నిజాయితీని, నిబద్ధతను, జవాబుదారీతనాన్ని గౌరవిస్తూ ప్రజలతో వ్యవహరించాలి.
- ❀ సివిల్, జాతి, మతం, కులం, లింగం, ప్రాంతం, భాష, సంస్కృతి, నిస్సహాయత, విద్య, వయస్సు, సంపద, వైకల్యాల ఆధారంగా ఏ విధమైన నకారాత్మక పక్షపాతాన్ని (చట్టం ఆమోదించని) చూపరాదు.
- ❀ సివిల్, ప్రభుత్వోద్యోగులు ప్రజల సంక్షేమం కొరకు నియమించ బడిన వారు కనుక అధికార దర్పంతో కాక సేవా దృక్పథంతో వ్యవహరించాలి.

**4. బహుమతులు, రికార్డ్లు, ఆతిథ్యాలు మరియు రాయితీలు పొందడంపై పరిమితులు**

- ❀ విధి నిర్వహణలో భాగంగా అనేక మందిని కలిసి వ్యవహరించే సందర్భంలో 'బహుమతులు, ఆతిథ్యాలు' ఏ రూపంలో ఉన్నప్పటికీ స్వీకరించరాదు.
- ❀ విధి నిర్వహణలో భాగంగా చేసే వస్తువుల కొనుగోళ్ళు, నగదు చెల్లింపులలో పూర్తి పారదర్శకతను పాటించాలి.
- ❀ ప్రభుత్వం ప్రకటించే రివార్డులు, బహుమతుల స్వీకరణపై ఎట్టి నిర్బంధం లేదు.
- ❀ ప్రభుత్వేతర సంస్థలు ప్రకటించే సామూహిక బహుమతులు, రాయితీల స్వీకరణపై ఎట్టి నిర్బంధం లేదు.
- ❀ ప్రైవేట్ వ్యక్తులు, సంస్థలు కల్పించే ఉచిత వసతి, ప్రయాణ రాయితీ సౌకర్యాలను విధి నిర్వహణలో స్వీకరించరాదు.

**5. వివిధ వర్గాల ప్రయోజనాల మధ్య తలెత్తే సంఘర్షణను నివారించటం**

- ❀ విధి నిర్వహణలో భాగంగా చేపట్టే చర్యలతో వర్గపరమైన ప్రయోజనాల కోసం సంఘర్షణలు తలెత్తవచ్చు. కనుక ఉద్యోగులు ఈ తరహా సంఘటనలను ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉండాలి. తగిన పరిష్కారాలను ముందస్తుగా ఆలోచించాలి. ప్రభుత్వ పథకాల ద్వారా పరిమిత సంఖ్యలోనే లబ్ధిదారుల ఎంపిక చేసేటపుడు పేదల్లో నిరుపేదలకి ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా మన నిర్ణయాలను సమర్థించుకోవచ్చు.
- ❀ ఒక పథకం అమలులో ఆ పథకం తాలూకు భాగస్వాముల (స్టేక్ హోల్డర్) పరిధులను స్పష్టంగా గుర్తించి, తదనుగుణంగా వ్యవహరించేలా చూడాలి. లేనిచో పథకం అమలులో క్రొత్త సమస్యలు తలెత్తవచ్చు.
- ❀ ప్రభుత్వం నుండి ఏ విధమైన పని కాంట్రాక్టులను ఉద్యోగులు స్వీకరించటం, భాగస్వాములుగా చేరటం, బినామీలుగా వ్యవహరించటం చేయరాదు.
- ❀ ఇతర ఉపాధి, వ్యాపారాలలో ఉద్యోగులు నిమగ్నమవరాదు. తమ కుటుంబ సభ్యులు కూడా చట్టవ్యతిరేక వృత్తి వ్యాపారాలలో పాల్గొనకుండా నియంత్రించాలి. లేనిచో సదరు కార్యకలాపాల వలన తలెత్తే దుష్పరిణామాలలో బాధ్యుడిగా ఆరోపించబడే ప్రమాదం ఉంది.
- ❀ పదవీ విరమణ తర్వాత స్వీకరించే వృత్తి వ్యాపారాలు, ఉపాధులకు విధి నిర్వహణలో పొందిన అధికార రహస్యాలను వినియోగించరాదు.

**6. రాజకీయ కార్యకలాపాల పై పరిమితులు**

- ❀ ఉద్యోగులు రాజకీయ పార్టీల స్థాపన, ఎన్నికలలో పాల్గొనడం, ప్రభుత్వ వ్యతిరేక ప్రసంగాలు చేయడం నిషేధించడమైనది.
- ❀ ఏదేని రాజకీయ పార్టీకి లేదా స్వతంత్ర్య అభ్యర్థికి మద్దతుగా ప్రచారం చేయరాదు.
- ❀ పని ప్రదేశాలలో రాజకీయ, విప్లవ, చట్టవ్యతిరేక, ప్రభుత్వ వ్యతిరేక ప్రసంగాలు చేయరాదు.
- ❀ ప్రజాసంక్షేమ కార్యక్రమాలలో, లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ ఒత్తిళ్ళకు అతీతంగా అర్హత కలిగిన వారికే ఆయా పథకాలను అందేలా చూడాలి.

**7. ఆర్థిక వ్యవహారాలలో వ్యవహారశైలి**

- ❀ ఉద్యోగులు ప్రైవేట్ వ్యక్తుల నుండి అప్పులు తీసుకోవటం, ప్రైవేట్ వ్యక్తులకు అప్పులు ఇవ్వటం చేయరాదు.
- ❀ తాకట్టు, వడ్డీ వ్యాపారాలు, చిట్‌ల నిర్వహణ చేయరాదు.
- ❀ ఏదేని చట్టబద్ధ ప్రైవేట్ ఆర్థిక సంస్థలలో కస్టమర్‌గా చేరి పొదుపు, చిట్‌లలో పాల్గొనటం వ్యక్తిగత నిర్ణయంగా భావించి పాల్గొనవలెను.
- ❀ కార్యాలయ డబ్బుని స్వంత ప్రయోజనాలకు వాడరాదు. ఇతరులకు అప్పుగా లేదా బదులుగా ఇవ్వరాదు.
- ❀ ప్రతి ప్రభుత్వ ధన వినియోగంలో పూర్తిగా నియమ నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలి. అర్హతలేని ఏజెన్సీల వద్ద కొనుగోళ్ళు చేయరాదు. చట్టం అనుమతించిన విధానంలోనే అనుమతి గల వస్తుసేవలను కొనుగోలు చేయాలి.
- ❀ ప్రైవేట్ వ్యక్తులకు, సంస్థలకు ఉచితమైన మేలు చేసి ప్రతిఫలింగా డబ్బు లేదా ఇతర ఆర్థిక అంశాలు లేదా ఆర్థికేతర ప్రయోజనాలను పొందడానికి ప్రయత్నించడం శిక్షార్హం.

**8. ప్రభుత్వ రహస్యాల నిర్వహణ, సమాచారహక్కు చట్టం**

- ❀ నిర్ణయీకరణ దశలో సమాచారాన్ని బయల్పరచడం వలన, కొందరు దురుద్దేశంతో నిర్ణయాలను ప్రభావితం చేయడానికి ప్రయత్నించవచ్చు. కావున ఈ తరహా సమాచారాన్ని తగిన చట్టం అనుమతి లేనిదే బయల్పరచరాదు.
- ❀ ఇదే సమయంలో సమాచారహక్కు చట్టం స్ఫూర్తిని గౌరవిస్తూ, ప్రజలకు వారు కోరిన సమాచారాన్ని సాధ్యమైనంత త్వరగా అందించాలి.
- ❀ సమాచారహక్కు చట్టం గూర్చి పూర్తి స్థాయి అవగాహనను పొంది, ప్రజలకు ప్రభుత్వ నిర్ణయాలను పారదర్శకంగా ఉంచాలి.

**9. ప్రభుత్వ/అధికారిక ఆస్తులు, సేవలు వినియోగం**

- ❀ అధికారిక హోదాలో కల్పించబడిన వాహన సౌకర్యం, వసతి, ఇతర సామాగ్రి మరియు సౌకర్యాలను భిన్నమైన ప్రయోజనాలకు వినియోగించరాదు.

❀ ప్రభుత్వ కార్యాలయాలను అనధికారిక కార్యక్రమాలకు, స్వంత ప్రయోజనాలకు వినియోగించరాదు.
❀ అధికారిక గుర్తింపుకార్డులను, హోదాలను స్వార్ధ ప్రయోజనాలకు వినియోగించరాదు.
❀ ఎలక్ట్రానిక్ నెట్‌వర్క్, కంప్యూటర్ మొదలైన సదుపాయాల వినియోగంలోనూ స్వార్ధ ప్రయోజనాలకు తావివ్వరాదు.

**10. ప్రభుత్వ ఆస్తుల అమ్మకాలలో పాల్గొనటం, కొనుగోలు చేసే హక్కుకు పరిమితి**

❀ ప్రభుత్వ ఆస్తుల బహిరంగ వేలం, అమ్మకాలలో పాల్గొని కొనుగోలు చేసే వెసులుబాటు ఉద్యోగులకు ఉంది. ఐతే ఈ ఆస్తులను తిరిగి అమ్మకం చేయటానికి లేదా ఉపాధి వ్యాపారాలకు వినియోగించడానికి కొనుగోలు చేయరాదు.
❀ స్వంత కార్యాలయ ఆస్తుల అమ్మకాలలో, కొనుగోళ్ళలో ఏ విధమైన ప్రాధాన్యత కోసం ప్రయత్నించరాదు.
❀ పంచాయతీ ఆస్తులైన చేపల చెరువులు, తోటలు, భూముల లీజు నిర్వహణలను ఇ.ఒ. (పి.ఆర్ఆర్.డి)లు పర్యవేక్షించాలి.

**11. సౌకర్యవంతమైన కార్యాలయ వాతావరణాన్ని నెలకొల్పటం**

❀ కార్యాలయ ఉద్యోగులకు, సందర్శకులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాలి. తద్వారా పని వేగంలో మెరుగుదల, సందర్శకులకు సంతృప్తి కలుగుతాయి.
❀ కార్యాలయ సహ ఉద్యోగులతో సగౌరవంగా వ్యవహరిస్తూ, మత, కుల, భాష, లింగ, వైకల్య పరమైన వివక్షను చూపకుండా వ్యవహరించాలి.
❀ కార్యాలయంలో ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించి, ఉద్యోగులకు ఆరోగ్య పరిరక్షణను, నిష్పక్షపాతంగా పనిచేసేందుకు తగిన భద్రతను కల్పించాలి.
❀ కార్యాలయం, కార్యాలయ పరిసరాల్లో డ్రగ్స్, ఆల్క హాల్‌లను వినియోగించరాదు. ఈ తరహా పదార్ధాలను సేవించి విధులకు హాజరవటం నేరం. నిషేధిత ప్రదేశాలలో పొగత్రాగరాదు.
❀ యూనిఫామ్‌ను ధరించవలసిన ఉద్యోగులు తప్పక ధరించి విధులకు హాజరవ్వాలి.
❀ యూనిఫామ్‌ను ధరించి, విధులలో లేని సమయాల్లో నైనా/ విధులలో ఉన్నప్పుడైనా ఆల్కహాల్, డ్రగ్స్ వంటి పదార్ధాల కొనుగోలు, వినియోగం చేయరాదు.
❀ వస్త్రధారణలో జాగ్రత్తలు పాటించాలి. ప్రభుత్వానికి, కార్యాలయానికి ప్రతినిధులుగా వ్యవహరించే ప్రభుత్వ ఉద్యోగులు ఆదర్శనీయమైన, నిరాడంబరమైన ఆహార్యాన్ని కలిగి ఉండాలి. తద్వారా ప్రజలలో గౌరవాన్ని పొందవచ్చు.
❀ కార్యాలయంలో పనిచేసే మహిళలపట్ల, అవసరార్థం కార్యాలయాలకు వచ్చే మహిళల పట్ల గౌరవంగా వ్యవహరించాలి.
❀ నిస్సహాయులైన, వైకల్యం గల వ్యక్తులను ఆదరించి, వారికి అందవలసిన సహాయాన్ని త్వరతగతిన అందించాలి.

పైన సూచించిన అంశాలలో ప్రభుత్వోద్యోగులు నైతికపరమైన నిబద్ధతను పాటించడం ద్వారా కార్యాలయంలోనే కాక వ్యక్తిగత జీవనంలోనూ గౌరవ మర్యాదలను పొందవచ్చు. అదేవిధంగా ప్రజలలో కూడా మంచి అధికారిగా మన్ననలు పొందవచ్చు.

మనలో కొందరు ఏ నిర్ణయం తీసుకుంటే ఏ ఇబ్బంది వస్తుందో అని ఏ విధమైన నిర్ణయాన్ని తీసుకోకుండా దాటివేత ధోరణిని అవలంబిస్తుంటారు.

ఉదాహరణకు "ఏరువాక కాలంలో ఖాళీగా వున్న ఒక రైతుని వరి నాటు వేసావా" అని ఒక వ్యక్తి ప్రశ్నించగా,

ఆ రైతు "లేదు వర్షాలు సకాలంలో పడవేమో అన్న భయంతో నాటలేదు" అన్నాడు.

అందుకా వ్యక్తి "మరి ఏం నాటావు?" అని ప్రశ్నించగా-

రైతు "ఏమీ నాటలేదు. నా పొలం మాత్రం క్షేమంగా ఉంది" అని బదులిచ్చాడు.

పై కథ నుండి ఏ నిర్ణయాన్ని తీసుకుంటే ఏమవుతుందో అన్న భయంతో, అసలు ఏ పంటనూ నాటలేదు. మరి ఇలా అయితే అతని కుటుంబం ఎలా గడుస్తుంది? !!

ఇదే తరహాలో మనలో కొందరు నిర్ణయాలు తీసుకోవడానికి భయపడుతుంటారు. కాని వారికి తెలియదు అలాంటి స్వభావం వలన వారి విధి నిర్వహణను వారు విస్మరిస్తున్నారని !!

మరో ఉదాహరణ- తన తల్లిపై కోపం వచ్చి ఓ బాలుడు అలిగి ఇంటి నుండి వెళ్లిపోయి దగ్గరలోని ఒక కొండ ప్రాంతానికి చేరి 'ఐ హేట్ యు' 'ఐహేట్ యు' అని తల్లిని తలచుకొని గట్టిగా అరిచాడు. ఐతే కొద్ది క్షణాల, తర్వాత అవే మాటలు కొండల మధ్య ప్రతిధ్వనించి వినవచ్చాయి. దీనికి ఆశ్చర్యపోయిన ఆ బాలుడు వెంటనే తన తల్లి వద్దకు వెళ్ళి ఎందుకలా జరిగిందని ప్రశ్నించాడు. దానికి ఆమె, మనం ప్రపంచానికి ఏమి పంచితే మనకు ప్రపంచం అదే తిరిగి ఇస్తుందని, నువ్వు కోపాన్ని చూపితే మనకు అదే ప్రతిగా చెబుతుందని చెప్పింది. తల్లి హితవు మేరకు ఆ బాలుడు మరలా ఆ కొండ ప్రాంతానికి వెళ్ళి "ఐ లవ్ యు", "ఐ లవ్ యు" అని గట్టిగా పలుకగా, కొద్ది క్షణాలకు అవే మాటలు అతనికి వినవచ్చాయి.

మనం మన సహచరుల పట్ల ఆదరణ, గౌరవాన్ని కనపరచినపుడు మనకు కూడా అదే ఆదరణ, గౌరవం దక్కుతుందని అర్థం చేసుకోవచ్చు.

ఇంకొక ఉదాహరణ- ఒక విజయవంతమైన వ్యాపారవేత్తను 'భిన్నమైన వ్యక్తిత్వాలు, వ్యవహార శైలి గల చాలామంది ప్రజలు మరియు ఉద్యోగులతో మీరు ఎలా నెగ్గుకు వచ్చి వ్యాపారంలో విజయం సాధించారు?" అని ప్రశ్నించగా-

దానికి సమాధానంగా ఆ వ్యాపారవేత్త మనుషుల్లో మంచితనాన్ని వెదకడం బంగారు గని నుండి బంగారాన్ని వేరు చేయడం వంటిదే. కొన్ని టన్నుల దుమ్ము-ధూళిని తొలగించినపుడే మనం ఒక ఔన్స్ బంగారం పొందగలం. నేను ఈ దుమ్ము ధూళి (చెడు) గురించి ఎక్కువగా ఆలోచించను. నా ఆలోచనంతా గని (మనిషి)లో దొరికే ఆ ఔన్స్ బంగారం (మంచితనం) మీదే ఉంటుంది. వ్యక్తులతో వ్యవహరించడం గని నుండి బంగారం తీయడం వంటిదే. మనం ఓర్పు, సహనంతో వేచి ఉండి పనిచేస్తే మనం తప్పక వారిలోని సమర్థత, మంచితనాన్ని తట్టి లేపగలం" అని బదులిచ్చారు.

మన విధి నిర్వహణలో భాగంగా అనేకమంది వ్యక్తులను కలుస్తుంటాం. ఈ క్రమంలో వారిలో కొందరు కొంత స్వార్ధ ప్రయోజనాలను ఆశించి మనపై ఆరోపణలు చేస్తుండవచ్చు. ఐనప్పటికీ, మనం నిబద్ధత, నిష్పాక్షికత, అంకిత భావాలతో పని చేస్తుంటే, అతి కొద్ది కాలంలోనే వారు తమ అభిప్రాయాలను మార్చుకొని మనను గౌరవించడం జరుగుతుంది. ఎదుటివారిలోని ఈ మంచితనాన్ని నిద్రలేపడానికి మనం జీసస్, గాంధీజీ, మదర్‌థెరెసాలు చూపిన సహనం, క్షమ భావాలను అలవర్చుకోవాలి.


*- మంగాపురనాథ్, ఎం.పి.డి.ఓ., ప్రకాశం జిల్లా*



# పిల్లల మనుగడ, ఎదుగుదల పెంపొందాలంటే బి.ఎన్.విలు ముఖ్య భూమిక పోషించాలి

**పిల్లల మనుగడ, ఎదుగుదల, అభివృద్ధిలో భాగంగా భారత్ నిర్మాణ్ వాలంటీర్లు, ముఖ్య భూమిక వహించే అమలు చేసే మోడల్ ప్రాజెక్ట్ అమలల్లో కీ-క్యాప్ కార్యక్రమం క్రింద ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎంపిక చేసిన 24 గ్రామాల నుండి హాజరైన బి.ఎన్.వి.లు, ఇ.టి.సి. ఫాకల్టీ మరియు డి.టి.ఎం.లను ఉద్దేశించి 10.06.2013న వర్క్‌షాపును అపార్డులో నిర్వహించడం జరిగింది.**

ఈ వర్క్‌షాప్‌కు ముఖ్య అతిథిగా హాజరైన సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ స్టడీస్ డైరెక్టర్ జనరల్ శ్రీ కె. చంద్రమౌళి ఐ.ఎ.ఎస్, (రిటైర్డ్) మాట్లాడుతూ, భారత్ నిర్మాణ్ వాలంటీర్లు గ్రామస్థాయిలో పిల్లల మనుగడ, అభివృద్ధి విషయంలో ప్రభుత్వ అధికారులను, ప్రతినిధులను కలుపుకుపోతూ అభివృద్ధి సాధించాలన్నారు. గర్భిణీలు, పాలిచ్చే తల్లులు, బాలికల్లో ఎక్కువ శాతం రక్తహీనతతో బాధపడుతున్నారని ఆయన తెలిపారు. గ్రామాల్లో అంగన్ వాడీ వర్కర్, ఆశా వర్కర్, ఎ.ఎన్.ఎమ్. మొదలైన ప్రభుత్వ సేవకులను ఉపయోగించుకుని బాలింతలు, పాలిచ్చే తల్లుల్లో చైతన్యం తీసుకురావాలన్నారు.




శిశువుల పట్ల సరియైన సంరక్షణ పద్ధతులు పాటించి ప్రసూతి సమయంలో నాణ్యత కల్గిన ఆరోగ్య సేవలు అందించాలని తెలిపారు. భారత్ నిర్మాణ్ వాలంటీర్లు, డిస్ట్రిక్ట్ ట్రైనింగ్ మేనేజర్లు ఎప్పటికప్పుడు కార్యక్రమ ఫలితాలను బేరీజు వేసుకొని ముందుకు పోవాలి.

గ్రామాల్లో బాల్య వివాహాలు ఇంకా అక్కడక్కడా జరుగుతూనే ఉన్నాయని, వాటిపై భారత్‌నిర్మాణ్ వాలంటీర్లు శ్రద్ధ వహించి వాటిని నివారించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఇంటా వ్యక్తిగత మరుగుదొడ్లు కట్టుకుని వాడుకునేలా ప్రోత్సహించి బహిరంగ మలవిసర్జన రహిత గ్రామాలుగా ప్రతి గ్రామాన్ని తీర్చి దిద్దాలని తెలిపారు.

మల విసర్జన తరువాత, భోజన తయారీ ప్రక్రియ ముందు, భోజనం చేసే ముందు, చంటి పిల్లలకు పాలిచ్చే ముందు, మొదలగు సందర్భాలలో సబ్బుతో చేతులు కడుక్కునేలా ప్రోత్సహించాలన్నారు. ప్రజలు ఎవరైతే సమస్యలను తమ చేతుల్లోకి తీసుకుంటారో ఆ గ్రామాలు అభివృద్ధికి నోచుకుంటాయని, "నా గ్రామం బాగోగులు నా చేతుల్లోనే ఉన్నాయి". అని ప్రతి ఒక్కరూ అనుకుని పనిచేయాలని శ్రీ చంద్రమౌళి పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో 22 గ్రామాల నుండి హాజరైన భారత్ నిర్మాణ్ వాలంటీర్లు, అపార్డు డిస్ట్రిక్ట్ ట్రైనింగ్ మేనేజర్లు, ఇ.టి.సి. ఫ్యాకల్టీ సభ్యులు, అపార్డ్ సెంటర్ హెడ్స్ శ్రీ కూర్మారావు, శ్రీ ఎ. నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

*- సి.ఎం.పి.*

# ప్రజా సేవకు పేదరికం అడ్డుకాదు...

**ఆయన టైర్లకు పంక్చర్లు అతికించడమేకాదు. సమాజంలో తన కళ్ళముందు కనిపించే సమస్యలకు కూడా అతుకులు వేస్తాడు. సమస్య వచ్చిందంటే ముందుండి పరిష్కార మార్గం వైపు నడుస్తాడు. వృత్తి రీత్యా మెకానిక్ అయినప్పటికీ, తనకు తోచిన సాయం చేస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తుంటాడు. ఆయనే ప్రకాష్ ముదిరాజ్. హైదరాబాద్ ఎల్లారెడ్డిగూడ ఆర్టీఐ క్వార్టర్స్ సమీపంలో టైర్ల పంక్చర్ దుకాణం నిర్వహించే ప్రకాష్ మొదటి నుండీ సామాజిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవాడు. పెద్దగా చదువుకోకపోయినా, సమాజంలో ఒకడిగా కాకుండా సమాజానికి ఒకడిగా బతకాలని అనుకున్నాడు.**





సమాజహిత కార్యక్రమాల వైపు అడుగులు వేయడం మొదలు పెట్టాడు. ఎనిమిదేళ్ళుగా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాడు. బతుకు తెరువుకోసం పంక్చర్లు వేసి సంపాదించిన డబ్బులో కొంతభాగం పలు సేవా కార్యక్రమాలు కోసం ఖర్చు చేస్తుంటాడు. కాలానికి అనుగుణంగా వేసవిలో గొంతెడుతున్న వారి దాహార్తిని తీర్చేందుకు శ్రీనగర్‌కాలనీ, ఎల్లారెడ్డి గూడ, వెంగళరావునగర్, కమలాపురి కాలనీ, యూసుఫ్‌గూడ, మధురానగర్, కష్ణానగర్, మొదలైన పలుప్రాంతాల్లో దాదాపు 6 చోట్ల సొంత ఖర్చులతో మజ్జిగ, పంపిణీ కేంద్రాలను, చలివేంద్రం కేంద్రాలను ఏర్పాటు చేస్తాడు. వాటిలో స్వయంగా నీళ్ళు నింపుతాడు.

తాను నివసించే చుట్టు ప్రక్కల రోడ్లు ఎక్కడైనా గుంతలతో కనిపించినా, మ్యాన్‌హోల్ తెరిచివున్నా వెంటనే ప్రకాష్ స్పందిస్తాడు. ఆ గుంతలు పూడ్చేందుకు కావల్సిన మట్టిని టిప్పర్ల (లారీలు) ద్వారా అయినా తెప్పించి ఆ గుంతలు పూడ్చుతాడు. రోడ్డు ప్రక్కల నిద్రించే

## నిరూపించిన ఓ పంక్చర్ మెకానిక్

అనాధలకు రగ్గులు, దుప్పట్లు అందిస్తాడు. పేద మహిళలకు చీరలు పంపిణీ చేస్తాడు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ మంచి ఫలితాలు సాధించే విద్యార్థులకు తగినంత చేయూతనిస్తాడు. దేశ నాయకుల జయంతికి అనాధ పిల్లలకు మిఠాయిలు పంచుతాడు.

ఏదేని శుభకార్యానికి వెళ్ళితే అక్కడ మిగిలే పదార్థాలు అన్నీ తెచ్చి రోడ్డు ప్రక్కల జీవనం సాగించే వారికి అందిస్తాడు. తనకుండే సమయంలో రోజుకి మూడు గంటలు ప్రజా సేవకే కేటాయిస్తాడు. ఇన్ని సేవా కార్యక్రమాలు చేస్తున్నా ఎలాంటి ప్రచారం చేసుకోడు. అతన్ని పలకరిస్తే పదిమందితో నవ్వుతూ మాట్లాడడం, చేతనైనంతలో సాయం చేయడం, ఈ జీవితానికి ఇంకేం కావాలండీ అంటూ తన వృత్తిలో నిమగ్నమైపోతాడు. ఇతరులకు సాయం చేయడానికి ధనవంతుడై ఉండాల్సిన పనిలేదని, హోదాలు అవసరం లేదని, మనసు ఉంటే చాలని నిరూపించాడు ప్రకాష్ మంచి తనానికి ఇంతకంటే నిదర్శనం ఇంకేం కావాలి.

*- సి.ఎం.పి.*







# గ్రామాభివృద్ధి కృషిలో కముజువారి లంక బి.ఎన్.వి.లు

**మన గ్రామ అభివృద్ధి మన చేతుల్లోనే**

**మారుద్దామా మన గ్రామాన్ని, ఇలా !**

**సరైన దిశా నిర్దేశం చేస్తే నేటి యువత సాధించలేనిది ఏదీ ఉండదు అని నిరూపించారు తూర్పు గోదావరి జిల్లా, అంబాజి పేట మండలంలోని కమూజ్‌వారి లంక గ్రామానికి చెందిన భారత్ నిర్మాణ్ వాలంటీర్లు. అధికారుల సహకారంతో గ్రామాన్ని తామే అభివృద్ధి చేసుకోవాలని తలచారు వారు.**

గ్రామస్తులంతా ఐకమత్యంతో ముందుకు సాగి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్ది పలువురికి ఆదర్శంగా నిలిచారు. గ్రామీణ కుటుంబాలకు, ప్రభుత్వానికి మధ్య వారథులుగా అంకిత భావంతో అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ఫలితాలు అందేలా చేసి, తమ గ్రామ ప్రజల జీవన ప్రమాణాలలో మెరుగుదల తీసుకురావడంలో విజయం సాధించారు.

ఒకప్పుడు గ్రామంలో ఎవరికి వారే యమునా తీరే అన్నట్లుగా, ఎవరి పని వారు చేసుకుపోతూ ఉండేవారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పేదల అభివృద్ధి కోసం ప్రవేశపెడుతున్న అనేక పథకాలపై గ్రామంలో సరైన అవగాహన లేక ప్రజలు అరకొర జీవనోపాధులపై ఆధారపడి జీవిస్తుండేవారు. ఆ సమయంలోనే కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కీ - క్యాప్, ల్యాబ్ టు ల్యాండ్ కార్యక్రమంలో భారత్ నిర్మాణ్ వాలంటీర్లుగా గ్రామం నుండి 15 మంది యువతీ యువకులు ఎ.ఎం.ఆర్. ఆంధ్రప్రదేశ్ అకాడమీ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ పొందారు.

గ్రామంలో ఇంటింటా సర్వే నిర్వహించి ప్రతి కుటుంబానికి ఉన్న సమస్యలను గుర్తించారు. సమస్యల పరిష్కారానికి యువత ఆరు బృందాలుగా ఏర్పడి ఒక్కొక్క సమస్యనూ పరిష్కరిస్తూ వచ్చారు. గ్రామ పారిశుధ్యంపై తొలుత దృష్టి సారించి, నిర్మల్ భారత్ అభియాన్ ద్వారా గ్రామంలో అందరికీ వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించారు. ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించారు.

గ్రామస్తులందరికీ గుడ్డతో తయారు చేసిన సంచులను అందించారు. బడి ఈడు పిల్లల్ని బడిలో చేర్పించి, వారికి కావలసిన దుస్తులు, బెల్టులు, టైలు మొదలైనవి అందించారు. ఇంటింటికి ఒక్కొక్క మొక్కను అందించి, వాటిని సంరక్షించే బాధ్యతను ఆ ఇంటికే అప్పగించారు. వారంలో రెండు రోజుల పాటు కొంత సమయం గ్రామాభివృద్ధికి కేటాయించేలా తీర్మానం చేశారు. మద్యపానం, ధూమపానం వంటి వ్యసనాల వలన వచ్చే అనర్ధాలను గురించి వివరిస్తూ, ఇంటింటికీ వెళ్ళి అవగాహన కల్గిస్తున్నారు. వీరు చేస్తున్న సేవలకు గాను వీరికి దేశవ్యాప్తంగా మంచి గుర్తింపు వచ్చింది.

800 మంది జనాభా కలిగిన ఈ గ్రామంలో వర్గ, వర్ణ విభేదాలకు ఆమడ దూరంలో ఉండి, ఐకమత్యమే మహాబలమని గుర్తించి వారంతా గ్రామం కోసం నిస్వార్ధంగా సేవలందిస్తూ, అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్నారు.

యువతలో అత్యంత కీలకమైన శక్తి నిబిడీకృతమై ఉంది. 'యువత తలుచుకుంటే యావత్తు ప్రపంచాన్నే మార్చేయవచ్చు' అన్న వివేకానంద మాటలను నిజం చేస్తూ, గ్రామంలో అనుకున్న కార్యక్రమాలను పూర్తి చేసి ఇంకా చేయవలసిన కార్యక్రమాలకు ప్రణాళికలు చేపడుతూ విజయ పరంపర దిశగా కొనసాగుతూ బి.ఎన్.వి. లు గ్రామాన్ని పురోగమనం దిశగా పయనింపజేస్తున్నారు.

*- సి.ఎం.పి.*









# స్థానిక పాలనే సుపరిపాలన



**సుపరిపాలన సమాజ భవిష్యత్ అవసరాలను తీర్చేదిగాను, అవినీతిని తగ్గించేదిగాను, అల్పసంఖ్యాక వర్గాలు, అణగారిన బలహీన వర్గాల ఆకాంక్షలను ప్రతిబింబించేదిగాను చేస్తుంది. ఇది కేవలం స్థానిక పాలన వలన మాత్రమే సాధ్యమవుతుంది. అందుకే "స్థానిక పాలనే సుపరిపాలన". స్థానిక ప్రజలు తమ దేశ పౌరులగానే కాక, ప్రత్యేకమైన మానవ సమూహంగా ఉండాలని అభిలషిస్తారు.**

చట్టాలు తమ స్థానిక వాస్తవిక అవసరాలకు అనుగుణంగా ఉండాలని అభిలషిస్తారు. అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను తమ స్వంత ఆలోచనల మేరకు రూపొందించి, అమలు పరచాలని కోరుకుంటారు. ఇవన్నీ జరగాలంటే, స్థానిక ప్రభుత్వాలను బలోపేతం గావించాలి. ప్రజాస్వామిక పటిష్టత అధికార వికేంద్రీకరణపై ఆధారపడి ఉంటుంది.

సమస్యలను స్థానికంగానే, స్థానికులచే పరిష్కరించాలి. ఈ రకంగా జరిగినప్పుడే ప్రభుత్వం, ప్రజల మధ్య సత్సంబంధాలు ఏర్పడతాయి. నవభారత నిర్మాత జవహర్‌లాల్ నెహ్రూ, జాతిపిత మహాత్మా గాంధీ స్థానిక ప్రభుత్వాల ప్రాముఖ్యాన్ని పలు సందర్భాలలో వక్కాణించారు.

స్థానిక అవసరాలను స్థానిక వనరులతో నెరవేర్చడం కోసం ఎన్నుకోబడ్డదే స్థానిక ప్రభుత్వం. స్థానిక ప్రభుత్వం బహుముఖ లక్షణాలను కలిగిన సంస్థ. స్థానిక ప్రభుత్వం సామాజిక నిర్మాణ వ్యవస్థగా పని చేస్తుంది. ఐకమత్య భావనను కలిగి ఉంటుంది. రాజకీయ కోణం నుంచి గమనిస్తే, స్థానిక ప్రభుత్వం ఒక దేశ లేదా రాష్ట్ర పాలనలో ఒక ఉపవిభాగం, దేశపాలనలోని రాజకీయ ఏర్పాటులో అంతర్భాగం, స్థానిక ప్రభుత్వాల ఏర్పాటు ద్వారా ఆర్థిక వికేంద్రీకరణ సాధ్యమవుతుంది. ఫలితంగా ప్రణాళిక రూపకల్పనలో, అభివృద్ధి కార్యక్రమాల అమలులో కేంద్రీకృత పోకడలను నివారించవచ్చు.

ఆర్థికాభివృద్ధిలో స్థానిక సంస్థలకు భాగస్వామ్యం కలుగజేస్తే, ఆర్థికంగా బలోపేతమై సాధికారతను సాధించగలవు. స్థానిక ప్రణాళికను స్థానిక ప్రజల అవసరాలకు అనుగుణంగా రూపొందించడం జరుగుతుంది. అంతేకాక, స్థానిక ప్రణాళికను రూపొందించడం వలన అభివృద్ధిలో తమకు కూడా భాగస్వామ్యం ఉందన్న మానసిక భావన క్షేత్ర స్థాయిలో ప్రజలకు కలిగితే అభివృద్ధి వేగవంతమై సామాజిక ఆర్థికాభివృద్ధికి దోహదం చేస్తుంది.

### 73,74 రాజ్యాంగ సవరణ ద్వారా బలోపేతమైన స్థానిక ప్రభుత్వాలు

స్థానిక ప్రభుత్వాలను ప్రధానంగా గ్రామీణ పట్టణ లేక నగర ప్రాంత

స్థానిక ప్రభుత్వాలుగా వర్గీకరించారు. 73, 74 రాజ్యాంగ సవరణల ద్వారా వీటిని బలోపేతం గావించడం జరిగింది. గ్రామీణ ప్రాంతాల్లో నెలకొల్పిన పంచాయితీరాజ్ వ్యవస్థను 1959 అక్టోబర్ 2న ప్రారంభించడం జరిగింది. ఆనాటి నుండి పంచాయితీరాజ్ వ్యవస్థలో అవసరానుగుణంగా మార్పులు గావించడం జరిగింది.

1957వ సంవత్సరంలో బల్వంత్‌రాయ్ మెహతా కమిటీ చేసిన సిఫార్సుల ఆధారంగా మూడంచెల పంచాయితీరాజ్ వ్యవస్థను ఏర్పాటు చేయడం జరిగింది. 1992వ సంవత్సరంలో 73వ రాజ్యాంగ సవరణ ద్వారా పంచాయితీరాజ్ వ్యవస్థకు భారతదేశ పాలనలో ఒక సమున్నతమైన స్థానాన్ని కల్పించడం జరిగింది. ఈ సవరణ పంచాయితీరాజ్ వ్యవస్థలకు రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించింది. గ్రామీణ సామాజిక ఆర్థిక వ్యవస్థలో మహిళలు ప్రముఖపాత్రను పోషిస్తారు.

ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకొని మహిళా సాధికారతను ఆశించి అన్ని పంచాయితీ రాజ్ వ్యవస్థలు 3వ వంతు స్థానాలను మహిళలకు కేటాయించడం సాకారాత్మక నిర్ణయం. సామాజికంగా వెనుకబడిన తరగతులైన ఎస్సీ, ఎస్టీలు, బిసీలకు, 73వ రాజ్యాంగ సవరణ ద్వారా జనాభా ప్రాతిపదికన స్థానిక ప్రభుత్వాలలో రిజర్వేషన్లు కల్పించడం ముదావహం. అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు పంచాయితీ సంస్థల ఎన్నికలను ప్రతి ఐదు సంవత్సరాలకొకసారి జరిపించాలి.

మన రాష్ట్రంతో సహా అనేక రాష్ట్రాలలో పంచాయితీరాజ్ సంస్థలకు, ఇతర సంస్థలకు సకాలంలో ఎన్నికలను జరిపించడం లేదు. దేశంలో గ్రామీణ, నగర, స్థానిక సంస్థలు ఏళ్ల తరబడి ప్రత్యేక అధికారి పాలనలో కొనసాగడం దురదృష్టకరం. పంచాయితీ, పట్టణ, నగర స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ కోసం 73,74 రాజ్యాంగ సవరణల ననుసరించి ప్రతి రాష్ట్ర ప్రభుత్వం స్వతంత్ర ప్రతిపత్తిగల రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఏర్పాటు చేయాలి.

దాదాపు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్ర ఎన్నికల సంఘాలను ఏర్పాటు చేశాయి. 73,74 రాజ్యాంగ సవరణల ననుసరించి అన్ని స్థానిక సంస్థల కాలపరిమితి ముగియక ముందే రద్దయితే, ఆరు నెలలలోపే ఎన్నికలు జరిపించాలి. ఈ అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు అంతగా పట్టించుకోవడం లేదు. ప్రతి రాష్ట్ర ప్రభుత్వం 73,74 రాజ్యాంగ సవరణలననుసరించి రాష్ట్ర ఆర్థిక సంఘాన్ని ఏర్పాటు చేయాలి. రాష్ట్ర ప్రభుత్వాలు స్థానిక ప్రభుత్వాలకు నిధులు లేని విధులు ఇచ్చాయనే విమర్శ ఉంది.

ముఖ్యంగా పంచాయితీరాజ్ సంస్థలు, కొన్ని మున్సిపాలిటీలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. కొన్నిచోట్ల ఆ సంస్థల ఆదాయం సిబ్బంది జీతాలకు సరిపోవడం లేదు. ఈ కారణంగా ఆ స్థానిక సంస్థలు ఏ రకమైన అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టలేక పోతున్నాయి.

73వ రాజ్యాంగ సవరణ ప్రకారం ప్రతి గ్రామానికి ఆ గ్రామ ఓటర్లతో కూడిన ఒక గ్రామసభను గ్రామ సర్పంచ్ ఏర్పాటు చేయాలి. గ్రామసభ సమావేశాలు సంవత్సరంలో కనీసం రెండు పర్యాయాలు జరగాలి. గ్రామ సభ సమావేశాల్లో గ్రామ పంచాయితీ చేపట్టబోయే కార్యక్రమాలను, బడ్జెట్‌ను చర్చించాలి. అనేక గ్రామాలలో గ్రామసభ సమావేశాలు మొక్కుబడిగా జరుగుతున్నాయి. నిజానికి గ్రామసభ రాష్ట్ర శాసనసభలా పనిచేయాలి.

## స్థానిక సంస్థల సమస్యలు

స్థానిక సంస్థలు ప్రధానంగా ఎదుర్కొంటున్న సమస్యలలో ప్రధానంగా పేర్కొనదగినది వనరుల కొరత. భూమి, నీరు, ఖనిజవనరులు స్థానిక సంస్థల ఆధీనంలోకి రావు. ఈ వనరులను స్థానిక సంస్థల ఆధీనంలోనికి తేనంత వరకు ఈ సంస్థలు బలహీనంగానే ఉంటాయి. ప్రజా ప్రతినిధులైన రాష్ట్ర శాసన సభ్యులకు, పార్లమెంట్ సభ్యులకు స్థానిక సంస్థలను పటిష్టపరచడం ఇష్టం ఉండదన్న విమర్శ ఉంది.

స్థానిక సంస్థల నాయకులు బలోపేతమైతే తమ ప్రాముఖ్యం తగ్గుతుందన్న భావన వీరిలో ఉంది. స్థానిక సంస్థలలో పనిచేసే సిబ్బందికి, ఎన్నిక కాబడ్డ ప్రజా ప్రతినిధులకు మధ్య సత్ సంబంధాలు లేకపోవడం వలన ఈ సంస్థలు సమర్ధవంతంగా పనిచేయడం లేదు.

ఈ సమస్యను పరిష్కరించాలంటే స్థానిక ప్రభుత్వాలలో పనిచేసే సిబ్బందిపై ఎన్నిక కాబడ్డ ప్రజా ప్రతినిధులకు నియంత్రణాధికారం ఉండాలి. స్థానిక ప్రభుత్వాలను రద్దు గావించే అధికారం, ఆ సంస్థల ప్రతినిధులను పదవుల నుండి తొలగించే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉంది. రాష్ట్ర ప్రభుత్వ ప్రమేయం లేకుండా స్థానిక ప్రభుత్వాలు ఏమీ చేయలేవు. అందుకే అవి నిర్వీర్యంగా ఉన్నాయి.

స్థానిక సంస్థలు ప్రజాస్వామ్యంలో ఒక ప్రముఖ భాగం. స్వయం పాలన కలిగిన స్థానిక సంస్థలు లేకుండా నిజమైన ప్రజాస్వామ్యం లేదు. క్షేత్ర స్థాయి ప్రజాస్వామ్యం లేకుండా జాతీయస్థాయిలో ప్రజాస్వామ్యం మనజాలదు. వైరుధ్యం కల్గిన స్థానిక సమస్యల పరిష్కారం స్థానిక ప్రభుత్వాలతోనే సాధ్యం. ప్రజాస్వామ్యం అనే సౌధానికి స్థానిక ప్రభుత్వాలు పునాదులు. ప్రజల నిత్యావసరాలను తీర్చగల సామర్థ్యం స్థానిక సంస్థలకు వుండాలి. అప్పుడే ప్రజారంజకమైన పాలన సాధ్యం. అదే 'సుపరిపాలన'. ఆంధ్రప్రదేశ్‌లోని స్థానిక సంస్థలకు త్వరలోనే ఎన్నికలు జరిపించనున్నట్లు ముఖ్యమంత్రి, పంచాయితీరాజ్ మంత్రి ప్రకటించడం ముదావహం. ప్రజాస్వామ్యానికి మూలస్తంభాలయిన స్థానిక సంస్థలకు త్వరలో ఎన్నికలు జరుగుతాయని ఆశిద్దాం.

**- డాక్టర్. పి. మోహన్ రావు**
హెడ్, ప్రభుత్వ పాలనశాస్త్రం, రైల్వే డిగ్రీ కళాశాల, సికింద్రాబాద్

# గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల్లో బిఎన్‌విల పాత్ర

**మానవాభివృద్ధికి ఏ స్వార్థం లేకుండా సహాయ సహకారాలు అందించడం మానవనైజం. ఆ స్వభావం మనిషిలో ఉండే సహకారబుద్ధికి తార్కాణం. ఎదుటి వారికి సహాయపడడం అనేది సహజమైన పరిణామం. ప్రతి జంతువులో నుండే సహజ గుణం. అందుకే నేడు ఆ గుణం పరస్పర సహాయం అందించుకోవడానికి మరింతగా ఉపయోగపడుతుంది. ఏ మతం బోధించిన, సూక్తులు గమనించినా, స్వంత లాభం కొంత మానుకొని ఎదుటి వారికి సహాయపడాలని సూచిస్తున్నట్లు తెలుస్తుంది. మన హిందూ సమాజం పరస్పర సహకారాన్ని చాల ఆలస్యంగా మొదలు పెట్టింది.**



అదే వేరే మతాల వారు పరస్పర సహకారాన్ని చారిటీల ద్వారా ఎప్పుడో మొదలుపెట్టారు. మిస్ నైటింగెల్ రెండవ ప్రపంచ యుద్ధంలో గాయపడిన సైనికులకు సేవలనందించి మానవత్వాన్ని చాటింది. అదేవిధంగా మేడమ్ బ్లావీట్స్కీ స్వచ్ఛందంగా విద్యా సంస్థలను స్థాపించి పేద ప్రజలను విద్యావంతులుగా చేయటానికి పూనుకొంది. బ్రిటీషు వారితో వచ్చిన క్రైస్తవ సంస్థలు మతప్రచారంతో పాటు స్వయంగా పేద ప్రజలకు చేయూతనిచ్చాయి. ఆనాటి క్రైస్తవ సంస్థలు చేసిన స్వచ్ఛంద సేవల వల్లనే నేడు మనం ఒక మానవ వనరులు కలిగిన పెద్ద దేశంగా మారగలిగాం. అత్యధికంగా వున్న మానవ వనరులను భారతదేశం ప్రపంచ దేశాలకు అందించగలుగుతున్నది.

గతంలో కూడా చరిత్రను చూస్తే గ్రామాలలో స్వచ్ఛందంగా పనిచేసేవారున్నట్లు మన పురాణ గాధలు తెలుపుతున్నాయి. కనుక నేడు భారత్ నిర్మాణ్ వాలంటీర్లుగా పనిచేసే వారు ఏమి ఆశించి గ్రామంలో సేవలు అందిస్తున్నారు? అని ప్రశ్నించే వారున్నారు. పనిచేయకపోతే సోమరిలా తిరుగుతున్నారంటారు. పనిచేస్తే వీరికి పనితప్ప ఏమి పట్టదనీ అంటారు. గ్రామాల్లో కబుర్లు చెప్పుకొంటూ కాలం వెళ్ళబుచ్చే వారికంటే ఊరికి ఏదో సేవ చేద్దాం అనేవారు దొరకడం అదృష్టంగా చెప్పవచ్చును. అంతేగాక వున్నంతలో సంతృప్తిగా జీవించే వారుంటారు. వారు ఇతరులకు సేవ చేయటానికి ముందుకు వస్తారు. కనుక అలాంటి వారినే గుర్తించి వాలంటీర్లుగా శిక్షణనిచ్చి గ్రామ అవసరాలను తీర్చేందుకు వాలంటీర్లుగా నియమించుకోవడం జరుగుతుంది. ఈ భారత్ నిర్మాణ్ వాలంటీర్లు (బి.ఎన్.వి) కేంద్ర ప్రభుత్వం అమలుచేసే ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాలను గూర్చి గ్రామాల ప్రజలకు వివరిస్తారు. ఆ కార్యక్రమాలు గ్రామీణులకు ఏ విధంగా తోడ్పడతాయి? అందుకు ఏమి చేయాలి? ఎవర్ని సంప్రదించాలనే అంశాలను కూడగట్టుకొని గ్రామీణులకు సమాచారం చేరవేయుటంలో వారధులుగా పనిచేస్తారు బిఎన్‌విలు. వీరు తమ గ్రామంలో పారిశుధ్యం, పరిశుభ్రత, ఆరోగ్య సూత్రాలను పాటించటం గురించి గ్రామస్థులకు చెప్పి, వారి ఊరును బాగు చేయించేందుకు కృషిచేస్తారు. గ్రామస్థుల పిల్లలను బడికి పంపాలని తల్లి దండ్రులకు చెప్పి, వారిని ఒప్పించి విద్యాభివృద్ధిని ప్రోత్సహించడం, పాఠశాల ఉపాధ్యాయులు రోజూ బడికి వచ్చి పిల్లలకు శ్రద్ధగా విద్యాబుద్ధులు చెప్పేలా ప్రోత్సహించడానికి ఈ బిఎన్‌విలు కృషి చేస్తారు.

గ్రామాలలో ప్రాణాంతక వ్యాధులు రాకుండా పరిశుభ్రంగా ఉండాలని చెప్పడమే కాక, స్వచ్ఛందంగా కొందరిని పోగు చేసి చుట్టు ప్రక్కల పరిసరాలు బాగుగా ఉండేట్లు చేస్తారు. దీనికి వారికి ఏమి వస్తుందని అడగవచ్చు. కేవలం ఊరు బాగు పడుతుంది. దీని వల్ల రోగాలు, రొప్పులు ఊరి వారికి సోకకుండా చేస్తారు. కొన్ని గ్రామాలలో బోరునీళ్లు తాగడం వలన క్షయవ్యాధులు రావడానికి ఒక కారణంగా

ఉంది. పొగాకు నమలడం వలన కూడా ఈ వ్యాధి రావచ్చు. అలాంటి కారణాలను గమనించి వాటిని తొలగించడం, గ్రామానికి ఆరోగ్య కార్యకర్తలు వచ్చి మందులు సరఫరా చేసేలా చూసి, రోగులకు ఆసుపత్రులలో చికిత్స లభించేలా భారత్‌నిర్మాణ్ వాలంటీర్లు కృషి చేస్తున్నారు. తను జన్మించిన ఊరులో అందరూ సౌఖ్యంగా ఉండాలనే ఆకాంక్షే కొందరిని బివిఎన్‌విలుగా మారుస్తోంది. ప్రభుత్వం అందించే సేవలు బివిఎన్‌విల ద్వారా గ్రామస్థులకు నేరుగా అందడం వలన, ఆకలి, అనారోగ్యాలను ప్రజలకు దూరంగా ఉంచడం వలన గ్రామాలు సుఖసంతోషాలతో ఉండగలవు. కనుక ప్రతి ఒక్కరూ, ప్రతి కుటుంబం బివిఎన్‌విలకు చేయూతనందించడం ద్వారా ఒక్కొక్క గ్రామాన్ని 'పొగరహిత' గ్రామం గాను, మరో గ్రామాన్ని 'మద్యపాన రహిత' గ్రామంగానూ మార్చుకోగలుగుతున్నారు. ఈ నేపథ్యంలో, ఆయా గ్రామాలలో వున్న ప్రముఖ సమస్యలు ఏమిటి? అని పరిశీలించి, ఆ అడ్డంకులను తొలగించడం ఎలాగో భారత నిర్మాణ్ వాలంటీర్లు ఆచరణాత్మకంగా చేసి చూపిస్తున్నారు.

నేడు మన గ్రామాలలో ముందుకు నడిపిద్దాం, అంటే వ్యతిరేకించే వారు కూడా ఉన్నారు. వీరు గ్రామాలలో ఏ పని చేద్దామన్నా వ్యతిరేకిస్తారు. ఎందుకంటే వారి పెద్దరికం పోతుందని. గ్రామం అభివృద్ధి అయితే తమ మాట ఎవరువింటారని అనుకొని వ్యతిరేకించే వారుంటారు. "రాజకీయ బ్రోకర్లుగా" ప్రతి పనికి అడ్డుపడుతూ, నాకు తెలియకుండా ఈ ఊరిలో ఏమీ జరుగకూడదనే వారు ప్రతి గ్రామంలో ఉంటారు. వీరిని కొన్ని చోట్ల "మధ్య వర్తులు" అని కూడా అంటారు. వీరు రాజకీయ నాయకుల వద్దకు వెళ్ళి, మా ఊరులో లేదా వార్డులో ఇన్ని ఓట్లున్నాయి. మాకు ఎంత ఇస్తావు అని బేరసారాలు జరుపుతుంటారు. వీరిని కాదని ఆ ఊరి వారు ఓటు వేస్తే, ఎన్నికల అనంతరం తగాదాలు, కొట్లాటలు, హత్యలకు దారితీస్తాయి. అట్లా ఎన్నికల్లో హింస, ఎన్నికలనంతర హింసలకు కూడా వీరి అమాయకత్వమే కారణమవుతుంది. ముఖ్యంగా వీరికి చదువు ఉండదు. ఉన్న మిడిమిడి జ్ఞానంతో, అర్థంకాని అంశాలను తమకు అనుకూలంగా మార్చి చెబుతుంటారు. వీరు వారిమాట వినని వారికి 'రేషన్' రానివ్వకుండా చెయ్యడం కూడా చేస్తారు. వీరిని మార్చి, మన గ్రామాన్ని బాగు చేసుకొందాం, అని చెప్పి వారికి భారత్ నిర్మాణ్ వాలంటీర్లుగా శిక్షణనిచ్చింది అపార్డ్.

ఆంధ్రప్రదేశ్ అకాడమీ ఆఫ్ గ్రామీణాభివృద్ధి సంస్థ రాష్ట్రంలో మొత్తం 40,028 మందికి బివిఎన్‌విలుగా శిక్షణ నిచ్చింది. వారు వివిధ గ్రామాలలో స్వచ్ఛందంగా పనిచేస్తూ, గ్రామీణుల జీవితాలను మార్చి వేస్తున్నారు. ఇందుకు, అపార్డ్‌కు అందుతున్న స్పందనలను నిదర్శనంగా చెప్పవచ్చును.

ఈ బివిఎన్‌విలు ఏ జీతం లేకుండా ఎందుకు చేయాలి అని కొందరు



అంటారు. ఊరికే ఖాళీగా ఉండకుండా, ఏదో వ్యాపకాన్ని సృష్టించుకొని, ప్రభుత్వం అమలు చేసే కార్యక్రమాలు మన ఊరివారికి అందించుదాం అనే తలంపే వారిని బి.ఎన్.వి.లుగా ముందుకు నడుపుతుంది. ఏదో చేయాలనే ఆలోచన వున్న యువతీ యువకులు ఎందరో ఉన్నారు. వారిని తట్టి లేపినదే ఈ బివిఎన్‌విల కార్యక్రమం. బివిఎన్‌విల తల్లిదండ్రులతో మాట్లాడినపుడు, "మా అబ్బాయి ఊరికే తిరిగేవాడు మంచి సేవకు నేడు ఉపయోగపడుతున్నాడు." అని సంతోషించే తల్లి దండ్రులు ఎంతో మంది ఉన్నారు.

అదేవిధంగా ఆ గ్రామ నాయకులకు, బివిఎన్‌విలకు మధ్య మంచి సంబంధాలు నెలకొనడంతో పాటు ఆ గ్రామ అధికారులతో కూడా బివిఎన్‌విలు, దైనందిన సంబంధాలు ఏర్పరుచుకొని, రేషన్, వృద్ధాప్య పెన్షన్లు సకాలంలో అందేలా చూడడం, స్వయం సహాయక బృందాలను ఏర్పాటు చేయడం, తదితర అంశాలలో సహాయపడుతున్నారు. వీరికి అపార్డు ఇచ్చిన శిక్షణతో గ్రామ సమస్యలను తీర్చుకొనడానికి తమను తాము ఏవిధంగా మలచుకోవాలో మెళకువలు నేర్చుకొనడం జరిగింది. అందుకు నిదర్శనం, అటు ఊరిలోని వారు, ఇటు స్వచ్ఛంద సేవా సంస్థలు బివిఎన్‌విలు చేసిన సేవలను గుర్తించి గౌరవించడమే. తద్వారా వారు ముందు ముందు చేసే సేవకు మరింత ప్రోత్సాహాన్ని కల్పించడం జరుగుతోంది.

గతంలో ప్రభుత్వాలు అదిచేశాం, ఇది చేశాం అని చెప్పుకొనే వారు. ఇప్పుడు ఈ బివిఎన్‌విలు చేసిన కార్యక్రమాలు, సేవలు అభివృద్ధి చిహ్నాలుగా నిలుస్తున్నాయి. ప్రతి రాజకీయ నాయకుడు, అధికారులు కూడా బివిఎన్‌విల సేవలను గూర్చి ఏకరువు పెడుతూ, తమ ప్రచారాన్ని కొనసాగించుకోవటం జరుగుతుందనేది సత్యదూరం కాదు. అందుకు వీరి నుండి అందుతున్న స్పందనల సమాహారమే నిదర్శనంగా నిలుస్తోంది.

**- డా॥ ఆసయ్య, ఐ.ఐ.ఎస్.**
**సెంటర్ హెడ్, మీడియా & పబ్లికేషన్స్, అపార్డ్**



చిన్నారులకు, గర్భిణీస్త్రీలకు ఉచితంగా ఓ.ఆర్.ఎస్. పాకెట్స్‌ను పంపిణీ చేస్తున్న ప్రకాశం జిల్లా జరుగుమల్లి గ్రామ భారత్ నిర్మాణ్ వాలంటీర్లు.




పొగత్రాగడం ద్వారా వచ్చే అనర్థాల గూర్చి స్టిక్కర్ల ద్వార ప్రచారం చేసేందుకు సిద్ధమయిన నల్గొండ జిల్లా మోత్కూరు గ్రామ భారత్ నిర్మాణ్ వాలంటీర్లు.

నిరుపేద కుటుంబానికి 14 రకాల నిత్యావసర వస్తువులను అందజేస్తున్న తూర్పు గోదావరి జిల్లా రావులపాడు గ్రామ భారత్ నిర్మాణ్ వాలంటీర్లు.



# భారత్ నిర్మాణ్ వాలంటీర్ల



తూర్పుగోదావరి జిల్లా అంబాజీ పేట మండలం కముజువారి లంక గ్రామంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేసే వేతన కూలీలను బీమా పథకంలో చేర్చబడుతున్న భారత్ నిర్మాణ్ వాలంటీర్లు



కర్నాటక రాష్ట్రం బళ్ళారి జిల్లాలో సాఫ్ట్‌వేర్ కంపెనీలో పని చేసే శ్రీమతి సరిత కర్నూలు జిల్లా కన్నపుకుంట భారత్ నిర్మాణ్ వాలంటీర్లు చేస్తున్న సేవలను గుర్తించి తనవంతు సాయంగా పేద, అనాథ, వృద్ధులకు, గర్భిణీ స్త్రీలకు బట్టలు, దోమ తెరలు, మరియు పౌష్టికాహారం అందజేస్తున్న దృశ్యం.



అపార్డులో ప్రయోగాత్మకంగా పండిస్తున్న కీన్-వా పంట గురించి ది. 18.6.2013 తేదీన ఈ టి.వి. వారికి వివరిస్తున్న సి.డి.ఎస్. డైరెక్టర్ జనరల్ శ్రీ కె. చంద్రమౌళి ఐ.ఎ.ఎస్. (రిటైర్డ్).



పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న అనంతపురం జిల్లా
పామిడి మండలం నీలురు గ్రామ భారత్ నిర్మాణ్ వాలంటీర్లు.



ది. 13.06.2013 తేదీన మన టివి ద్వారా భారత్ నిర్మాణ్ వాలంటీర్లకు
శిక్షణా కార్యక్రమం అందజేస్తున్న సి.డి.ఎస్. డైరెక్టర్ జనరల్
శ్రీ కె. చంద్రమౌళి ఐ.ఎ.ఎస్. (రిటైర్డ్), అపార్డ్, కన్సల్టెంట్ శ్రీ జి. జయపాల
రెడ్డి, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ కుమారి బి. లావణ్య.



పిల్లల మనుగడ, ఎదుగుదల కార్యక్రమంపై
కర్నూలు జిల్లా సి. బెలగల్ మండలం
ముడుమల్ల గ్రామ మహిళలకు అపార్డు
కన్సల్టెంట్ శ్రీ జి. జయపాల రెడ్డి
అవగాహన కల్గిస్తున్న దృశ్యం.

# అపూర్వ విజయాలు



కరీనంగర్ జిల్లా చొప్పదండి మండలం దేశాయిపేట గ్రామానికి
చెందిన భారత్ నిర్మాణ్ వాలంటీర్ శ్రీ మోర వెంకట రమణ
రక్తదానం చేస్తున్న దృశ్యం.





విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలం సారిపల్లి గ్రామంలో పిల్లల మనుగడ,
ఎదుగుదల పై అవగాహన కల్గిస్తున్న అపార్డు డి.టి.ఎమ్.
మరియు భారత్ నిర్మాణ్ వాలంటీర్లు.



ది. 20.06.2013 తేదీన తూర్పుగోదావరి జిల్లా
ముమ్మిడివరం మండలం కొత్త లంక గ్రామ ప్రజలకు
గ్రామ సభ నిర్వహణపై అవగాహన కల్గిస్తున్న
అపార్డు సిబ్బంది మరియు
ఆ గ్రామ భారత్ నిర్మాణ్ వాలంటీర్లు.

# ఉపాధి హామీతో ఎదిగే క్రమంలో భార్యాభర్తలు

**ఆ రోజు రవిచంద్ర ఆత్రంగా పనినించి ఇంటికి పోవాలనుకొన్నాడు. ఎంతకీ మగ్గంలో నేస్తున్న చీర అయిపోలేదు. తను ఇంటి నుంచి పనిలోకి వచ్చేటప్పటికి తన భార్య కొంచెం నీరసంగా ఉంది. అసలే నెలలు నిండిన మనిషి కదా, ఇంట్లోనే ఉండినా బాగుండేది. ఎవరినైనా ఇంటికి పంపి కనుక్కుందామనుకున్నంతలో పక్కింటి పిల్లోడు వచ్చి చెప్పాడు. తన భార్య ఇంట్లో కానుపు అయిందనీ, పాప పుట్టిందనీ. పెద్ద పాప ఐశ్వర్యకి 12 సంవత్సరాలు.**

ఇప్పుడు మళ్లీ ఇన్నాళ్లకి తన ఇంట్లో పసిపిల్ల పుట్టిందన్న ఉత్సాహంతో ఇంటికి వచ్చాడు. సంతోషంగా భార్య మంచం మీద నించి చూసింది. ఆలూమగలు ఇద్దరూ ఒక పట్టుచీరను వారంపాటూ నేస్తే రూ. 300 లు వస్తాయి. ఇప్పుడు తను ఒక్కడే రెండువారాలపాటు చీరను నేసి కేవలం రూ. 300 లు సంపాదించగలడు. ఈ డబ్బు ఏమూలకో! మరో పని ఏదీ తనకూ, తన భార్యకీ చేతకాదు.

సరిగా పాపకి ఒక సంవత్సరం వచ్చేటప్పటికే 2006 సంవత్సరంలో ఉపాధి హామీ పనులు అందుబాటులోకి వచ్చాయి. ఆలూమగలు ఇద్దరూ ఉపాధి హామీ పథకం కూలీలు అయ్యారు. వాళ్లిద్దరికి బిల్లు వచ్చినప్పుడల్లా రూ. 5000, రూ. 6000 లు మిగుల్చుకొని ఒక మేకను కొనేవారు. అట్లా 10 మేకలు కొన్నారు.

అవి ఈనడం మొదలు పెట్టడంతో 40 మేకలు అయ్యాయి. వాటిని అమ్మడం వల్ల ఒక సంవత్సరానికి రూ. 20,000 లు ఆదాయం వచ్చేది. పెద్ద పాపకు రూ. 30,000 లు పెట్టి పెళ్ళి చేశారు. ఆ డబ్బు ఉపాధి హామీ పనుల వల్ల మిగిలించుకొన్నదే.



## జాబ్‌కార్డు నెం. 10180

| | | |
|---|---|---|
| భర్త పేరు | : | మందల రవిచంద్ర (38 సంవత్సరాలు) |
| భార్య పేరు | : | నాగేంద్రమ్మ (32 సంవత్సరాలు) |
| కులం | : | కమ్మ (ఓసీ) |
| గ్రామం | : | మైలసముద్రం |
| గ్రామ పంచాయితీ | : | మైలసముద్రం |
| మండలం | : | కొత్తచెరువు |
| జిల్లా | : | అనంతపురం |

ఇప్పుడు మేకలు అమ్మేసి వాటి స్థానంలో పొట్టేళ్ల పెంపకం బాగుంటుందని కొన్నారు. ఏదేమైన ఒక సెంటు భూమి లేకున్నా 'అంచెలంచెలుగా ఎదగడానికి ఉపాధి హామీకిమించింది లేదు!' అంటారు ఆలూమగలిద్దరూ!

*- చిలుకూరి దేవపుత్ర*

## నక్సల్స్ ప్రభావిత జిల్లాల్లో 'రోష్ని'

దేశంలోని నక్సల్స్ ప్రభావిత జిల్లాల్లోని యువత కోసం 'రోష్ని' పేరిట కొత్తగా నైపుణ్య అభివృద్ధి పథకాన్ని కేంద్రం ప్రవేశపెట్టింది. దీనిని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి శ్రీ జైరాం రమేశ్ ప్రారంభించారు. దేశంలోని అత్యంత సమస్యాత్మకమైన నక్సల్స్ ప్రభావిత 24 జిల్లాల్లో ఈ పథకాన్ని అమలు చేస్తారు. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి విశాఖపట్నం జిల్లా ఇందుకు ఎంపికైంది. యువతలో నైపుణ్యాన్ని పెంచడం ద్వారా ఉపాధి అవకాశాలను కల్పించడమే 'రోష్ని' పథకం లక్ష్యమని మంత్రి చెప్పారు.

రానున్న మూడేళ్లలో దేశంలోని 24 నక్సల్స్ ప్రభావిత జిల్లాల్లో 18 నుంచి 35 ఏళ్లలోపు 50 వేల మంది యువతీ యువకుల జీవితాల్లో రోష్ని పథకం వ్యాపార, ఉద్యోగాల ద్వారా వెలుగు నింపనుందని తెలిపారు. కేంద్రం 75 శాతం, రాష్ట్రాల నుంచి 25 శాతం భాగస్వామ్యంతో ఈ పథకాన్ని అమలు చేయనున్నట్లు చెప్పారు.

వ్యవస్థీకృత రంగంలో ఉపాధి కల్పించేందుకు వీలుగా నక్సల్స్ ప్రభావిత జిల్లాలకు చెందిన యువతీ యువకులను ఈ పథకం కింద గుర్తించి వారికి తగిన శిక్షణ అందిస్తారు.

*- సి.ఎం.పి.*



# జీవనియంత్రణ ప్రక్రియతో పంటలలో బూజు తెగుళ్ళ నివారణ

**పెరుగుతున్న జనాభా వలన మన పంటల దిగుబడులు పెంచవలసిన అవసరం ఎంతైనా వున్నది. దీని కారణంగా రైతులు ఎక్కువ మోతాదులో రసాయన ఎరువులు ఉపయోగించి పంటల దిగుబడిని పెంచుతున్నారు. మరీ ఎక్కువగా వాణిజ్య పంటలు పండించడం వలన ఎక్కువ మోతాదులో రసాయన ఎరువులు వాడవలసి రావటంతో భూమి సారం తగ్గి నిస్సార భూములుగా తయారవుతున్నాయి.**

అంతే కాకుండా ఖరీఫ్‌లో పెంచిన పంటల అవశేషాలు భూమిలో ఉంటాయి. తద్వారా కీటకాలు, తెగుళ్ళు, మొక్కకు నష్టం కలుగచేసే సూక్ష్మజీవులు, నులి పురుగులు భూమిలో కోశస్థ దశలో వుండి మనం పంటలను వేసినప్పుడు మొలక దశలలో మొక్కలను నాశనం చేసే అవకాశం వున్నది. అంతే గాకుండా భూమిలో మేలు చేసే సూక్ష్మజీవుల సంఖ్య తగ్గిపోయి, సేంద్రీయ కర్బన శాతం తగ్గి భూములు నిస్సారంగా మారతాయి. కావున మన పంటల ఉత్పత్తుల నాణ్యత తగ్గి, మానవులు మంచి ఆహారం తీసుకొన్నప్పటికీ, ఎక్కువ పోషకాహార లోపాలను చూస్తున్నాము.

కాబట్టి రైతులు విత్తనం విత్తేటప్పుడు జీవనియంత్రణ పద్ధతులను దృష్టిలో పెట్టుకుని విత్తన శుద్ధి చేసి విత్తనం ద్వారా ఉపయోగపడే సూక్ష్మజీవులను భూమిలో వాడినట్లయితే వేరుకుళ్ళు నివారణ చాలా సులభ పద్ధతిలో నివారించుకోవచ్చును.

ఈ రోజులలో సేంద్రియ వ్యవసాయానికి చాలా ఆదరణ కన్పిస్తోంది. అంతే గాకుండా, పంటకు అనేక రకాలుగా ఉపయోగపడే బ్యాక్టీరియా, శిలీంధ్రాలను జీవనియంత్రకాలుగా వాడుకున్నట్లయితే, చాలా రకాలుగా ఈ సూక్ష్మజీవులు వివిధ రకాలైన పద్ధతుల ద్వారా తెగుళ్ళు కలుగ చేసే శిలీంధ్రాల పెరుగుదలను తగ్గిస్తాయి.

**ఉదా :-** బాసిల్లస్ సబ్‌టిలిస్, సూడోమోనాస్ ఫ్లోరెసెన్స్, ట్రైకోదెర్మా విరిడి మరియు ట్రైకోడెర్మా ఆర్జియానమ్ మొదలగునవి.

### ట్రైకోడెర్మా విరిడి

ట్రైకోడెర్మా విరిడి శిలీంధ్ర నాశిని. ఈ శిలీంధ్రనాశిని వివిధ రకాలైన బూజు తెగుళ్ళను నివారిస్తుంది. కాండం, తెగుళ్ళు, విత్తన కుళ్ళు, వడ తెగులు, కుళ్ళు తెలుగు, వేరు కుళ్ళు తెగులు, ఎర్ర కుళ్ళు తెగుళ్ళను నివారిస్తుంది. ట్రైకోడెర్మా శిలీంధ్రనాశినిని వేరుశెనగ, టమోటా, పొగాకు, కూరగాయలు, శెనగ, లెంటిల్, కంది, ప్రత్తి, టమోటా, ఫ్రెంచిబీన్స్, చెరకు పంటలలో బూజు తెగుళ్లను నివారిస్తుంది.

### సూడోమోనాస్ ఫ్లోరిసెన్స్

ఈ శిలీంధ్రనాశిని వరిలో ఆకు ఎండు తెగులు, పాము పొడ తెగులు, పొట్ట కుళ్ళు తెగుళ్లను నివారిస్తుంది. మిరియాలలో ఫుట్‌రాట్, పొడ తెగుళ్లను నివారిస్తుంది. తమలపాకు తోటల్లో ఆకు మచ్చలను, తొడిమలపై మచ్చలను తగ్గిస్తుంది.

కూరగాయలలో ఎండు తెగుళ్ళను, మచ్చ తెగుళ్ళను, పసుపులో



దుంపకుళ్ళును తగ్గిస్తుంది. పిథియమ్, ఫ్యూజేరియమ్, ఫైటోప్థెరా ద్వారా వ్యాపించే తెగుళ్ళను తగ్గిస్తుంది. వరిలో వేరు ముది, నెమటోడ్లను తగ్గిస్తుంది. సూడోమోనాస్‌ను వరి, ప్రత్తి, కూరగాయలు, వేరుశెనగ, అరటి, పొగాకు, మల్బరి మరియు పండ్లతోటలలో వాడవచ్చును. జీవనియంత్రకాలు వివిధ రకాలైన విధానాల ద్వారా తెగుళ్ళు కలుగచేసే శిలీంధ్రాల పెరుగుదలను నిరోధిస్తాయి.

- సిడిరోఫోర్స్ అనేవి ఇనుప ధాతువును నిల్వ చేసుకుంటాయి. ఇవి భూమిలో వుండి జీవనియంత్రకాల ద్వారా ఫెర్రిక్ నుండి ఫెర్రస్‌గా మారిపోయి, తెగుళ్ళను కలుగచేసే సూక్ష్మజీవులకు అందకుండా ముందుగానే ఉపయోగించుకొని, ఆహారం అందకుండా ఈ నిల్వలను ముందుగానే వాడుకుంటాయి.
- విరిడిన్, బ్యాసిలాన్, హెక్సాదయి, ఫైయోనిన్ అనే రసాయనాలను విడుదల చేసి తెగుళ్ళు కలుగచేసే శిలీంధ్రాలను పెరగకుండా నిరోధిస్తాయి.
- ఇవి వివిధ రకాలైన హార్మోనులను ఉత్పత్తి చేయడం వలన భూమిలో వేరుకు దగ్గరలో వివిధ రకాలైన ఆమ్లత్వాన్ని పెంచి శిలీంధ్రాలను నాశనం చేస్తుంది. అంతే గాకుండా ఈ ఆమ్ల ఉత్పత్తి వల్ల మొక్కలకు అందకుండా వున్న భాస్వరం కరిగి మొక్కలకు అందుతుంది.
- ఈ బ్యాక్టీరియా రోగ నివారణ శక్తిని పెంచే ఎంజైమ్ ఫినైల్ ఆక్సిడైజ్, ఫినైల్ అలనైన్, ఫెర్రి ఆక్సిడేస్ అనే సెల్యూలోస్, కైటినేజ్ అనే ఎంజైమ్‌లను విడుదల చేసి వేరుకు ఎటువంటి హానికరమైన శిలీంధ్రాలు వ్యాపించకుండా నిరోధిస్తాయి. జీవనియంత్రక బ్యాక్టీరియా మరియు శిలీంధ్రాలు అన్ని విధాలైన పంటలలో విత్తనంతో పాటు లేదా దుక్కిలో వాడుకొనవచ్చును.

- **జీవనియంత్రకాలను వాడే విధానం :-** (1) విత్తన శుద్ధి (2) ట్రైకోడెర్మా విరిడి :- 1 కిలో విత్తనానికి 8-10 గ్రా. పొడి మందు సరిపోతుంది. (లేదా) పొడి మందును 10 మి.లీ. నీటిలో కలిపి విత్తన శుద్ధి చేయవచ్చును. అరటి, పసుపు దుంపలను, చెఱకు ముచ్చెలను శిలీంధ్ర ద్రావణంలో ముంచి నాటాలి. 500 గ్రాముల ట్రైకోడెర్మా విరిడి పొడి 100 లీటర్ల నీటిలో కలిపి ఉపయోగించాలి.
- **సూడోమోనాస్ ఫ్లోరెసెన్స్ :-** 8 గ్రాముల నుండి 10 గ్రాముల పొడి మందును 10 మి.లీ. నీటితో కలిపి ఒక కిలో విత్తనానికి పట్టించాలి. (లేదా) సూడోమోనాస్, బెల్లం, తుమ్మ జిగురును బురదగా తయారు చేసి విత్తనాలకు పట్టించి 24-48 గంటలు బ్యాక్టీరియా పెరిగేటట్లు చేసి విత్తుకొన్నట్లయితే విత్తనం నుంచి, నేల నుంచి సంక్రమించే వ్యాధుల నుంచి మొక్కలను కాపాడుకొనవచ్చును.

**వేళ్ళను శుద్ధి చేయడం**

వరి, వంగ, టమోటా, మిరప పైర్లకు ఒక కిలో సూడోమోనాస్ ఫార్ములేషన్ (లేదా) ట్రైకోడెర్మా విరిడి నిల్వ వుండే నీళ్ళలో కలిపి, వాటి వేర్లను గంట సమయం పాటు ఈ నీటిలో వుంచిన తరువాత నాటుకుంటే ఇది తెగుళ్ళను నివారించడమే కాకుండా పెరుగుదలను పెంచుతుంది.

**భూమిలో వేసే పద్ధతి**

ఎకరాకు 2-3 కిలోలను దుక్కిలో వేయవలెను. ట్రైకోడెర్మా 1 కిలో వేపపిండి, 10 కి. గ్రా బాగా చేరిన పశువుల ఎరువు 90 కి. గ్రా మిశ్రమాన్ని కలిపి కావలసినంత తేమ అందించి ఒక వారం రోజులు నీడలో వుంచి తరువాత వేయవలెను. తరువాత ఈ మిశ్రమాన్ని కలియత్రిప్పుకొని కావలసినంత తేమ చేర్చి మరొక వారం రోజులు వుంచి తరువాత మిశ్రమాన్ని కలియదిప్పి దుక్కిలో వేసుకోవాలి.

వేపపిండి, పశువుల ఎరువు లభ్యం కాని ఎడల సూటిగా ఇసుకతో కలిపి వాడవచ్చును. పైరులో అక్కడక్కడ మొక్కలకు వేరుకుళ్ళు, ఎండు తెగులు ఆశిస్తే, 50 గ్రా. పొడి మందును 10 లీ. నీటిలో కలిపి చల్లాలి. ఇది ఒక సెంటు భూమిని తడపటానికి సరిపోతుంది. ఇదే పద్ధతిలో సూడోమోనాస్ ఫ్లోరోసెన్స్‌ను తయారు చేసుకోవాలి.

## లభ్యమయ్యే ప్రదేశాలు

జీవ నియంత్రణ ప్రయోగశాలల్లోను, వ్యవసాయ శాఖ నిర్వహణలో అన్ని జిల్లాల్లోను లభ్యమవుతాయి.

**- డా.యస్. త్రివేణి, డా.ఎ. విజయగోపాల్, పి.జయమ్మ, ఆర్.సుభాష్ రెడ్డి,**
**మైక్రోబయాలజీ అండ్ బయోఎనర్జీ డిపార్ట్‌మెంట్, కాలేజీ ఆఫ్ అగ్రికల్చర్, రాజేంద్రనగర్, హైదరాబాద్.**

# రాష్ట్రంలో 'ఇందిరమ్మ పచ్చతోరణం' అమలు



**రోడ్డుకు ఇరువైపుల ఉన్న బీడు భూములు, చెరువుల వెనుక భాగం, కాలువలు, డ్రెయిన్ గట్లు మొదలైన ప్రభుత్వస్థలాలలో చెట్లు నాటటం ద్వారా సదరు భూ వనరులను బలోపేతం చేయటం, పేదలకు నికరమైన జీవనోపాధి కల్పించటం కోసం భూమి లేని జాబ్ కార్డు కలిగిన షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల కుటుంబాలకు వారికి చెట్టు పట్టా జారీ చేసి ఫలసాయం మాత్రమే వారసత్వంగా పొందేలా చేయటం, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం తోడ్పాటుతో చెట్లు నాటి సంరక్షించటం మొదలైన కార్యక్రమాలు చేపట్టడానికి 'ఇందిరమ్మ పచ్చ తోరణం' పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. ఈ పథకాన్ని నిర్దేశిత మార్గదర్శక సూత్రాల ననుసరించి అమలు చేయాలి.**

ఉద్దేశ్యం: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేసే పనులలో ఉత్పాదకత కల్గిన పనులను కల్పించడానికి, ప్రభుత్వ భూములను కాపాడుకోవటానికి, పేదలకు నికరమైన జీవనోపాధి కల్పించటానికి పచ్చదనం పెంపొందించి భూమిని, నీటిని సంరక్షించుకుని జీవన సమతుల్యాన్ని పెంపొందించటానికి కృషి చేయటం.

**లబ్ధిదారుల అర్హత :** పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా గుర్తింపబడిన దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న నిరుపేద ఎస్సీ/ఎస్టీల జాబితాలోని కుటుంబాలు వారు మాత్రమే అర్హులు.

లబ్ధిదారులుగా ఎంపికకు ఎస్సీ/ఎస్టీ కుటుంబాల వారు 2012-13వ సంవత్సరంలో ఉపాధి హామీ పథకంలో కనీసం 20 రోజుల పని చేసి ఉన్న అట్టి వారే ఈ పథకానికి అర్హులు.

**లబ్ధిదారుల గుర్తింపు :**

ఈ పథకం ద్వారా లబ్ధిదారులను గ్రామ ఐక్య సంఘం గుర్తించగా, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథక మార్గ దర్శకాల ప్రకారం గ్రామ సభ ఆమోదం పొందాలి.

**అనుమతి:**

- గ్రామ ఐక్య సంఘం నుండి ఫారం-1 అందిన 15 రోజుల లోగా నిర్దేశిత అధికారి అనుమతి గాని, లేదా తిరస్కరణ గాని తెలియజేయాలి. 15 రోజుల లోగా అనుమతి రాని యెడల అనుమతి ఇచ్చినట్టే పరిగణించబడుతుంది.
- సదరు లబ్ధిదారునికి 200 మొక్కలు మించకుండా నాటుకోవటానికి, ఫలసాయాన్ని అనుభవించటానికి నిర్దేశిత అధికారి ఫారం-డి ద్వారా అనుమతి మంజూరు చేస్తారు.

### ఇందిరమ్మ పచ్చతోరణం భూముల గుర్తింపు కమిటీ

గ్రామ స్థాయిలో ఇందిరమ్మ పచ్చతోరణం అమలుకు కావలసిన భూముల గుర్తింపునకు ఈ దిగువ సభ్యులతో కమిటీని ఏర్పాటు చేయాలి.

- సంబంధిత గ్రామ సంఘాల భూముల సబ్-సమిటీ ప్రతి వి.ఓ. నుండి ఇద్దరు, సభ్యులు.
- సంబంధిత గ్రామ పరిపాలనాధికారి. (వి.ఆర్.ఓ.)
- జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథక క్షేత్ర సహాయకుడు.
- మండల పారా లీగల్ మరియూ ఐకెపి కమ్యూనిటీ సర్వేయరు.
- జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథక సాంకేతిక సహాయకుడు.
- సంబంధిత బీడు భూముల మండలస్థాయి అధికారులను కూడా సమావేశానికి ఆహ్వానించాలి.

### బీడు భూముల గుర్తింపు కమిటీ విధులు

- భూముల కమిటీ గ్రామ పంచాయితీలోని రహదారుల వెంబడి గల కాలువ గట్లు, చెరువుల శిఖం, ప్రభుత్వ విద్యాలయాలు, రెవెన్యూ పోరంబోకు మొదలైన ప్రభుత్వ బీడు భూములను గుర్తించి అందులో మొక్కలు నాటడానికి అనువైన భూములను కమ్యూనిటీ సర్వే ద్వారా కొలిపించి ప్లాట్లు ఏర్పాటు చేయాలి.
- భూముల కమిటీ సర్వే ద్వారా లభించే భూమికి ప్లాట్ల క్రింద (200 మొక్కలు చొప్పున నాటడానికి కావలసిన స్థలం) విభజించి ఎంత మంది లబ్ధిదారులకు మొక్కలు నాటుకునే అవకాశం కల్పించవచ్చో నిర్ణయించాలి.
- గ్రామంలో లభించే ప్లాట్లకు సమానంగా లబ్ధిదారులను భూమి లేని ఎస్సీ/ఎస్టీ కుటుంబాల భూముల ఇన్వెంటరీ జాబితా గ్రామ సంఘం (వి.ఓ.) నుండి ఎంపిక చేయాలి. గ్రామ సంఘ లీగల్ కో-ఆర్డినేటర్ ద్వారా ఎస్సీ/ఎస్టీ కుటుంబాల ప్రింట్ అవుట్స్ పొందవచ్చును.

  ఎస్సీ/ఎస్టీల జాబితాను ప్రాధాన్యతా క్రమం ప్రకారం తయారు చేయాలి. సరి చేసిన జాబితాను భూమి.వెబ్‌సైట్ నందు పారాలీగల్ ద్వారా కానీ లేదా కమ్యూనిటీ సర్వేయర్ ద్వారా అప్‌డేట్ చేయాలి.
- గుర్తించిన భూములు, లబ్ధిదారులను గ్రామ సభ ఆమోదం పొందిన తరువాత నిర్దేశిత అధికారులకు సంబంధిత మండల తహాశీల్దారు వారి దగ్గర నమోదు చేసి ఫారం-1 ద్వారా ఆమోదం పొందాలి. మండల స్థాయిలో తహాశీల్దారు ఫారం-1లో దరఖాస్తులు తీసుకొని నిరేశిత అధికారుల నుండి చెట్టు పట్టా జారీ చేయడానికి నోడల్ అధికారులుగా వ్యవహరిస్తారు.



### నాటవలసిన మొక్కల జాతులు

- మామిడి, జామ, సపోటా, నేరేడు, కొబ్బరి, సీతాఫలం, చింత, పల్ప్‌వుడ్ మొక్కలు.
- రోడ్డుకు ఇరువైపుల ఒక వరుసలో చొప్పున నాటవలెను. కావలసిన భూమి అందుబాటులో ఉన్న యెడల ఒకటి కన్నా మించిన వరుసల్లో మొక్కలు నాటవచ్చు.
- 2 సంవత్సరాల వయస్సు కలిగిన మొక్కలను మాత్రమే నాటాలి.

**ఎ. భూమి లభ్యత ఆధారంగా ఈ క్రింది నిర్దేశాలు పాటించాలి :**

| రోడ్డుకు ఇరువైపుల | | బ్లాక్ ప్లాంటేషన్ | సుమారుగా 200 మొక్కలు నాటడానికి కావలసిన భూమి |
|---|---|---|---|
| రోడ్డుకు ఒక వైపు మొక్కలు | 1 | మామిడి 7.5 × 7.5 | 2.8. ఎకరాలు |
| నాటినట్లయితే కనీసం | 2 | జామ 6 × 6 | 1.8. ఎకరాలు |
| 1. కిలోమీటరు/ రెండు వైపుల | 3 | సపోటా 8 × 8 | 3.2. ఎకరాలు |
| నాటినట్లయితే, రోడ్డు పొడవు | 4 | అల్లనేరేడు 10 × 10 | 5.0 ఎకరాలు |
| 0.5 కిలో మీటరు ఉండాలి. | 5 | కొబ్బరి 8 × 8 | 3.2 ఎకరాలు |
| మొక్కకు, మొక్కకు మధ్య | 6 | సీతాఫలం 4 × 4 | 0.8 ఎకరాలు |
| 5. మీటర్ల దూరం ఉండాలి. | 7 | చింత 10 × 10 | 5.0 ఎకరాలు |
| | 8 | జీడి మామిడి 7.5 × 7.5 | 2.8 ఎకరాలు |

బి. 0.9. ఘ.మీ॥ గుంతులలో మొక్కలను నాటాలి. నాటినందుకు గాను లబ్ధిదారునికి / శ్రమ శక్తి సంఘానికి చెల్లింపు జరుగుతుంది.

సి. మొక్కకు మొక్కకు మధ్య 3×1×1 మీటరు కందకాలు త్రవ్వి మట్టిని వాలుకి క్రింది వైపు వేయటంవలప వర్షపునీరు నిల్వ ఉండి మొక్కకు తేమ లభిస్తుంది.

డి. దీనికి సంబంధించిన చెల్లింపులు లబ్ధిదారులు / శ్రమ శక్తి సంఘానికి చేస్తారు.

ఈ. రెండు సంవత్సరాల వయస్సు ఉన్న మొక్కలను లబ్ధిదారులు ఎంపిక చేసుకున్న నర్సరీ నుండి / డిపార్ట్‌మెంటు నర్సరీ నుండి కొని నాటుకోవాలి. లబ్ధదారులకి / సరఫరా చేసిన వారికి చెల్లింపులు జరుగుతుంది.

ఎఫ్. ప్రతి మొక్కకు సంవత్సరానికి రక్షణ నిమిత్తం వాన పాముల ఎరువు/ పశువుల ఎరువు / క్రిమి సంహారక మందుల కొనుగోలు నిమిత్తం రూ. 50.00 రెండు విడతలలో అందజేస్తారు.

ప్రతి మొక్కకు రూ. 125/- చొ॥న కంచె నిమిత్తం లబ్ధి దారులకి చెల్లింపు చేస్తారు.

జి. బ్రతికిన ప్రతి మొక్కకు 40 సార్లు నీరు పోయటానికి గ్రామీణాభివృద్ధి శాఖ నిర్ణయించిన రేట్ల ప్రకారం చెల్లింపులు చేస్తారు.

హెచ్. లబ్ధిదారులకి మొక్కకు రక్షణ నిమిత్తం రోజుకు మొక్కకు 0.50 పైసలు చొప్పున చెల్లిస్తారు. తీయటం, కలుపు తీయటం, నేలను గుల్ల పరచటం, అవసరం లేని కొమ్మలను కత్తిరించటం చేయాలి.

ఐ. ప్రతి సంవత్సరం ఎఫ్ ఎస్ ఆర్. ఆర్ ఎస్ ఎస్ ఆర్. సిఎస్ఆర్ ల రేట్లలో మార్పుల కనుగుణంగా చెల్లింపులు జరుగుతాయి.

జె. స్థలం ఎంపిక జరిగిన తరవాత, లబ్ధిదారులని ఫీల్డ్ అసిస్టెంట్‌కు పరిచయం చేసి టెక్నికల్ అసిస్టెంట్ ద్వారా యంసిసిలో అంచనాని (ఎస్టిమేట్) వేసి పని ప్రారంభించాలి. యం.సి.సి.లో వేసిన ఎస్టిమేట్ నిర్వహణ చెల్లింపుల నిమిత్తం ఏసిసిలో కూడా జనరేట్ కావాలి.

కె. సాంకేతిక సహాయకులు కొలతలను నమోదు చేయాలి. తదుపరి ఇంజనీరింగ్ కన్సల్‌టెంట్/ప్లాంటేషన్ మేనేజరు కొలతలను తనిఖీ చేసి వేతనం చెల్లింపులను యంసిసికి, చెల్లింపుల గురించి ఎసిసిలకు సిఫారసు చేయాలి. పారదర్శక చెల్లింపులు జరపడానికి వి.ఓ. పాత్రపై తదుపరి ఆదేశాలు ఇస్తారు.

**పనిలో వివరాలు**

- గుంతలు తీయటం, మొక్కలు నాటటం, మొక్కల ఖరీదు, కంచె, ఎరువులు.
- మొక్కల మధ్య ట్రెంచ్ తీయటం.
- నీరుపట్టటం, కలుపు తీయటం, నేలను తయారుచేయటానికి పరికరాలు.
- బ్రతికిన మొక్కలను ఆధారంగా చేసుకొని 5 సంవత్సరాల వరకు నైపుణ్యం లేని, సెమి స్కిల్డ్ వేతనాలను లబ్ధిదారునికి చెల్లించటం.
- రెండు మొక్కల మధ్య దూరం 5 మీటర్లు ఉండే విధంగా 200 మొక్కలు నాటు కోవటానికి వీలుగా లబ్ధిదారులకు భూమిని కేటాయించాలి.
- లబ్ధిదారులు తమకు కేటాయించిన భూమిలో మాత్రమే మొక్కలను నాటుకోవాలి. ఇతరుల భూమిని ఆక్రమించకూడదు.
- లబ్ధిదారులు తమకు కేటాయించిన భూమికి హాని కలిగే కార్యక్రమం ఏమీ చేయరాదు.
- తనకు కేటాయించిన భూమిని చట్ట విరుద్ధమైన ఎలాంటి పనికి లబ్ధిదారులు వినియోగించ రాదు.
- తనకు కేటాయించిన సామాజిక ఆస్తిని కాపాడటానికి లబ్ధిదారులు ప్రభుత్వ శాఖతో కలిసి పని చేయాలి.
- నీరు సక్రమంగా పోయించడానికి ఏర్పాటు చేయాలి. మొక్కల పెంపకం పర్యవేక్షణకు ఒక్కొక్క సాంకేతిక సహాయకునికి/ప్లాంటేషన్ సూపర్ వైజర్‌కు రోడ్డుకు ఇరువైపుల మొక్కల పెంపకం అయితే 30 కి.మీ., లేదా బ్లాక్ అయితే 200 ఎకరాలు కేటాయించాలి.
- అంచనా రెండు విధాలుగా ఉండాలి. ఒకటి-యం.సి.సి విభాగం, రెండవది-ఏసిసి విభాగం.
- వేతనాలను యంసిసి ద్వారా, సామాగ్రి ఖర్చు ఏసిసి ద్వారా చెల్లించాలి.
- సాంకేతిక సహాయకుడు యం. బుక్ (M.Book) నందు కొలతలు రికార్డు చేయాలి. ఇంజనీరింగ్ కన్సల్టెంట్ కాని/ ప్లాంటేషన్ మేనేజర్ కాని చెక్ మెజర్ నిర్వహించాలి.

**- టి.ఎం. కె. గాంధీ,**
**జూనియర్ ఫాకల్టీ, సిఐఆర్ఎం, ఎమ్ఆర్ అపార్డ్.**

## అమ్మో అమ్మో నేరానూ... అలాంటి పనికి నేరాను...

చిట్టీ చిట్టీ బుల్లెమ్మా !
చెట్టు చాటుకు పెళ్దామా !
వేకువ జామున పెళ్దామా !
చెంబు పట్టుకు పెళ్దామా !

కాదు కాదు నావల్ల, చీటికి మాటికి గుంజీళ్ళు
పాము పుట్ట కరిచేను, ప్రాణం మీదికి వచ్చేను !
పోకిరి మూకలు గూడేను, అల్లరి పాలు చేసేను !
ఈగలు దోమలు వాలేను, రోగాలు వెంట తెచ్చేను !
అమ్మో అమ్మో నేరానూ ! అలాంటి పనికి నేరాను !

అట్టా అంటే ఎట్టామ్మా !
అన్నిటికన్నీ చెప్తావు !
ఆ పని జరిగేదెట్లమ్మా !
వివరంగా చెప్పమ్మా !

పరువుగా పనిని కానిచ్చేందుకు,
రోగాలను తరిమి కొట్టేటందుకు,
ప్రభుత్వ పథకం వచ్చింది
ఇంటింటా మరుగు దొడ్డి తెస్తుంది
అదే "నిర్మల్ భారత్ అభియాన్"

అమ్మల్లారా, అక్కల్లారా,
అన్నల్లారా, చెల్లెళ్ళారా రండీ, రారండి
మనమంతా మరుగు దొడ్లు నిర్మించుకుందాం
హాయిగా, గౌరవంగా మరుగు దొడ్డి వాడుకుందాం.

**- పిన్నింటి మాధురి**



# ఆధునిక సాంకేతికతతో "ఆన్‌లైన్" పద్ధతి ద్వార సంక్షేమ హాస్టళ్ల నియంత్రణ

**రాష్ట్రంలోనున్న సాంఘిక సంక్షేమ హాస్టళ్ళ నియంత్రణ నిర్వహణ అంతయు పారదర్శకంగా నిర్వహిస్తూ, విద్యార్థుల ఉత్తీర్ణత శాతంను 87% ఫలితాలు సాధించినట్లు సాంఘిక సంక్షేమ శాఖ కమీషనర్ బి. ఉదయ లక్ష్మీ ఐ.ఎ.ఎస్ అన్నారు. ఈ 87%లో రాష్ట్ర సరాసరి శాతం 81.5% కాగా, 6.5% ఫలితాలు అధికంగా సాధించినట్లు ఆమె చెప్పారు.**

ఆమె అపార్డులో సంక్షేమ శాఖాధికారుల రెండవ బ్యాచ్ శిక్షణా కార్యక్రమంలో ముఖ్యోపన్యాసం చేశారు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్‌లో సంక్షేమ హాస్టళ్ళు నిర్వహణ ఆధునిక సాంకేతికత ఆన్‌లైన్ పద్ధతి ద్వారా అనుసంధానం చేసి హాస్టళ్ళను తనిఖీ చేస్తూ లోపాలు సరిదిద్దుతూ సంక్షేమ "హాస్టలు కల్చర్" ను సృష్టించేందుకు ప్రయత్నం చేస్తున్నామని శ్రీమతి ఉదయ లక్ష్మీ వివరించారు. రాష్ట్రంలో 2,233 హాస్టళ్ళు ప్రభుత్వం నడిపిస్తుందనీ, ముఖ్యంగా ఎస్.సి.సబ్. ప్లాన్ ద్వారా నిధులు 1750 కోట్ల రూపాయలతో మొత్తం హాస్టళ్ళను ఆధునీకరించి స్వంత భవనాల నిర్మాణానికి ప్రతి హాస్టల్‌కు 80 లక్షల రూపాయలు కేటాయించినట్లు చెప్పారు.

**- సి.ఎం.పి.**

## 2011 తగ్గిన గ్రామీణ జనాభా

2011 జనాభా గణాంక వివరాలు ఒక్కొక్కటి వెల్లడి చేస్తున్నారు. వాటిలో దేశంలో పట్టణీకరణ పెరిగి గ్రామీణ జనాభా తగ్గింది. 2001 జనాభా లెక్కల ప్రకారం 27.8% ఉన్న పట్టణ జనాభా 2011 కి 31.16% పెరిగింది. అదే రీతిలో గ్రామీణ జనాభా 72.19% నుండి 68.16% పడిపోయింది. అంటే గత దశాబ్దంలో జనాభా సగటున 17.7% 2001 - 2011 అదే 1991 నుండి 2001 కి పెరుగుదల 21.5%గా ఉంది. వృద్ధి శాతం 3.9% తగ్గింది.

అంటే నేటి దేశం మొత్తం జనాభా 121,07,26,932 అంటే 1.21 బిలియన్లుగా ఉంది. గ్రామీణ జనాభా 68.8% కాగా, పట్టణ జనాభా 31.2%గా ఉంది.

ఇదే సమయంలో గ్రామీణ జనాభావృద్ధి రేటు 5.9% తగ్గింది. కాని పట్టణ జనాభా వృద్ధి మాత్రం 0.3% పెరిగింది. దీన్ని బట్టి పల్లెలలో జనం తగ్గుతుంటే పట్టణాల్లో వారి ఒత్తిడి పెరుగుతుంది. ఆంధ్రప్రదేశ్‌లో పట్టణ జనాభా పెరుగుతుంటే గ్రామీణ జనాభా తగ్గుతుంది. రాష్ట్ర జనాభా మొత్తం 8,46,65,533, పురుషులు 4,25,09,881, స్త్రీలు 4,21,55,652, గ్రామీణ జనాభా 5,63,11,788, పురుషులు 2,82,19,760, మహిళలు 2,80,92,028 పట్టణ జనాభా 2,83,53,745, 1,42,90,121 పురుషులు, మహిళలు 1,40,63,624గా ఉన్నారు.

1000 పురుషులకు 968 మంది మహిళలున్నారు. రాష్ట్రంలో అక్షరాస్యత శాతం 67.66% గ్రామాల్లో 61.44% పట్టణాల్లో 8.54%.


**- సి.ఎం.పి.**



# బిఎన్‌విలతో పిల్లల మనుగడ, ఎదుగుదల

## ఎంపిక చేసిన 24 గ్రామ పంచాయితీలలో బిఎన్‌విలు నిర్వహించిన ప్రాథమిక సర్వేలో వెల్లడైన అంశాల సమగ్ర సమాచార నివేదిక

**జూన్ 10, 2013 తేదీన అపార్డ్‌లో 22 జిల్లాల శిక్షణ మేనేజర్లు, విస్తరణ శిక్షణ కేంద్రాల ప్రతినిధులు మరియు 24 గ్రామ పంచాయితీల నుండి భారత్ నిర్మాణ్ వాలంటీర్లతో పిల్లల మనుగడ, ఎదుగుదల ప్రాజెక్టులో భాగంగా ఒక వర్క్ షాప్ నిర్వహించడం జరిగింది.**




ఈ వర్క్ షాప్‌లో పిల్లల ఎదుగుదల-మనుగడకు సంబంధించిన క్షేత్ర స్థాయి సమాచారాన్ని ఎలా సేకరించాలి? ఎవరెవరి నుండి సమాచారం పొందాలి? సమాచారం సరిగా ఉందని రూఢి చేసుకోవడం ఎలా? వంటి వాటిపై సమగ్రంగా వివరించడం జరిగింది. ఆ తరువాత క్షేత్ర స్థాయి సమాచారాన్ని సేకరించడం జరిగింది.

21వ శతాబ్దంలో వున్నాం. విద్యాపరంగా, ఆర్థిక పరంగా, సాంకేతికంగా ఎంతో అభివృద్ధిని సాధించాం. కానీ, నేటికి ఇలాంటి విషమ పరిస్థితుల ను నిలువరించలేకపోతున్నాం. మనం ఇన్ని రోజులు సాధించలేనిది భారత్ నిర్మాణ్ వాలంటీర్లు సాధించగలరనే ఓ పెద్ద ఆశ.

***"భవిష్యత్‌ను మార్చడం మన చేతుల్లో లేక పోవచ్చు కానీ, అలవాట్లను మార్చడం మన చేతుల్లో ఉంది ఆ మారిన అలవాట్లే భవిష్యత్‌ను మారుస్తాయి."***

**- డాక్టర్ అబ్దుల్ కలాం**

అందుకే ఈ రోజు నుండి మనం చేయి చేయి కలుపుదాం. మన లక్ష్యాలపై మనకు విశ్వాసం ఉండి, గెలిచి తీరాలన్న ధృఢ సంకల్ప ఉంటే దానంతట అదే విజయం వరిస్తుంది. అందుకే ఈరోజు నుండి మన ధ్యాస క్రింది ముగ్గురిపై మరల్చుదాం.

1. **కిశోర బాలికలు, గర్భిణీ స్త్రీలు**
2. **పాలిచ్చే తల్లులు**
3. **5 సంవత్సరాలలోపు చిన్నారుల తల్లులు మరియు వారి కుటుంబ సభ్యులు.**

ఈ నేపథ్యంలో భారత్ నిర్మాణ్ వాలంటీర్లందరూ పై మూడు తరగతుల వారిని ప్రత్యక్షంగా కలిసి పిల్లల మనుగడ-ఎదుగుదల కొరకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యకర

## 24 గ్రామపంచాయితీలలో పిల్లల మనుగడ-ఎదుగుదల గత సంవత్సరం అనగా డిసెంబర్ 2012 నాటికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి

| క్రమ సంఖ్య | జిల్లా | మండలం | గ్రామ పంచాయితీ | మొత్తం కుటుంబాలు | మొత్తం జనాభా | చదువు మధ్యలో నిలిపిన | బాల్య వివాహాలు | ఇంటిలో ప్రసవాలు | అబార్షన్లు | తల్లుల మరణాలు | తక్కువ బరువుతో పుట్టిన చిన్నారులు | పుట్టిన గంటలోపు తల్లి పాలు అందని శిశువులు | సం. లోపే మరణించిన చిన్నారులు | 5 సం లోపే మరణించిన చిన్నారులు | మరుగు దొడ్లు వాడని కుటుంబాలు | పూర్తి ఆరోగ్యపు అలవాట్లు ఆచరించని కుటుంబాలు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1. | ఆదిలాబాద్ | నిర్మల్ | రత్నాపూర్ కాండ్లీ | 551 | 2346 | 3 | 0 | 1 | 0 | 0 | 0 | 0 | 1 | 0 | 421 | 454 |
| 2. | అదిలాబాద్ | మామడ | సాంఘ్వీ | 455 | 1612 | 0 | 0 | 0 | 0 | 0 | 2 | 0 | 2 | 1 | 405 | 417 |
| 3. | వరంగల్ | హసన్ పర్తి | సీతా నగరం | 232 | 932 | 1 | 1 | 0 | 0 | 0 | 0 | 0 | 1 | 1 | 152 | 172 |
| 4. | ఖమ్మం | బోనకల్ | చిన్నబీరపల్లి | 337 | 1481 | 2 | 2 | 2 | 1 | 0 | 3 | 1 | 0 | 0 | 37 | 217 |
| 5. | కరీంనగర్ | మల్లియల్ | లంబాది పల్లి | 613 | 2428 | 0 | 0 | 0 | 1 | 1 | 2 | 0 | 0 | 0 | 398 | 527 |
| 6. | కృష్ణ | గుడ్ల వల్లేరు | కట్టవాని చెరువు | 248 | 974 | 0 | 0 | 0 | 0 | 0 | 0 | 0 | 0 | 0 | 76 | 120 |
| 7. | కర్నూల్ | సి. బెలగల్ | ముడుమాల | 742 | 3378 | 3 | 0 | 20 | 0 | 0 | 2 | 5 | 7 | 2 | 352 | 487 |
| 8. | చిత్తూరు | రామచంద్రాపురం | పాతకండులవారి పల్లి | 126 | 478 | 2 | 0 | 0 | 0 | 0 | 1 | 0 | 0 | 0 | 122 | 124 |
| 9. | వైయస్ఆర్ కడప | వల్లూరు | కొప్పోలు | 625 | 1965 | 13 | 0 | 0 | 0 | 0 | 2 | 0 | 0 | 0 | 551 | 590 |
| 10. | అనంతపూర్ | కళ్యాణదుర్గం | పాల్వాయి | 933 | 3540 | 8 | 8 | 0 | 0 | 1 | 6 | 2 | 3 | 0 | 913 | 933 |
| 11. | విశాఖపట్నం | పాయకరావుపేట | కిండంగి | 387 | 1478 | 9 | 7 | 0 | 0 | 0 | 1 | 0 | 0 | 2 | 374 | 374 |
| 12. | విశాఖపట్నం | బుచ్చయ్యపేట | కె.పి అగ్రహారం | 245 | 1250 | 7 | 0 | 0 | 0 | 0 | 0 | 1 | 0 | 0 | 170 | 213 |
| 13. | పిఎస్ఆర్ నెల్లూరు | వెంకటాచలం | ఈదగలి | 720 | 2524 | 9 | 0 | 2 | 4 | 0 | 3 | 0 | 0 | 0 | 698 | 698 |
| 14. | తుర్పుగోదావరి | అంబాజీపేట | కముజువారి లంక | 162 | 806 | 4 | 0 | 0 | 0 | 0 | 0 | 0 | 0 | 0 | 42 | 112 |
| 15. | విజయనగరం | మెంటాడ | ఇద్దన వలస | 300 | 1242 | 0 | 0 | 0 | 0 | 0 | 0 | 0 | 0 | 0 | 250 | 272 |
| 16. | పశ్చిమ గోదావరి | భీమడోలు | కురెల గూడెం | 915 | 3110 | 50 | 0 | 0 | 4 | 0 | 6 | 3 | 1 | 0 | 635 | 815 |
| 17. | ప్రకాశం | ఛిన్న గంజాం | కొదవ కుదురు | 1100 | 4500 | 21 | 24 | 0 | 4 | 0 | 1 | 4 | 0 | 0 | 650 | 900 |
| 18. | రంగారెడ్డి | యాచారం | నానక్ నగర్ | 271 | 1171 | 9 | 0 | 2 | 1 | 0 | 1 | 1 | 0 | 1 | 69 | 265 |
| 19. | రంగారెడ్డి | మొయినాబాద్ | మేడేపల్లి | 650 | 2098 | 19 | 0 | 0 | 1 | 0 | 2 | 0 | 0 | 0 | 585 | 602 |
| 20. | నిజామాబాద్ | లింగంపేట్ | భవానిపేట | 570 | 2700 | 0 | 4 | 6 | 1 | 0 | 2 | 6 | 2 | 0 | 530 | 556 |
| 21. | మహబూబ్‌నగర్ | పెద్ద మందాడి | చిన్న మందాడి | 304 | 700 | 10 | 4 | 2 | 3 | 0 | 0 | 0 | 0 | 0 | 294 | 304 |
| 22. | నల్గొండ | సూర్యాపేట | టి.కె.పహాడ్ | 792 | 2783 | 5 | 0 | 0 | 0 | 0 | 0 | 0 | 0 | 0 | 437 | 492 |
| 23. | శ్రీకాకుళం | పాలకొండ | అన్నవరం | 316 | 1098 | 10 | 0 | 1 | 1 | 0 | 0 | 1 | 0 | 0 | 126 | 256 |
| 24. | గుంటూరు | కొల్లిపర | శివలూరు | 513 | 1645 | 0 | 0 | 0 | 0 | 0 | 1 | 0 | 0 | 1 | 61 | 4 1 7 |



అలవాట్లు మొదలగు అంశాలతో పాటు, ఉన్న ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవడం ఎలా?

అన్న అంశాలను తెలియ చేద్దాం. అందుకై ముఖాముఖి మాట్లాడడం, సమావేశాలు, ర్యాలీల నిర్వహణ మొదలగు చర్యల ద్వారా వారిని ఎప్పటికప్పుడు పిల్లల మనుగడ-ఎదుగుదల దిశగా కార్యోన్ముఖులను చేద్దాం.

అపార్డ్ సాధించిన విజయాలలో మరో మైలురాయిగా పిల్లల మనుగడ-ఎదుగుదల చరిత్రలో నిలిచి పోవాలి.


*'వ్యక్తికి బహువచనం శక్తి' అన్నారు శ్రీశ్రీ.*

ఆ శక్తి మనందరిలో రావాలి. పిల్లల మనుగడ-ఎదుగుదల నూటికి నూరు శాతం సాధించాలి".

*- మాధురి పిన్నింటి, ఫ్యాకల్టీ, అపార్డ్*

**భూ**మి నేటికీ గ్రామీణ ప్రాంతాలలో ప్రధాన జీవనాధారం. భూమి ఒక ఆదాయ వనరు మాత్రమే కాదు. భూమి వుంటే ఒక భద్రత, ఒక సామాజిక హోదా. మన దేశంలోని గ్రామాలలో జీవిస్తున్న ప్రజలలో 70 శాతం మంది ప్రత్యక్షంగానో, పరోక్షంగానో భూమిపై అధారపడి జీవిస్తున్నారు. గత 60 సం॥ లుగా భూమి లేని నిరుపేదలకు భూమి పట్టాలివ్వడానికి మన రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో చట్టాలు, పథకాలు రూపొందించింది. దాదాపు 45 లక్షల ఎకరాల ప్రభుత్వ భూమిని పేదవారికి మంజూరు చేసింది. కానీ నేటికీ, రాష్ట్రంలో సగంపైన గ్రామీణ కుటుంబాలకు సాగు భూమి లేదు. ప్రస్తుతం ఉన్న చట్టాల పరిధిలో ప్రతి భూమి లేని పేద కుటుంబానికి ఒక ఎకరం భూమి ఇచ్చే అవకాశం వుందని శ్రీ కోనేరు రంగారావు కమిటి నివేదిక తెలియ చేస్తుంది.

భూమికి పట్టా పొందటానికి చట్టాలలో వివిధ మార్గాలు వున్నాయి. ప్రభుత్వ భూములు అసైన్‌మెంట్ పొందటం, అటవీ హక్కులకు పట్టా మొదలగునవి. ఈ విధంగా పట్టాలు పొందటం కొరకు వున్న చట్టాలు ఏవి? అవి ఏం చెపుతున్నాయి? పట్టా పొందే విధానం ఏమిటి? అనే విషయాలను ఈ వ్యాసంలో పొందు పరచడం జరిగింది.



రైతుల, రైతుకూలీల క్షేమం
ప్రభుత్వ ధ్యేయం


ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము

పట్టాదారు పాసు పుస్తకము

[అనుసూచిక XIV-B]

(యజమాని సాగు చేయు భూముల వివరము, వాటి భూమిశిస్తు ఋణ వివరముల)



### కొనుగోలు చేసిన భూమికి పట్టా

భూమిని కొనుగోలు చేయడం ద్వారా హక్కు పొందిన

# భూమి పట్టా పొందటం ఎలా ?

వారికి ఆంధ్రప్రదేశ్ భూమి హక్కులు మరియు పట్టాదారు పాసుపుస్తకాల చట్టం 1971లోని సెక్షన్ 5 ప్రకారం హక్కుల రికార్డుని సవరించి పట్టాదారు పాసుపుస్తకం మరియు టైటిల్ డీడ్ పొందటానికి అవకాశం కల్పించబడింది. పట్టాభూముల అమ్మకం, కొనుగోళ్ళ ద్వారా రైతుల మధ్య యాజమాన్య హక్కు అనుభవాలు మారుతుంటాయి. అలాంటి మార్పులను రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేసి ప్రస్తుతం అనుభవదారుడికి చట్టంలోని 18, 19, 20, 21 నియమాలలో పేర్కొనబడిన ప్రక్రియ ద్వారా పట్టాదారు పాసుపుస్తకం / టైటిల్ డీడ్ మంజూరు చేయడం ద్వారా హక్కులు కల్పించడం జరుగుతుంది.

**రిజిష్టర్డ్ దస్తావేజు ద్వారా కొనుగోలు చేసిన భూమికి పట్టా పొందే క్రమం:**

- భూమి కొనుగోలు చేసిన వ్యక్తి ఫారమ్-6ఎ లో తహశీల్దారు గారికి (సె. 4(1), రూలు 18 ననుసరించి) దరఖాస్తు చేయాలి. దరఖాస్తుతో పాటు లింకు దస్తావేజుల కాపీ, విక్రయదారుడి పట్టాదారు పాసుపుస్తకం / టైటిల్ డీడ్ నకలు (ఉన్నట్లయితే), అడంగల్ / పహణీ కాపీ, నాలుగు పొటోలు (ఇదివరకు కొనుగోలు దారునికి పట్టాదారు పాసు పుస్తకం / టైటిల్ డీడ్ లేనట్లయితే) జత చేయాలి.
- దరఖాస్తు అందిన తర్వాత తహశీల్దారు గారి కార్యాలయం దరఖాస్తు దారునకు ఫారం 6 సి లో (రూలు 18 ప్రకారం) రశీదు ఇస్తారు.
- నోటీసు తేదీ నుండి తహశీల్దారు విచారణ నిమిత్తం కొనుగోలు దారుడికి, అమ్మకం దారుడికి, అలాగే ఎవరికైనా అభ్యంతరాలుంటే 30 రోజులోపు తెలియచేయమని కోరుతూ రూల్ 19(1) ప్రకారం ఫారం-8 లో గ్రామ పంచాయితీలో బహిరంగ విచారణకై నోటీసును ప్రకటిస్తారు. 45 రోజుల తర్వాత విచారణ చేపడతారు.
- నోటీసు తేది నుండి నిర్ణయించిన తేదిన గ్రామస్తుల / వి ఆర్ ఒ సమక్షంలో విచారణ చేస్తారు. భూ స్వభావం నిర్ధారించటానికి

రెవెన్యూ రికార్డులను పరిశీలిస్తారు.

- భూమి రికార్డులలో పట్టాదారుగా నమోదైన వ్యక్తి, భూమి అమ్మిన వ్యక్తి ఒకరే కానట్లయితే బహిరంగ విచారణలో సరిహద్దు రైతుల నుంచి, గ్రామస్తుల నుంచి భూమి హక్కులు మారిన విధానాన్ని విచారణ చేసి వాంగ్మూలాలను రికార్డు చేస్తారు. విచారణ సమయంలో ఏవైనా అభ్యంతరాలుంటే రెండు పక్షాల వాదనలను రికార్డు చేస్తారు.
- అడంగల్/పహాణీ, ఆర్.ఓ.ఆర్. 1బిలో వున్న పట్టాదారు, కొనుగోలు చేసిన డాక్యుమెంట్ ప్రకారం భూమిని అమ్మిన వ్యక్తి ఒకరేనా అనే విషయం పరిశీలిస్తారు.
- రెండు వర్గాలలో ఎవరైనా సమయం కోరితే, విచారణను మరొక తేదీకి వాయిదా వేసి తెలియ చేస్తారు.
- ఒకవేళ ఆ దరఖాస్తుపై ఎలాంటి అభ్యంతరాలు లేకపోతే భూమి సరిహద్దు రైతుల సమక్షంలో పంచనామా చేస్తారు.తహశీల్దారు పట్టాదారు పాస్‌బుక్ మరియు టైటిల్ డీడ్‌ల జారీకి ఉత్తర్వులిస్తారు.
- దరఖాస్తుదారు వివరాలను ఫారం-1, 1బి రిజిష్టర్‌లో నమోదు చేస్తారు.
- అమ్మకం దారుడికి హక్కు లేకుండా అమ్మినా లేదా ఇతర తగాదాలున్నా తహశీల్దారు దరఖాస్తును తిరస్కరిస్తూ సివిల్ కోర్టును ఆశ్రయించమని మెమో ఇస్తారు.
- కొత్త పిపిబి/టిడీ జారీ చేయాల్సి వస్తే వాటిపై కొనుగోలుదారు సంతకాలు కావాలనీ, నిర్ణీత ప్రభుత్వ రుసుము రూ॥.15 చెల్లించాలనీ తెలియచేస్తారు.
- కొనుగోలుదారు సంతకాలు అయిన తర్వాత పట్టాదారు పాసుపుస్తకం / టైటిల్ డీడ్‌లపై ఎమ్.అర్.వో సంతకాలు చేస్తారు.
- టైటిల్ డీడ్‌పై సంతకం కోసం అర్.డి.వో గారికి పంపుతారు.
- అర్.డి.వో గారి సంతకం తర్వాత పట్టాదారు పాసు పుస్తకం / టైటిల్ డీడ్ అందచేసి ఫారం-17 లో ముట్టినట్లుగా సంతకం చేయించుకుంటారు.

### వంశపారంపర్యంగా సంక్రమించిన భూమికి పట్టా

వారసత్వంగా వచ్చినా లేదా తండ్రి ద్వారా ఆర్జింపబడిన ఆస్తులున్న వ్యక్తులు వాటిని పంచుకోవటానికి కుటుంబ సభ్యుల మధ్య భాగస్వామ్య ఒప్పందం చేసుకున్న, తర్వాత వారి పరస్పర అంగీకారంతో రెవెన్యూ రికార్డులలో నమోదు చేసి మార్పులు చేయడానికి, అలాగే కుటుంబంలోని వ్యక్తులందరికీ పట్టాదారు పాస్ పుస్తకం / టైటిల్ డీడ్ ఇవ్వడానికి ఆంధ్రప్రదేశ్ భూమి హక్కులు మరియు పట్టాదారు పాస్ పుస్తకాల చట్టం, 1971 ద్వారా అవకాశం కల్పించబడింది.

**వంశపారంపర్యంగా సంక్రమించిన భూమికి పట్టా పొందే క్రమం :**

- వారసత్వంగా లేదా భాగ పంపకాల ద్వారా భూమి సంక్రమించిన వ్యక్తి పట్టాదారు పాసు పుస్తకం / టైటిల్ డీడ్ పొందటానికి ఫారం-6ఎ లో తహశీల్దారు గారికి దరఖాస్తు చేయాలి. దరఖాస్తుతో పాటు నాలుగు ఫొటోలు, భాగస్వామ్య ఒప్పంద పత్రం ఉన్నట్లయితే, సరైన స్టాంపు రుసుము చెల్లించినదై ఉండాలి. లేకపోతే మౌఖికమైన భాగస్వామ్యం కూడా వర్తిస్తుంది. అడంగల్ / పహాణీ, పట్టాదారు పాసు పుస్తకం / టైటిల్ డీడ్ నకలు కాపీ జత చేయాలి.
- దరఖాస్తు అందిన తర్వాత దరఖాస్తు దారుకు ఫారం-6సి లో (సెక్షన్ 4(1) లోని రూల్ 18(2) ప్రకారం) తహశీల్దారు రశీదు ఇస్తారు.
- దరఖాస్తు దారుడికి, ఇతర కుటుంబ సభ్యులకు అభ్యంతరాలు కోరుతూ (రూల్ 19(1) ప్రకారం) ఫారం-8లో బహిరంగ విచారణ నిమిత్తం 30 రోజుల లోపు అభ్యంతరాలు తెలియచేయాలని తెలిపే నోటీసులను ప్రకటిస్తారు. 45 రోజుల లోపు నిర్ణయించిన తేదీన నిర్ణయించిన ప్రదేశంలో గ్రామస్తులు, వి.ఆర్.వో సమక్షంలో విచారణ చేస్తారు.
- వారసత్వ నిరూపణకు ఒక వేళ భాగస్వామ్య ఒప్పందం జరిగి ఉంటే అవి రిజిష్టర్ కాకుండా ఉన్నట్లైతే ఒప్పందం పత్రాలు సరైన స్టాంపు పేపరుపై ఉందా అనే విషయం పరిశీలించి కుటుంబ సభ్యులందరి నుండి స్టేట్‌మెంట్లు రికార్డు చేసుకుంటారు. మౌఖిక భాగ పంపకాలు కూడా చేసుకోవచ్చును.
- పై అంశాల పట్ల ఏ వివిధమైన అభ్యంతరాలు లేనట్లైతే, భూమి సర్వే చేసి సబ్ డివిజన్ చేయడానికి రూ. 250 చలానా కట్టి తహశీల్దారుకు దరఖాస్తు చేసుకోవాలి. ఒకవేళ అభ్యంతరాలు వచ్చి, పరిష్కరించబడకుండా వుండి వివాదాస్పదమైనచో, సివిల్‌కోర్టును ఆశ్రయించమని మెమో ఇస్తారు.
- సబ్‌డివిజన్ రికార్డు తయారు చేయడం కోసం సర్వేయరుకు ఆదేశాలు జారీ చేస్తారు.
- సర్వేయరు దరఖాస్తు వివరాలు 8(ఎ) రిజిష్టర్‌లో నమోదు చేసి, సర్వే చేసే తేదీని నిర్ణయించి ప్రక్క రైతులకు మరియు దరఖాస్తు దారులకు తెలియచేస్తారు.
- మండల సర్వేయరు గ్రామంలో అందరి సమక్షంలో భూమి సర్వేచేసి సబ్‌డివిజన్ చేస్తారు. సబ్‌డివిజన్ రికార్డును తహశీల్దారు గారి ద్వారా డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే వారికి పంపుతారు. వారు ఆ రికార్డును స్క్రూటినీ చేసి తహశీల్దారుగారికి పంపుతారు.
- తహశీల్దారు భాగస్వాముల పేర్లను సర్వే సబ్ డివిజన్ల ప్రకారం రెవెన్యూ రికార్డులలో అమలు పరచటానికి ఉత్తర్వులు జారీచేస్తారు.
- వారసత్వం, భాగస్వామ్యం ద్వారా సంక్రమించిన మార్పుల రిజిష్టరు, 1బి రిజిష్టర్, పహాణీ /అడంగల్ ఫారం17 లలో భూమికి రెవెన్యూ రికార్డులలో మార్పులను చేస్తారు. దరఖాస్తు దారుకు పట్టాదారు పాసు పుస్తకం / టైటిల్ డీడ్ అందచేస్తారు.

### ఇనాం భూములకు పట్టా

నిజాం ప్రభుత్వ కాలంలో నిజాం ద్వారా లేదా జాగీర్దారుల ద్వారా లేదా సంస్థానాధీసుల ద్వారా కొంత మందికి దానం లేదా గ్రాంటుగా భూములు అందించబడ్డాయి. అలాంటి వాటిలో కొన్ని సేవలు అందించే షరతులతో, కొన్ని ఎలాంటి షరతులు లేకుండాను

దానరూపేణా లేదా గ్రాంటు రూపేణా ఇవ్వబడ్డాయి. ఇలా ఇవ్వబడిన భూములు ఇనాం భూములుగా రికార్డుల్లో నమోదు చేయబడ్డాయి.

ఆంధ్రప్రదేశ్ (తెలంగాణా ప్రాంతం) ఇనాంల రద్దు చట్టం, 1955 ద్వారా ఈ ఇనాంలు రద్దు చేయబడ్డాయి. 1-11-1973 సంవత్సరపు ఇనాం రూల్స్ అమలుకు ముందు నుంచి ఇనాం భూమిని అనుభవిస్తున్న అర్హులైన వారికి ఆక్యుపెన్సీ రైట్స్ సర్టిఫికెట్ జారీ చేయబడుతుంది.

ఓ ఆర్ సి ప్రతిని జతపరుస్తూ ఫారం 6 లో అర్జీ పెట్టుకొని, నిర్ధారించిన రుసుము చెల్లించినట్లయితే పట్టాదారు పాసు పుస్తకం / టైటిల్ డీడ్ జారీ చేస్తారు.

## ఇనాం భూముల క్రమబద్ధీకరణ

ఇనాం భూముల అనుభవదార్లు రెండు రూపాయల నాన్ జ్యుడీషియల్ స్టాంపు అతికించి ఫారం-1లో వివరాలను నమోదు చేయాలి. దీనిని ఆర్.డి.ఓ గారికి దరఖాస్తు చేసుకోవాలి.

**ఇనాం భూములకు పట్టా పొందే క్రమం :**

- దరఖాస్తు అందిన వెంటనే రెవెన్యూ డివిజనల్ అధికారిగారు ఇన్ వార్డు రిజిష్టరులో వివరాలు నమోదు చేస్తారు. ఆ నమోదు క్రమ సంఖ్యను తెలియచేస్తూ, దరఖాస్తు దారుకు ఫారం-బిలో రశీదు ఇస్తారు.
- దరఖాస్తును పరిశీలించి ఫారం-2లో ఇనాందారుకు, అనుభవదారుకు, ఇతర సంబంధింత వ్యక్తులకు నిర్దేశించిన తేది మరియు సమయంలో హాజరు కావాలని నోటీసులు జారీ చేస్తారు.
- క్షేత్ర పరిశీలన జరిపి రిపోర్టును పంపమని తహశీల్దారుకి ఆదేశాలు జారీ చేస్తారు. తహశీల్దారుగారు గ్రామాన్ని సందర్శించి ఇనాం ఎంక్వైరీ చేస్తారు.
- ఖాస్రా పహాణీ, 1973-74 పహాణి, ప్రస్తుత పహాణి మొదలైనవి పరిశీలిస్తారు. సాగు అనుభవ వివరాలు తెసుకుంటారు. తన నివేదికను రెవెన్యూ డివిజనల్ అధికారికి పంపిస్తారు.
- రెవెన్యూ డివిజనల్ అధికారి నిర్ణీత తేదీన దరఖాస్తుదారును, సంబంధిత వ్యక్తులందరినీ విచారణ చేస్తారు. తహశీల్దారు రిపోర్టులను, అందుబాటులో వున్న రికార్డులను పరిశీలిస్తారు. విచారణ చేసి దరఖాస్తుదారు పేరున బదిలీ కావలసిన ఇనాం భూమి సర్వే నెంబరు, విస్తీర్ణం, ఇతర వివరాలు, దరఖాస్తుదారు చెల్లించ వలసిన ప్రీమియం నిర్ధారిస్తారు. ఈ ప్రీమియం భూమి శిస్తుకు 9 నుంచి 60 రెట్లు ఉంటుంది.
- నిర్ధారించిన ప్రీమియం చెల్లించిన తర్వాత దరఖాస్తుదారుకు అక్యుపెన్సీ రైట్స్ సర్టిఫికెట్ (ఓ.ఆర్.సి) అందచేస్తారు.
- ఓ.ఆర్.సి కాపీని జత చేస్తూ దరఖాస్తుదారు పట్టాదారు పాస్ పుస్తకం / టైటిల్ డీడ్ మంజూరు కొరకు ఫారం-6ఎలో తహశీల్దారు గారికి దరఖాస్తు చేసుకోవాలి.
- ఆర్.ఓ.ఆర్ చట్టం ప్రకారం విచారణ చేసి పట్టాదారు పాసు పుస్తకం / టైటిల్ డీడ్ అందచేస్తారు.

## సాదాబైనామా / తెల్లకాగితాలపై కొనుగోలు చేసిన భూమికి పట్టా

మన రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలలో చాలా మంది తెల్ల కాగితాలపై భూములు కొనుగోలు చేసి దశాబ్దాలుగా సాగుచేసుకుంటున్నా కాని వారికి పట్టాలు లేవు. భూమి కొనుగోలు రిజిస్ట్రేషన్ కానందువలన వారు చట్టప్రకారం భూమి హక్కుదారులు కాలేకపోయారు. కోనేరు రంగారావు ఆధ్వర్యంలో వేసిన భూ కమిటీ నివేదిక ప్రకారం రాష్ట్రంలో తెల్లకాగితాలపై భూమి కొనుగోలు చేసిన వారి సంఖ్య దాదాపుగా 12-15 లక్షల మంది ఉంటారని అంచనా. వారిలో 70-85 శాతం మంది పేదవారే. ఈ విధంగా తెల్లకాగితాలపై జరిగిన కొనుగోళ్ళను క్రమబద్ధీకరించడానికి ఆంధ్రప్రదేశ్ భూమి హక్కులు మరియు పట్టాదారు పాసు పుస్తకాల చట్టానికి 1989లో సవరణ చేసి '5-ఎ' సెక్షన్‌ను చేర్చడం జరిగింది. ఈ సెక్షన్ ప్రకారం భూమి కొనుగోలు చేసిన వ్యక్తి తహసీల్దార్‌కు నిర్ణీత గడువు తేదీలోగా అర్జీ పెట్టుకున్నట్లయితే, విచారణ జరిపి కొనుగోలును చట్టబద్ధం చేస్తూ సర్టిఫికెట్ జారీచేసి, పట్టాదారు పాస్‌బుక్ / టైటిల్ డీడ్ ఇస్తారు.

**తెల్లకాగితాలపై కొనుగోలు చేసిన భూమికి పట్టా పొందే క్రమం :**

సెక్షన్ 5-ఎ, ఆంధ్రప్రదేశ్ భూమి హక్కులు పట్టాదారు పాస్ పుస్తకాలు చట్టం, 1971; రూల్ 22, ఆంధ్రప్రదేశ్ భూమి హక్కులు పట్టాదారు పాస్ పుస్తకాల రూల్స్, 1989 ప్రకారం తెల్లకాగితాలపై కొనుగోలు చేసిన భూములకు పట్టాపొందే విధానం ఇది :

- తెల్లకాగితాలపై కొనుగోళ్ళు చేసిన వ్యక్తులు దరఖాస్తు చేసుకోవడానికి, తహశీల్దార్ జిల్లా గెజెట్‌లో ఫారం-9 లో నోటీసు ఇచ్చి గ్రామంలో తెలియపరుస్తారు.
- ప్రభుత్వం నిర్ణయించిన గడువులోగా తెల్లకాగితంపై భూమి కొనుగోలు చేసిన వ్యక్తి ఫారం-10 లో తహశీల్దార్‌కు దరఖాస్తు చేసుకోవాలి.
- తహశీల్దార్ ఫారం-11 లో భూమి అమ్మిన వ్యక్తికి ఏ తేదీన, ఏ సమయంలో, ఎక్కడ విచారణ జరుగుతుందో తెలుపుతూ నోటీసు జారీ చేస్తారు. ఫారం-12 లో ఆసక్తిగల సంబంధిత వ్యక్తులకు కూడా నోటీసు జారీ చేసి గ్రామపంచాయితీ కార్యాలయపు నోటీసు బోర్డు, తహసీల్దారు ఆఫీసు, మండల ప్రజా పరిషత్ ఆఫీసు నోటీసు బోర్డులపై ప్రదర్శిస్తారు.
- తహశీల్దార్ నిర్ణయించిన తేదీన విచారణ జరిపి ఇరుపక్షాల వాదనలు వింటారు, సాక్షులను విచారిస్తారు, డాక్యుమెంట్లను పరిశీలిస్తారు.
- ఎలాంటి అభ్యంతరాలు రానిచో రిజిస్ట్రేషన్ రుసుము నిర్ధారించమని ఫారం-13 ఎ లో తహశీల్దార్ సబ్‌రిజిస్ట్రార్‌ను కోరతారు. సబ్‌రిజిస్ట్రారు రుసుము నిర్ధారించి తహశీల్దారుకు తెలియజేస్తారు. సబ్ రిజిస్ట్రార్ తెల్లకాగితాలపై కొనుగోలు చేసిన తేదీ నాటి భూమి విలువ ఆధారంగా రిజిస్ట్రేషన్ ఫీజు, స్టాంపు డ్యూటీ నిర్ణయిస్తారు.

- దరఖాస్తుదారు రిజిస్ట్రేషన్/స్టాంపు డ్యూటీలు రుసుము చలాను రూపంలో చెల్లించి ఆ చలాను ప్రతిని (ఒరిజినల్ కాపీ) తహశీల్దార్‌కు సమర్పించాలి.
- తహశీల్దార్ ఫారం-13 బి లో ధృవీకరణ పత్రం (సర్టిఫికెట్) జారీ చేస్తారు. ఫారం-13 సి లో రిజిస్ట్రారుకు సమాచారం పంపుతారు.
- భూమి హక్కులు రికార్డు (ఆర్.ఓ.ఆర్) లోఅనగా ఫారం-1, ఫారం-1బి, మార్పులు చేసి పట్టాదారు పాస్‌బుక్/టైటిల్ డీడ్ జారీ చేస్తారు. తరువాత ప్రస్తుత సం॥పహణీలో పొందు పరుస్తారు.
- తహశీల్దార్ ఇచ్చిన తీర్పుపై 30 రోజులలోగా ఆర్‌డీఓ/సబ్-కలెక్టర్‌కు అప్పీలు చేసుకోవచ్చు. ఆరు నెలల లోపు అప్పీలుపై తీర్పుఇవ్వాలి. ఆర్‌డిఓ/సబ్-కలెక్టర్ తీర్పుపై కలెక్టర్‌కు రివిజన్ పిటిషన్ పెట్టుకోవచ్చు. కలెక్టర్ తనంతట తానుగా కూడా రివిజన్ కేసు ప్రారంభించవచ్చు.

## ప్రభుత్వ భూమికి పట్టా

ఇప్పటి వరకూ ప్రభుత్వం లక్షల ఎకరాల ప్రభుత్వ భూమిని, సీలింగ్ మిగులు భూమిని పేదలకు అసైన్ చెయ్యడం జరిగింది. ఇప్పటికీ గ్రామాలలో భూమి లేని నిరుపేదల నుంచి తమకు ప్రభుత్వ భూమిని సాగు చేసుకోవడానికి ఇప్పించాలనే వినతులు వస్తూనే వున్నాయి. గ్రామంలో ఇంకా ఎవరి ఆక్రమణలోనూ లేకుండా, ఎవరికీ మంజూరు చెయ్యబడకుండా, ఖాళీగా వున్న, సాగు చెయ్యడానికి వీలైన ప్రభుత్వ భూమి అందుబాటులో వుంటే ఆ గ్రామంలో భూమి కావాలని కోరుకునే భూమి లేని పేదలు ఆ భూమిని తమకు అసైన్ చెయ్యమని రెవెన్యూ అధికారులను కోరవచ్చు.

- లబ్ధిదారులు దరఖాస్తులు తహశీల్దారు గారికి సమర్పించాలి. తహశీల్దారు గారి కార్యాలయం నుండి దరఖాస్తు అందినట్లు రశీదు ఇస్తారు.
- భూమి అసైన్‌మెంట్ కోరే వ్యక్తుల దరఖాస్తులను పరిశీలించిన తరువాత ఫారం-బి రిజిష్టరులో నమోదు చేస్తారు. ఆ దరఖాస్తుపై విచారణ కోసం గ్రామ రెవెన్యూ అధికారి మరియు మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌కు ఆదేశాలు జారీ చేస్తారు.
- ఆ భూములపై, అలాగే ప్రతిపాదించబడిన లబ్ధిదారులపై ఆక్షేపణలు గాని, అభ్యంతరాలు గాని వున్నట్లయితే, 15 రోజులలోపు తెలియచేయాలని కోరుతూ దండోరా ద్వారా గ్రామంలో తెలియపరుస్తారు.
- పై విషయాన్ని తెలియచేస్తూ ఎ-1 నోటీసును గ్రామ పంచాయతి కార్యాలయంలో, అలాగే జన సమ్మర్ధం అధికంగా వుండే ప్రదేశాలలోని గోడలపైన కూడా అతికిస్తారు.
- రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ 15 రోజుల గడువు పూర్తి అయిన తరువాత ఎ-మెమెరాండం డూప్లికేటును తయారు చేసి తహశీల్దారుకి పంపిస్తారు. దీనితో పాటు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సంతకం చేసి, గ్రామంలోని ఇద్దరు వ్యక్తులు నోటీస్ తీసుకున్నట్లుగా సాక్షి సంతకాలు చేసిన ఇ-నోటీసును కూడా జత చేస్తారు.
- తహశీల్దారు గారు ఒకరి కంటే ఎక్కువ మంది దరఖాస్తు చేస్తే, వారిలో ఎక్కువ అర్హత కల వారిని ఎంపిక చేస్తారు. అర్హత కల వారిని ఎంపిక చేసే విధానంలో అసలు భూమి లేని నిరుపేదలకు ప్రాధాన్యతనిస్తారు.
- తహశీల్దార్ ప్రభుత్వ భూమిని సర్వేచేసి, ఫోడి రికార్డు మరియు గ్రామానికి రెండు కి.మీ. దూరంలోపు వున్నదా అనే నివేదిక ఇవ్వాలని మండల సర్వేయరుకు ఆదేశిస్తారు.
- భూమి సర్వే నెంబర్, సాగు చేస్తున్న విస్తీర్ణం, సరిహద్దుల వివరాలను తీసుకుని చుట్టు ప్రక్కల రైతులను విచారణ చేసి స్టేట్‌మెంట్లు రికార్డు చేస్తారు.
- సబ్ డివిజన్ అవసరం ఉందా, లేదా అనేది సర్వేయర్ నిర్ధారణ చేసి తహశీల్దారుకి తెలియచేస్తారు. తహశీల్దార్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్‌చే స్క్రూటినీ చేయించి సబ్‌డివిజన్ నివేదికను అందజేస్తారు.
- మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నివేదిక, దానితో పాటుగా సబ్‌డివిజన్ నివేదిక అందిన తరువాత తహశీల్దారు కార్యాలయంలో సంబంధిత సహాయకుడు, పర్యవేక్షణ అధికారి చెక్ మెమో తయారు చేసుకుని తహశీల్దారు అమోదం పొంది గ్రామ సభలో ఆమోదం పొందుతారు.
- లబ్ధిదారుల పేర్లు, తండ్రి / భర్త పేరుతో సహా సర్వే నెంబర్, భూమి విస్తీర్ణం మొదలైనవి తప్పులు లేకుండా సక్రమంగా నమోదు అయ్యేటట్లు చూస్తారు.
- ఈ ప్రతిపాదనలను రెవెన్యూ డివిజనల్ అధికారి ద్వారా అసైన్‌మెంట్ కమిటీ పరిశీలనకు పంపుతారు.
- ఉత్తర్వులు కమిటీ అమోదం పొందిన తరువాత మరియు అసైన్‌మెంట్ పట్టా డూప్లికేట్ ప్రతిని తయారు చేసి ఒకటి లబ్ధిదారుడికి ఇచ్చి, రెండవది ఆఫీస్ కాపీగా ఉపయోగిస్తారు.
- ఉత్తర్వు, డి-ఫారం పట్టా సర్టిఫికెట్ ప్రతిని అసిస్టెంట్ డైరెక్టర్, సర్వే & ల్యాండ్ రికార్డ్ గారికి సప్లిమెంటరీ సేత్వార్ / ఆర్.యస్.ఆర్ జారీ చేయడానికి పంపుతారు.
- లబ్ధిదారుల పేరున రెవెన్యూ రికార్డ్‌లలో మార్పులు చేస్తారు.
- లబ్ధిదారులకిచ్చే డి-ఫారం / అసైన్‌మెంట్ పట్టాతో పాటు పహణీ, సబ్ డివిజన్ రికార్డు కాపీ, ఆర్.ఓ.ఆర్ 1-బి కాపీ జత చేసి ఇస్తారు.
- పట్టాదారు పాస్ బుక్ / టైటిల్ డీడ్ ఫారం-17 లో సంతకాలు తీసుకొని లబ్ధిదారులకు జారీ చేస్తారు.
- లబ్ధిదారులకు అసైన్‌మెంట్ చేసిన భూమిని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్/ సర్వేయర్‌ల ద్వారా పంచనామా చేసి స్వాధీన పరుస్తారు.
- అసైన్‌మెంట్ చేసిన భూముల వివరాలను ఎప్పటి కప్పుడు తహశీల్దారుగారు సబ్ రిజిస్ట్రార్ గారి కార్యాలయానికి పంపుతారు.
- పట్టాదారు పాస్‌బుక్/టైటిల్ డీడ్‌లలో అసైన్డ్ పట్టా భూముల కెదురుగా "ప్రభుత్వ భూమి, పట్టా బదిలీ నిషేధము"అని స్టాంపు వేస్తారు.

**ప్రభుత్వ భూమిని ఆక్రమించి సాగు చేస్తున్న అర్హులైన పేదలు పట్టాలు పొందాలంటే :**

ఒక ఫసలీ సంవత్సరం (వ్యవసాయక సంవత్సరం) ముందు నుంచి ఏదైనా ప్రభుత్వ భూమిని ఆక్రమణ చేసి సాగు చేస్తున్న వ్యక్తిని శివాయి జమాదారు అంటారు. అసైన్ మెంట్ చేసేటప్పుడు అర్హులైన శివాయి జమాదార్లకు ముందు ప్రాధాన్యం ఇవ్వాలని జి.ఓ.ఎస్.నెం.1406, రెవెన్యూ, తేది 25.17.1958 ద్వారా సూచించడం జరిగింది. శివాయి జమాదారు భూమి లేని నిరుపేద అయినట్లయితే, అతడి / ఆమె స్వాధీనంలో వున్న భూమి ఎలాంటి ఆక్షేపణలు లేని భూమి అయినట్లయితే, ఎట్టి పరిస్థితులలోను వారిని భూమి నుంచి తొలగించకూడదు. ప్రభుత్వ భూమిని ఆక్రమించి సాగు చేస్తున్న అర్హులైన పేదలు పట్టాలు పొందే క్రమం :

- భూమి అభ్యంతరం లేనిదై, శివాయి జమాదారు అర్హుడైన వ్యక్తి అయితే పూర్తి వివరాలతో తహశీల్దారు గారికి దరఖాస్తు చేసుకోవాలి. శివాయి జమాదారు దరఖాస్తు అందినట్లుగా తహశీల్దారు కార్యాలయం నుండి రశీదు పొందాలి.
- దరఖాస్తును పరిశీలించిన తరువాత తహశీల్దారు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ను క్షేత్ర పరిశీలన చేసి సర్వే నెంబర్, సాగు విస్తీర్ణం, సరిహద్దుల గురించి శివాయి జమాదారు సమక్షంలో విచారించి నివేదిక సమర్పించమని ఆదేశిస్తారు.
- రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ తాను ఎప్పుడు గ్రామాన్ని సందర్శిస్తారో శివాయి జమాదారుకు ముందుగానే తెలియ చేస్తారు.
- రికార్డులను పరిశీలించి, శివాయి జమాదారుకు బి-మెమో ఇచ్చినట్లయితే దాని కాపీని, 4-సి రిజిష్టర్‌లో వుండే ఆక్రమణ దారుల వివరాలను పరిశీలిస్తారు.
- గ్రామంలో విచారణ చేసేటప్పుడు అతడికి ఇది వరకే గల భూములను గురించి, ఆదాయం గురించి, నివాసం గురించి విచారిస్తారు.
- వీటితో పాటు శివాయి జమాదారు స్వాధీనంలో ఉన్న భూమి రఫ్ స్కెచ్ కూడా జత చేస్తారు. ఇందులో అతడి ఆక్రమణలో వున్న భూమి హద్దులు కూడా చూపిస్తారు.
- ఒకవేళ భూమి ఆక్రమణ ఆక్షేపణీయమైనదైతే, శిస్తుతో, అపరాధ రుసుముతో పాటు భూ ఆక్రమణ చట్టం, 1905 సెక్షన్ 7/6 ప్రకారం భూమి నుంచి తొలగిస్తారు.
- భూమి అభ్యంతరకరం కానిదనీ, శివాయి జమాదారు అర్హుడనీ నిర్ధారణ అయితే అసైన్‌మెంట్ కోసం సిఫారసు చేస్తారు.
- సర్వేయర్ సర్వే చేసి సబ్ డివిజన్ రికార్డులను తయారు చేస్తారు. తహసీల్దార్ కోరిన ప్రకారం, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే స్క్రూటినీ చేసి సబ్‌డివిజన్ రికార్డు ఇస్తారు.
- మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నివేదిక, దానితో పాటుగా సబ్ డివిజన్ నివేదిక అందిన తరువాత మండల ఆఫీస్‌లో సంబంధిత సహాయకుడు, పర్యవేక్షణ అధికారి చెక్ మెమో తయారు చేసుకుని తహశీల్దారు ఆమోదం పొందుతారు. ప్రతిపాదనలు గ్రామసభ ముందుంచి వారి ఆమోదం పొందుతారు.
- ప్రతి పాదనలను అసైన్‌మెంట్ కమిటీ ముందు ఆమోదం కోసం వుంచుతారు.
- కమిటీ ఆమోదం పొందిన తరువాత ఉత్తర్వులు మరియు అసైన్‌మెంట్ పట్టా డి-ఫారంను డూప్లికేటులో తయారు చేసి ఒకటి అసైన్‌మెంట్ పొందుతున్న శివాయి జమాదారుకు ఇచ్చి, రెండవది ఆఫీస్ కాపీగా ఉపయోగిస్తారు.
- ఉత్తర్వులు, డి-ఫారం పట్టా సర్టిఫికెట్‌ను అసిస్టెంట్ డైరెక్టర్, సర్వే & ల్యాండ్ రికార్డ్ గారికి సప్లిమెంటరీ సేత్వార్ జారీ చేయడానికి పంపుతారు.
- శివాయి జమాదారు కిచ్చే డి-ఫారం పట్టాతో పాటు పహాణీ, సబ్‌డివిజన్ రికార్డు, 1-బి కాపీ జత చేసి ఇస్తారు.
- తహశీల్దారు గారు పట్టాదారు పాస్ బుక్, టైటిల్ డీడ్ ఫారం-17లో సంతకాలు తీసుకొని అతడికి జారీ చేస్తారు.
- పట్టేదారు పాసుబుక్/టైటిల్ డీడ్‌లో ఇట్టి నమోదుకు ఎదురుగా "ప్రభుత్వ భూమి పట్టా-బదిలి నిషేధము" అనే స్టాంపు వేస్తారు.

## అటవీ భూములకు హక్కు పత్రం

గిరిజనులు, ఇతర సాంప్రదాయ అటవీ నివాసితులు వారి జీవనానికి అడవి మీద, అటవీ సంపద మీద ఆధార పడుతున్నారు. వారి జీవనోపాధిగా ఆధారపడుతున్న అడవిని, పర్యావరణ వ్యవస్థను పరిరక్షించుకుంటూ, సుస్థిరతను సాధించటం అనేది గిరిజనుల జీవితంతో మమేకమై ఉంది. అడవిని, గిరిజనులను విడదీసి చూడలేము. అయితే తరతరాలుగా అడవిని నమ్ముకుని, దానిని పరిరక్షించుకుంటూ వస్తున్న ఎన్నో లక్షల కుటుంబాలకు అటవీ భూమి హక్కులు ఇటీవల వరకు గుర్తించబడలేదు. కేంద్ర ప్రభుత్వం 2006వ సంవత్సరంలో గిరిజనుల, అడవిపై వారికున్న హక్కులను మొదటిసారిగా గుర్తిస్తూ, 'షెడ్యూలు తెగలు మరియు ఇతర సాంప్రదాయక అటవీ నివాసితుల అటవీ హక్కులు గుర్తింపు చట్టం 2006'లో రూపొందించింది. ఈ చట్టం డిసెంబరు 31, 2007 నుండి అమల్లోకి వచ్చింది. చట్టం అమలు నియమావళిని తయారు చేసి జనవరి 1, 2008 నుండి అమల్లోకి తీసుకు రాబడ్డాయి.

**అటవీ భూములకు హక్కు పత్రం పొందే క్రమం :**

- గ్రామ సభకై తేదీని నిర్ణయించి ప్రజలకు తెలియపరిచి, నిర్ణయించిన తేదీన గ్రామ సభ నిర్వహించబడుతుంది. పంచాయితీ కార్యదర్శి నేతృత్వంలో హాబిటేషన్ల వారీగా గ్రామ సభ జరగాలి.
- చట్టంలోని నిబంధన 3 క్రింద 10 నుండి 15 మంది సభ్యులతో అటవీ హక్కుల కమిటీని గ్రామ సభ ద్వారా ఎన్నుకోబడతారు. వీరి నుండి మాత్రమే కార్యదర్శి మరియు అధ్యక్షులని ఎన్నుకోవడం జరుగుతుంది.
- వ్యక్తిగత హక్కులు మరియు సామాజిక హక్కులు పొందటానికి నిర్దేశించబడిన ఫారాలలో అటవీ హక్కుల కమిటీకి రెండు సాక్ష్యాధారాలతో దరఖాస్తు చేసుకోవాలి.

- దరఖాస్తు చేసుకున్న తేదీ నుండి 3 నెలలలోపు అటవీ హక్కుల కమిటీ దరఖాస్తులను స్వీకరించి, ప్రతి దరఖాస్తుకు రశీదు ఇవ్వాలి.
- దరఖాస్తుదారుడు దరఖాస్తు చేసుకున్న భూమిపై హక్కు నిర్ధారణకుగాను అటవీ హక్కుల కమిటి సంబంధిత భూమిని సందర్శించి దరఖాస్తులో పేర్కొన్న వివరాలతో సరిపోల్చుకుని నిర్ధారణ చేస్తారు.
- దరఖాస్తుకు సంబంధించి ఇతర వ్యక్తుల వాంగ్మూలాలను, సంబంధిత రికార్డులు ఏవైనా వుంటే వాటిని పరిశీలిస్తారు. అనంతరం సంబంధిత భూమికి హద్దులు సూచిస్తూ మ్యాప్ తయారు చేస్తారు. మ్యాపుపై ఫారెస్టు క్షేత్రస్థాయి సిబ్బంది, గ్రామ రెవెన్యూ అధికారి, అటవీ హక్కుల కమిటీ ఛైర్మన్ సంతకం, స్టాంపులు వుండాలి. తయారుచేసిన నివేదికను గ్రామ సభ పరిశీలనకు ఇస్తారు.
- అటవీ హక్కుల కమిటీ పరిశీలించిన దరఖాస్తులను - గ్రామ సభ పరిశీలించి ఆమోదించవచ్చు లేదా తిరస్కరించవచ్చు. గ్రామ సభ అమోదం పొందిన దరఖాస్తులను తదుపరి నిర్ణయం కొరకు సబ్ డివిజనల్ స్థాయి కమిటీకి పంపుతారు.
- గ్రామ సభ ఆమోదించిన దరఖాస్తులను సబ్ డివిజనల్ స్థాయి కమిటీ పరిశీలించి ఆమోదించవచ్చు లేదా తిరస్కరించవచ్చు. గ్రామ సభ అమోదించిన దరఖాస్తులను, తీర్మానాలను, మ్యాప్‌లను ఏకీకరించి పరిశీలించి ప్రతిపాదిత అటవీ హక్కుల ముసాయిదా రికార్డుతో కలిపి తుది నిర్ణయం కొరకు సబ్ డివిజనల్ అధికారి ద్వారా జిల్లా స్థాయి కమిటీకి పంపుతారు.
- అన్ని దరఖాస్తులను, ప్రత్యేకంగా ఆదిమ గిరిజనులు, పశు పోషకులు, సంచార గిరిజనుల దరఖాస్తులు పరిగణించారా అనే విషయాన్ని పరిశీలించి సబ్ డివిజనల్ స్థాయి కమిటీ రూపొందించిన అటవీ హక్కుల రికార్డులను, హక్కుల పత్రంతో సహా అవసరమైన ప్రభుత్వ రికార్డులతో అటవీ హక్కులను చేర్చే విధంగా జిల్లా కమిటీ ఉత్తర్వులు జారీ చేస్తుంది. అటవీ హక్కుల రికార్డులను తయారు చేస్తుంది.
- సబ్ డివిజనల్ స్థాయి కమిటీ ఆమోదించి తయారుచేసి ఇచ్చిన అటవీ హక్కుల రికార్డును జిల్లా స్థాయి కమిటీ ఆమోదిస్తుంది. తరువాత అటవీ హక్కుల పత్రం కాపీలు గ్రామ సభ ద్వారా దరఖాస్తుదారునికి అందించబడతాయి.

గ్రామ సభ నిర్ణయంపై అభ్యంతరాలు వుంటే సబ్ డివిజనల్ స్థాయి కమిటీకి, ఈ కమిటీ నిర్ణయంపై అభ్యంతరాలు వుంటే జిల్లా స్థాయి కమిటీకి అప్పీలు చేసుకోవచ్చు.

భూమిని కొనుగోలు చేయడం ద్వారా హక్కు పొందిన వారికి ఆంధ్రప్రదేశ్ భూమి హక్కులు మరియు పట్టాదారు పాసుపుస్తకాల చట్టం 1971 లోని సెక్షన్ 5 ప్రకారం హక్కుల రికార్డుని సవరించి పట్టాదారు పాసుపుస్తకం మరియు టైటిల్ డీడ్ పొందటానికి అవకాశం కల్పించబడింది పట్టాభూముల అమ్మకం, కొనుగోళ్ళ ద్వారా రైతుల మధ్య యాజమాన్య హక్కు అనుభవాలు మారుతుంటాయి. అలాంటి మార్పులను రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేసి ప్రస్తుతం అనుభవ దారుడికి చట్టంలోని 18, 19, 20, 21 నియమాలలో పేర్కొనబడిన ప్రక్రియ ద్వారా పట్టాదారు పాసు పుస్తకం / టైటిల్ డీడ్ మంజూరు చేయడం ద్వారా హక్కులు కల్పించడం జరుగుతుంది.

వారసత్వంగా వచ్చిన లేదా తండ్రి ద్వారా ఆర్జింపబడిన ఆస్తులున్న వ్యక్తులు వాటిని కుటుంబ సభ్యుల మధ్య భాగస్వామ్య ఒప్పందం చేసుకున్న తర్వాత వారి పరస్పర అంగీకారంతో రెవెన్యూ రికార్డులలో నమోదు చేసి మార్పులు చేయడానికి, అలాగే కుటుంబంలోని వ్యక్తులందరికీ పట్టాదారు పాస్ పుస్తకం / టైటిల్ డీడ్ ఇవ్వడానికి ఆంధ్రప్రదేశ్ భూమి హక్కులు మరియు పట్టాదారు పాస్ పుస్తకాల చట్టం, 1971 ద్వారా అవకాశం కల్పించబడింది.

ఆంధ్రప్రదేశ్ (తెలంగాణా ప్రాంతం) ఇనాంల రద్దు చట్టం - 1955 ద్వారా ఇనాంలు రద్దు చేయబడ్డాయి. ఇనాందారులు లేదా వారి నుంచి కొనుగోలు చేసిన వారికి ఆక్యుపెన్సీ హక్కు సర్టిఫికెట్లు జారీ చేయబడ్డాయి. 1-11-1973 సంవత్సరపు ఇనాం రూల్స్ అమలుకు ముందు నుంచి ఇనాం భూమిని ఎవరైతే అనుభవిస్తున్నారో వారికిచ్చే సర్టిఫికెట్‌నే ఆక్యుపెన్సీ రైట్స్ సర్టిఫికెట్ అంటారు.

భూమి కొనుగోలు రిజిస్ట్రేషన్ కానందువలన వారు చట్టప్రకారం భూమి హక్కుదారులు కాలేక పోయారు. ఈ విధంగా తెల్లకాగితాలపై జరిగిన కొనుగోళ్ళను క్రమబద్ధీకరించడానికి ఆంధ్రప్రదేశ్ భూమి హక్కులు మరియు పట్టాదారు పాసు పుస్తకాల చట్టానికి 1989 లో సవరణ చేసి '5(ఎ)' సెక్షన్‌ను చేర్చడం జరిగింది. ఈ సెక్షన్ ప్రకారం భూమి కొనుగోలుచేసిన వ్యక్తి తహసీల్దార్‌కు అర్జీ పెట్టుకున్నట్లయితే విచారణ జరిపి కొనుగోలును చట్టబద్దం చేస్తూ '13-బి' సర్టిఫికెట్‌ను జారీచేసి, పట్టాదారు పాస్‌బుక్ / టైటిల్ డీడ్ ఇస్తారు.

గ్రామంలో ఇంకా ఎవరి ఆక్రమణలోనూ లేకుండా, ఎవరికీ మంజూరు చెయ్యబడకుండా, ఖాళీగా వున్న, సాగు చెయ్యడానికి వీలైన ప్రభుత్వ భూమి అందుబాటులో వుంటే ఆ గ్రామంలో భూమి కావాలని కోరుకునే భూమి లేని పేదలు ఆ భూమిని తమకు అసైన్ చెయ్యమని రెవెన్యూ అధికారులను కోరవచ్చు.

ప్రభుత్వ భూమిని అసైన్ మెంట్ చేసేటప్పుడు అర్హులైన శివాయి జమాదార్లకు ముందు ప్రాధాన్యం ఇవ్వాలని జి.ఓ.ఎస్.నెం.1406, రెవెన్యూ, తేది 25.17.1958 ద్వారా సూచించడం జరిగింది. శివాయి జమాదారు భూమి లేని నిరుపేద అయినట్లయితే, అతడి / అమె స్వాధీనంలో వున్న భూమి ఎలాంటి ఆక్షేపణలు లేని భూమి అయినట్లయితే ఏట్టి పరిస్థితులలోను వారిని భూమి నుంచి తొలగించకూడదు.

భారత ప్రభుత్వం 2006లో గిరిజనుల మరియు ఇతర సాంప్రదాయ అటవీ నివాసితుల అటవీ హక్కుల గుర్తింపు చట్టం - 2006 తీసుకొని వచ్చింది. ఈ చట్టం క్రింద అర్హత ఉన్న గిరిజనులు మరియు ఇతర సాంప్రదాయ అటవీ నివాసితులు తాము సాగుచేసిన మరియు చేస్తున్న అటవీ భూమికి వ్యక్తిగత హక్కు మరియు సామాజిక హక్కు పొందవచ్చు.

**(ఆర్.డి.ఐ, హైదరాబాద్ సౌజన్యంతో)**

# పంటల సాగులో ఉత్తమ యాజమాన్య పద్ధతులు

## వరి పంట

**వరి పంటసాగుకు అవసరమైన పద్ధతులు, జాగ్రత్తల గురించి తెలుసు కుందాం.**



- ✯ ప్రాంతాలకు అనువైన రకాలను ఎన్నుకోవాలి.
- ✯ ఎకరానికి సరిపడే నారుమడికి 5 సెంట్లలో సెంటుకు ఒక్కింటికి 5 కిలోల చొప్పున విత్తుకోవాలి.
- ✯ విత్తుకొనే ముందు కార్బండజిమ్ లేదా ట్రైసైక్లోజోలతో విత్తన శుద్ధి చేసుకోవాలి.
- ✯ నారుమడిలో పశువుల ఎరువుతోపాటు 5 సెంట్ల నారుమడికి 2 కి॥ నత్రజని, 1 కి॥ భాస్వరం, 1 కి॥ పొటాష్‌నిచ్చే ఎరువులు వేయాలి.
- ✯ చలి ఉన్న ప్రాంతాల్లో భాస్వరం మోతాదును రెండింతలు పెంచుకోవాలి.
- ✯ నారు పీకడానికి 5-7 రోజుల ముందు కార్బోఫ్యూరాన్ 3 జి 800 గ్రా. (లేక) కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4 జి. 600 గ్రా. (లేక) క్లోరిపైరిఫాస్ (లేక) ఫోరేట్ 10 జి 250 గ్రా. గుళికలను నారుమడిలో వేయాలి.
- ✯ సాధారణ పరిస్థితులలో దీర్ఘకాలిక రకాలకు చ॥మీ.కు 33, మధ్యకాలిక రకాలకు 44, స్వల్పకాలిక రకాలకు 66 కుదుర్లు ఉండేటట్లు నాటాలి.
- ✯ ఆలస్యంగా నాటువేసే పరిస్థితులలో, ముదిరిన నారును 5-6 మొక్కల చొప్పున దగ్గరగా నాటుతూ చ॥మీ.కు 50-60 కుదుర్లు తగ్గకుండా నాటాలి.
- ✯ సిఫారసు చేసిన మోతాదులో ( ఎకరానికి 30-40 కిలోలు) 1/3 వంతు నత్రజనిని నాటే సమయంలో మొదటి దఫాగా, 1-3 వంతును పిలకలు తొడిగే దశలో, మిగిలిన 1/3 వంతును అంకురం ఏర్పడే దశలో వేయాలి.
- ✯ భాస్వరం, పొటాష్‌నిచ్చే ఎరువులను ఆఖరి దమ్ములో వేయాలి.
- ✯ పచ్చిరొట్ట పైర్లయిన జనుము, జీలుగ లేదా పిల్లి పెసర లాంటి పైర్లను నాటడానికి ముందు వేసుకుని, పూతదశలోపు ప్రధాన పొలంలో కలియ దున్నుకోవాలి. ఈ పరిస్థితులలో ఎకరానికి 150 కిలోల సింగిల్ సూపర్ పాస్ఫేటును వేసినట్లయితే, పచ్చి రొట్ట బాగుగా కుళ్ళి పోతుంది. దీని వలన రసాయనిక ఎరువుల వాడకాన్ని కొంత వరకు, ముఖ్యంగా నత్రజనిని 25-30% తగ్గించుకొనవచ్చును.
- ✯ భూసార పరీక్షలననుసరించి నత్రజని, భాస్వరం, పొటాష్‌ల సమతుల్యతను పాటించాలి.
- ✯ జింకు ధాతులోపం వంగడాన్ని, నేల స్వభావాన్ని మరియు వాతావరణాన్ని బట్టి గమనించబడుతుంది. దీని సవరణకు జింకు సల్ఫేట్‌ను ఎకరాకు, 20 కిలోలను/ దాళ్వా (రబీ) కాలంలో వేయాలి.
- ✯ నాటిన పైరులో జింకుధాతులోప సవరణకు లీటరు నీటికి 2 గ్రా. జింక్ సల్ఫేట్‌ను కలిపి 5-6 రోజుల వ్యవధితో 2-3 సార్లు పిచికారి చేయవలెను. దీనిలో ఎలాంటి పురుగు లేదా తెగుళ్ళ మందులు కలుపరాదు.
- ✯ సమస్యాత్మక పొలాల్లో (చౌడు) జింక్‌సల్ఫేట్ పైరుపై పిచికారి చేసినప్పుడు మంచి ఫలితాలను సాధించవచ్చు.
- ✯ సకాలంలో కలుపు నివారణకు ఎకరాకు బ్యూటాక్లోర్ 1లీ. (లేదా) అనిలోఫాస్ 500 మి.లీ. 20 కిలోల పొడి ఇసుకతో కలిపి, నాటిన 3-5 రోజులలో చల్లాలి. వెడల్పాటి కలుపు మొక్కల నివారణకు 2, 4 డి. ఎకరాకు 5 కిలోలు వేయాలి.
- ✯ ప్రతి 2 మీటర్లకు 20 సెం.మీ. కాలి బాటలను ఏర్పాటు చేయాలి.
- ✯ వాతావరణ ఆధారిత సలహాలను పాటిస్తూ సమగ్ర సస్యరక్షణ చర్యలను చేపట్టాలి.
- ✯ సామూహికంగా ఎలుకల నివారణ పద్ధతులను ఆచరించాలి.
- ✯ ప్రస్తుతం సాంబమసూరి లాంటి సన్నగింజ రకాలను వినియోగదారుల నుండి మరియు మార్కెట్‌లో ఉన్న ప్రాముఖ్యతను అనుసరించి వీటిని సాగు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ఈ రకాలు సాగు చేసినప్పుడు సస్యరక్షణలో ప్రత్యేక శ్రద్ధ వహించాలి.
- ✯ వరికోత యంత్రాలను ఉపయోగించాలి.

### 1. పంటల సరళి

నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలలో వరి ఆధారిత పంటల సరళి ఈ క్రింద ఇవ్వడం జరిగింది.

**1. ఉత్తర కోస్తా మండలం**

కాలువలు : వరి - మినుములు/పెసలు, వరి - వేరు శెనగ / నువ్వులు; చెరువులు : మొక్కజొన్న - మినుములు / నువ్వులు - కూరగాయలు; బావులు : వరి - కూరగాయలు, అపరాలు

**2 కృష్ణా మరియు గోదావరి మండలం**

కాలువలు : వరి - వరి, వరి తరువాత మినుములు / వేసవిలో పెసలు

చెరువులు : వరి - మినుములు / పెసలు / మొక్కజొన్న, చెరకు, నువ్వులు, పెసలు - వరి - అపరాలు వరి - మొక్కజొన్న - పశుగ్రాసాలు / అపరాలు

బావులు : వరి - మొక్కజొన్న / అసరాలు పత్తి - వరి

**III. రామలసీమ** (దక్షిణ మండలం / అత్యల్ప వర్షపాత మండలం)

కాలువలు : వరి- వేరుశెనగ / పొద్దు తిరుగుడు

చెరువులు : వరి - ప్రొద్దు తిరుగుడు / వేరుశెనగ

బావులు : వరికి బదులు ఆరు తడి పంటలను ప్రోత్సహించాలి.

**4. తెలంగాణా** (దక్షిణ / ఉత్తర మరియు మధ్య తెలంగాణ మండలాలు)

కాలువలు : వరి - వరి, వరి - ప్రొద్దు తిరుగుడు / వేరుశెనగ / ఆవాలు; బావులు : వరి - మొక్కజొన్న, మొక్కజొన్న - వేరుశెనగ / ప్రొద్దుతిరుగుడు / శెనగ, వరి ఉద్యానవన పంటలు; చెరువులు : వరి - ప్రొద్దుతిరుగుడు - పెసలు, వరి - మొక్కజొన్న / గోధుమ - పెసలు ఆదిలాబాద్, వరంగల్, ఖమ్మం మరియు రంగారెడ్డి జిల్లాల నల్లరేగడి భూములకు ప్రత్తి, సోయా, చిక్కుడు.

## 2. యాంత్రీకరణ - ఆధునిక పరికరాలు

పవరు టిల్లరు, షడ్లరు, కోత యంత్రాలు, ఆధునిక పనిముట్లు/ పరికరాలు వినియోగాన్ని ప్రోత్సహించాలి.

## 3. పెట్టుబడి ఖర్చును తగ్గించే సూచనలు

- ★ రైతులకు అవసరం అయిన విత్తనాన్ని వారే తయారు చేసుకోవాలి
- ★ రైతులు వారి ప్రాంతాలకు అనువైన రకాన్ని ఎన్నుకోవాలి
- ★ పైపాటుగా కాంప్లెక్స్ ఎరువులను వేయరాదు.
- ★ అవసరం మేరకు సస్యరక్షణ మందులు వాడవలెను.

## 4. నాణ్యమైన ధాన్యం దిగుబడికి సూచనలు

**కోతకు ముందు తీసుకోవలసిన మెళకువలు**

**నీటి యాజమాన్యం**

పిలకలు తొడిగే దశలో నీరు పలుచగా ఉంచి, ఆ తర్వాత చిరుపొట్ట దశ నుండి పొలంలో సుమారు 5 సెం.మీ. వరకు నీరు ఉండేటట్లు చూసుకోవాలి. కోతకు 7-10 రోజుల ముందు పొలం నుండి నీటిని తీసి ఆరగట్టాలి.

## 5. కోత సమయం మరియు కోత తరువాత మెళకువలు

వెన్నులో 75-50 శాతం గింజలు గట్టిపడిన దశలో కోసిన గింజ నాణ్యత బాగా ఉంటుంది. పనలను 2-3 రోజుల పాటు ఆరనివ్వాలి.

ఇతర రకాల గింజలు (బెరుకులు) కలువకుండా నాణ్యతా



ప్రమాణాలు పాటించాలి.

నూర్చిన ధాన్యంలో మట్టి, తాలు, చెత్త, చెదారం లాంటివి లేకుండా శుభ్రపరిచిన యెడల, గింజ నాణ్యత బాగుండి త్వరగా మార్కెట్లో అమ్ముడు పోయి ఎక్కువ ఆదాయం వస్తుంది.

★ గింజల్లో తేమ శాతం 13-14 ఉండేటట్లు చూడాలి.

***నిల్వలో***

- ★ ధాన్యంలో తేమ 14 శాతం కంటే ఎక్కువ ఉండరాదు.
- ★ ధాన్యాన్ని శుభ్రపరిచిన గోనె సంచులలో మాత్రమే నిల్వ చేయాలి.
- ★ నిల్వ ధాన్యంలో ఆశించే చీడపీడలను సిఫారసు చేసిన రసాయనాలతో నిర్మూలించాలి.

***వేయకూడని పనులు***

- ★ పంట అయిన తర్వాత కోయకుండా ఎక్కువ రోజులు ఉంచరాదు.
- ★ ధాన్యాన్ని వేగంగా ఆరబెట్టవద్దు. పంట ఈనిక దశలో ఉన్నప్పుడు పొలాన్ని ఆరబెట్టవద్దు. గింజ నాణ్యత లోపించి నూక శాతం పెరుగుతుంది. తడిగా ఉన్న ధాన్యాన్ని నిల్వ ఉంచరాదు.

## 6. సమగ్ర సస్యరక్షణ

- ★ ఆయా పరిస్థితుల ఆధారంగా పురుగులను తట్టుకొనే శక్తి గల రకాలను ఎంపిక చేసుకోవాలి. ప్రత్యేకించి ఉల్లికోడు, దోమ ఆశించే ప్రాంతాలకు నిరోధక శక్తి గల రకాలు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి. ఉల్లికోడు, కాండం తొలిచే పురుగు తీవ్రంగా ఆశించే ప్రాంతాలలో నారు తీయటానికి 5-7 రోజుల ముందు ఎకరా నారుమడికి 16 కిలోల కార్బోఫ్యూర్యాన్ గుళికలు గాని, 5 కిలోల ఫోరేట్ గుళికలు గాని వేయాలి.
- ★ నాటేటప్పుడు నారు కొసలను 2-4 అంగుళాలు త్రుంచి, నాటిన యెడల నారు ద్వారా వ్యాప్తి చెందే కాండం తొలిచే పురుగు, తాటాకు తెగులు మరియు ఆకుముడత పురుగుల పెరుగుదలను నియంత్రించవచ్చు.
- ★ ప్రతి 2 మీIIకు 20 సెం.మీ. కాలి బాటలను ఏర్పాటు చేయాలి. పైరులో వెలుతురు సోకటానికి, ఇతర యాజమాన్య పనులు సులువుగా చేసుకోవడానికి ఉపయోగపడతాయి.
- ★ శత్రు, మిత్రపురుగుల ఉనికిని గమనించడానికి స్థిరమైన, నిర్ధారించిన స్థలంలో, ఎప్పటికప్పుడు నిఘా ద్వారా విశ్లేషించి నిర్ణయాన్ని తీసుకోవాలి.
- ★ కాండం తొలిచే పురుగుకు ఎకరాకు 3 లింగాకర్షక బుట్టలు పెట్టి నిఘా పెట్టాలి. ఎకరాకు 8 లింగాకర్షక బుట్టలు అమర్చి పురుగు

మందులు వాడకుండా ఈ పురుగును అదుపు చేయవచ్చును.

- ★ దీపపు ఎరలు మరియు లింగాకర్షక ఎరల ద్వారా కాండం తొలిచే పురుగు, ఆకుముడత, రెల్లరాల్చే పురుగు, దోమ మొదలైన వాటి ఉధృతిని గమనించవచ్చు.
- ★ పురుగుమందుల పిచికారి ముందు, తాడు లాగి 'ఆకుముడత' మరియు కేస్‌వర్మ్ పురుగులను సులభంగా అరికట్టవచ్చు.
- ★ పచ్చదీపపు పురుగులు, సుడిదోమలు, ఆకుముడత పురుగుల పెరుగుదల నత్రజని ఎరువును ఆధికంగా వేసినప్పుడు ఎక్కువ. అందువల్ల 'నత్రజని' ఎరువు వాడుకను నియంత్రించాలి. నత్రజనితో పాటు సిఫారసు చేసిన పొటాష్‌ను, వేప సంబంధించిన పదార్థాల వినియోగాన్ని కూడా ప్రోత్సహించి, రసం పీల్చే పురుగులను అదుపులో ఉంచాలి.
- ★ ఆకుముడత, రెల్లరాల్చు పురుగు, కాండం తొలిచే పురుగుల పెరుగుదలను అరికట్టడానికి మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లేదా క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా కార్టాఫ్ హైడ్రాక్లోరైడ్ 2 గ్రా. చొప్పున లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.
- ★ నేల మట్టానికి దగ్గరగా మొదళ్ళు కోసిన, కాండం తొలిచే పురుగుల ను కొంత వరకు నిర్మూలించవచ్చు.
- ★ సుడిదోమ తట్టుకోని రకాలు సాగుచేసినప్పుడు వాటి నివారణకు నత్రజనిని సమపాళ్ళలో వేయాలి. పిలక దశలో 10-15 పురుగులు, అంకురం నుండి గింజ గట్టిపడే దశలో 20-25 పురుగులు / దుబ్బుకు ఉన్నప్పుడు పురుగు మందులు వాడాలి. ఇథోఫెన్‌ప్రాక్స్ 1.5 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.25 మి.లీ. లేదా థయామిథోక్సామ్ 0.2 గ్రా. లేదా ఫెనోబ్యూకార్బ్ 2 మి.లీ. లేదా మోనోక్రోటోఫాస్ 2.2 మి.లీ. / లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.
- ★ మిత్రపురుగులైన సాలీడులు, మిలిడ్ జాతి నల్లులు, తూనీగలు, కరాబిడ్ జాతి పెంకు పురుగులను సంరక్షించాలి.

## 7. తెగుళ్ళు - నివారణ పద్ధతులు

### పాము పొడ తెగులు

- ★ కిలో విత్తనానికి కార్బండజిమ్ 3 గ్రామ్‌ల చొప్పున కలిపి పొడి విత్తన శుద్ధి చేయాలి.
- ★ తెగులు సోకని విత్తనాన్ని వాడాలి.
- ★ దగ్గర దగ్గరగా నాట్లు వేయవద్దు.
- ★ కార్బండజిమ్ 1 గ్రా. లేదా హెక్సాకొనజోల్ 2 మి.లీ. లేక ప్రొపికోనజోల్ 1.0 మి.లీ. లేదా వ్యాలిడామైసిన్ 2.0 మి.లీ. ఒక లీటరు నీటితో కలిపి పైరుపై పిచికారి చేసి ఈ తెగులును నిర్మూలించవచ్చు.

### బాక్టీరియా ఆకు ఎండు తెగులు

- ★ తెగులు సోకని పైరు నుండి విత్తనాన్ని ఎంచుకోవాలి.
- ★ తెగులు తట్టుకొనే శక్తి గల రకాలు, స్వర్ణ, దీప్తి, ఇంద్ర, బాపట్ల సన్నాలు సాగు చేయాలి.
- ★ ఈ తెగులును నిర్మూలించే రసాయనాలు లేవు.
- ★ అధిక నత్రజని ఎరువును వాడవద్దు. అంతేకాక, తెగులు సోకిన పొలం నుండి నీటిని వేరే పొలంలోకి పోనివ్వకుండా జాగ్రత్త వహించాలి.

### టుంగ్రో వైరస్

- ★ ఈ వైరస్‌ను తట్టుకొనే రకాలైన వేదగిరి, భరణి, విక్రమార్క రకాల ను సాగుచేయాలి.
- ★ తెగులు ఆశించిన దుబ్బులను తీసి నాశనం చేయాలి.
- ★ పచ్చదీపపు పురుగులు ఈ తెగులును వ్యాప్తి చేస్తాయి. వీటి నివారణకు కార్బోఫ్యూరాన్ 10 కిలోలు ఎకరాకు లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా థయామిథాక్సామ్ 0.2 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

### అగ్గితెగులు

- ★ ఈ తెగులు తట్టుకొనే శక్తి గల రకాలను సాగు చేయాలి - విజేత, ప్రభాత్, సోనామసూరి, ఐ-ఆర్-64. యం.టి.యు. 9993, ఫల్గుణ, పినాకిని, తిక్కన, యన్.యల్.ఆర్. 34449, సింహపురి, శ్రీరంగ, స్వర్ణముఖి, వేదగిరి, సోమశిల, స్వాతి, అపూర్వ, సాగర్‌సాంబ, సుమతి, సలీమ, సార్థివ, శ్రీ కూర్మ మొదలగునవి.
- ★ కార్బండజిమ్ 3 గ్రా. లేదా ట్రైసైక్లోజోల్ 1 గ్రా/ కిలో విత్తనానికి కలిపి విత్తన శుద్ధిచేయాలి. ట్రైపైక్లోజోల్ 0.6 గ్రా. లీటరు నీటిలో కలిపి తెగులు సోకిన వెంటనే ఒకసారి, 15 రోజుల వ్యవధిలో మరోసారి పిచికారి చేయాలి.

### ఎలుకల నివారణ

విషపు ఎర పద్ధతిని 5-6 రోజులు సామూహికంగా నిర్వహిస్తే, మంచి ఫలితాలు కలుగుతాయి. చిరుపొట్ట దశకు ముందే ఎర మందుల ద్వారా సమర్థవంతంగా ఎలుకలను నివారించుకోవచ్చును.

#### పద్ధతి - 1

*1వ రోజు :* ఎలుకల బొరియలను గుర్తించి, విషం కలుపని ఎరను (98 పాళ్లు నూకలు, 2 పాళ్లు నూనె) ప్రతి కన్నంలో ఉంచాలి.

*2వ రోజు :* 10 గ్రా. విషపు ఎరను (96 పాళ్లు నూకలు, 2 పాళ్లు నూనె, 2 పాళ్లు జింక్ ఫాస్ఫైడ్ కన్నంలో ఉంచాలి.

*3వ/4వ రోజు :* అన్ని కన్నాలను మూసి, చనిపోయిన ఎలుకలను మట్టిలో పూడ్చి పెట్టాలి.

*5వ రోజు :* తిరిగి తెరచుకున్న బొరియలో రెండు అల్యూమినియం ఫాస్ఫైడ్ 0.6 గ్రా. బిళ్ళలను వేసి కన్నాలను మూసివేయవల యును. నల్లరేగగి భూములలో అల్యూమినియం ఫాస్ఫైడ్ బదులు బ్రోమాడయోలిన్ ఎరను 15 గ్రా. ప్రతి కన్నంలో వేయాలి.

*14వ రోజు* : రెండవసారి బ్రోమాడయోలిన్ ఎరను వాడాలి.

#### పద్ధతి - 2

*1వ రోజు :* ఎలుకలున్న కన్నాలను గుర్తించి 15 గ్రా. బ్రోమాడయోలిన్ ఎరను ప్రతి కన్నంలో ఉంచాలి.

*15వ రోజు :* రెండవ సారి కూడా ఎలుకలున్న కన్నంలో బ్రోమాడయోలిన్ ఎరను వాడాలి.

కన్నాలలో పొగపెట్టడం కూడా ఎలుకలను నివారించవచ్చు. ఇనుము కడవను గాలితో నింపి కొలిమి తగిలించి, కడవలోపల తడి గడ్డిని ఉంచి నిప్పు పెట్టాలి. గాలి విసురుగా తగిలేటట్లు బ్లోయర్‌ని త్రిప్పి కడవలోనికి వెళ్ళే కడవ మూతికి ఎలుక కన్నాన్ని కప్పి ఉంచే విధంగా అమర్చి 2-3 నిమిషాలు ఉదరపెడితే ఎలుకలు చనిపోతాయి.

*(వ్యవసాయ విశ్వవిద్యాలయ సౌజన్యంతో)*



# దుఃఖదాయినిగా ఉన్న గోదావరిని ప్రాణహితగా మార్చిన సర్ అర్థర్ కాటన్

**మే 15, 1803 సంవత్సరంన ఇంగ్లండులో కౌంబర్ మిల్ ఎచి అనే గ్రామంలో హెన్రీకాటన్ దంపతులకు 10వ సంతానంగా ఆర్థర్ కాటన్ జన్మించారు. వీరికి రాజ కుటుంబంతో దగ్గర సంబంధముండేది. వీరు మన దేశానికి ఉద్యోగం నిమిత్తం వచ్చేటప్పటికి వీరి వయస్సు కేవలం 18 సంవత్సరాలు మాత్రమే.**

అప్పటి మన దేశంలో పరిస్థితి చాలా కష్టంగా వుండేది. జలవనరుల విషయంలో మనది వర్ష ఆధారిత దేశం. ముఖ్యంగా దక్షిణ భారతదేశంలో మూడొంతుల మంది ప్రజలు వర్షాలపై ఆధారపడి తమ వ్యవసాయం కొనసాగించుకొని జీవించేవారు, అతి వర్షం లేక అనావృష్టి, లేదా వరదలు. కురిసిన వర్షంలో నీరు చాలా సముద్రం పాలయ్యేది. అవసరానికి చుక్కనీరు నిల్వ వుండేదికాదు. క్షామం, పంటలేమి, పస్తులు, ఆకలి రాజ్యమేలేవి. పంటనష్టం, ప్రాణనష్టంతో ప్రజలు సతమతమైపోయేవారు.

ముఖ్యంగా బ్రిటీష్ పౌరులు మన దేశంలో సహజసిద్ధంగా ఉన్న

## కాటన్ తన జీవితంలో విశేషంగా కృషి చేసిన అంశాలు


| | | |
|---|---|---|
| **1826-29** | : | పాంబన్ జలసంధి అభివృద్ధి |
| **1836-39** | : | 1. తాంజోర్ జిల్లాలో కావేరి డెల్టా అభివృద్ధి<br>2. కొలెరొాన్ ఆనకట్ట నిర్మాణం |
| **1936** | : | మద్రాసు హార్బరు పథకం అమలు |
| **1937** | : | మద్రాసు నుండి రెడ్‌హిల్స్ వరకు రైలు మార్గం నిర్మాణ పనులపై పర్యవేక్షణ |
| **1938-40** | : | విశాఖ నౌకాశ్రయ నిర్మాణం ప్రాజెక్టు పని |
| **1843-52** | : | ధవళేశ్వరం-విజ్జేశ్వరం మధ్య గోదావరిపై ఆనకట్ట |
| **1852** | : | గన్నవరం అక్విడెక్ట్ నిర్మాణం |
| **1856** | : | కృష్ణానదిపై ఆనకట్ట నిర్మాణానికి నివేదిక సమర్పణ |
| **1859** | : | ఒరిస్సా ప్రభుత్వానికి నీటి పారుదలపై నివేదిక |
| **1878** | : | తుంగభద్ర కాలువ నిర్మాణం-ఉత్తర భారతంలోని నదులను దక్షిణ భారత నదులతో అనుసంధానం చేయడంపై నివేదిక |

☆ బెంగాల్, ఒరిస్సా, బీహార్ ప్రాంతాల నదులను మానవ ఉపయోగంలోకి తీసుకురావడానికి ఎన్నో ప్రయోగాలు చేశారు.

☆ 1881లో మద్రాసు ప్రెసిడెన్సీలో భారతీయ నదుల అనుసంధానానికి ఒక విస్తృత పథకం తయారు చేసి సభకు సమర్పించారు.

1. సట్లెజ్‌ని - 'జమున'తో కలిపే నిర్మాణం
2. గోదావరిని పొడిగించి 'తపతీ' తో కలపడం
3. కాకినాడ - సూరత్‌కు మధ్య జలమార్గం
4. తుంగభద్ర - కార్వార్ నగరం వద్ద సముద్రంలో కలయిక
5. బెంగాల్ నుండి తీర కాలువ కలకత్తా నుండి కన్యాకుమారి వరకు, తూర్పు తీరంగా విస్తరించి పశ్చిమ తీరం వైపు తిరిగి కార్వార్ వరకు
6. మద్రాసు నుండి బయలు దేరి కర్నాటక ద్వారా సోనాని వరకు
7. గోదావరి వార్ధాల మీదుగా 'తపతి' వెంట సూరత్ వరకు అతి తక్కువ ఖర్చుతో ప్రణాళిక రచించారు. ఈ కాలువల వల్ల వేల మైళ్ళ పొడుగునా జలమార్గాలు-వ్యవసాయం, త్రాగునీటి సమస్య పరిష్కారంతో దేశం సస్యశ్యామలమయ్యేలా ప్రణాళిక రచించారు.

ముడి ఖనిజాలు, బంగారం, వజ్రవైడుర్యాలను దోచుకెళ్ళేవారు. అందుకు కావలసిన రవాణా మార్గాలు, జలమార్గాలు మన దేశంలో లేవు. అందుకోసం రవాణా మార్గాలు, జలమార్గాలు ఏర్పాటుకు నదుల మీద ఆనకట్టలు నిర్మించేవారు.




నాణ్యానికి బొమ్మబొరుసు వున్నట్లే, అక్కడ నుండి మనదేశానికి వచ్చిన అధికారుల్లోనూ మన ప్రజల సంక్షేమం కొరకు తమ జీవితాంతం కష్టపడ్డ మహానుభావులు అనేకమంది ఉన్నారు. వీరిలో మరచిపోలేని మొదటి వ్యక్తి సర్ అర్థర్ కాటన్.

కరువులు బారిన పడకుండా పూర్వం రాజులు నీటి నిల్వ కోసం, పంటల కోసం చెరువులు త్రవ్వించే వారు. అంతేకాక, కరువు కాటకాలలో పని కల్పించడానికి కూడా మట్టి పని చేయించేవారు.

వీరు తమిళనాడులో మొదటగా సరిచేసిన అంశం చెరువుల మరమ్మతులు. నిర్వహణ లేక ప్రజలు పడే ఇబ్బందిని గమనించి త్రాగడానికి అవసరమైన నీరు, వ్యవసాయానికి నీటి సరఫరా పైన దృష్టి కేంద్రీకరించి, చెరువులకు మరమ్మత్తులు చేయించి, ప్రజల అవసరాలు, వలసల నివారణ, బీడు భూములు అభివృద్ధి వైపు మొదటి అడుగు వేశారు.

కాటన్ తన జీవితాన్ని నీటి పారుదల, నావికాయోగ్యమైన కాలువలు, ఆనకట్టలు నిర్మించడానికి దారపోసారు.

మొదట కావేరినది మీద ఆనకట్ట నిర్మించారు. వీరి ప్రతిభ చూచి, గోదావరి నది మీద కూడా వంతెన నిర్మించడానికి ప్రభుత్వం వీరిని నియమించింది.

18వ శతాబ్దంలో అతివృష్టి, కరువు, వరద ముంపులకు లోనైన గోదావరి నదిపై ఆనకట్ట నిర్మించడానికి తీవ్రమైన కృషి చేసారు. గోదావరి నదీ తీరాన నెలల తరబడి నడిచేవారు. సునిశిత పరిశీలన, అధ్యయనం చేసేవారు. వీరి నివేదిక ప్రకారం, ఆనకట్ట నిర్మించే అధికారాన్ని కాటన్ గారికే ఇచ్చింది ప్రభుత్వం. నది తీరంలోనే రేకుల షెడ్డు వేసుకొని, ఎండకు వానలకు వెరవక నిరంతరం ఆనకట్ట నిర్మాణంలోనే గడిపేవారు. వీరి వాహనం వీరి గుర్రం మాత్రమే. ఆనకట్టకు కావలసిన చాలా సామాగ్రి లోకల్‌గానే తయారు చేయించే వారు. దొరకని సామాగ్రిని విదేశాల నుండి తెప్పించుకున్నారు. 5 సంవత్సరాలలోనే ఆనకట్ట పూర్తయింది. క్షామ పీడితమైన గోదావరి సస్యశ్యామలమైంది.

వీరు మన దేశంలో నుండగా తెలుగు, తమిళం, ఉర్దూ నేర్చుకున్నారు. గల గల గోదావరి పరుగులిడుతూ సముద్రంలో చేరడానికి దూసుకొస్తున్న సమయంలో, పరుగులను నడకలుగాను, నడకను నిలకడ చేసి ధవళేశ్వరం వద్ద ఆనకట్ట నిర్మించి ఉభయగోదావరి జిల్లాల ప్రజల హృదయాలలో ప్రశాంతత నింపి, దాదాపు 6 లక్షల ఎకరాల భూమిని సాగులోనికి తీసుకువచ్చిన అపర భగీరధుడు కాటన్‌గారు.

గోదావరి నీటిని సేకరించి శుభ్రం చేసి పట్టంగాలకు పంపే ఏర్పాటు మొట్ట మొదటిసారి చేసిన ఘనత వీరిదే. కాటన్ దొర అని అభిమానంగా పిల్చుకొనే 'సర్ అర్థర్ కాటన్' బ్రిటీష్ సైనికాధికారి మాత్రమే కాక, నీటిపారుదల ఇంజనీర్ కూడా. ఉభయగోదావరి జిల్లాల్లో వీరి శిలా విగ్రహాలు దాదాపు 3000 వరకు వున్నాయంటే, ఈయన ఎంతగా ప్రజల హృదయాలను చూరగొన్నారో అర్థమవుతుంది. ఈయనకు 1860లో 'సర్' అనే బిరుదు ప్రదానమైంది.


వీరి సేవలను దృష్టిలో పెట్టుకొని భారత ప్రభుత్వం వారు ధవళేశ్వరం ఆనకట్ట దగ్గరగా ఆనకట్ట కట్టడానికి ఉపయోగించిన కార్యాలయాన్ని మ్యూజియంగా తీర్చిదిద్దారు. ఇక్కడ 160 సం॥రాల నాటి పురాతన యంత్రాలను జాగ్రత్త చేసారు. కాటన్ దొర జీవిత విశేషాలు, ఇతర చోట్ల జరిగిన పనుల నమూనాలు ఇక్కడ వున్నాయి. గోదావరి నాసికలో పుట్టి బంగాళా ఖాతంలో కలిసే వరకు చూపించే నమూనా కూడా ఉంది.

వీరికి 1850లో 'కల్నల్' హోదా లభించింది. 1860లో పదవీ విరమణ చేసి ఇంగ్లండుకు వెళ్ళిపోయినా, తిరిగి ఇండియా వచ్చి, 'సోనా' ప్రాజెక్టుకు సలహాలిచ్చారు. వీరు అప్పుడప్పుడు అనారోగ్యానికి గురైతన దేశానికి వెళ్ళినా, అక్కడ నుండి సాంకేతిక సలహాలు ఇచ్చేవారు.

ఆంధ్రప్రదేశ్‌కు వీరు చేసిన సేవలు ఎనలేనివి. నిస్వార్థ ప్రజా సంక్షేమ నిరతుడు, వీరి కృషికి గాను నేటికి గౌరవింపబడుతున్నారు. ఇంకనూ గౌరవింపబడుతూ వుంటారు. వీరు 96 సం॥రాల 2 నెలలు జీవించారు.

వీరి జ్ఞాపక చిహ్నంగా హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై సికింద్రాబాద్ నుండి వెళితే 8వ స్థానంలో అల్లూరి సీతారామరాజు తర్వాత 'సర్ అర్థర్ కాటన్' గారి విగ్రహం ఏర్పాటు చేసింది రాష్ట్ర ప్రభుత్వం. కాటన్ గారు తెలుగు ప్రజల వికాసానికి దారి ఏర్పాటు చేసిన గొప్ప మానవతావాది, గొప్ప ప్రజా సంక్షేమకులు. మొత్తం భారతీయులందరు కాటన్‌గారికి రుణగ్రస్తులు, వీరి కృషి, భారతీయులకు వీరు చేసిన సేవల వల్ల వారు ప్రజల గుండెల్లో నిలిచేవున్నారు.

*- ఎన్. రాజేశ్వరమ్మ, యం.పి.డి.ఓ*
*విజయపురంమండలం, చిత్తూరు జిల్లా*



# పశువుల్లో మేలు జాతి - ఒంగోలు జాతి

**ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి గర్వకారణం ఒంగోలు జాతి పశువులు. భారీ శరీరం, భారీ మోపురం, అందమైన గంగడోలు, తెల్లని రంగుతో గంభీరంగా, రాచఠీవితో నడిచే ఒంగోలు జాతి పశువులు పనికి, పాడికి మన దేశంలోను, మాంసానికి విదేశాలలోను విశిష్ఠమైన స్థానాన్ని పొందాయి. మనదేశానికి కోహినూర్ వజ్రం వల్ల వచ్చిన కీర్తి కంటే, మన ఒంగోలు జాతి ఆంబోతుల వల్ల వచ్చిన కీర్తే గొప్పదని చెప్పడంలో అతిశయోక్తి లేదు.**

ఒంగోలు జాతి పశువుల్ని నెల్లూరు, బ్రాహ్మణ్ జాతి పశువులుగా కూడా పిలుస్తారు. ఈ జాతి పశువులు నెల్లూరు, ఒంగోలు, గుంటూరు జిల్లాలలో అభివృద్ధి చెందాయి. ఈ జాతి అమెరికా, ఆస్ట్రేలియా, ఆఫ్రికా, బ్రెజిల్ వంటి దేశాలలో తన ప్రత్యేకతను చాటుకుంటూ ఉన్నది. ప్రత్యేక అవసరాలకు అనుగుణంగా మన ఒంగోలు జాతి పశువులను ఆయా దేశాలలోని పశువులతో సంకరపరచి, వారి పశుసంపద విలువలను పెంచుకుంటున్నారు.

బ్రెజిల్ దేశీయులు 5-6 దశాబ్దాల క్రితమే 60 వేల రూపాయలకు పైగా ధర చెల్లించి మన ఒంగోలు ఆంబోతులను ఆ దేశానికి తరలించి, వాటి ద్వారా వారి స్థానిక రకాలను అభివృద్ధి పరచగా, అదే సంతతి ఆంబోతుల వీర్యాన్ని మరల మనమే దిగుమతి చేసుకొనే పరిస్థితి రావడం బాధాకరం.

అత్యధిక స్వేదగ్రంథులు, వదులైన నల్లనిచర్మం మీద తెల్లని వెంట్రుకల కవచం ఉండటం వల్ల ఈ జాతి పశువులు ఎండను, వేడిని తట్టుకొనగలవు. నాసిరకం మేతను సైతం సమర్థవంతంగా వినియోగించుకొనగలిగిన ఈ పశువులు కరువు ప్రాంతాలలో సైతం మనుగడ సాధించగలవు. ఈ పశువుల నుండి వెలువడే ప్రత్యేక వాసనలు కొన్ని ప్రమాదకర వ్యాధుల్ని వ్యాపింపచేసే కీటకాలను దరిచేరనీయక పోవటం గమనార్హం. వ్యాధి నిరోధక శక్తి కూడా ఈ పశువులలో చాలా ఎక్కువ.

ఇతర జాతి పశువుల్లో ఎక్కువగా కనిపించే ఈనె సమస్యలు, బాలింత సమస్యలు, కంటి కాన్సరు ఈ జాతి పశువులలో చాలా తక్కువ. ఎంపిక చేసిన ఒంగోలు పశువుల మధ్య వ్యూహాత్మంగా బ్రీడింగ్ చేయగల్గితే, ఆ సంతతి నుండి రోజుకు 10 నుండి 12 లీటర్ల వరకు పాలను పొందవచ్చును.

భారీ మోపు కలిగిన ఈ జాతి పశువుల పాలు, పెరుగు, నెయ్యి, పేడ, మూత్రాలు ఇతర ఉత్పత్తులకు ఆయుర్వేద వైద్యంలో వున్న ప్రశస్థి మరి ఏ ఇతర భారతీయ జాతులలో గానీ, ముఖ్యంగా విదేశీ జాతి, సంకర జాతి పశువులలో వుండదని ఆ రంగంలోని నిపుణుల నమ్మకం.

అటు పాడికి, ఇటు పనికి రెండు విధాలుగా భారతీయులకు అంది వచ్చే ఈ పశువు ఆడదైనా, మగదైనా యజమానికి సమానంగా ఆదాయాన్ని, ఆనందాన్ని అందిస్తుంది. తల్లి గర్భం నుండి బైటకు వచ్చిన కొద్ది నిముషాలలోనే తనంత తానే లేచి నిలబడి స్వయంగా పాలు కుడిచి, ఆ తర్వాత అతి తక్కువ కాలంలోనే నడిచి, పరిగెత్తగలగటం ఒంగోలు దూడలలో ప్రత్యేక లక్షణం.

### ఒంగోలు జాతి, పశువుల లక్షణాలు

ఆంబోతులు 800 నుండి 1000, ఆవులు 450 నుండి 650 కిలోల శరీర బరువుతో గంభీరంగా, ఠీవిగా వుంటాయి. పుట్టినప్పుడు 25 కిలోల



పచ్చికబీళ్ళు అంతరించి పోవడం, నాణ్యమైన పశుగ్రాసాలు లభ్యం కాకపోవడం, ఇతర పశువుల్లో ఎదురయ్యే ఆరోగ్య సమస్యలు, సేంద్రీయ ఎరువులకు పెరుగుతున్న ఇంధన వనరులు వంటి అనేక కారణాల రీత్యా అంతరించిపోతున్న అమూల్యమైన ఒంగోలు జాతికి పూర్వ వైభవం తీసుకురావలసిన అవసరం ఎంతో వుంది.

అనాలోచితంగా మన ఒంగోలు జాతిని, విదేశీ రకాలతో కలుషితం చేసి నిర్వీర్యం చేయడం, మనం కూర్చున్న చెట్టును మనమే నరుక్కోవడం వంటిదే. పాడికి, పనికి, (విదేశాలలో అయితే మాంసానికి) అగ్రస్థానంలో ఉండే లక్ష్యంతో మన ఒంగోలు జాతికై కృత్రిమ గర్భోత్పత్తి, పిండమార్పిడి, క్లోనింగ్ వంటి అత్యాధునిక శాస్త్రీయ విధానాల ద్వారా పునరుద్ధరించి మన భావితరాలకు ఒక అమూల్య పశుజాతిని వారసత్వంగా అందించటం ఈతరం ప్రతినిధులుగా మనందరి బాధ్యత.

ఇప్పటికైనా ఒక ప్రత్యేక సంస్థ ద్వారా ఈ ఒంగోలు జాతిని పునరుద్ధరించవలసిన అవసరాన్ని మన పాలకులు గుర్తించాలి. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఒక జాయింట్ డైరెక్టర్ స్థాయిలో పశుసంవర్ధక శాఖాధికారిని నియమించి ఈ జాతి అభివృద్ధిని వృద్ధి చేయాలి.

బరువు ఉండే దూడలు, ఆరు నెలల్లో అతి వేగంగా పెరిగి 240 నుండి 250 కిలోలకు చేరి దేశీయ పశువులలోనే అగ్రస్థానంలో ఉన్నాయి.

ఎత్తుగా, పొడవుగా బలిష్ఠంగా రాజ ఠీవితో కూడిన నడక ఒంగోలు జాతి ప్రత్యేకత. పటిష్ఠమైన పొట్టివైన మొద్దుబారిన కొమ్ముల కొనలు, పెద్దవైన చెవులు, నల్లని కనుపాపల మధ్య కోడిగ్రుడ్ల అకృతి కలిగిన చురుకైన కనుగుడ్లు, నల్లని విశాలమైన చిరుముట్టి క్రింద విశాలమైన నాసికారంధ్రాలు, పటిష్ఠమైన పొట్టి మెడ నుండి వ్రేలాడే బరువైన గంగడోలు, భుజాలు, తొడల నుండి ప్రక్కలకు విస్తరించి నిటారుగా ఉండే బలమైన కాళ్ళు, అందంగా వంగిన పటిష్ఠమైన ప్రక్కటెముకలు, మోపురం నుండి తోక వరకు ఏకమట్టంగా ఉండే వీపు, నల్లని కుచ్చుతో బలిష్టంగా మోకాళ్ళ వరకు ఉండే తోక తదితర విశిష్టలక్షణాలు ఒంగోలు జాతికే సొంతం.

నవనలుపులుగా పిలవబడే నల్లని చెవుల చివరలు, కనుబొమ్మలు, మోకాళ్ళ గిట్టలు, పురుషాంగపు చర్మం, తోక మొదలు క్రింద భాగం, మానం, మానం క్రింది భాగం, అంబోతులలో వృషణాలు నలుపు రంగులో ఉండటం ఈ పశువుల విశిష్ఠ లక్షణాలు.

క్రమశిక్షణ, విధేయత, విశ్వాసాలకు పేరెన్నికగన్న ఈ జాతి ఎడ్ల జత మంచి మీద రెండు టన్నుల బరువును సునాయాసంగా లాగగలవు. మంచి నిర్వహణలో ఉండే ఎద్దును, ఒక చిన్న పుల్లకు యజమాని కట్టివేసినప్పటికీ, తమ పరిధిని దాటకుండా అక్కడే నిలిచి వుండటం ఈ పశువుల విధేయతకు చిహ్నం. ఇక చావిళ్ళలో చలాకీగా పరుగులు తీసే ఆవు దూడలు ఇచ్చే ఆనందం, మరి ఏ పెంపుడు జంతువు ఇవ్వదని చెప్పవచ్చు. అందంతో పాటు, సున్నితత్వం, విధేయత కలిగిన ఒంగోలు ఆవుల్ని చూస్తే మతాలకతీతంగా ఎవరికైనా పూజ్య భావం కలుగుతుంది.

సుమారు 4 నుండి 4.5 శాతం వెన్నతో, రోజుకు 6 నుండి 8 లీటర్ల వరకు పాలను ఇవ్వగల ఒంగోలు ఆవులు ఈతలో 2000 నుండి 2500 లీటర్ల వరకు మంచి ధర పలికే పాలను ఇవ్వగలవు. సంకర జాతి, విదేశీ పశువుల్లో మనకు ఎదురయ్యే అనేక పునరుత్పత్తి సమస్యలు గానీ, పొదుగు వాపు గానీ మన ఒంగోలు ఆవుల్లో అంతగా కనిపించవు.

## లాభదాయకంగా పశువుల పోషణ- లేగదూడల సంరక్షణ

★ లేగదూడలను జాగ్రత్తగా సంరక్షించి పోషిస్తే భవిష్యత్తులో చక్కటి పాడి పశువులుగా రూపొందుతాయి.

★ దూడలు పుట్టగానే శ్వాస సరిగ్గా పీల్చుకునేలా ముక్కులను పొడి గుడ్డతో శుభ్రం చేయాలి.

★ దూడలు పుట్టగానే వెంటనే బొడ్డు క్రింద 2 అంగుళాలు వదలి కత్తిరించి, వ్రేలాడే మిగతా భాగంలో టింక్చర్ అయోడిన్ అద్ది 'బొడ్డువాపు' రాకుండా చూడాలి.

★ దూడలు పుట్టిన గంటలోగా జున్నుపాలు సమృద్ధిగా తాగించాలి. ఆ తర్వాత మొదటి 3 రోజులు రోజుకు నాలుగైదు సార్లు జున్ను పాలు త్రాగించాలి. జున్ను పాలలో శక్తినిచ్చే పోషణాలు, వ్యాధినిరోధక శక్తిని పెంపొందించే యాంటీబాడీలు, విటమిన్లు ఖనిజ లవణాలు ఉంటాయి.

★ లేగదూడలు ఆరోగ్యంగా వృద్ధి చెందడానికి పుట్టిన



మొదటిరోజు టి.టి. ఇంజక్షన్, 4, 5వ రోజు యాంటి బయాటిక్ మందులు, 6వ రోజు విటమిన్ 'ఎ' తగు మోతాదులో ఇవ్వాలి.




## చూడి పశువుల సంరక్షణ

- ✯ చూడి కాలం సాధారణంగా ఆవుల్లో 280 రోజులు, గేదెల్లో 310 రోజులు ఉంటుంది.
- ✯ చూడి పశువు ప్రతి ఈతకు గర్భ స్రావాలు సంభవిస్తుంటే గమనించి, పశువైద్యునిచే వ్యాధి నిర్ధారణ చేయించి, తగిన మందుల్ని వాడాలి.
- ✯ పాలు ఇచ్చే చూడి పశువులు ఈనడానికి 2 మాసాల ముందే నుండే పాలు పితకడం మానివేయాలి. రోజు ఒకసారి, తర్వాత 2 రోజులకొకసారి చొప్పున పాలు పితుకుతూ, 10 రోజుల్లో క్రమ క్రమంగా పాలు పితకడం మానివేయాలి.
- ✯ పశువుల చూడి చివరి 3 మాసాల్లో మేపు పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటే గర్భంలోని పిండం త్వరగా ఎదిగి, బలంగా, ఆరోగ్యంగా ఉండే దూడలు జన్మిస్థాయి.
- ✯ చూడి పశువులను ఇతర పశువులతో పాటు మందతో పంపించకూడదు. గాలి, వెలుతురు దారాళంగా ప్రసరించే కొట్టాల్లో ఉంచాలి.
- ✯ పశువుని ఈనే ముందు పశువుని, పశువులశాలను శుభ్రపరచాలి. పశువులు ఈనడానికి 2 గంటల ముందు జొన్న, రాగులు, సజ్జలు మొదలగు వాటిని నలగగొట్టి, ఉడికించి, కొద్దిగా ఉప్పు, బెల్లం కలిపి అందివ్వాలి. పచ్చిగడ్డి కూడ కొద్ది కొద్దిగా ఇవ్వాలి.
- ✯ పశువులు ఈనిన తర్వాత 2 నుండి 8 గంటల్లో మాయవేస్తాయి. ఇంతకంటే ఎక్కువ సమయం తీసుకుంటే పశువైద్యుని సహాయం తీసుకోవాలి.
- ✯ అధిక పాల దిగుబడి ఉండే పశువులు ఈనిన వెంటనే 2 రోజుల వరకు పాలను సంపూర్ణంగా పితుకకూడదు.

## పశువుల్లో ఆరోగ్య పరిరక్షణ

- ✯ పశువుల్లో గాలికుంటు, గురక, దొమ్మ మొదలగు అంటువ్యాధులు సోకడం వల్ల పశువులు ఎక్కువ సంఖ్యలో మరణిస్తాయి. వ్యాధులు సోకకుండా ముందే వ్యాధి నివారణ టీకాలు వేయించాలి.



- ✯ పశువులకు సోకే గాలికుంటు వ్యాధి నివారణకు సంవత్సరానికి 2 సార్లు, గొంతు వాపు, జబ్బవాపు వ్యాధి నివారణకు తొలకరిలో ఒకసారి టీకాలు వేయించాలి.
- ✯ సంకర జాతి ఆవుల్లో థైలీ రియాసిస్ వ్యాధి నివారణకు, చూడిపశువుల్లో బ్రూసెల్లాసిస్ వ్యాధి సోకి ఈసుకుపోతున్న సందర్భాల్లో పశువైద్యుల సలహాపై ప్రత్యేకంగా టీకాలు వేయించాలి.

## పశువుల్లో పునరుత్పత్తి

- ✯ ఈనిన పశువుల్ని 45-90 రోజుల్లో తిరిగి చూడి కట్టాలి. ఇలా పొర్లించడం వల్ల పశువుల్లో వట్టిబోయే కాలం తక్కువగా (2 మాసాలు) మాత్రమే ఉండి ఎక్కువకాలం (10 మాసాలు) పాల దిగుబడి ఉంటుంది.
- ✯ ఆవుల్లో ఎదకాలం 24 గంటలు, గేదెల్లో 24-36 గంటలు ఉంటుంది. ఆరోగ్యమైన పశువులు 3 వారాలకొకసారి తిరిగి ఎదకొస్తాయి.
- ✯ పశువులు ఉదయం ఎదకు వస్తే సాయంత్రం, సాయంత్రం ఎదకు వస్తే మరునాటి ఉదయం వీర్యదానం చేయించాలి. ఎద మధ్యకాలం నుండి చివరి దశకు చేరేప్పుడు అంటే ఎద ప్రారంభమైన 10-12 గంటల తర్వాత వీర్యదానం చేయిస్తే చూడి కట్టే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.
- ✯ పశువులు పొర్లిన 2 మాసాల తర్వాత చూడి నిర్ధారణ పరీక్ష చేయించి చూడి నిలువని పశువుల్ని తిరిగి వెంటనే ఎదకు వచ్చి పొర్లే విధంగా చికిత్స చేయించాలి.

ఒంగోలు జాతి పశువులు అందంగా ఉండటమే కాకుండా, పాల ఉత్పత్తికి మరియు పశుసంపదకు, పాడికి, పనికి ఈ జాతివి చాలా ఉపయోగపడతాయి. క్రమశిక్షణకు, విధేయత, విశ్వాసాలకు పేరెన్నిక గన్న ఈ జాతి ఎడ్ల జత మంచి బండి మీద 2 టన్నుల బరువును సునాయసంగా లాగగలవు. వ్యవసాయ సేద్యానికి బాగా ఉపయోగపడతాయి.

*- ఎమ్. మొగలయ్య*
*ఫ్యాకల్టీ మెంబర్, సిఎన్ఆర్ఎమ్, అపార్డ్*




# 'రేబిస్' నుండి రక్షణ పొందటం సులువే !

**'రేబిస్' అనే వ్యాధి ఆ జబ్బు బారిన పడిన కుక్కలు-ముఖ్యంగా వీధికుక్కల ద్వారా మనుషులకు వ్యాపిస్తుంది. ఎన్ని చర్యలు తీసుకుంటున్నా ఈ సమస్య ఎక్కడో ఒక చోట తరచూ తలెత్తుతూనే ఉంది. అయితే సమస్య తీవ్రత తగ్గాక అందరూ దాని గురించి మర్చిపోవటం, మళ్ళీ ఎదురైతే రకరకాలుగా రాద్ధాంతం చేయటం మామూలైపోయింది. అందుకే రేబిస్ వ్యాధిని పూర్తిగా అరికట్టి, అందరికీ ఆరోగ్యభద్రత అందించాలంటే ముందుగా దానిగురించి సరైన అవగాహన కల్పించటం అవసరం.**

రేబిస్ అనేమాట 'రబాస్' (హింసించడం) అనే సంస్కృతపదం నుండి వచ్చింది. (ఇదే అర్థాన్నిచ్చే ఒక లాటిన్‌పదం నుండి వచ్చిందని కూడా చెప్తారు). 'రేబిస్' అనేది ఒక 'జూనోటిక్' (జంతువులనుండి మనుషులకు సంక్రమించే) వ్యాధి. ఇది రేబిస్ అనే వైరస్ వల్ల జనిస్తుంది. రేబిస్ వ్యాధి ఉన్న ఏదైనా జంతువు మరొక జంతువును కరిచినప్పుడు, కరిచిన జంతువు, లాలాజలం ద్వారా గాయపడిన జంతువు శరీరంలోకి రేబిస్ క్రిములు ప్రవేశిస్తాయి.

రేబిస్ వ్యాధి ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాలలో ఉంది. ఇందుకు సంబంధించిన గణాంకాలు చాలా ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి. ప్రపంచంలో ఏటా 50,000 మంది రేబిస్ వ్యాధి వల్ల చనిపోతున్నారు. ఈ మరణాలు కూడా ఆసియా, ఆఫ్రికా దేశాలలోనే ఎక్కువగా సంభవిస్తున్నాయి. ఒక్క ఇండియాలోనే ఏటా 30,000 మంది ఈ వ్యాధి బారినపడి మరణిస్తున్నారంటే, మనదేశంలో వ్యాధి తీవ్రత ఎంతుందో అర్థం చేసుకోవచ్చు.

2006 నాటికే ఆస్ట్రేలియా, నార్వే, స్వీడన్, తైవాన్, యునైటెడ్ కింగ్‌డమ్, స్కాండినేవియా, మలేషియా మొదలైన దేశాలలో ఈ వ్యాధి పూర్తిగా నిర్మూలించబడింది. అమెరికాలో మాత్రం ఏటా ఒకరిద్దరు ఈ వ్యాధివల్ల మరణిస్తున్నారని, ఒక 1994లో మాత్రం అత్యధికంగా 6 కేసులు నమోదయ్యాయని అధికారిక లెక్కలు తెలుపుతున్నాయి.

**జూలై 6వ తేదీ 'రేబిస్' వ్యతిరేకదినం**

వాస్తవానికి ఒక జంతువులో రేబిస్ వైరస్ ఉన్నదనే విషయాన్ని ఆ జంతువు మెదడులోని కణాలను పరీక్షిస్తే తప్ప సాధ్యపడదు. కానీ, సదరు జంతువు ప్రవర్తన ఆధారంగా రేబిస్ వ్యాధిని, దాని తీవ్రతను అంచనా వేయవచ్చు. రేబిస్ వ్యాధి పెంపుడు జంతువులకు, అడవి జంతువులకు వేటికైనా రావచ్చు. అయితే, ప్రస్తుత సమస్య మన పల్లెల్లో, పట్టణాల్లో సంచరించే కుక్కలవల్ల వ్యాప్తిచెందే రేబిస్‌దే. కుక్కలలో కూడా- పెంపుడు కుక్కలలో కంటే, వీధికుక్కలలోనే ఎక్కువగా ఈ రేబిస్ వ్యాధి ఎక్కువగా తలెత్తుతోంది.

రేబిస్‌వ్యాధి సోకిన కుక్క మరో కుక్కను కరిచినప్పుడు వ్యాధి లక్షణాలు వెంటనే కనిపించవు. కరిచిన 3-8 వారాల (పిల్లలలో 2-6 వారాలు) వరకు ఎటువంటి లక్షణాలు కనిపించకపోవచ్చు. కొన్ని కేసుల్లో పది రోజుల తరువాత ఆ లక్షణాలు కనిపించొచ్చు. అందుకే, మనుషుల్ని కుక్క కరిస్తే, పదిరోజులు దానిని గమనించాలని చెప్తారు. రేబిస్ వ్యాధి సోకిన కుక్క మనిషిని కరిస్తే - మనిషిలో ఆ లక్షణాలు 3-6 వారాల మధ్య కనిపిస్తాయి. (ఒక్కొక్కసారి 3 నెలలు కూడా పట్టొచ్చు) వ్యాధి లక్షణాలు కనిపించిన తరువాత ఎటువంటి మందులు వాడినా ఫలితం శూన్యం. అందుకే, కుక్క కరిస్తే - అనుమానం ఉంటే, వెంటనే వైద్యం ప్రారంభించటం ఎంతైనా అవసరం.

రేబిస్ వ్యాధి సోకిన కుక్క ప్రవర్తనను బట్టి చాలావరకు వ్యాధి తీవ్రతను అంచనా వేయవచ్చు. అసాధారణంగా, పిచ్చిపిచ్చిగా ప్రవర్తించడం, తనను తానే కరుచుకోవటం, పళ్ళుకొరకటం, చెక్కముక్కలు, రాళ్ళు వంటివాటిని కొరకటం, అడ్డువచ్చినవారిని కరవటం, కళ్ళు ఎర్రగా మారి, పుసులు కారటం, నోటివెంట నురగతో కూడిన చొంగ కారటం మొదలైన లక్షణాలు వ్యాధిసోకిన జంతువులో కనిపిస్తాయి. ఆ పైన నెమ్మదిగా వ్యాధి తీవ్రతరమై, పక్షవాతం వచ్చి, తరువాత శారీరకంగా మరింత బలహీనపడి చివరకు ఆ కుక్క దయనీయమైన స్థితిలో చనిపోతుంది.


రేబిస్ వ్యాధి సోకిన కుక్క కరవటం ద్వారా ఆ వ్యాధి మనిషికి

సంక్రమిస్తే-కుక్కలో కనిపించే లక్షణాలే వ్యాధి సోకిన మనిషిలోనూ కనిసిస్తాయి. రేబిస్ వ్యాధి సోకిన కుక్క మనిషిని కరిచిన ప్రదేశాన్ని బట్టి వ్యాధి తీవ్రత ఉంటుంది. అంటే, కాళ్ళపై కరిచిన దానికంటే ముఖంపై కరిచిన కాటువల్ల రేబిస్ త్వరగా సోకుతుంది. మనిషి మెదడుకు ఎంత దగ్గరగావున్న భాగంలో కరిస్తే, అంత త్వరగా వ్యాధి తీవ్రత ఉంటుంది. కరిచిన కుక్క లాలాజలంలో ఉండే రేబిస్ క్రిములు ముందుగా గాయం ఏర్పడినచోట నరాల్లో ప్రవేశించి, మెల్లగా మెదడుకు చేరతాయి. రేబిస్ వ్యాధి సోకిన 20-60 రోజులలో పూర్తి లక్షణాలు బయటపడతాయి. ఆకలి మందగించి పోవటం, తలనొప్పి, వికారం, వాంతులు, జ్వరం వంటివి ముందుగా కనబడతాయి. పూర్తిగా శరీరంలో వ్యాధి వ్యాపిస్తే రేబిస్ క్రిములు మనిషి లాలాజలం, చర్మం, పాంక్రియాస్, మూత్రపిండాలు, గుండె, కంటి రెటీనా మొదలైన అన్ని ప్రదేశాలకు వ్యాపిస్తాయి.

రేబిస్ వ్యాధి సోకిన మనిషులు (కుక్క కూడా) నీటినిచూస్తే విపరీతంగా భయపడతారు. నీళ్ళు తాగాలంటే గొంతుపట్టేసి, నీరు తాగలేకపోవటం, భరించలేని గొంతు నొప్పికి గురికావటమే ఇందుకు కారణం. అందుకే రేబిస్ వ్యాధిని హైడ్రోఫోబియా అని కూడా పిలుస్తారు.

రేబిస్ వ్యాధి కేవలం కుక్కల ద్వారానే కాకుండా, పిల్లులు, గబ్బిలాల ద్వారా కూడా మనుషులకు సంక్రమించే అవకాశం ఉందంటున్నారు నిపుణులు. అందుకే, ఇళ్ళల్లో పెరిగే పిల్లులు, గుళ్ళల్లో తిరిగే గబ్బిలాల విషయంలో కూడా తగు జాగ్రత్తలు తీసుకోవటం అవసరం. సరైన జాగ్రత్తలు తీసుకుంటే రేబిస్ వ్యాధి అనేది అసలు తలెత్తకుండా చేయటం చాలా సులువే. ముందుగా పెంపుడు కుక్కలకు పుట్టిన వాటికి 6 వారాలకు ఒక ఎ.ఆర్.వి. (యాంటి రేబిస్ వేక్సిన్) ఇంజెక్షన్ (1.0 ఎం.ఎల్) వేయించాలి. ఆ తరువాత మళ్ళీ ప్రతి సంవత్సరం ఒక ఇంజెక్షన్ చేయించాలి. ప్రస్తుతం-రక్షారేబ్, నోబివేట్, రేబివైన్, రేబీవేక్ అనే ఎ.ఆర్.వి.లు అందుబాటులో ఉన్నాయి.

రేబిస్ వ్యాధి రాకుండా చూసుకోవటం ఉత్తమమైన పద్ధతి. వచ్చిన తరువాత, తీవ్రమైన వ్యాధి లక్షణాలు బైటపడ్డాక మరణం మినహా మందులేదు. అందుకే అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకొని వ్యాధి రాకుండా చేసుకోవటమే ఉత్తమం. ప్రమాదవశాత్తు ఏదైనా కుక్క కరిస్తే తక్షణమే గాయాన్ని సబ్బునీటితో కడిగి (కరిచిన గాయానికి ఎటువంటి పరిస్థితుల్లోను కుట్లు వేయరాదు) వెంటనే సరైన వైద్యుని సంప్రదించాలి. వ్యాధి లక్షణాలు కనిపించకముందే సరైన చికిత్సపొందితే నూటికి నూరుశాతం రేబిస్ రాకుండా చూసుకోవచ్చు.




అయినప్పటికీ, ప్రమాదవశాత్తు ఒకవేళ రేబిస్ వ్యాధి సోకిన కుక్క మనుషుల్ని కరిస్తే, వెంటనే యాంటి రేబిస్ వేక్సిన్ వేయించు కోవాలి. 0,3,7,14,30,90 రోజులలో ఒక్కొక్క డోస్ చొప్పున (1.0 ఎం.ఎల్) ఎం.ఆర్.వి., ఇంజక్షన్ చేయించుకోవాలి. పిల్లలకైనా, పెద్దలకైనా ఇదే మోతాదులలో వేక్సిన్ వేయించాలి. రేబిపూర్, అభయరేబ్, వేరోరేబ్ అనే ఇంజెక్షన్లు అందుబాటులో ఉన్నాయి.

ముఖ్యంగా, రేబిస్ సోకిన కుక్క మనిషి ముఖంమీద కరిస్తే, ఇమ్యునోగ్లోబ్లిన్స్ అనే ఇంజెక్షన్ (Intra Venus) 1500 (మనిషి నుండి తీసినది) /3000 (Horse నుండి తీసినది) ఐ.యు. (International Units) వెంటనే తీసుకోవాలి. వైద్యుని సలహా మేరకు పూర్తి కోర్సు వాడాలి. సగం ఇంజెక్షన్స్ తీసుకొని, వ్యాధి లక్షణాలు లేవు కదా అని వైద్యం మధ్యలో విరమించటం ప్రమాదకరం.

రేబిస్ వ్యాధికి హోమియోలో కూడా మంచి మందులున్నాయి. హైడ్రోఫోబియా-200 మందు ఒక డోసు, లేదా లెడల్‌పాల్ 30 మందు రోజుకు రెండు డోసుల చొప్పున రెండు రోజులు తీసుకుంటే, మంచి ఫలితం ఉంటుంది. ఏ మందు అయినా అనుభవజ్ఞుడైన వైద్యుని సలహా, సూచనల మేరకు వాడటం శ్రేయస్కరం.

అన్నిటికంటే ముఖ్యంగా-రేబిన్ వ్యాధి అటు కుక్కలు, పిల్లులు మొదలైన జంతువులకు వ్యాపించటం, అవి కరవటం ద్వారా మనుషులకు వ్యాపించి మరణాలు సంభవించటం, జరిగాక లబోదిబోమంటూ నానా హంగామా చేయటం, బాధ్యత ఫలానా వారిదే అంటూ వేలంవెర్రి విమర్శలు చేయటం కంటే, అందరూ సమిష్టి బాధ్యతతో వ్యవహరిస్తే, అసలు అంకురించకుండానే వ్యాధిని అంతమొందించొచ్చు.

ఈ విషయంలో అన్నింటికంటే ముఖ్యంగా చేయాల్సింది- పెంపుడు జంతువులకు క్రమం తప్పకుండా ఎ.ఆర్.వి. వేయించాలి. అలాగే వీలైనంత వరకు వీధికుక్కలకు కూడా వేక్సిన్ వేయించాలి. ముఖ్యంగా, మునిసిపాలిటీలు, నగరపాలక సంస్థలలో పెంపుడు జంతువులకు లైసెన్సింగ్ విధానాన్ని పకడ్బందీగా అమలుచేయాలి. లైసెన్సులేని కుక్కలు పెంచేవారిపైన, పెంపుడు జంతువులను వీధులలో వదిలేసి బాధ్యత లేకుండా వ్యవహరించేవారిపైనా, నిర్దాక్షణ్యంగా చర్యలు తీసుకొని జరిమానా విధించాలి.

ఇందుకోసం స్థానికప్రభుత్వాలు చొరవతీసుకోవాలి. స్వచ్ఛంద సంస్థలు ఇందుకు తగిన సహకారం అందించి, రేబిస్ వ్యాధి గురించి ప్రజలలో సరైన అవగాహన కల్పించాలి. అనవసర కార్యక్రమాలకు, వాటి ప్రచారానికి ఎన్నో కోట్ల రూపాయిలు ఖర్చుపెట్టే స్థానికసంస్థలు అతి ముఖ్యమైన ఈ కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యతనిచ్చి చర్యలు తీసుకుంటే, చేతులు కాలాక ఆకులు పట్టుకునే పరిస్థితి మరోసారి రాకుండా అరికట్టటం సులభసాధ్యమే. ఈ విధంగా అందరం ఏకమై అన్ని చర్యలు తీసుకుంటే మనం చేసే తప్పులకు ఏ పాపం ఎరుగని మూగజీవాలను మట్టు పెట్టాల్సిన అవసరం ఎప్పటికీ రాదు. ఆ పాపం ఎవరికీ అంటదు.

*- డా॥ వి. రాజేంద్రప్రసాద్*
*మున్సిపల్ కమిషనర్, రాజమండ్రి.*

# అంధత్వ నిర్మూలనకు సేవలు



**"అంధత్వం పేదవాడికి శత్రువు. చూపు లేకపోతే జీవనోపాధి కరువవుతుంది. సమాజంలో గౌరవం పోతుంది. ఏ మనిషికీ అటువంటి పరిస్థితి రాకూడదు" అంటారు ప్రముఖ కంటి వైద్యులు డా॥ గోవిందప్ప వెంకటస్వామి.**



ప్రపంచ ప్రశస్తి గడించిన డా॥ గోవిందప్ప వెంకటస్వామి 1918 అక్టోబర్ 1వ తేదీన తమిళనాడులోని వడమాల్పురంలో రైతు కుటుంబంలో జన్మించారు. మధురైలోని మెడికల్ కాలేజీలోను, మద్రాసులోని స్టాన్లీ మెడికల్ కాలేజీలోను నేత్రవైద్యంలో ఎం.ఎస్.సి. పట్టా అందుకొన్నారు. అంతకు ముందు భారత సైన్యంలో 1945-48 మధ్య డాక్టరుగా పనిచేశారు. కాని ఉద్యోగంలో వున్నపుడే తీవ్రమైన రుమటాయిడ్ కీళ్ల వాతంతో, కొన్ని నెలల పాటు మంచానికే పరిమితమైనారు. కాలకృత్యాలు కూడా తీర్చుకోలేకపోయారు. కాసేపైనా నిలబడలేక పోయారు. చేతివేళ్లతో పెన్ను పట్టుకొంటే వేళ్లు వొంకర్లు పోయేవి. ఇన్ని శారీరక ఇబ్బందులున్నా ఆయన ఆత్మవిశ్వాసంతో, తన వృత్తి పట్ల అంకిత భావంతో మరల కంటి ఆపరేషన్లు చేయనారంభించారు. మరలా మధురై ప్రభుత్వ మెడికల్ కాలేజీలో నేత్ర వైద్య విభాగం అధిపతిగాను, మద్రాసులోని ఎర్స్కిన్ హాస్పిటల్ నేత్ర విభాగం అధిపతిగాను 20 ఏళ్లపాటు ఉద్యోగ విధులను ఎంతో నైపుణ్యంగా కొనసాగించారు. కేవలం వైద్యమే కాక, కంటి చికిత్సకు సంబంధించిన పరిశోధనలు, కొత్త విధానాలను కనుగొన్నారు. భారతదేశంలోని గ్రామాలలోని బాల బాలికలు పుట్టుకతోనే గుడ్డి వారుగా ఉండటం, పెరిగిన తర్వాత శాశ్వతంగా కంటి చూపు కోల్పోవటం గమనించి తీవ్రంగా ఆలోచించారు. ఈ దుర్దశ నుండి ప్రజలను తప్పించే దిశలో కృషి ప్రారంభించారు.

డా॥ గోవిందప్ప వెంకటస్వామి బాల్యం నుండి దైవ భక్తి కలవారు. మహాయోగి అరవింద ఘోష్‌గారి దర్శనం కోసం వీలున్నపుడల్లా వెళ్లేవారు. చూపులేని వారికి తగిన వైద్యం అందించి, మరల చూపు తెప్పించటం ఒక రకంగా దేవుడి సేవగా భావించారు.

డా॥ గోవిందప్ప వెంకటస్వామి గారిని ప్రజలు ఆప్యాయంగా ''డా॥వి.'' అని పిల్చేవారు. కంటి చికిత్సలో పేరుగాంచిన న్యూయార్క్‌లోని సర్ జాన్ విల్సన్‌ను''డా॥ వి.'' కలుసుకొన్నారు. సర్ జాన్ విల్సన్ స్వయంగా గుడ్డివాడు. అంధత్వ నివారణ కోసం, రాయల్ కామన్ వెల్త్ సొసైటీ స్థాపించారు. సర్ జాన్ ఎక్కడికి వెళ్లాలన్నా తోడుగా ఒక మనిషి వుండాల్సిందే. డా॥ వి. ఆయనకు తోడుగా వుండి రాయల్ సొసైటీ ద్వారా అంధత్వ నివారణ కేంద్రాల స్థాపనను గురించి ఎన్నో

విషయాలు తెలుసుకొన్నారు. స్వదేశానికి వచ్చే ముందు గ్రామ ప్రాంతాల్లో కంటి వైద్య శిబిరాలను ప్రారంభించ నిశ్చయించారు. భారతదేశం చేరిన తర్వాత ప్రధాని ఇందిరా గాంధీని కలుసుకొని దేశంలో అంధత్వ నివారణ కేంద్రాల స్థాపన గురించి విన్నవించారు. ప్రధాని సంతోషంగా తమ నుండి సహాయం అందజేస్తామన్నారు.



డా॥ వి. 1977లో మధురైలో, కేవలం 11 పడకలతో, నలుగురు నేత్ర వైద్య మిత్రులతో అరవింద నేత్ర వైద్యశాల ప్రారంభించారు. 1980లో అమెరికాలోని బోస్టన్ నుండి, డా॥వి. గారి మిత్రులు అరవింద కంటి ఆసుపత్రికి శంకుస్థాపన చేశారు. డా॥వి. వద్ద పైకం లేదు. బ్యాంకుల నుండి డబ్బు తెచ్చుకోవడం కష్టంగా వుండేది. డా॥వి. తన ఇంటిని రూ. 5 లక్షలకు కుదువపెట్టారు. మొదట ఒక అంతస్తు భవనాన్ని నిర్మించారు. క్రమంగా 7, 8 అంతస్తుల భవన సముదాయం ఏర్పడింది. ఈ మహావైద్యశాలను చూడాలన్న కోరికతో గూగుల్ వ్యవస్థాపకులలో ఒకరైన ల్యారీసెజ్ రెండు రోజులుండి అరవింద్‌లోని సేవలను ప్రశంసించారు.

అరవింద్‌లో మూడు రకాల సేవలుంటాయి. ఒకటి పూర్తిగా ఉచితం, రెండు తగ్గింపు ధర, మూడు ఫీజు చెల్లింపు. ఏ రకం చికిత్స చేయంచుకోవాలన్నది రోగి లేదా అతని కుటుంబ సభ్యులు నిర్ణయిస్తారు. ఉచిత సేవ అందుకునే వారు ఎటువంటి ఆదాయ ధృవ పత్రాలు సమర్పించవలసిన పనిలేదు. తగ్గింపు ధర అయినా, ఫీజు చెల్లించేదైనా అందరికీ ఒకే రకమైన వైద్య సేవ అందజేస్తారు.

"చాల రోజుల క్రితం ఒక పెద్దాయన కాంట్రాక్ట్ ఆపరేషన్ కోసం అరవింద్‌కు వెళ్లాడు. తీరా వెళ్లాక చెక్కు తీసుకోరని తెలిసింది. అక్కడ నగదు లావాదేవీలు మాత్రమే వుంటాయి. వచ్చిన పెద్ద మనిషితో వైద్యులు మాట్లాడుతూ, మీరు డబ్బు తీసుకురాలేదు కాబట్టి ఉచితవైద్యం చేయించుకోవచ్చు అని సలహా ఇచ్చారు. ఒక్కసారి ఆసుపత్రిలో కాలుపెట్టిన తర్వాత, ఎటువంటి తేడాలుండవు... ఒకేరకమైన చికిత్స, ఒకే నిపుణుల బృందం. అదంతా చూసిన ఆ పెద్దాయన చాలా సంతోషించారు. ఆ పెద్ద మనిషి ఎవరో కాదు. డా॥ ఎ.పి.జె. అబ్దుల్‌కలాం, భారతరత్న, మాజీ భారత రాష్ట్రపతి. అరవింద్ నేత్ర వైద్యంలో గ్రామీణ వైద్య శిబిరాలు ఒక ప్రధాన భాగం. ఈ శిబిరాలలో శస్త్ర చికిత్స చేయించుకొనే వారి సంఖ్య నానాటికీ పెరుగుతూ వుంది. అరవింద్‌లో కళ్లద్దాలు తయారు చేసే విభాగం వుంది. అరవింద్‌లో నిమిషానికొక సర్జరీ జరుగుతుంది. మిగతా ఆసుపత్రులలో పదిహేను నిమిషాలు పడుతుంది.

సాధారణ వ్యక్తులకు శిక్షణ ఇచ్చి సంస్థకు అవసరమైన విధంగా తీర్చిదిద్దుకోవడమే ముఖ్యమని అరవింద్ భావిస్తుంది. ఆసుపత్రి ఉద్యోగులలో ఎనభై శాతం మంది గ్రామీణ మహిళలే. ఒక ఏడాది శిక్షణతో వారిని మంచి నిపుణులుగా మార్చుతారు. ఇంగ్లండులోని రాయల్ కాలేజ్ ఆఫ్ ఆఫ్తమాలజీ కంటే అరవింద్ వైద్యం మేలైనదని అధ్యయనాలు నిరూపించాయి.

1976లో 11 పడకలతో ప్రారంభమైన ఆసుపత్రి ఒక అంతస్తు నుండి ఏడు అంతస్తులకు పెరిగింది. కోయంబత్తూరు, పాండిచ్చేరి, తిరునల్వేలి, దిండిగల్‌లలో శాఖలు పనిచేస్తున్నాయి. ఇదంతా రోగులు ఇచ్చిన ఫీజుల నుండి నిర్మింపబడినవే. ఎవరి వద్దా విరాళాలు తీసుకోరు.

తొలిరోజుల్లో డా॥వి. (గోవిందప్ప వెంకటస్వామి) విరాళాలకోసం సంప్రదించగా, వంద, రెండు వందలు ఇస్తామన్నారు. తర్వాత అతి తక్కువ ఫీజు ద్వారా లభించిన పైకంతో ఈ నేత్ర వైద్యశాలను నిర్మించారు. ఈ సేవ అంతా దైవ సేవగా భావించారు డా॥వి.

డా॥వి. బ్రహ్మచారిగానే జీవించారు. ఆయన వారసులు ఆయన తమ్ముళ్లు, చెల్లెళ్ల పిల్లలు. వారిలో 20 మంది వైద్య నిపుణులున్నారు. గాంధీజీ బోధించిన ధర్మకర్తృత్వ భావనతో ఈ నేత్ర వైద్యాలయం నిర్వహింపబడుతున్నది.

డా॥ గోవిందప్ప వెంకటస్వామి ఎన్నో పురస్కారాలందుకొన్నారు. భారత ప్రభుత్వం పద్మశ్రీ ప్రశస్తి నిచ్చింది. అంతర్జాతీయ అంధత్వ నివారణ సంస్థ అవార్డు, ప్రపంచ ఆరోగ్య సంస్థ అవార్డు, రాజ్యలక్ష్మీ ఫౌండేషన్ సత్కారం, హెలన్ కెల్లర్ అంతర్జాతీయ అవార్డు, సుశ్రుత అవార్డు, డా॥ బి.సి.రాయ్ అవార్డు వంటివి మరెన్నో వున్నాయి.

డా॥ గోవిందప్ప వెంకటస్వామి ఆదర్శ పురుషుడు.

ఎందరెందరికో చూపును ప్రసాదించి డా॥వి. గారు 2006 జూలై 7వ తేదీన మధురైలోనే మహాదేవత మీనాక్షి ఆలయం వెలసిన చోటే తుది శ్వాస వదిలారు. భౌతికంగా ఆయన లేకున్నా దేశ విదేశాలలో వున్న అరవింద్ నేత్ర వైద్యశాలలు ఆయనను అమరజీవిగా చేశాయి.

**- జానమద్ది హనుమచ్ఛాస్త్రి**

# పల్లె ప్రజల ప్రగతి బాట

## చిత్తూరు జిల్లా గ్రామీణులకు సప్తగిరి చేయూత

**ఏ బ్యాంకులో చిన్న అప్పు అడిగినా అంతకు పదిరెట్ల ఆస్తులు షూరిటీలు చూపిస్తేనే ఇస్తారు. ఆస్తిపాస్తులు లేనివారిని అవతలికి పొమ్మంటారు. మైక్రోఫైనాన్స్‌లు ఆసరా అవుతాయనుకుంటే వారు పేదల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ఇలాంటి నేపథ్యంలో నిరుపేదల పాలిట పెన్నిధిగా నిలిచింది 'సప్తగిరి గ్రామీణబ్యాంక్.'**

చిత్తూరు, కృష్ణా జిల్లాల్లో 151 శాఖల్లో వందలాది సమిష్టి బాధ్యతా సంఘాలకు అప్పులిచ్చింది. ఒకటి రెండు కాదు, ఏకంగా రూ. 58 కోట్లకు పైగా రుణాలిచ్చి పేదలకు అండగా నిలిచింది. వారికి ఉపాధి అవకాశాలు కల్పించి, జీవితాల్లో వెలుగులు నింపుతూ ఆదర్శ బ్యాంకుగా నిలిచింది. చిన్నచిన్న వృత్తులు చేసుకునేవారిని గ్రూపులుగా ఏర్పర్చి ఎలాంటి హామీలు లేకుండా రూ. 10 వేల నుండి రూ. 25 వేల వరకు అప్పులిచ్చింది. దీంతో వారు చీకూ చింతా లేకుండా తెలిసిన వ్యాపారాలు చేసుకుని, సంతోషంగా బతుకుతున్నారు. వీళ్ళంతా సమిష్టిసంఘాలుగా ఏర్పడటం వలన, ఒకరిమీద ఒకరికి విశ్వాసం పెరిగింది.

పేదల అవనరాలను ఆనరాగా చేనుకుని ఉనురు తీస్తున్న వడ్డీవ్యాపారులు, మైక్రోఫైనాన్స్ సంస్థల్లా కాకుండా సప్తగిరి గ్రామీణ బ్యాంక్ నిరుపేదలకు నీడగా నిలిచింది. ఈ బ్యాంకును స్ఫూర్తిగా తీసుకుని మిగతా బ్యాంకులు కూడా ముందుకు వస్తే, ఆయా గ్రామాల్లో పేదరికం, నిరుద్యోగం పూర్తిగా తొలగిపోతాయని ప్రజలంతా ఆకాంక్షిస్తున్నారు.

"రొంపిచెర్ల మండల కేంద్రంలో ఒకే ఒక్క ప్రైవేటు శాఖ ఉండేది. పేదల కుటుంబాలు బీడీల తయారీ, చేనేతపని, తోపుడు బండ్లపై చిల్లర వర్తకం తదితర పనులే జీవనాధారంగా బతుకుతున్నారు. వాళ్ళ ఆదాయాలు, అతిచిన్న మొత్తాలు సైతం వడ్డీ వ్యాపారుల చేతుల్లోకి పోయేవి. ఈ మండలంలోని పేదలంతా అసంఘటితంగా ఉన్నారు.

వీరికి రుణాలివ్వటంలో అంతర్గత వ్యాపార అవకాశమున్న సంగతి బ్యాంకులు గుర్తించకపోవడంతో వారికి రుణాలు దొరకడం కష్టమయ్యేది. రవాణా సౌకర్యాలు, మౌలిక సదుపాయాలు లేకపోవడంవల్ల దగ్గరలోని పీలేరు మండలంలోని బ్యాంకులు సైతం ఈ ప్రాంత ప్రజలకు చేరువకాలేకపోయాయి.

ఈ పరిస్థితుల్లో 2010లో రొంపిచెర్లలో ఈ బ్యాంకుశాఖను ప్రారంభించారు. జెఎల్‌జి నమూనాతో పనిచేస్తూనే, మరోవైపు



స్వయంసహాయక గ్రూపులతో కలిసిపనిచేశాయి. ప్రైవేటు ఫైనాన్సుల కంటే తక్కువ వడ్డీకే పేద వినియోగదారులకు వడ్డీలివ్వడంతో వారికి చేరువయ్యాయి. ఈ బ్యాంకు అధికారుల కృషివల్ల రొంపిచెర్లలో 122 జెఎల్‌జిలు ఏర్పడ్డాయి. వీరికి దాదాపు రూ. 1.76 కోట్ల రుణాలు ఇచ్చారు. ప్రతి చిరువ్యాపారస్తుడు జెఎల్‌జి ద్వారా ఈ బ్యాంకు వినియోగదారుడు కావడం గర్వకారణం. పంచాయతీరాజ్‌శాఖ రొంపిచెర్ల మండలంలో ఈ బ్యాంక్ ద్వారా పేదలు ఎలా అభివృద్ధిచెందాయో గుర్తించింది. సప్తగిరి సేవలవల్ల పేదల జీవితాల్లో వచ్చిన వెలుగులను డాక్యుమెంటరీ చిత్రంగా పంచాయతీరాజ్‌శాఖ నిర్మించి ప్రదర్శించింది. ఇది రొంపిచెర్లలో సప్తగిరి సాధించిన ప్రగతికి మచ్చుతునక...



పచ్చని చెట్లమధ్య ప్రశాంతమైన పల్లె అది. వెయ్యిమంది జనాభా. దాదాపు అందరూ దిగువ మధ్యతరగతికి చెందినవారే! సొంతంగా భూములున్నవారు తక్కువే. దాదాపు నలభై కుటుంబాలు మగ్గాల మీద పట్టుచీరెలను నేస్తూ బతుకుతున్నారు. ఇక్కడ తయారయ్యే పట్టుచీరెలు 'కంచి'కి వెళ్ళి అక్కడ కంచి పట్టుచీరలుగా బ్రాండ్ ఇమేజ్‌ని సంతరించుకుని దేశమంతా ప్రాచుర్యం పొందుతున్నాయి.

ఇదీపెద్దమల్లెల గ్రామం ప్రత్యేకత. చిత్తూరు జిల్లా రొంపిచెర్ల మండలం నుండి ఇరవై నిమిషాల ప్రయాణం చేస్తే పెద్దమల్లెల గ్రామం వస్తుంది.

ఆకర్షణీయమైన రంగుల్లో అందర్నీ ఆకట్టుకునే పట్టుచీరెలు నేస్తున్నప్పటికీ, వీరి ఆదాయాలు మాత్రం అంతంత మాత్రమే! తరతరాలుగా చేనేతనే నమ్ముకున్న వీరికి మరోపని చేతకాక కష్టమైనా, నష్టమైనా నేతపనినే బతుకుతెరువుగా ఎంచుకున్నారు. రోజంతా కష్టపడినా రూ. 70కి మించి పెరగని వీరు స్వశక్తితో ఎదగడానికి సప్తగిరి గ్రామీణబ్యాంక్ వీరికి రుణాలు మంజూరు చేయసాగింది. దీంతో ఇక్కడ ఉత్పత్తి పెరగడమే కాక, ఆదాయాలు పెరిగి జీవితాలను సుఖమయం చేసుకుంటున్నారు.

### ఉపాధి అవకాశాలు ఊరిస్తున్నాయి

"మా ఊరికి దగ్గరలో కొన్ని బ్యాంకులున్నప్పటికీ, గ్యారంటీ చూపడానికి మాకు ఆస్తులేమీ లేకపోవడంతో మాకు అప్పు దొరకలేదు.

ఐతే మా గ్రామంలో మేం నేస్తున్న చీరెలను, మా పనితనాన్ని చూసిన సప్తగిరి గ్రామీణబ్యాంక్ ఎలాంటి హామీ లేకుండానే అప్పు ఇచ్చారు. దాంతో మా బతుకులు ఒక దారిలో పడ్డాయి. పదకొండు మగ్గాలు పనిచేస్తున్నాయి. ఒక మగ్గంపై వారానికి రెండు పట్టుచీరెలు నేస్తాను. నా భార్య మహాలక్ష్మి పట్టుదారం చుడుతుంది. బ్యాంక్ లోన్‌తో పెట్టుబడి పెట్టి వైండింగ్ మిషన్ కొన్నాను. దానిపై మహాలక్ష్మి రోజుకు 3 కేజీల దారం చుడుతుంది. దీనివల్ల 9 పట్టుచీరెలు తయారవుతాయి. కరెంటు కోతలవల్ల వైండింగ్ చేయలేకపోతున్నాం. మా గ్రామంలో 25 స్వయం సహాయక సంఘాలున్నాయి. వారుకూడా బ్యాంక్‌రుణం తీసుకున్నారు. సప్తగిరి బ్యాంకులోన్‌ల వల్ల మా ఆర్థికస్థితిగతుల్లో కొంతమార్పు వచ్చింది. నాతోపాటు నలుగురికి ఉపాధి కల్గింది".

- పల్లా రవీంద్ర, పెద్దమల్లెలు, చిత్తూరు జిల్లా

### అభాగ్యుల ఇంట సౌభాగ్యం

ఇటు కర్నాటక, అటు తమిళనాడు సరిహద్దుల మధ్య ఉన్న చిత్తూరు జిల్లా, రొంపిచెర్ల మండలం పేదలది అందరి పేదల కథే. ఈ మండలంలో సున్నీ ముస్లిం కుటుంబాల సంఖ్య కాస్త ఎక్కువే. సమీపంలో కాళహస్తి, తమిళనాడులో బీడీ ఫ్యాక్టరీలు ఎక్కువగా ఉండటంతో వీళ్ళు గత 70 ఏళ్ళుగా బీడీలు చుడుతూ బతుకుతున్నారు. రొంపిచెర్ల, ఆవల్‌కొండ గ్రామాల ముస్లింలంతా బీడీల తయారీతో తమ బతుకును కొనసాగిస్తున్నారు. ఈ అసంఘటిత కార్మికులందరినీ సంఘటిత పర్చడంలో సప్తగిరి గ్రామీణ బ్యాంక్ రొంపిచెర్ల బ్రాంచి మేనేజర్ షహీనా బేగం కీలకపాత్ర పోషించారు. సమిష్టి బాధ్యతా సంఘాలు పెట్టి వారిలో ఆత్మవిశ్వాసం పెంచారు. ఏంచేస్తే తమ పేదరికం పోతుందో సంఘాల్లో చర్చించుకున్నారు. వారికి రుణాలివ్వడం ద్వారా స్వయంశక్తి పెంచుకుంటారని భావించి సప్తగిరి బ్యాంక్ రుణాలు మంజూరు చేసింది. బీడీలు చుడుతూనే రుణంతో మరిన్ని చిన్న వ్యాపారాలు చేస్తూ, ఆదాయాలు పెంచుకునే ప్రయత్నం చేస్తున్నారు. సప్తగిరి తమకు కొండంత ధైర్యాన్ని ఇచ్చిందని జెఎల్‌జీ గ్రూప్‌లన్నింటికీ బీడీలను చుట్టే పని కల్పిస్తున్న ఆర్.నీలోఫర్ అంటున్నారు...

### అప్పు వల్ల ఆత్మవిశ్వాసం పెరిగింది

"నేను, నా భర్త ఇబ్రహీంఖాన్ కలిసి రోజూ ముప్పైఐదు మంది గ్రామస్థులతో బీడీలు తయారు చేయిస్తున్నాము. కొందరు తమ ఇంటిలోనే ఖాళీ సమయంలో బీడీలు చుడుతుంటారు. ఒక్కో కుటుంబం వారు సగటున రోజుకు రెండువేల బీడీలు తయారుచేస్తారు. వీరికి నెలకు రూ. 6000 ఆదాయం వస్తుంది. రొంపిచెర్లలోని ముస్లిం కుటుంబాలన్నీ దాదాపుగా ఇదే వృత్తిపై ఆధారపడి బతుకుతున్నాయి. వీరు చేసిన బీడీలను శ్రీకాళహస్తిలోని జయరాం బీడీ ఫ్యాక్టరీకి సప్లై చేస్తాం.

నా భర్త బీడీ ఫ్యాక్టరీ నుండి ఆర్డర్లు తీసుకొస్తారు. జెఎల్‌జి గ్రూపులకు పని అప్పజెప్పడం నా పని. ఇంతకు ముందు ఇక్కడి సప్తగిరి బ్యాంక్ మేనేజర్‌గా పనిచేసిన షహీనా బేగం మా శ్రమను గుర్తించి, మాకు రుణాలివ్వడానికి ముందుకొచ్చారు. తొలిసారిగా జెఎల్‌జి హుస్సేనీ గ్రూపు తరపున రూ. 2 లక్షలు ఇచ్చారు. పది మంది గ్రూపు సభ్యుల్లో ఒక్కొక్కరికి రూ. 20 వేలు చొప్పున వచ్చింది. ఈ రుణంలో బీడీ కార్మికులంతా చిన్నవ్యాపారాల్లో పెట్టుబడి పెట్టి కొంత ఆదాయం సంపాదించు కోవడమే గాక 60 శాతం లోను ఇప్పటికే తీర్చేసారు.



దశాబ్దాలుగా ఇక్కడి ముస్లిం కుటుంబాలు బీడీ తయారీలో ఉన్నాయి కానీ వారి బతుకులు ఎదుగూబొదుగూ లేకుండా ఉన్నాయి. సప్తగిరి గ్రామీణ బ్యాంక్ అప్పులిచ్చి ఆదుకోవడంతో వీరి ఆర్థిక స్థితిలో కొంత మార్పు వచ్చింది. బీడీలు చుట్టడమే గాక, ఇతర వృత్తులవైపు దృష్టిసారించి, ఆత్మవిశ్వాసంతో ఆదాయాలను పెంచుకుంటున్నారు".

-ఆర్. నీలోఫర్

### బ్యాంక్ లోన్ వల్ల ఐక్యమత్యం పెరిగింది

"మేమంతా వ్యవసాయ కూలీలం. చెరకు తోట, వరి మడుగుల్లో పనులకు పోతుంటాం, రోజుకు రూ. 80 కూలీ ఇస్తారు. మాలాంటి పేదలకు అప్పు కావాలంటే వడ్డీ వ్యాపారులే దిక్కు. మాలో కొందరు మైక్రో ఫైనాన్స్‌ల వలలో పడి మోసపోయారు. తీసుకున్న అప్పులు, వడ్డీలు తీర్చలేక కొందరు చావడానికి సైతం సిద్ధపడ్డారు. ఇదంతా ఒకప్పుడు. నేడు మాకు సప్తగిరి గ్రామీణ బ్యాంక్ కొండంత అండగా నిలిచింది. మా గ్రూపులోని పదిమందికి కలిపి రూ. 5 లక్షలు రుణం ఇచ్చారు. దీనితో మేము పాడి పశువులను కొనుక్కొని పాలను అమ్ముకుంటూ ఆనందంగా బతుకుతున్నాం.

వచ్చిన ఆదాయంతో బ్యాంకు అప్పును కొద్దికొద్దిగా తీరుస్తున్నాం. కూలీ పనులతోపాటు పాల అమ్మకం వల్ల నెలకు రూ. 5 వేలు అదనపు ఆదాయం పొందుతున్నాం. సప్తగిరి బ్యాంకు వలన మాకు స్థిరమైన ఆదాయాలు వచ్చాయి. అంతేగాక సంఘాలుగా ఏర్పడటం వల్ల సమస్యలు వచ్చినపుడు కలిసి మెలసి చర్చించుకుని పరిష్కరించుకుంటున్నాం".

- కావలి గీత, శ్రీదుర్గాదేవి గ్రూపు, నడిగిమడుగువారిపల్లి

### చిన్నవ్యాపారులకు చేయూత

"ఒకప్పుడు అప్పు కావాలంటే మైక్రోఫైనాన్సులను ఆశ్రయించేవాళ్ళం. ఆ తరువాత వారి వేధింపులతో మనశ్శాంతి లేకుండా పోయేది. ఇలాంటి స్థితిలో సప్తగిరి మాకు తోడైంది. మమ్మల్ని సమిష్టి సంఘాలుగా ఏర్పర్చి రుణాలను మంజూరు చేసారు. మాలో కొందరు ఎస్టీడీ, కిరాణా షాపులు నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. ష్యూరిటీగా చూపించటానికి మాకు ఎలాంటి ఆస్తులూ లేకపోయినా, మా శ్రమను గుర్తించి సప్తగిరి బ్యాంకు రూ. 2.75 లక్షలు ఇచ్చింది. దీంతో మా వ్యాపారాలను పెంచుకున్నాం. నాలుగు డబ్బులు వెనకేసుకున్నాం. ఇదివరకు ప్రైవేటు అప్పులు చేసి మా బతుకులు దెబ్బతిన్నాయి. సప్తగిరి వలన కోలుకుంటున్నాం. రుణాలను ఇవ్వడమే గాక బ్యాంకు మేనేజరు మా కష్టసుఖాలను తెలుసుకుని మా అభివృద్ధికి దోహదపడుతున్నారు.

- ముఖేష్ మెహతా, బిస్మిల్లా గ్రూపు

### సప్తగిరిజనులు

వీరికి చేయడానికి ఏముంది? చెరుకు తోటల్లో కూలికి వెళ్లడం, పనికి ఆహార పథకంలో పనులకు పోవడం. ఏడాది కొన్ని నెలలే పని. అది లేనపుడు ఈతాకులు తెచ్చి చీపుర్లు తయారుచేసి అమ్ముకొని పొట్టపోసుకుంటారు. ఇదీ చిత్తూరుజిల్లా, కుమార్‌వెంకట భూపాలపురం మండలానికి ఇరవై కిలోమీటర్ల దూరంలోని కొండల మధ్య అడవిలో అనాధలుగా బతుకుతున్న యానాదుల జీవన వ్యాపారం. అయితే వీరి చీకటి బతుకుల్లో నాబార్డ్ 'మాతోట'ల పథకం వెలుగులు పంచింది. ఒక్కో గిరిజన కుటుంబానికి తమ భూముల్లో మామిడి, ఉసిరి, సరి హద్దుల్లో టేకుచెట్లు పెంచుకోవడానికి ఆర్థికసాయం అందింది. గత మూడేళ్ళుగా తోటల పెంపకంలో ఉన్నప్పటికీ, వారికి మెరుగైన జీవనాధారం లేదు.

కొండలమధ్య నిరాశగా బతుకుతున్న గిరిజనులకు అండగా సప్తగిరి గ్రామీణ బ్యాంక్ నిలబడింది. వీరందరినీ సంఘటితపరిచి జె.ఎల్.జి గ్రూప్‌లు పెట్టింది. వారిలో ఆత్మవిశ్వాసం కలిగించి గొర్రెల పెంపకం చేపట్టడానికి రుణం అందించింది. ఇపుడా యానాది గిరిజనులు అనాథలు కాదు. వారికి సప్తగిరి కొండంత అండగా వుంది.

### చీకటి పల్లెలో కాంతిరేఖ

"నాబార్డు సాయంతో పండ్లతోటలు పెంచుకుంటూ ఈత చీపుర్లు అమ్ముకొని బతుకుతున్నాం. చీపుర్లు అమ్మితే ఒక్కోసారి రోజుకు తిండిగింజలు కూడా సరిపోనంత ఆదాయం వచ్చేది. కెవిబిపురంలోని సప్తగిరి గ్రామీణ బ్యాంక్‌వారు మమ్మల్ని సంఘాలుగా ఏర్పర్చి మా కుటుంబానికి రూ. 33 వేల రుణం ఇచ్చారు. వాటితో పొట్టేలు పిల్లలు, మేకలను కొని పెంచుతున్నాం. బాగా పెరిగాక అమ్ముకుంటే మంచి ఆదాయం వస్తుందని బ్యాంక్ అధికారులు చెప్పారు. మేకలు బాగానే పెరుగుతున్నాయి. బ్యాంక్ అధికారి ఒక మేకను కొనడానికి ముందుకు వచ్చారు. ఈసారి గొర్రెలన్నీ అమ్మేసి, పాడిపశువులను కొనాలను కుంటున్నాం. మా గ్రామంలో ఇప్పటికీ 45 మంది బ్యాంక్ రుణంతో గొర్రెలను కొని పెంపకం చేపట్టాం. ఇప్పటివరకూ అడవిలో ఉన్న ఈ మారుమూల గిరిజన పల్లెకు వచ్చి మా బాగోగులు అడిగిన వారెవరూ లేరు. సప్తగిరి బ్యాంక్, నాబార్డు వారు మా బతుకు తెరువుకోసం ఎంతో సాయంచేశారు. వారివల్ల కష్టాల నుండి ఇపుడిపుడే బయటపడుతున్నాం.

- గోగుల పేరంటాలు, చెంచమ్మ, ఆదవరం గ్రామం

### పశుసంపద పెరిగింది

"నాకు 15 ఎకరాల పొలం ఉన్నప్పటికీ దాంట్లో పండించే చెరకు, వేరుశెనగ వరి పంటల వల్ల చెప్పుకోదగిన ఆదాయం లేదు. పంటలతోపాటు పాడి కూడా వుంటే మాతోపాటు నలుగురికి ఉపాధి కలుగుతుందని కెవిబిపురం సప్తగిరి బ్యాంక్ బ్రాంచి అధికారుల ను కలిశాం. మా పట్టుదలను చూసి రూ. లక్షన్నర లోన్ ఇవ్వడానికి ముందుకు వచ్చారు. నాబార్డు కొంత సబ్సిడీ ఇచ్చింది. తమిళనాడులోని కరూర్ వెళ్ళి అయిదు పాడి పశువులను కొని తెచ్చాం. పాడిపశువుల కోసం బ్యాంక్ లోన్ తీసుకునే వారంతా ఇతర రాష్ట్రంలో మాత్రమే పశువులను కొనాలనే నిబంధన వుంది. దీని వల్ల మనరాష్ట్ర పశుసంపద పెరుగుతుందని బ్యాంక్ అధికారి పిచ్చయ్య చెప్పారు.

ఇపుడు పశుపోషణ వల్ల నెలకు రూ. 9 వేలకు పైగా ఆదాయం వస్తోంది. ఎన్‌జిబి లోన్ వల్ల మా ఆదాయం పెరిగింది. గతంలో వ్యవసాయం కోసం రూ. 5 లక్షల రుణం బ్యాంకు మంజూరు చేస్తే సకాలంలో దానిని తీర్చేశాం. మా గ్రామంలో మిగతావారు తీసుకున్న లోన్స్‌ని సకాలంలో తీర్చేలా ప్రయత్నం చేస్తున్నాను. పాడిపంటలతో మా గ్రామం సంతోషంగా వుండటం వెనుక సప్తగిరి గ్రామీణ బ్యాంక్, నాబార్డుల కృషి వుంది".

- ఆగూరు రాజారావు

### మెరుగైన ఆదాయం

'గోపాలమిత్ర' కార్యకర్తగా 5 గ్రామాల్లో పశువైద్యం చేస్తున్నాను. మాకు ప్రభుత్వం నెలకు రూ. 2 వేలు గౌరవ వేతనం ఇస్తుంది. కానీ బతకడానికి ఇది సరిపోదుకదా!

కొంచెం మెరుగైన ఆదాయం కోసం పశువైద్యసేవలు విస్తరించడానికి రైతులకు పశువుల దాణా, రోగనివారణ మందుల కోసం పెట్టుబడిని సమకూర్చుకోవాలనుకున్నాం.

సప్తగిరి గ్రామీణ బ్యాంకు మాకు ఆర్థిక సాయం అందించింది. తొలిసారి రూ. 10 వేలు లోన్ ఇచ్చారు. దానిని సకాలంలో తీర్చేశాం. ఇప్పుడు రూ. 50 వేలు రుణం ఇచ్చారు. దీనివల్ల పశువుల పెంపకందార్లకు ఎక్కువగా సేవలు చేసే అవకాశం కలిగింది. ఇపుడు



బతకడానికి సరిపోయే ఆదాయం పొందుతున్నాం. గ్రామాల్లో పరపతి పెరిగింది.

ఈసారి బ్యాంక్‌లోన్‌తో మినీడెయిరీలు ఏర్పాటు చేయాలని వుంది. దీనికోసం నాబార్డుని సంప్రదిస్తే, సబ్సిడీ ఇస్తామన్నారు. దీనివల్ల ఆర్థికంగా స్థితిగతులు మెరుగవుతాయని ఆశిస్తున్నాం".

- ముదిగలం జ్యోతిలక్ష్మి, మునగలపాలెం, ఏర్పేడుమండలం

పదోతరగతి చదువుతున్నప్పుడే పెళ్ళికావడంతో పర్వీన్ చదువు ఆగిపోయింది. స్వయం సహాయక సంఘంలో సభ్యురాలుగా చేరింది, భర్త అక్తర్ అలీ జెఎల్‌జీ గ్రూప్ సభ్యుడు. అతను సీజనల్ వ్యాపారాలు చేస్తుంటాడు. సప్తగిరి గ్రామీణ బ్యాంక్, ఆవల్ కొండలో అడుగుపెట్టాక తమగ్రామంలో ఊహించని మార్పువచ్చిందంటోంది.

"మా గ్రూప్ మొత్తానికి రూ. 5 లక్షలు లోన్ ఇచ్చారు. నా వంతుగా రూ. 50 వేలు వచ్చింది. దాంతో కిరాణాషాపు పెట్టుకున్నాను. కూల్‌డ్రింక్స్ నుండి కుంకుమబిళ్లల వరకు మా దుకాణంలో దొరుకుతాయి. ప్రభుత్వం ఇచ్చిన ఇందిరమ్మ ఇంటికి మరికొంత డబ్బుపెట్టి సౌకర్యంగా తీర్చిదిద్దుకున్నాం. ఇంత క్రితం 4 సార్లు సప్తగిరి బ్యాంక్ నుండి లోన్ తీసుకుని సక్రమంగా చెల్లించేశాం. సప్తగిరి గ్రామీణ బ్యాంక్ వల్ల మా గ్రామస్తులంతా ఆర్థికంగా నిలదొక్కుకున్నారు. ఎవరూ సమయం వృధా

చేయకుండా కష్టించి ఏదో ఒక పనిచేసి బతుకుతున్నారు. గ్రూప్‌లుగా ఏర్పడటంవల్ల ఏదైనా సాధించవచ్చు అనే నమ్మకం పెరిగింది. ఎవరికి ఏ సమస్య వచ్చినా ఐక్యంగా ఎదుర్కొంటున్నాం''.

**- పర్వీన్**

### మా గ్రామంలో అడుగుపెట్టిన తొలి బ్యాంక్

"గత నలభైఏళ్లుగా బీడీలు చుడుతూ బతుకుతున్నాం. రోజుకు రెండువందలకు పైగా ఆదాయం. ఇన్నాళ్లు ఆర్థిక ఆసరా లేకపోవడంతో ఎదుగుబొదుగూ లేక ఇలాగే ఉండిపోయాం. కొన్ని నెలలక్రితం సప్తగిరి గ్రామీణ బ్యాంక్ అధికారులను కలిసి రుణం అడిగాను. మేం గ్రూప్‌గా ఏర్పడితే అప్పు ఇస్తామన్నారు. అయిదుగురం కలిసి అబ్బాస్ జెఎల్‌జిగా ఏర్పడ్డాం. నాకు రూ. 20 వేలు అప్పు ఇచ్చారు. దానికి తోడుగా మరో పదివేలు వేసి మామిడి, టెంకాయల వ్యాపారం చేశాను. రూ. 20 వేలకు పైగా ఆదాయం వచ్చింది. ఈసారి మరో రూ. 50 వేల రుణం కోసం దరఖాస్తు చేశాను. నా ఇద్దరు కొడుకులు, కూతుళ్ల పెళ్లిళ్ళు చేశాను. ఆఖరి అబ్బాయి చిత్తూరులో పదోతరగతి చదువుతున్నాడు.

మా గ్రామంలో ఇంత వరకూ ఏ బ్యాంక్ వారు అడుగు పెట్టలేదు. సప్తగిరి బ్యాంక్‌వారే మా దగ్గరకు వచ్చి ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి సలహాలు, సూచనలు ఇచ్చి మాకు దారిచూపుతున్నారు''.

**- జాఫర్ అలీ, అబ్బాస్ గ్రూప్**

### చెత్త వ్యాపారానికి కొత్త పెట్టుబడి

"గత ఏడుసంవత్సరాలుగా స్క్రాప్ బిజినెస్ చేస్తున్నా. మా చుట్టుప్రక్కల గ్రామాల నుండి రోజుకు 150 కేజీల పనికిరాని ఇనుము, ప్లాస్టిక్, సీసాలు సేకరిస్తాం. పదిమంది కుర్రాళ్ళు సైకిళ్లమీద తిరుగుతూ స్క్రాప్ సేకరించి మా షాప్‌కి తెస్తారు. దీనివల్ల వాళ్ళకి రోజుకి కొంత ఆదాయం వస్తుంది. ఐతే ఈ వ్యాపారాన్ని మరింత విస్తరించడానికి పెట్టుబడి కోసం చాలా బ్యాంకుల చుట్టూ తిరిగాను కానీ, ఎక్కడా దొరకలేదు. సప్తగిరి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ చంద్రారెడ్డిగారిని కలిస్తే నన్ను మైనారిటీ కార్పొరేషన్ తరపున సెలక్ట్‌చేసి రూ. 12 వేలు లోన్ ఇచ్చారు. దీంతో నా వ్యాపారం కొంత మెరుగైంది. ఆదాయం గతం కంటే పెరిగింది. ఇప్పుడు రూ. 4 లక్షల లోన్ కోసం ప్రయత్నం చేస్తున్నా. దీంతో మరింత మందికి ఉపాధి కల్పించి చెత్త వ్యాపారంలో కూడా ఉత్తమ లాభాలు సాధించే అవకాశం ఉందని నిరూపిస్తా''.

**- మెహిదీ అలీ, స్క్రాప్ బిజినెస్**

"నేను అయిదో తరగతి వరకే చదివాను. గత అయిదేళ్ళుగా చికెన్ వ్యాపారం చేస్తున్నాను. స్థిరమైన ఆదాయం, ఆస్తులు లేకపోవడంతో ఎక్కడా రుణం దొరకలేదు. నా వ్యాపారానికి పెట్టుబడి కోసం తిరుగుతున్న సమయంలో సప్తగిరి గ్రామీణ బ్యాంక్ వారు నాకు అండగా నిలిచారు. నేను ఏ గ్రూప్‌లో సభ్యుడిని కానందున గ్రామసభలో తీర్మానం చేసి రూ. 50 వేలు లోన్ ఇచ్చారు.

ఇప్పుడు నా వ్యాపారాన్ని విస్తరించాను. చిత్తూరు జిల్లాలోనేకాక తమిళనాడు, కర్నాటకలో కూడా బిజినెస్ చేస్తున్నాను. నెలకు 40 టన్నుల చికెన్ సరఫరా చేస్తున్నాను. ఖర్చులన్నీ పోనూ నెలకు 40 వేలు మిగులుతుంది. బ్యాంక్‌లో సకాలంలో తీర్చడంతో ఇప్పుడు



రూ. 1 లక్ష లోన్ ఇస్తామని బ్యాంక్ మేనేజర్ చెప్పారు. చికెన్ వ్యాపారంలో వచ్చిన లాభాలతో ఒక వెహికల్ కొన్నాను. మరో వ్యాన్ కొనబోతున్నాను.

నాలుగేళ్ళ క్రితం జీరోతో మొదలైన వ్యాపారం నాతోపాటు మరో నలుగురికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగడం వెనుక సప్తగిరి గ్రామీణ బ్యాంక్ ప్రోత్సాహమే కారణం''.

**- జవహర్ అలీ, చికెన్ వ్యాపారి**

### చిత్తూరు జిల్లా గ్రామీణుల్లో అనూహ్య మార్పు

- ☆ చిత్తూరుజిల్లా గ్రామాల్లో చిరు వ్యాపారాలు చేసుకునేవారిలో ఆదాయ భద్రత ఏర్పడింది. వారికి పనిదొరకదన్న బాధలేదు. లాభాలు వచ్చే కొత్త వ్యాపారాలవైపు దృష్టి సారించారు.
- ☆ సప్తగిరి గ్రామీణ బ్యాంక్ రుణాలు ఇవ్వడం వల్ల సకాలంలో ఆ రుణాలు తీర్చాలన్న తపనతో వ్యాపారంలో నైపుణ్యం పెంచుకుని ఎక్కువ ఆదాయం పొందుతున్నారు.
- ☆ సమిష్టి బాధ్యతా గ్రూపులుగా ఏర్పడడం వల్ల పేదల్లో ఐక్యతా భావన పెరిగింది. తమ సమస్యలను కలిసి చర్చించుకుంటున్నారు. సమస్యలను పంచుకోవడమే గాక పరిష్కార మార్గాలు వెతుకుతున్నారు.
- ☆ జెఎల్‌జి సంఘాల ద్వారా పెరిగిన ఆత్మవిశ్వాసంతో గ్రామీణులు మరిన్ని ఆర్థిక కార్యకలాపాలు చేపట్టడానికి సిద్ధపడుతున్నారు.
- ☆ వేరుశనగకు మార్కెట్లో ఎప్పుడూ డిమాండ్ ఉంటుందంటారు తంబళ్ళపల్లి గ్రామస్థులు. జిల్లాలోని శ్రీకాళహస్తిలో చాలా వంట నూనె ఫ్యాక్టరీలున్నాయి. వాటి డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని వేరుశెనగ పంటను ఎక్కువగా పండించడానికి సప్తగిరి గ్రామీణ బ్యాంకు రుణాలు వీరికి అండగా నిలిచాయి.
- ☆ సప్తగిరి బ్యాంక్ రుణాల వల్ల గ్రామీణ పేదలు వడ్డీ వ్యాపారుల వలలో పడటంలేదు. అలాగే మైక్రో ఫైనాన్స్‌ల అప్పుల ఊబిలో చిక్కుకోవడం లేదు. నామమాత్రపు వడ్డీతో సప్తగిరి వీరికి తోడుగా నిలిచింది.
- ☆ రైతుల మధ్య పరస్పర విశ్వాసం, నమ్మకం పెరిగాయి. రైతులకు, చిరు వ్యాపారులకు వ్యక్తిగత భద్రత, ఆదాయ భద్రత చేకూరింది.
- ☆ సమిష్టి బాధ్యతా సంఘాలవల్ల రైతులంతా సమిష్టిగా విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పరికరాలను సమకూర్చుకున్నారు. దీనివల్ల వారిలో సమిష్టి కృషిపట్ల విశ్వాసం పెరిగింది.
- ☆ సప్తగిరి రుణాలవల్ల పంటల దిగుబడి, వ్యక్తిగత ఆదాయం పెరిగిన విషయాన్ని రైతులు, బీడీ కార్మికులు, చిరు వ్యాపారులు గుర్తించారు.

*- శ్యాంమోహన్ (రూరల్‌మీడియా), హైదరాబాద్*

Printed & Published by: Shasibhushankumar, Commissioner, on behalf of Andhra Pradesh Academy of Rural Development, Printed at Caxton Offset Pvt. Ltd., 11-5-416/3, Red Hills, Hyderabad-4. A.P. Published at Andhra Pradesh Academy of Rural Development, Rajendranagar, Hyderabad-30, Rangareddi. Editor : **Shasibhushankumar**